# POETICS AND AESTHETICS-(I)
## M.A. (SANSKRIT) I Semester Paper -IV

**Director**
**Dr.Nagaraju Battu**
M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.
Centre for Distance Education
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510

Phone No.0863-2346208, 0863-2346222, Cell No.9848477441
0863-2346259 (Study Material)
Website: www.anucde.info
e-mail: anucdedirector@gmail.com

HISTORY OF POETICS

# అలంకార శాస్త్ర గ్రంథాలు

కావ్యానుశీలనంచేసే శాస్త్ర గ్రంథాలను కావ్యశాస్త్రాలని, సాహిత్యశాస్త్రాలని అంటారు వీటికే అలంకార శాస్త్రాలని చాల ప్రచారంలోవున్న పేరు వీటిల్లో కావ్యసంబంధమైన చర్చలు వుంటవి కాబట్టి వీటిని కావ్యవిమర్శనా గ్రంథాలని కూడ అనవచ్చును. ఇంకా వీటిల్లో లక్షణాలు మరియు లక్ష్యభూతంగా కావ్యాల సమీక్షలు వుండటంచేత వీటిని లక్షణ గ్రంథాలని అనటం కూడ వున్నది. ఈ అలంకార శాస్త్రగ్రంథాలు అర్వాచీన రచనలు కావు కావ్యనాటకాల ఉత్పత్తి వికాసాలతోపాటు కావ్య శాస్త్ర ఉత్పత్తి వికాసాలు కూడ జరిగినవి. కావ్యాల సాధుతా సాధుత్వాలను నిర్ణయించటానికి, పెడమార్గాన్ని పట్టే కవిత్వాన్ని సంరక్షించటానికి విమర్శన, లక్షణ రూపాలైన కావ్యశాస్త్రాలు ఉదయించినవి ఈ గ్రంథాలు కేవలం లక్షణాలను చేప్పేవి కావు. వీటిల్లో కావ్య సమీక్షలు చేయబడినవి. కవిత్వ దోషాదులు, కవిత్వ గుణాలంకార రసాదులు; కవి ప్రతిభాదులు చర్చింపబడి ప్రాచీన కాలంలో కావ్యవిమర్శలు జరుగలేదనే లోటును ఈ అలంకార శాస్త్ర గ్రంథాలు తీరుస్తున్నవి. పాశ్చాత్య విమర్శనా సిద్ధాంతాలచేత ప్రభావితమై ఆధునిక విమర్శనా పద్ధతులు భిన్నమార్గం పట్టినవి. ప్రాచీన కాలంలో కావ్యనాటకాదులను కావ్యశాస్త్ర పద్ధతుల ననుసరించి తూచేపద్ధతులు ఇప్పటి విమర్శనా పద్ధతులకు భిన్నంగా వుండేవి. కొంతవరకు కావ్యవిమర్శ అలంకార శాస్త్రాల్లో జరిగినా చాలామట్టుకు అవి మౌఖిక రూపంలో పండిత సదస్సుల్లో, గురు శిష్య వర్గంలో జరిగేవి. అంతేగాని ప్రాచీన కాలంలో కావ్యవిమర్శలే జరుగ లేదని, అది ఆధునిక కాలంలోనే ఆరంభమైందని అనటం సత్యదూరమౌతుంది. ఇప్పటికి కూడ భారతీయ భాషా సాహిత్యాలల్లో కావ్యశాస్త్రాలకు అతీతంగాగాని వ్యతిరేకంగా గాని విమర్శలు జరగటం లేదు.

అతి ప్రాచీనమైన కాలంలోనే అలంకార శాస్త్ర గ్రంథాలు రచింపబడినవి. కావ్యవిమర్శలతో కూడిన అలంకార శాస్త్రం వేదాంగాలల్లో ఒకటి అని, దాన్ని సప్తమాంగంగా చెప్పాలని ప్రసిద్ధాలంకారికుడు రాజశేఖరుని అభిప్రాయం. వేదాంగాల అధ్యయనం వల్లనే వేదాలు అర్థమౌతున్నవి. అదే విధంగా సప్తమాంగమైన

అలంకార శాస్త్రాలవల్లనే వేదసాహిత్యం అర్థమౌతుందని అతని అభిప్రాయం. అలంకార శాస్త్రాలల్లో చర్చింపబడే విషయాలు - కావ్యనాటక లక్షణాలు, కావ్య సిద్ధాంతాలు, కావ్యభేదాలు నాయికా నాయక లక్షణాలు, రసనిరూపణం, కావ్యగుణ దోషాలు, శబ్దశక్తులు, అలంకారాదులు. మొదట్లో అలంకారికుల దృష్టి నాటకాల పైనే వుండేది తర్వాత కాలక్రమంగా శ్రవ్యకావ్య విశ్లేషణచేసే అలంకార శాస్త్రాలు కూడ వచ్చినవి. కావ్యం అంటె ఏది ? కావ్యస్వరూపం, కావ్యమూల తత్త్వమేది? కావ్యప్రయోజనాలు కావ్యహేతువులు. కావ్యాన్ని దోషాలు లేకుండ గుణయుక్తంగా ఎట్లా వ్రాయాలి? అలంకారాల ప్రాధాన్యం, కావ్యభేదాలు, కావ్య లక్షణాలు మొదలైనవి ఈ అలంకార శాస్త్రాలల్లో వివేచింపబడ సాగినవి. మొదట శ్రవ్యకావ్యానికి శబ్దార్థాలు, ఉక్తివైచిత్రి (అలంకారాలు)' శబ్దార్థాల సంయోజనాలు (గుణాలు, రీతులు) ప్రధానమైనవని అలంకారికులు తలంచారు. ఇవే కావ్యానికి మూలతత్త్వా లని చెప్పారు. ఈ మూలతత్త్వానికే వామనుడు ''కావ్యాత్మ' 'అని నామకరణం చేసాడు. తర్వాత కావ్యాత్మ ఏది? అని మీమాంస జరిగి అనేక సిద్ధాంతాలు బయలుదేరినవి ప్రతి అలంకారికుడు తన ప్రతిభానుసారంగా నూతన మూలతత్త్వాన్ని స్థాపించటానికి ప్రయత్నించాడు. ఒక అలంకారికుడు చెప్పిందాన్ని మరొక అలంకారికుడు ఖండించి మరొక తత్త్వాన్ని స్థాపించటానికి పూనుకొన్నాడు. ఈ విధంగా అలంకార, గుణ, రీతి, వక్రోక్తి, రస, ఔచిత్య సిద్ధాంతాలు స్థాపింపబడటం జరిగింది. విభావానుభావాదుల సమ్మిశ్రణం చేత ధ్వనించే రసమే కావ్యానికి ప్రధాన తత్త్వమని ఆనందవర్ధనుడు తిరిగి భరతుడు నాటకాలకు చెప్పిన రససిద్ధాంతాన్నే శ్రవ్యకావ్యాలకు పట్టించి నూతన సిద్ధాంతంగా స్థాపించాడు పిమ్మట జగన్నాథాదులు ఈ ధ్వనిరూపమైన రససిద్ధాంతాన్నే అంగీకరించి వ్యాపింపజేసారు.

ప్రస్తుతం మనకు లభించే అలంకార శాస్త్రాలల్లో ప్రాచీనతమమైంది భరతుని నాట్యశాస్త్రం. ఇది బృహద్గ్రంథం. ఇది కారికలరూపంలో రచింపబడింది. దీనిలో 36 అధ్యాయా లున్నవి.

## భరతుడు

### భరతనామం

అభినయదర్పణకారుడైన నందికేశ్వరుడు బృహస్పతి, ఉపమన్యు అనే అలంకారికుల పేర్లను పేర్కొన్నాడు. కాని వారి అలంకార శాస్త్ర గ్రంథా లేవీ



మనకు దొరకలేదు. శిలాలినుడు, కృశాశ్వుడనే నటసూత్రకారులను పేర్కొన్నాడు. వారు భరతునికి పూర్వమున్నవారు కావచ్చును. వారి గ్రంథాలు కూడ దొరకలేదు. లభించే అలంకార శాస్త్ర గ్రంథాలల్లో మొదటిది నాట్యశాస్త్రమే. దీని కర్త భరతుడు. భరతున్ని భరతముని అని కూడ అంటారు. గాంధర్వవేద సృష్టికర్తగా భరతమునిని విష్ణుపురాణం పేర్కొంటున్నది. 'భరత' శబ్దానికి "నటు"డనే అర్థమున్నది. కాళిదాసు విక్రమోర్వశీయ నాటకాన్ని బట్టి భరతుడు ఇంద్రసభలో వుండే నాట్యవేత్త అని తెలుస్తున్నది. బ్రహ్మదేవుడు పంచమ వేదమైన నాట్యవేదాన్ని సామాన్యజనుల మనోరంజనాసికై సృష్టించి దాన్ని మానవలోకంలో ప్రచారం చేయటానికి భరతమునిని నియోగించెను. ఈ భరతమునే "ఆది భరతుడు", "వృద్ధ భరతుడు"గా పేర్కొనబడుతున్నాడు. ఇతడు, నాట్యశాస్త్ర కర్త భరతుడు వేరు వేరు వ్యక్తులని కొందరి అభిప్రాయం కాగా ఇద్దరు ఒక్కరే అని చాలామంది విమర్శకులు అంగీకరించారు. నాట్యశాస్త్రకర్త భరతుని తర్వాత నాట్యకళావేత్తలైన వ్యక్తులెందరో భరతు డన్న పేరును పెట్టుకొని వుంటారు. అందుకే క్రమంగా నాటక నిర్వాహకుడైన, నాట్యకళాభిజ్ఞుడైన నాటక సూత్రధారునికి భరతుడన్న పేరు లోకంలో స్థిరపడిపోయినట్లుగా కన్పిస్తున్నది. భరతుని పేరు మీదుగానే నాటకం చివర ఏదో ఒక ప్రధానపాత్ర చేత చదువబడే మంగళ వాక్యాలకు భరతవాక్య మనే పేరు కలిగింది. ఒకవేళ ఆ మంగళ వాక్యాలను ఒకప్పుడు నాటకనిర్వాహకుడైన భరతుడు చదివేవాడేమో.

## భరతుని కాలం

ఆది భరతుడు లేక వృద్ధభరతుడు నాట్యశాస్త్రకర్త అని నిర్ణయించినా అతని కాలాన్ని నిశ్చయించి చెప్పటం చాల కష్టంగా వున్నది. భారతీయ సంప్రదాయానుసారం భరతుడు చాల ప్రాచీనమైనవాడుగా చెప్పబడుతున్నాడు. త్రేతా యుగంలో బ్రహ్మ నాట్య వేదాన్ని సృష్టించి తత్ప్రచారానికి భరతున్ని నియోగించాడు. కాబట్టి భరతుడు భారతీయ సంప్రదాయానుసారం సత్యయుగంవాడు. ఈ కాలగణనను అంగీకరించని ఆధునిక విమర్శకులు దీన్ని నిరాకరించారు. చారిత్రక దృష్టితో వారు భరతుని కాలనిర్ణయాన్ని చేయటానికి పూనుకొన్నారు. ఎస్. కే. దే భరతున్ని క్రీ. శ. 800 ప్రాంతంవాడని, మేక్‌డోనెల్ క్రీ. శ. 600 ప్రాంతం వాడని తలంచారు. యాకోబి, కీథ్, పి.వి. కాణే మొదలైనవారు భరతుడు క్రీ శ,

300 నాటి వాడని అభిప్రాయపడినారు. పిశెల్ భరతుడు క్రీ.శ 6, 7 శతాబ్దాల వాడని చెప్పాడు మహామహోపాధ్యాయ హరప్రసాదశాస్త్రి, మన్‌మోహన్ ఘోష్‌లు భరతుడు క్రి. పూ. 200 ప్రాంతంవాడని అంగీకరించారు. కాళిదాసు (క్రీ. పూ. ప్రథమ శతాబ్దం) నాటికే నాట్యశాస్త్ర రచన జరిగిందనటం తథ్యం. కాళిదాసు భరతున్ని దేవనాట్యాచార్యునిగా పేర్కొన్నాడు. భరతుడు దేవనాట్యాచార్యుడనే భావం ప్రచారంలో ఆనాడు వున్నదంటే అప్పటికే అతడు చాల ప్రాచీనమైనవాడై వుండాలి. కాళిదాసు నాటికే భరతుడు చెప్పిన నాట్య లక్షణాలు స్థిరపడి నిర్దుష్ట రూపాన్ని ధరించిన వనటం నిశ్చయం. అప్పుడు భరతుడు క్రి. పూ. ప్రథమ శతాబ్దం నాటికి ప్రాచీన ఆలంకారికు డని చెప్పవచ్చును. క్రి. పూ. 5 వ శతాబ్దం వాడైన పాణిని "నటసూత్రా"లను పేర్కొని వున్నాడు. ఒకవేళ ఈ నట సూత్రాలు భరతుడు వ్రాసిన మూలగ్రంథమే కావచ్చును. అప్పుడు భరతున్ని క్రీ.పూ. 5 వ శ॥కి పూర్వుడని చెప్పవలసి వుంటుంది. యుధిష్ఠిర్ మీమాంసకుడు తన "వ్యాకరణ శాస్త్రి - కా - ఇతిహాస్ అన్న గ్రంథంలో భరతుడు క్రి. పూ. 500 - 1000 మధ్యకాలం వాడని నిర్ణయించాడు. ఈ కాలనిర్ణయమే ఇప్పటికి సమంజసంగా వున్నది.

## నాట్యశాస్త్రం

నాట్యశాస్త్రం ఇప్పుడొక బృహద్గ్రంథం. భరతుడు వ్రాసిన మూలగ్రంథం ఇంతటి బృహద్రూపంలో వుండివుండదని విమర్శకుల అభిప్రాయం. నాట్య శాస్త్రంలో విషయాన్ని చెప్పటంలో కాని విషయ విభాగంలోకాని ఒక క్రమపద్ధతి వున్నట్లు కన్పించదు. అది అనేక గ్రంథాల కూర్పులాగ కన్పిస్తుంది. నాట్యశాస్త్రం వేదాంత వ్యాకరణాది శాస్త్రగ్రంథాలవలె సూత్రరూపంలో వుండి తర్వాత ఇది విశాలరూపాన్ని ధరించిందని వింటర్‌నిట్స్ అభిప్రాయం ప్రస్తుతం లంభించే నాట్యశాస్త్రం ప్రాచీన నాట్యశాస్త్రగ్రంథం ఆధారంగా క్రమంగా విస్తరించిన గ్రంథమని డి. ఆర్. భండార్కర్ కూడ అభిప్రాయపడినాడు. ఒకవేళ మూల నాట్యశాస్త్రగ్రంథం పాణిని పేర్కొన్న నటసూత్రాలే కావచ్చును కాలక్రమంగా ప్రక్షిప్తాలు చేరి ఈ సూత్రాలు విస్తరింపబడివుంటవి. నాట్యకళా ప్రవీణులైన భరత నామధేయులెందరో ఈ గ్రంథవిస్తరణకు కారకులై వుంటారు. కాని మూలగ్రంథ రూపం ఇదని ఇప్పుడు నిర్ణయించి చెప్పటానికి వీల్లేదు.



భరతుని నాట్యశాస్త్రం నాట్యకళా సంబంధమైన విజ్ఞాన సర్వస్వం వంటిది. ఇది సూత్ర, భాష్య, కారికలు-ఈ మూడు రూపాల్లో వున్నది. దీనిలో 6000 శ్లోకా లున్నవి. అన్నీ శ్లోకా లేకాక అక్కడక్కడ గద్యంకూడ వున్నది. దీనిలో నాటకోత్పత్తి, నాటకభేదాలు, వాటి లక్షణాలు, నృత్యం, అభినయ విధానాలు, నాటకాలల్లోని భాష, సంవాదస్వరూపం, ఇతివృత్త విధానం, గాయనవాదనలు, నాయికానాయక లక్షణాలు, రసనిష్పత్తి, రస స్వరూపం, ప్రేక్షకులు, నాట్య శాలల నిర్మాణ పద్ధతులు, రంగస్థలం, రంగాలంకరణలు మొదలైనవి చర్చింపబడినవి. తర్వాత రచింపబడిన అలంకారశాస్త్ర గ్రంథాలకు ఇది ఉప జీవ్యగ్రంథంగా ఏర్పడింది. నాట్యకళా విజ్ఞానమంతా చెప్పబడిన ఈ గ్రంథం నాట్యవేదం అని పిలువబడుతున్నది. ఈ నాట్యవేదాన్ని రచించిన భరతుడు ముని స్థానాన్ని పొందటంలో ఏమి ఆశ్చర్యం లేదు. భరతునికి పూర్వంకూడ నాట్య కళావేత్తలు, నాట్యగ్రంథ రచయితలు వుండేవారు. కాని వారి రచన లేవీ మనకు దొరకలేదు. భరతుని నాట్యశాస్త్రమే పండిత జనాదరణను పొంది అధిక ప్రచారంలో వుండి మిలిగింది. ఆ యా కాలాల్లో ప్రక్షిప్తాలను తనలో చేర్చుకుంటూ నశించకుండా నిలిచింది.

## నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానాలు

నాట్యశాస్త్రానికి అనేక ప్రాచీన అర్వాచీన వ్యాఖ్యానా లున్నవి. ఉద్భట, లోల్లట, శంకుక, భట్టనాయక, రాహులు, భట్టతౌత, కీర్తిధర, నామదేవ, మాతృ గుప్త మొదలైన వ్యాఖ్యాతల పేర్లను అభినవగుప్తుడు పేర్కొన్నాడు. వారి నాట్యశాస్త్ర వ్యాఖ్యానాలు దొరకటం లేదు. అభినవగుప్తుని "అభినవభారతి" అన్న వ్యాఖ్యానమే ఇప్పుడు దొరుకుతున్నది. కాని ఇదికూడ సంపూర్ణంగా దొరకటం లేదు. అయినా ఈ అసంపూర్ణ వ్యాఖ్యానమే ఎక్కువ ప్రచారంలో వున్నది. క్రీ శ. 11 వ శ॥ వాడైన ధనంజయుని దశరూపకం నాట్యశాస్త్రానికి రూపాంతర మనే చెప్పాలి. నాట్యశాస్త్రం ఆధారంగా రచింపబడిన కృతులు – సాగరనంది (క్రీ.శ. 12 వ శ॥) నాటక లక్షణకోశం, రామచంద్ర గుణచంద్రుల (క్రీ.శ 12 వ శ॥) నాట్యదర్పణం, శారదాతనయుని (క్రీ.శ. 13 వ శ॥) భావ ప్రకాశం, సింగభూపాలుని (క్రీ శ. 14 వ శ॥) నాటకపరిభాష, రూపగోస్వామి (క్రీ. శ. 15 వ శ॥) నాటక చంద్రిక, సుందరమిశ్రుని (క్రీ.శ. 7 వ శ॥) నాట్యప్రదీపం

మొదలైనవి. ఇవేగాక ప్రసిద్ధ కావ్యశాస్త్రకారులకు, వారి గ్రంథాలల్లోని నాటక, రసప్రకరణాదుల రచనలకు నాట్యశాస్త్రమే ప్రమాణాధారమైంది భోజ విశ్వనాథ, హేమచంద్ర, విద్యానాథాది ఆలంకారికుల కావ్య సంబంధ విషయాలెన్నో నాట్య శాస్త్రాధారమైనవే. ఈ నాటికిని నృత్య నాట్యనాటక అభినయాదుల విషయంలో భారతీయులకు భరతుని నాట్యశాస్త్రమే ప్రమాణగ్రంథం.

## భరతుని తర్వాత వెలసిన ఆలంకారికులు

భరతుని తర్వాత కోహలుడనే ఆలంకారికుని పేరు వినిపిస్తున్నది. అభినవ గుప్తుడు కోహలుని పేర్కొన్నాడు కొందరు విమర్శకులు కోహలుడు భరతుని కన్న ప్రాచీనుడని తలంచారు.. కాని అతడు భరతునికి శిష్యుడో, కొడుకో కావచ్చు ననే అభిప్రాయమే విమర్శకుల్లో బలీయంగా వున్నది. కొహలుని తర్వాత ధూర్తిల, శాండిల్య, బాదరాయణాది అలంకారశాస్త్రకర్త లున్నట్లు తెలుస్తున్నది. కాని వారి రచన లేవీ దొరకలేదు భరతుని నాట్యశాస్త్రం తర్వాత విశేష వ్యాప్తి నందుకొన్న గ్రంథం నందికేశ్వరుని అభినయదర్పణం ఇతన్ని నంది అనికూడ అంటారు. నందికాలం క్రీ. శ 12వ శ॥ అని విమర్శకులు నిర్ణయించారు. నాట్యశాస్త్రం తర్వాత నాట్యకళపై వ్రాయబడిన ఉత్తమ గ్రంథం ఇది. ఇది అనేక భాషల్లోకి అనువదింపబడింది.

## అగ్నిపురాణం

అలంకారశాస్త్రరచన అతి ప్రాచీనమైం దని, పురాణాల నుంచే దాని పుట్టుక జరిగిందని కొందరు విమర్శకులు అగ్నిపురాణాన్ని ఉదాహరిస్తారు. అలంకారశాస్త్ర సంబంధమైన రూపక భేదాలు, శ్రవ్యకావ్య భేదాలు, గద్యకావ్య భేదాలు, శబ్దార్థాలంకారాలు మొదలైన విషయాలెన్నో విస్తృతంగా అగ్నిపురాణంలో చర్చింపబడినవి. భరతుడు రూపకభేదాలను పదింటిని మాత్రమే వివరించగా అగ్ని పురాణకారుడు రూపక, ఉపరూపక భేదాలను 27వరకు వివరించాడు. అగ్నిపురాణం, దానిలోని అలంకార శాస్త్ర సంబంధ విషయాలు చాలా ప్రాచీనమైనవని, భరతుని కన్న ప్రాచీన మైనవని కొందరు విమర్శకులు తలంచినా చాలామంది ఆధునిక విమర్శకులు దీన్ని అంగీకరించలేదు. వారు దీన్ని చాల అర్వాచీన రచనగా చెప్తున్నారు. అగ్ని పురాణమంతా కాకున్నా అలంకార శాస్త్రాధ్యాయం చాలా తర్వాత కాలంలో





చేర్చబడిన ప్రక్షిప్తభాగమని వారు అంటున్నారు. అగ్ని పురాణంలోని సాహిత్య వివేచనను బట్టి అది నాట్యశాస్త్రం తర్వాత రచన అని తేలుతున్నదని, నాట్య శాస్త్రంలోని సిద్ధాంతాలను అగ్నిపురాణం అంగీకరించి గ్రహించిందని కన్నయ్యా లాల్ పోద్దార్ అభిప్రాయం భోజరాజు క్రీ. శ 11వ శ॥ సరస్వతీ కంఠాభరణ ప్రభావం అగ్నిపురాణ సాహిత్య విమర్శమీద వుండటంచేత అది క్రీ. శ 11వ శ॥ తర్వాతి రచన అని బలదేవ ఉపాధ్యాయ అభిప్రాయపడినా అగ్నిపురాణం క్రీ శ 12 శతాబ్దకాలంలో అలంకారికులచేత ఉద్ధరింపబడటంచేత దీని రచనా కాలం క్రీ. శ 9 లేక 10 శతాబ్దంగా అంగీకరించవచ్చు నని అన్నాడు. అగ్ని పురాణ కారునికి ధ్వని సిద్ధాంతంతో సంపూర్ణ పరిచయం వున్నదని, అపహ్నుతి, సమాసోక్తి, ఆక్షేప, పర్యాయోక్తి, అప్రస్తుత ప్రశంసాది అలంకారాలల్లో ధ్వని విశేష మున్నదని పేర్కొనటంచేత అగ్నిపురాణం ధ్వన్యాలోకం తరువాత అనగా క్రీ. శ 900 తరువాత వ్రాయబడిందని పి. వి. కాణే నిర్ణయించాడు. "ధ్వని" శబ్దం అగ్నిపురాణంలో ప్రయోగింపబడినా ధ్వనిసిద్ధాంతజ్ఞాన మున్నట్లు కన్పించదు. ధ్వని శబ్దం వ్యాపకార్థంలోనే ప్రయోగింప బడింది, మరియు భరతుడు చెప్పినట్లుగా శృంగార, రౌద్ర, వీర, బీభత్స-ఈ నాలుగు రసాలనే అగ్నిపురాణకారుడు అంగీకరించి గ్రహించాడు, భామహదండ్యాదులు చెప్పిన ఎన్నో కావ్యలక్షణ విశేషాలు దీనిలో లేవు, చాలా విషయాలల్లో ఇది భరతుని నాట్యశాస్త్రాన్ని అనుగమిస్తున్నది కాబట్టి ఇది నాట్యశాస్త్రం తర్వాత భామహదండ్యాదులకు పూర్వం వ్రాయబడిందని కన్నయ్యాలాల్ పోద్దార్ చాల విషయచర్చ చేసి నిర్ణయించాడు. కావ్య సంబంధమైన అలంకార, గుణరీతి, ధ్వని మొదలైన కావ్యాత్మ పరిచయం అగ్నిపురాణంలో కన్పించదు. ''వాగ్వైదగ్ధ్య ప్రధానోఽపి రస ఏవాత్రజీవితమ్'' అని రసమే కావ్యనాటకానికి జీవితమని భరతుని సిద్ధాంతాన్ని అగ్ని పురాణకారుడు చెప్పాడు. కాబట్టి ఇది భరతునికి తర్వాత, భామహాదులకు పూర్వం రచింపబడిందని ఎక్కువమంది విమర్శకులు అంగీకరిస్తున్నారు.

## మేధావి

భామహుడు తన కావ్యాలంకారంలో మేధావిని రెండు సార్లు పేర్కొన్నాడు. ఉపమ, యథాసంఖ్య, ఉత్ప్రేక్షాలంకారాల వివరణ సందర్భంలో భామహుడు మేధావి అభిప్రాయాలను గూర్చి ప్రసంగించాడు. రుద్రటుడు మేధావిని ఒక

అలంకారశాస్త్రకర్తగా పేర్కొన్నాడు. క్రీ. శ. 10 శ॥ నాటి రాజశేఖరుడు మేధావి రుద్రు డనే అలంకారికుని గూర్చి ప్రసంగించాడు. మేధావి రుద్రుడు, మేధావి, ఇద్దరు వేరు వేరు వ్యక్తు లని కొందరు విమర్శకులు తలంచినా ఆ రెండు పేర్లు ఒక్కటే అని, ఒకే వ్యక్తి పేర్లు అని చాలా మంది విమర్శకులు అంగీకరించారు. రాజశేఖరుడు మేధావిరుద్రుని అంధకవిగా చెప్పాడు. మేధావి వ్రాసిన అలంకార శాస్త్ర గ్రంథ మేదీ మనకు లభించలేదు. చివరకు దాని పేరైనా మనకు తెలియదు నామమాత్రపరిచితుడై అతడు నిలిచాడు. భామహునికి పూర్వం వెలసిన అలంకారికులల్లో ప్రముఖమైన వాడని భామహుడు అతని అభిప్రాయాలను ఉల్లేఖించటం చేత చెప్పవచ్చును.

## భట్టి

భట్టి మహాకావ్య కర్తయే కాక వైయాకరణుడు మరియు అలంకారికుడు. భట్టి తన కావ్యంలో 10 నుంచి 13 సర్గల వరకు కావ్యసంబంధ విషయ చర్చలు చేసాడు. పదవ సర్గలో అలంకారాలు, పదకొండవ సర్గలో మాధుర్య గుణం, పన్నెండవ సర్గలో భావికాలంకారం, పదమూడవ సర్గలో భాషా సమాసాలను గూర్చి చర్చించాడు. దీనిననుసరించి భట్టికి అలంకార శాస్త్ర సంబంధ విషయాల తోను మంచి పరిచయమున్నట్లు తెలుస్తున్నది. అలంకారాల వివేచనలోను మరియు అలంకారాల పూర్వాపరక్రమాలను పాటించటంలోను భట్టి భామహులు ఒకే అభిప్రాయాలను కలిగి వున్నారు. అందుచేత భట్టి భామహునికి ఈ షత్పూర్వుడో లేక సమకాలికుడో అయి వుండవచ్చునని విమర్శకులు నిర్ణయించారు.

## ధర్మకీర్తి

ధర్మకీర్తి ప్రసిద్ధ బౌద్ధనైయాయికుడు. దిఙ్నాగుని ప్రమాణసముచ్చయానికి ప్రమాణవార్తిక కారికను, ప్రమాణవార్తిక వృత్తిని కూడ వ్రాసాడు. ఇంకా ఇతడు ప్రమాణ వినిశ్చయ, న్యాయబిందు, హేతుబిందు వివరణ, వాదన్యాయ, సంతానాంతరసిద్ధి, సంబంధ పరీక్ష, సంబంధ పరీక్షావృత్తి మొదలైన బౌద్ధ న్యాయగ్రంథాలను రచించాడు ఇతడు అలంకార శాస్త్రాన్ని కూడ వ్రాసాడు. కాని అవి అనుపలభ్యం. ఇతని అభిప్రాయాలను భామహుడు ఉల్లేఖించి వున్నాడు.



## భామహుడు

### కావ్యాలంకారం

భామహుని అలంకారశాస్త్ర గ్రంథం కావ్యాలంకారం. ఇప్పుడు లభ్యమయ్యే అలంకారశాస్త్ర గ్రంథాలల్లో (నాట్యశాస్త్రం తర్వాత) కావ్యాలంకారమే మొదటిది. మరియు శ్రవ్యకావ్య స్వరూప లక్షణాలను చర్చించే కావ్యశాస్త్ర గ్రంథాలల్లో ఇది ప్రప్రథమమైంది. నాట్యశాస్త్రంలో నాట్య, రూపక లక్షణ భేదాలు చాల సూక్ష్మంగా వివరింపబడినవి. అప్పటికి శ్రవ్యకావ్యాల రచన ఎక్కువగా వికసించి ప్రచారంలో లేకపోవటం చేతనో లేక తత్ ప్రక్రియను గ్రహించక భరతుడు విడిచి పుచ్చటం చేతనో నాట్యశాస్త్రంలో శ్రవ్యకావ్యాల చర్చ ఏమీ లేదు. శ్రవ్యకావ్య వివేచన మనకు కావ్యాలంకారంలోనే మొట్టమొదట కన్పిస్తున్నది. ఇందులో శ్రవ్యకావ్య భేదాలు శ్రవ్యకావ్య స్వరూపం మహాకావ్యలక్షణాలు, కావ్యగుణ దోషాలు, కావ్యలంకారాలు వివరంగా చర్చింపబడినవి. శ్రవ్యకావ్యం పాఠకులను అలరించటానికి ఏమేమి తత్త్వాలవసరమో, వేటిని పరిహరించవలసి వుంటుందో ఈ కావ్యశాస్త్రంలో చక్కగా చర్చింపబడినవి. భామహుని కావ్యశాస్త్రంలో ఆరు పరిచ్ఛేదాలున్నవి. భామహుడు దీన్ని కారికల రూపంలో రచించాడు. ప్రథమ పరిచ్ఛేదంలో కావ్యప్రయోజనాలు, కావ్యహేతువులు, కావ్యలక్షణాలు, కావ్య భేదాలను గూర్చి చెప్పబడినది. ద్వితీయ పరిచ్ఛేదంలో గుణ, అలంకారాలు వివరింపబడినవి. తృతీయ పరిచ్ఛేదంలో గత పరిచ్ఛేదంలోని అలంకారాలల్లో మిగిలినవి వివరింపబడినవి. చతుర్థ పంచమ పరిచ్ఛేదాలల్లో దోషాలు, షష్ఠపరిచ్ఛేదంలో శబ్దశుద్ధి వివరింపబడినది. పంచమ సర్గలో తర్కశాస్త్రం ఆధారంగా షష్ఠ సర్గలో వ్యాకరణం ఆధారంగా దోషాలు వివరింపబడినవి. అలంకారాలను, దోషాలను గూర్చి భామహుడు ఎక్కువ వివరించటం చేత అతని దృష్టిలో కావ్యం దోషాలను పరిహరిస్తు శబ్దశుద్ధి కలిగి అలంకారయుక్తమై వుండవలెనని తెలుస్తున్నది. దీనిలో మొత్తం 400 కారిక లున్నవి. ఉదాహరణ శ్లోకాలు చాలవరకు భామహుడే స్వయంగా రచించాడు.

భరతుని రససిద్ధాంతాన్ని భామహుడు వివరించలేదు. అగ్నిపురాణకారుడు రసమే కావ్యానికి జీవిత మని అంగీకరించినట్లుగా భామహుడు అంగీకరించినట్లు కన్పించదు. అతని దృష్టిలో శబ్దార్థాలే కావ్యం. అందులో వైచిత్రి, వక్రోక్తితో కూడిన అర్థసంయోజనం కావ్యానికి అవసర మని అతడు తలంచాడు. అందుకే

రామాయణాలల్లోని పాత్రల చర్చలనే అతడు చేసాడు. వైదిక విధులనే పేర్కొన్నాడు కాని ఎక్కడా అతడు బౌద్ధ ధర్మ ప్రసక్తిని తేలేదు. రక్రిలగోమిన్ అన్న పేరు కేవలం బౌద్ధ సంబంధి అనే చెప్పటానికి వీల్లేదు. కాశ్మీరాది ప్రాంతాలల్లో బ్రాహ్మణులూ అటువంటి పేర్లను ధరిస్తారు. భామహుడు కృత్యారంభంలో "సర్వజ్ఞం" అని స్మరించింది బుద్ధున్ని కాక శివున్ని అని గ్రహించాలి. ఎందుకంటె "సర్వజ్ఞ" అన్న పేరు బుద్ధునికి కాక శివునికే ఎక్కువ ప్రచారంలో వున్నది.

### భామహుని రచనలు

భామహుడు కావ్యాలంకారాన్నే కాక పరరుచి ప్రాకృత ప్రకాశానికి 'మనోరమ' అనే పేరుతో వ్యాఖ్యానం వ్రాసాదని అంటారు. ''మనోరమ" కర్త భామహుదే అని పిశెల్ అంగీకరించాడు. వృత్తరత్నాకర వ్యాఖ్యానంలో నారాయణ భట్టు భామహోక్తమైన ఛందస్సులని కొన్నిటిని ఉదాహరించటం చేత భామహుడు ఛందోగ్రంథాన్ని కూడ వ్రాసెనని అనుమానం కలుగు తున్నది. అభిజ్ఞాన శాకుంతలానికి "అర్థద్యోతనిక" అనే వ్యాఖ్యానంలో రాఘవభట్టు భామహుని పేర ఉద్ధరించిన ఆలంకార ఛందస్సు సంబంధ విషయాలను బట్టి భామహుడు కావ్యాలంకారమే కాక ఛందః శాస్త్రాన్నికూడా రచించాడని పండితులు ఊహిస్తున్నారు.

భామహుని కావ్యాలంకారం పండితుల విశేషాదరణను పొందింది. ఉద్భట, ఆనందవర్ధన అభినవ గుప్త, మమ్మటాది ఆలంకారికులు భామహుని మీద గౌరవ భావం కలవారు మరియు అతన్ని అనేకసార్లు ఉద్ధరించి వున్నారు.

## దండి

### కావ్యాదర్శం

దండి అలంకార శాస్త్ర గ్రంథం పేరు కావ్యాదర్శం. కావ్యాదర్శానికి అలంకార శాస్త్ర గ్రంథాలల్లో విశేషస్థానమున్నది. అగ్నిపురాణం, కావ్యాలంకారాల తర్వాత కావ్యాదర్శమే లభ్యమయ్యే అలంకార శాస్త్ర గ్రంథం. కావ్యాదర్శంలో మూడు పరిచ్ఛేదా లున్నవి. ప్రథమ పరిచ్ఛేదంలో కావ్యపరిభాష కావ్య భేదాలు, మహాకావ్య లక్షణాలు, గద్యకావ్య భేదాలు, తల్లక్షణాలు వివరింప బడినవి. ద్వితీయ



పరిచ్ఛేదంలో ౩౫ అర్థాలంకారాలు సోదాహరణంగా వివరింపబడినవి. తృతీయ పరిచ్ఛేదంలో యమక భేదాలు, చిత్రబంధాలు, వివరింపబడినవి. తర్వాత విస్తారంగా దోషనిరూపణ జరిగింది. కావ్యాదర్శంలో మొత్తం ౩౬౦ శ్లోకా లున్నవి.

దండి విశేషంగా అలంకార గుణరీతుల వివేచన చేసివున్నాడు. కావ్య మూలతత్త్వ సిద్ధాంతాలల్లో దండి ఏ సిద్ధాంతానికి చెందినవా డన్న విషయంలో అభిప్రాయభేద మున్నది. దండి దోషనిరూపణను విస్తారంగా చేసి కవిత్వంలో గుణాల ప్రాధాన్యాన్ని ఎత్తి చూపాడు. అందుచేత అతడు గుణసిద్ధాంత వాది అని కొందరు విశ్వాసించారు. అలంకార వివేచనను కూడ దండి చాల వివరంగా చేసాడు. అతడు భామహుని వలెనే అలంకార వాది అని మరికొందరి విశ్వాసం. మొత్తంమీద దండి గుణాలంకారవాది అని చెప్పవచ్చును. భామహుడు తడివి విడిచిపెట్టిన విషయాలను ఎన్నిటినో దండి విస్తరించి వివరించాడు. భామహున్ని దండి ఎన్నోచోట్ల సమర్థించినట్లుగా కన్పిస్తుంది. భామహుడు అలంకార శోభా హేతుకమైంది వక్రోక్తి అని చెప్పగా దండి "శ్లేషః సర్వాసు పుష్ణాతి ప్రాయో వక్రోక్తిషు శ్రియమ్" అని భామహునితో అంగీకరించాడు. ఉక్తి వైచిత్రి, అతిశయోక్తుల పైననే అలంకారశోభ ఆధారపడిందని భామహ దండ్యాచార్యుల అభిప్రాయం స్వభావోక్తిని విశేషంగా ఆదరించి వివరించినవారిలో దండి ప్రథమాచార్యుడు. నాట్యశాస్త్ర, అగ్నిపురాణాలవలె దండి రసవాదానికి ప్రాధాన్యాన్ని ఇయ్యలేదు. శ్రవ్య కావ్యంలో రససిద్ధాంతం పట్టదని అతని అభిప్రాయం కావచ్చును. భామహుని వలెనే అతడు రసాన్నికూడా అలంకారంగానే అంగీకరించాడు. శ్రవ్యకావ్యంలో ఉక్తివైచిత్రికి, గుణాలకు ప్రాధాన్యమని వాటిచేత అది పఠనీయం అవుతుందని దండి అభిప్రాయం కాని దోషరహితత్వం కూడ చాల ముఖ్యమని గ్రహించి దండి భామహుని వలెనే దోష నిరూపణకు ప్రాధాన్యమిచ్చాడు.

కావ్యాన్ని దండి ఒక వ్యక్తిగా దర్శించాడు. శబ్దార్థాలు అతని దృష్టిలో కావ్యశరీరం. అలంకారాలు అలంకారాలు. గుణాలు గుణాలు. తర్వాత ఆలంకారికులు ఈ కావ్య శరీర కల్పలను అంగీకరించి కావ్య ప్రధాన తత్త్వాన్ని కావ్యశరీరానికి ఆత్మగా గుర్తించి తదన్వేషణకు పూనుకొన్నారు.

### కావ్యాదర్శానికి టీకలు

కావ్యాదర్శానికి అనేక టీకలు రచింపబడినవి. వాటిల్లో తరుణ వాచస్పతి టీక ప్రాచీనమైంది. దీనికి అజ్ఞాత రచయిత వ్రాసిన "హృదయంగమ" మనే మరొక ప్రసిద్ధ టీక వున్నది. కావ్యాదర్శం సియ - వస - లకర (స్వభాషాలంకారం) అనే పేరుతో క్రీ. శ. 9 వ శతాబ్దంలో సింహళ భాషలోకి అనువదింపబడింది.

## రుద్రభట్టు

కావ్యాలంకారకర్త రుద్రటుని కన్న ఈ రుద్రడు భిన్నుడు. ఇతని కృతి శృంగార తిలకం. ఇది కావ్యమాల సిరీజ్‌లో మూడవ గుచ్ఛంగా ప్రచురితమైంది. శృంగార తిలకానికి గోపాలభట్టు టీకను వ్రాసాడు. ఈ టీకలో రుద్రభట్టు త్రిపురవధ అనే కావ్యాన్ని వ్రాసినట్లు చెప్పాడు. కాని అది అలభ్యం. శృంగారతిలకంలో నాయికా నాయకుల భేదాలు, రసాలంకార నిరూపణలు చేయబడినవి. దీనిలో మూడు పరిచ్ఛేదా లున్నవి. దీనిలో శృంగార, కరుణ, వీర, అద్భుత, శాంత, హాస్యాది నవరసాల వివరణ వున్నది. శృంగారతిలకం నుంచి ఉద్ధరణలు శార్‌ఙ్గధర పద్ధతి, సూక్తి ముక్తావళి, సాహిత్య దర్పణం, పంచతంత్రాలల్లో కన్పిస్తున్నవి. నాట్య శాస్త్రంలో రూపకసంబంధి రసవివేచన చేయబడింది. రుద్రభట్టు కావ్యసంబంధి రసవివేచన చేశాడు. ఇతడు విశేషంగా శృంగార రసాన్ని వివరించాడు. శృంగారరసాన్ని నాయక రసంగా ఇతడు అంగీకరించాడు. రసవిహీనమైన వాణి నీరసమైందని రుద్రభట్టు అభిప్రాయం. రుద్రభట్టు క్రీ. శ. 7 వ శతాబ్దం వాడని విమర్శకుల అభిప్రాయం.

## ఉద్భటుడు

అలంకార శాస్త్ర చరిత్రలో భామహదండ్యాచార్యుల తర్వాత ఉద్భటుడు ప్రసిద్ధి చెందినవాడు. ఉద్భటుడు కాశ్మీర రాజు జయాపీడుని ఆస్థాన పండితుడు. జయాపీడుని (క్రీ. శ. 779-813) పండితపోషణను ప్రశంసించిన కల్హణుడు తన రాజ తరంగిణిలో ఉద్భటుడు ఆ రాజు ఆస్థాన పండితుడని తెలిపివున్నాడు:

విద్వాన్ దీనార లక్షేణ ప్రత్యహం కృత వేతనః
భట్టోఽభూదుద్భటస్తస్య భూమి భర్తు సభాపతిః



"కావ్యాలంకార సార సంగ్రహం" ఉద్భటుని అలంకార కృతి. ఇంకా అతడు "భామహ వివరణ"ను వ్రాసెను. పేరునుబట్టి ఇది భామహుని కావ్యాలంకారానికి వాఖ్యానం అని తెలుస్తున్నది. కాని ఇది అలభ్యం. ఉద్భటుడు భరతుని నాట్యశాస్త్రానికి టీక కూడ వ్రాసాడు. ఉద్భటుడు కుమార సంభవమనే కావ్యాన్ని కూడ వ్రాసాడు. ఆ కావ్యం నుంచి తన అలంకార గ్రంథంలో లక్షణోదాహరణలను ఇచ్చాడు.

కావ్యాలంకారసార సంగ్రహంలో ఆరు పరిచ్ఛేదా లున్నవి. 79 కారిక లున్నవి. ఉద్భటుడు భామహుని అనుసరించి ఈ గ్రంథంలో అలంకారాల వివేచనను చేసాడు. ఒకొకచోట భామహుని కన్న భిన్నంగా అలంకార భేదాలను చెప్పాడు కూడ. ఉద్భటుడు మొత్తం 41 అలంకారాలను వివరించాడు. కొన్ని కొన్ని అలంకార వివరణలను ఉద్భటుడు భామహుని నుంచి తీసుకొన్నా. అతని ఉపమ, అతిశయోక్తి, ఉత్ప్రేక్షాద్యలంకారాల వివరణలను తర్వాత మమ్మటరుయ్యకాదులు గ్రహించారు. ఉద్భటుని అనుసారం గుణాలు, అలంకారాలు రెండు సమానంగా కావ్య సౌందర్యవర్ధకాలని రుయ్యకుడు ఉల్లేఖించాడు. శాంతరసాన్ని నవమ రసంగా నాట్యశాస్త్రంలో చెప్పింది ఉద్భటుడే అని పండితుల అభిప్రాయం. ఉద్భటుడు రీతులను దేశపరమైన పేర్లతో కాక ఉపనాగరిక, గ్రామ్య, పరుష అనే పేర్లతో పేర్కొన్నాడు. ఈ విభజన శబ్ద సంయోజనం మీద ఆధారపడింది. ఉపనాగరిక రీతి పరిష్కృతమైంది. గ్రామ్య రీతి సాధారణమైంది. పరుషరీతి కఠినమైంది. క్రీ. శ. 960 ప్రాంతంవాడైన ప్రతీహారేందురాజు ఉద్భటుని అలంకార శాస్త్రానికి వ్యాఖ్యానాన్ని వ్రాసాడు. ఆనందవర్ధనుడు ఉద్భటుని అభిప్రాయాలను సాదరంగా ఉల్లేఖించాడు. రాజశేఖరుడు "ఇతి ఔదంభరాః ఉద్భటమతానుయాయినః" అని పేర్కొనటం చేత ఉద్భటుని శిష్యప్రశిష్యపరంపర రాజశేఖరుని నాటి వరకు వున్నదని తెలుస్తున్నది. ఉద్భటుని సంప్రదాయం ఔద్భట సంప్రదాయంగా ప్రసిద్ధికెక్కింది. శ్రవ్య కావ్యంలో రసమే "జీవద్రూపం" అని ఉద్భటుడు ప్రప్రథమంగా అంగీకరించినవాడని కొందరు విమర్శకుల అభిప్రాయం. శబ్ద శక్తి విచారణ ఉద్భటునితోనే ఆరంభమైందని కూడ పండితుల అభిప్రాయం. అలంకారాలల్లోని అలంకారాంతర ప్రతిభ చర్చలో శబ్ద శక్తి విచారణను చూడవచ్చును. ఉద్భటునికి ప్రాచీనాలంకారికుల్లో మహత్త్వపూర్ణమైన స్థానమున్నది.

## వామనుడు

ఉద్భటునివలెనే వామనుడు కాశ్మీరరాజు జయాపీడుని (క్రీ. శ. 779-813) ఆస్థాని, మంత్రి కూడ. వామనుని అలంకార గ్రంథం కావ్యాలంకార సూత్రవృత్తి. ఇంతకుముందున్న అలంకార శాస్త్రాలన్ని పద్య కారికలల్లో వ్రాయబడివుండగా వామనుడు సూత్ర పద్ధతిలో తన అలంకార కృతిని రచించి ప్రత్యేకతను చూపాడు. సూత్రబద్ధం చేస్తేనే శాస్త్రమన్న ఆలోచనను మనస్సులో వుంచుకొని వామనుడు కావ్య లక్షణాదులను సూత్రబద్ధం చేసాడేమో. దీనిలో 319 సూత్రాలున్నవి. ఇది ఐదు అధికరణలుగా, పన్నెండు అధ్యాయాలుగా విభాగింపబడింది. తన సూత్రాలకు అర్థాలను వామనుడే స్వయంగా వ్రాసుకొన్నాడు. ఈ సూత్ర వివరణకే వృత్తి అని పేరు. వామనునికి పూర్వం ఆలంకారికులు లక్షణోదాహరణలు తాము స్వయంగా వ్రాసినవి ఇచ్చారు. కాని వామనుడు ఆ యా కవుల కావ్యాల నుంచి ఉదాహరణలను ఇచ్చి తన సిద్ధాంతాలకు వ్యాప్తిని కలిగించాడు.

కావ్యాలంకార సూత్ర వృత్తిలో ప్రథమ అధికరణంలో కావ్య పరిభాష, కావ్య ప్రయోజనాలు, కావ్య హేతువులు, కావ్య రీతులు, కావ్యాంగాల నిరూపణ జరిగింది. ద్వితీయ, తృతీయ, చతుర్థ అధికరణాలల్లో క్రమంగా దోష, గుణ, అలంకారాల నిరూపణ జరిగింది పంచమ అధికరణంలో శబ్ద శుద్ధిని గూర్చి వివరింపబడింది. ఇది భామహుని కావ్యాలంకారంలోని చివరి పరిచ్ఛేదాన్ని పోలివున్నది. వామనుడు 33 అలంకారాలను వివరించాడు: వాటిల్లో వక్రోక్తి, వ్యాజోక్తులను విశేషంగా వివరించి చెప్పాడు కావ్యంయొక్క 'ఆత్మ'ను గూర్చి మొట్ట మొదట పేర్కొని చర్చించిన మొదటి అలంకారికుడు వామనుడు. అతడు "రీతిరాత్మా కావ్యస్య" - కావ్యానికి రీతి ఆత్మరూపమైందని స్థాపించెను. "కావ్య శోభాకరాన్ ధర్మానలంకారాన్ ప్రచక్షతే" అని దండి అభిప్రాయం. వామనుడు కావ్య శోభ గుణాలవల్ల కలుగుతుందని చెప్పాడు. "కావ్య శోభాయాః కర్తారో ధర్మా గుణాః" గుణాలవల్ల కావ్య సౌందర్యం కలగుతుందని, ఆ సౌందర్యాన్ని అతిశయింపజేసేది అలంకారం అని వామనుని అభిప్రాయం. అలంకారాలు లేకున్నా కావ్య సహజ సౌందర్యానికి లోపం రాదని వామనుని మతం. ఒక వ్యక్తికి గుణాలవల్ల ఆత్మ సౌందర్యం సమకూరినట్లుగా కావ్యానికి కూడ సౌందర్యం గుణాలవల్ల సమకూరుతుందని అతడు అంటాడు. అందుచేత వామనున్ని సౌందర్యవాదిగా కూడ పిలుస్తారు.



ఉద్భటవామనులు ఒకే రాజు ఆస్థానాన్ని అలంకరించారు ఇద్దరు భిన్న మార్గాలను అనుసరించిన ఆలంకారికులు. అందుకే వారు తమ కృతుల్లో ఒకరిపేరు నొకరు పేర్కొనలేదేమో. ఉద్భటుడు అలంకారవాది అయిన భామహుని అనుసరించగా వామనుడు కొంతవరకు దండిని అనుసరించి రీతి సిద్ధాంతాన్ని కొత్తగా సృష్టించినవాడు. దండి కావ్యాన్ని వ్యక్తులతో పోల్చగా ఒక వ్యక్తివలె కావ్యానికి ఆత్మ వుంటుందని కల్పన చేసి నిరూపించినవాడు వామనుడు.

కాశికాకారుడైన వామనుడు, కావ్యాలంకార సూత్ర వృత్తికర్త వామనుడు. ఇద్దరు ఒకే వ్యక్తులా? వేరువేరు వ్యక్తులా? అను విషయంలో పండితులల్లో అభిప్రాయ భేదమున్నది. కాశికలోని వామనుని వ్యాకరణ సంబంధ అభిప్రాయాలను ఆలంకారికుడైన వామనుడు సమ్మతించటంచేత ఇద్దరు ఒక్కరే అని పి. వి. కాణే నిర్ణయించాడు. బ్యూలర్ కూడ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

## రుద్రటుడు

### రుద్రటుని కాలం

రుద్రటుని అలంకారశాస్త్ర గ్రంథం కావ్యాలంకారం. పేరునుబట్టి ఇతడు కాశ్మీర దేశీయుడని చెప్పవచ్చును. రుద్రటుడు సామవేదశాఖి అని, తండ్రి పేరు భట్ట వాముకుడని కావ్యాలంకారానికి నమిసాధు వ్రాసిన టీక ద్వారా తెలుస్తున్నది. రుద్రటునికి శతానందుడని పేరు వున్నట్లు (శతానందా పరాఖ్యేన భట్ట వాముక సూనునా) కూడ నమి సాధు తెలిపి వున్నాడు. క్రీ. శ. 10 వ శతాబ్దం వాడైన ప్రతీహారేందురాజు రుద్రటుని పేర్కొన్నాడు. రుద్రటునికి ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతంతో పరిచయమున్నట్లు లేదు. కాబట్టి రుద్రటుని కాలం ఉద్భట వామనుల తర్వాత ప్రతీహారేందురాజు ఆనంద వర్ధనులకు పూర్వం అంటె దాదాపు క్రీ శ. 9 వ శ॥ పూర్వార్ధమని చెప్పవచ్చును

## కావ్యాలంకారం

కావ్యాలంకారంలో 16 అధ్యాయాలు, 748 శ్లోకాలు వున్నవి. దీనిలో 14 ప్రక్షిప్త శ్లోకాలు కూడ చేరినవి ఈ శ్లోకాలల్లో 495 కారికలు, మిగిలినవి ఉదాహరణలు. ప్రౌఢమైన అలంకారశాస్త్ర గ్రంథాలల్లో కావ్యాలంకారం ఒకటి. తన

కావ్యాలంకారంలో రుద్రటుడు కావ్యశాస్త్ర సంబంధ విషయాలనన్నిటిని గూర్చి చర్చించాడు. వామనాదులవలె రుద్రటుడు ఏ కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదు. కాని శాస్త్రీయ పద్ధతిలో అతడు చేసిన విషయ వివేచన మెచ్చుకోదగ్గది. శబ్ద, అర్థ భేదాలతో అలంకారాలను చక్కగా విభజించి రుద్రటుడు విస్తారంగా శాస్త్రీయ పద్ధతిలో వివరించాడు. ఈ విషయంలో తర్వాత ఆచార్యులు రుద్రటుని అనుసరించారు అతడు 57 అలంకారాలను వివరించాడు. రుద్రటుడు ఆలంకారవాది. అయినా రసనిష్పత్తిని కూడ వివరించాడు. ప్రేయోరసాన్ని అతడు దశమరసంగా గుర్తించి స్థాపించాడు. ప్రేయోరసానికి రుద్రటుడు స్నేహాన్ని స్థాయీ భావంగా పేర్కొన్నాడు. సౌహార్దభావంగల వ్యక్తి నాయకుడు. సహృద్వ్యవహారంతోకూడిన నిశ్చలనిర్వ్యాజ మనోవృత్తియే స్నేహం. స్నేహభావంవల్ల ఏర్పడిన ప్రేమ, విశ్వాస, సద్భావనలతో కూడిన కోమలమైన పరస్పరాలాపా లుంటవి. హృదయం ఆర్ద్రం కావటం, ఆహ్లాదజనితాశ్రువులు, సుస్నిగ్ధస్ఫారమైన కనులతో పరస్పరావలోకనం అనుభావాలు. ప్రేయోరసం శృంగార రసంవలె ప్రణయసంబంధి రతి కాక ప్రణయేతర సంబంధి రతి కలది. అప్పుడు పుత్రప్రేమ, దాంపత్య ప్రేమ, ప్రకృతి ప్రేమ, దేశభక్తి, మహాపురుషుల ఎడల సమాదరప్రేమ మొదలైనవి ప్రేయోరసాంతర్గతమైనవని చెప్పవచ్చును. తర్వాత భోజరాజాదులు ఈ ప్రేయోరసాన్ని గ్రహించి వివరించారు. ఆధునిక కవిత్వంలో పోషింపబడే అమలిన శృంగారం (Platonic love) ఈ ప్రేయోరసంలో అంతర్భవిస్తుంది. రుద్రటుడు వైదర్భి, గౌడి, పాంచాలీ రీతులనేకాక 'లాటి' అనే నాల్గవరీతిని కూడ గుర్తించాడు. తర్వాత భోజుడు రీతులను ఇంకా పెంచాడు. భామహదండ్యాచార్యులు చెప్పిన మహాకావ్య లక్షణాలను రుద్రటుడు భారవిమాఘుల మహాకావ్యాలను పరిశీలించి ఇంకా స్పష్టం చేసాడు.

## కావ్యాలంకారానికి టీకలు

క్రీ. శ. 1069లో నమిసాధు అనే శ్వేతాంబరజైనుడే కాక కావ్యాలంకారానికి క్రీ. శ. 1240 ప్రాంతంలో ఆశాధరుడనే జైనాచార్యుడు కూడ టీకను వ్రాసాడు. నమిసాధు టీక వ్రాయకముందు కావ్యాలంకారం కొంత దుర్బోధకంగా వుండేదని పండితుల అభిప్రాయం.



## భట్టలోల్లటుడు

భట్టలోల్లటుడు భరతుని నాట్యశాస్త్రానికి టీకను వ్రాసాడు. కాని ఇప్పుడది ఉపలభ్యం కాదు. అభినవగుప్తుడు భట్టలోల్లటుని మతాన్ని ఖండించాడు. రాజశేఖరుడు కూడ భట్టలోల్లటుని అభిప్రాయాలను ఉల్లేఖించాడు. రాజశేఖరుని అనుసారం లోల్లటుడు అపరాజితుని కొడుకు రసం రామాదినాయక నిష్ఠమని, నటుల్లో రసం లేకున్నా రసమున్నట్లు భాసిస్తుందని, సామాజికులు ఆ నటులను చూడటం వల్ల వారి హృదయాల్లో రామాదినాయక నిష్ఠమైన రసం స్ఫురిస్తుందని చెప్పెను. దీనికి ఉత్పత్తివాద మని పేరు. లోల్లటుడు క్రీ. శ. 750–800 ప్రాంతంవాడు.

## భట్టశంకుకుడు

ఇతడు క్రీ. శ. 850 ప్రాంతంవాడు అంటే ఆనందవర్ధనుని సమకాలికుడు. నాట్యశాస్త్రానికి టీకను వ్రాసెను. కాని అది అనుపలభ్యం. ఇంకా ఇతడు భువనాభ్యుదయమనే కావ్యాన్ని కూడ వ్రాసెను. అది కూడ దొరకలేదు. శంకుకుడు లోల్లటుని ఉత్పత్తి వాదాన్ని ఖండించి రసం రామాది నాయకుల వేషాలను ధరించే నటనిష్ఠమని చెప్పెను. నటగత రత్యాది స్థాయిభావాలను సామాజికులు అనుభవించి ఆనందిస్తారని అతని మతం దీనికి అనుమితివాద మని పేరు.

## భట్టనాయకుడు

భట్టనాయకుడు కాశ్మీరరాజు అవంతివర్మ ( క్రీ. శ. 855–884 ) ఆస్థాన కవి. ఇతడు నాట్యశాస్త్రానికి హృదయదర్పణమనే వ్యాఖ్యానాన్ని వ్రాసెను. ఇది కూడ అనుపలభ్యం. ఇతడు పై ఆచార్యుల రసనిష్పత్తివాదాలను ఖండించి రసం సామాజిక నిష్ఠమని చెప్పెను. రసం రామాదినాయక నిష్ఠమైనా, నటనిష్ఠమైనా సామాజికుడు దాన్ని అనుభవించటం జరుగదు. సామాజికులు నాయకాదులతో అభేదం పొంది ఆ రసాన్ని తామే అనుభవిస్తారని అతని మతం. దీనికి భుక్తివాద మని పేరు. ఈ ముగ్గురు ఆచార్యులు రససిద్ధాంత వివరణకు చేసిన యోగదానం చాల గొప్పది. తర్వాత భట్టనాయకుని భుక్తివాదాన్ని గ్రహించి అభినవగుప్తుడు రసధ్వనిని నిరూపించాడు, ఈ ధ్వనిరూపమైన రసం పండితు లందరి మన్ననలను పొందింది.

## ఆనందవర్ధనుడు

### ధ్వని కారికాకారుడు

ఆనందవర్ధనుడు కాశ్మీరరాజు అవంతివర్మ (క్రీ శ. 855-883) ఆస్థాన పండితుడు. ఇతని కృతి ధ్వన్యాలోకం. దీనికి కావ్యాలోకం అని కూడ పేరు. ధ్వన్యాలోకం ప్రౌఢమైన మౌలిక గ్రంథం. కావ్యశాస్త్రంలో ఒక కొత్త మలుపును తెచ్చిన గ్రంథం. యుగప్రవర్తకమైన గ్రంథమే అని చెప్పవచ్చును. ప్రాచీనాచార్యుల కావ్యతత్త్వసిద్ధాంతాలను అన్నిటిని పరిశీలించి ఒక కొత్త దిశలో కావ్యతత్త్వచింతన దీనిలో చేయబడింది. మరియు సమాహార రూపమైన ధ్వని సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది.

ధ్వన్యాలోకంలో 129 కారిక లున్నవి. వీటికి ధ్వనికారికలని పేరు. ఈ కారికలకు వ్రాయబడిన వృత్తి పేరు ధ్వన్యాలోకం ఈ ధ్వన్యాలోకానికి 150 సంవత్సరాల తర్వాత అభినవగుప్తుడు లోచనమనే వ్యాఖ్యానాన్ని వ్రాసాడు. మూలకారికలు రచించింది ఆనందవర్ధనుడు కాదని కొందరు పండితులు అభిప్రాయ పడుతున్నారు. ప్రతీహారేందురాజు, కుంతకుడు, మహిమభట్టు, క్షేమేంద్రుడు, హేమచంద్రుడు, విశ్వనాథాది ప్రాచీనాలంకారికులు కారికాకారుడు ధ్వన్యాలోక కారుడు ఒకే వ్యక్తి అన్నట్లుగానే ఉల్లేఖించివున్నారు. ప్రాచీనాలంకారికులల్లో మత భేదమున్నట్లు కనబడదు. కాని ఆధునికుల్లోనే కారికలను, వృత్తి, ధ్వన్యాలోకాన్ని రచించింది వేరు వేరు వ్యక్తులనే అభిప్రాయ ఏర్పడింది. అభినవగుప్తుడు కారికాకారుడు గ్రంథకారుడు అని వేరువేరుగా పేర్కొనటంచేత ఆధునికుల్లో ఇటువంటి అభిప్రాయం కలగటానికి దారి తీసింది. ఆనందవర్ధనుడు ధ్వనివాదం— "పరంపరయా సమామ్నాతః" అని పేర్కొన్నదాన్ని బట్టి ధ్వనికారికాకారుడు అతడు కాదని ధ్వనిస్తున్నదని అంటున్నారు. మరియు ధ్వన్యాలోకారంభంలో వున్న శ్లోకం కూడ వారి అనుమానాన్ని బలపరిచేటట్లుగా వున్నది—

> కావ్యస్యాత్మా ధ్వనిరితి బుధైర్యస్సమామ్నాత పూర్వ
> స్తస్యాభావం జగదురపరే భాక్తమాహుస్తమన్యే
> కేచిద్వాచాం స్థితమవిషయే తత్త్వమూచుస్తదీయం
> తేన బ్రూమ స్సహృదయ మనః ప్రీయతేతత్స్వరూపమ్.



"పూర్వవిద్వాంసులు కావ్యాత్మధ్వని అని పేర్కొన్నారు. కొందరు దానిని కాదంటారు కొందరు దాన్ని లక్షణాంతర్గత మని అంటారు. కొందరు వాచామగోచర మని అంటారు. సహృదయుల ప్రీతికై నేను దాని తత్త్వాన్ని నిరూపిస్తాను" — అని చెప్పటంచేత కావ్యాత్మ ధ్వని అని ఆనందవర్ధనుని కన్న పూర్వమే స్థాపింపబడిందని, దానితో అంగీకరించని పండితులుండిరని తెలుస్తున్నదని. అటువంటప్పుడు ఆనందవర్ధనుడు ధ్వని ఉపస్థితిని, స్వరూప స్వభావ భేదాలను సంపూర్ణంగా వివరించి ధ్వని సిద్ధాంతాన్ని సర్వసమానంగాచేసి ధ్వని సిద్ధాంత స్థాపకుడనే పేరు గడించి వుంటాడని ఆధునిక విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. రాజశేఖరుని రెండు శ్లోకాలనుబట్టికూడ కారికాకారుడు ఆనందవర్ధనుడు అని తేలుతున్న దని ఆధునిక విమర్శకుల అభిప్రాయం—

> ధ్వనినాఽతి గభీరేణ కావ్యతత్త్వ నివేశినా
> ఆనందవర్ధనః కస్య నాఽసీదానంద వర్ధనః

"అతి గంభీరమైన కావ్యతత్త్వ నివిష్టమైన ధ్వని యొక్క స్వరూప స్వభావాలను నిరూపించటం చేత ఆనందవర్ధనుడు ఎవరికి ఆనందవర్ధనుడు కాడు?

> సత్కావ్య తత్త్వ విషయం స్ఫురిత ప్రసుప్త
> కల్పం మనస్సు పరిపక్వ ధియాం యదాసీత్
> తద్వ్యాకరో త్సహృదయోదయ లాభహేతో
> రానందవర్ధన ఇతి ప్రథితాభిధానః.

"పరిపక్వబుద్ధి గల విపశ్చిత్తుల మనస్సులలో స్ఫురిత ప్రసుప్తకల్పంగా వున్న కావ్యతత్త్వాన్ని సహృదయానందానికై ఆనందవర్ధనుడు వ్యాఖ్యానించి చెప్పెను." కావ్యాత్మ ధ్వని అని ఆనందవర్ధనునికి పూర్వమే వుండెనని దాన్ని నిరూపించి సర్వపండితాంగీకార యోగ్యంగా వ్యాఖ్యానించినవాడు ఆనందవర్ధను డని పై శ్లోకాలను బట్టి తేలుతున్నదని ఆధునికుల అభిప్రాయం. వింటర్ నిట్జ్, యాకోబి, ఎస్.కే.డే., పి.వి. కాణే మొదలైనవారు కారికాకారుడు ఆనందవర్ధనుడు కాదని సమర్థించారు. అయితే కారికాకారుడు ఎవరు? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఆ అన్వేషణకు కూడ విమర్శకులు పూనుకొన్నారు. కారికాకారుడు "సహృదయ" నామధేయుడని పి. వి. కాణే చెప్పెను. ఈ కారికాకారుడు ఆనందవర్ధనునికి

సంప్రదాయం వ్యంగ్యార్థమనే ముసుగువేసుకున్న రససిద్ధాంతమే అని చెప్ప వచ్చును. లక్షణా మూలధ్వనిలో కూడ ఆనందవర్ధనుడు అనేక భేదాలు చెప్పాడు. లక్షణామూలధ్వని, అత్యంత తిరస్కృత వాచ్యం అర్థాంతర సంక్రమిత వాచ్యం అని రెండు విధాలు. ఈ రెండు మళ్ళీ వాక్యగతం, పదగతం అనే భేదాలచేత నాలుగు విధాలు. ఈ విధంగా వివిధ ధ్వనిభేదాలల్లో పూర్వాచార్యుల అలంకార, గుణ, రీతి మొదలైన కావ్యసిద్ధాంతాలన్ని ధ్వని అంతర్గతమైనవిగానే ఆనంద వర్ధనుడు చెప్పాడు. మరియు అతడు అలంకారాలను భామహాదులవలె కావ్య ప్రధాన తత్త్వంగా అంగీకరించలేదు. రసభావ సమన్వితమైన కావ్యాన్నే అతడు ఉత్తమ కావ్యమని, అలంకార రచన ఉత్తమ కావ్యం కాదని చెప్పాడు

ఆనంద వర్ధనుడు ధ్వని సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చినప్పుడు దాన్ని, మొదట పండితులు చాలామంది విమర్శించినా తర్వాత ఆలంకారికులు ఆదరించి ప్రచారంలోకి తేవటంలో దోహదం చేసారు. కావ్యసిద్ధాంతాలల్లో కెల్లా ధ్వని సిద్ధాంతమే గొప్పదని సర్వజనాంగీకార యోగ్యమైంది. అంతవరకు ప్రచారంలో వున్న భామహదండ్యాచార్యుల అలంకారవాదం, వామనుని రీతివాదం వెనుకకు నెట్టి ధ్వని సిద్ధాంతం ముందంజ వేసింది. ఒక విధంగా ధ్వని సిద్ధాంతం భరతుని రస సిద్ధాంతం మొదలుకొని వామనుని రీతి సిద్ధాంతం వరకు కావ్య సిద్ధాంతాల నన్నిటిని సమన్వయించి ఒక్క గొడుగు కిందికి తెచ్చిందని చెప్పవచ్చును. ఇట్లా ఒక సిద్ధాంతాన్ని ప్రతి పాదించటానికి ఆనంద వర్ధనుడు మంచి మౌలికమైన తార్కికపూర్ణమైన శైలిని గ్రహించాడు ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించే ఆనందవర్ధనుని ప్రతిభ పాండిత్యాలు గొప్పవి.

## ముకుల భట్టు

ముకుల భట్టు తండ్రి కల్లటుడు కల్లటుడు ఆనంద వర్ధనుని ఆశ్రయదాత అవంతి వర్మ సభాపండితుడు. కాబట్టి ముకుల భట్టు అనందవర్ధనునికి దాదాపు సమకాలికుడు లేక కొంచెం తరువాతి వాడని చెప్పవచ్చును. ముకుల భట్టు ''అభిధావృత్తి మాతృక'' అనే కావ్యగ్రంథాన్ని రచించాడు. దీనిలో 15 కారిక లున్నవి. దీనితో అభిదా, లక్షణాల విశిష్టత - నిరూపింపబడింది. అనంద వర్ధనుని వ్యంజనావృత్తిని ఉపేక్షించి ముకుల భట్టు వాచ్యార్థానికే పట్టాన్ని కట్టాడు. ఆనందవర్థనుని వ్యంజనావృత్తిని, ధ్వని సిద్ధాంతాన్ని అంగీకరించక తిరస్క



రించిన వారిలో ఇత డొక ఆచార్యుడు. ఆనంద వర్ధనుని ధ్వని వాదాన్ని అంగీక రించిన మమ్మటుడు ముకుల భట్టు అభిధాలక్షణల విషయంలో చెప్పిన కొన్ని అభిప్రాయాలను గ్రహించి వున్నాడు.

## రాజ శేఖరుడు

రాజశేఖరుడు కవి, నాటకకారుడే కాక గొప్ప ఆలంకారికుడుకూడ. మౌలిక మైన అతని అలంకార కృతి ''కావ్యమీమాంస" ఒక విశిష్టమైన కోవకు చెందింది రాజశేఖరుడు మహారాష్ట్ర దేశీయు డని అంటారు. అతడు కనౌజ్ రాజులు మహేంద్ర పాల, మహీపాలుర (క్రి శ. 880-925) అస్థానంలో వున్నాడు. ఇతడు మహేంద్ర పాలుని విద్యా గురువు కూడ. మహేంద్రపాలుని తర్వాత అతని కొడుకు మహీపాలు అస్థానంలో రాజశేఖరుడు గౌరవింపబడినాడు.

కావ్యమీమాంస ఒక అపూర్వమైన కావ్యశాస్త్ర గ్రంథం. దీని రచనా శైలిని తర్వాత క్షేమేంద్ర, భోజ, హేమచంద్ర, వాగ్భట, కేశవమిశ్రాది ఆలంకారికులు గ్రహించి అనుసరించారు. కావ్యమీమాంసలో 18 అధ్యాయా లున్నవి. వీటిల్లో క్రమంగా-కావ్యపురుషుని ఉత్పత్తి, అష్టాదశవిధ కావ్యవిద్యలను కావ్యపురుషుడు అష్టాదశ శిష్యులకు ఉపదేశించటం, ఆ శిష్యులు ఆ విద్యల మీద గ్రంథాలు వ్రాయటం, కావ్యభేదాలు, సాహిత్య విద్యా వధువును కావ్య పురుషుడు వివాహ మాడటం, కవి భేదాలు, కావ్యహేతువులు, భాష, శైలి, కావ్యయోనులు, కవి దిన చర్య, కావ్యార్థాహరణోపాయాలు, కవి సమయాలు, కవి రహస్యాలు, పూర్వవృత్తి, అలంకార సిద్ధాంత సమీక్ష, ఉత్తరవర్తి కవుల కవితా సమీక్ష, కై గ్రహింపవలసిన విషయాలు - మొదలైనవి శాస్త్రీయ పద్ధతిలో చెప్పబడినవి. ఇటువంటి విషయ చర్చలు మరే కావ్య శాస్త్రంలోను మనకు కనిపించవు. కావ్యార్థాపహరణను గూర్చి రాజ శేఖరుడు విస్తారంగా చర్చించాడు. అర్థాప హరణ కవులకు తప్పనిసరి అని పేర్కొంటు అతడు 32 విధాలైన అర్థాపహరణ ఉపాయాలను వివరించాడు. రాజశేఖరుడు చర్చించిన విషయాలల్లో ప్రధానమైంది మరొకటి - కవి సమయచర్చ. రాజశేఖరుడు తనకు ముందున్న ఆచార్యుల మతాలను సమీక్షించటమే కాక వాటిలోని తప్పొప్పులను పరిశీలించి చూపాడు. అప్పటికే రస, అలంకార, గుణ, రీతి, ధ్వని సిద్ధాంతాలు స్థాపింపబడివవి. వాటి వాటి నన్నింటిని రాజశేఖరుడు సమీక్షించాడు అంతేగాక కావ్యపురుషుడు అనే

ఒక విచిత్రమైన సృష్టిని అతడు చేశాడు. కవుల దిన చర్యలు కవి గోష్ఠులు, రాజులకు కవులకుండే సంబంధం, రాజ సభలు, వాటి స్వరూపాలను రాజశేఖరుడు చక్కగా వివరించాడు. ఈ నూతన విషయ చర్చలచేత కావ్యమీమాంస ఒక కొత్త మార్గాన్ని తొక్కిన అలంకార గ్రంథంగా పరిగణింపబడుతున్నది.

రాజశేఖరుడు ఏ కావ్య సంప్రదాయానికి చెందినవాడు అని నిర్ణయించటంలో విమర్శకులు భిన్నాభిప్రాయాలను ప్రకటించారు. కొందరు అతన్ని అలంకారవాది అని, కొందరు రసవాది అని నిర్ణయించారు. రాజశేఖరుని మీద రుద్రటుని కావ్యాలంకార ప్రభావం బాగా కన్పిస్తున్నది అలంకార పరీకరణలో, కావ్య శక్తుల వివరణలో రాజశేఖరుడు రుద్రటుని అనుసరించాడు. కాబట్టి అతడు అలంకారవాది అన్న భ్రమ కలుగుతుంది. కాని రాజశేఖరుడు కావ్యాత్మగా రీతిని అంగీకరించాడని ఎస్. కె. డే. అభిప్రాయం. గుణాలను మాత్రమే రీతులకు ఆధారంగా వామనుడు గ్రహించటాన్ని రాజశేఖరుడు విమర్శించాడు. సమాసాలు, అనుప్రాసలు రీతులకు ఆధారాలని అతడు నిర్ణయించాడు. అలంకారాలను, రీతులను కావ్యోపయోగ సామగ్రులుగా అతడు గ్రహించాడు కాని వాటిలో ఏ ఒక్కదాన్ని అతడు కావ్యాత్మగా స్వీకరించ లేదని కావ్యమీమాంసను పరిశీలించిన తేలగలదు. రాజశేఖరుడు ధ్వని సంప్రదాయాన్ని ఎక్కడ స్పష్టంగా ఉల్లేఖించలేదు కాని అర్థాపహరణ ప్రకరణంలో, కవి భేద విభాజనలో అతడు ధ్వన్యాలోకాన్ని అనుసరించాడు. కవి భేదాలను వివరించేటప్పుడు రాజశేఖరుడు ఉక్తి వైచిత్రికి గల ప్రాధాన్యాన్ని అంగీకరించినట్లు తెలుస్తున్నది. కాని కావ్యాత్మగా ధ్వనిని అతడు ఎక్కడ పేర్కొనలేదు. రాజశేఖరుని నాటికి ధ్వని సిద్ధాంతం - పూర్తిగా పండిత సమ్మతిని సంపాదించి వుండదు.

రాజశేఖరుని భార్య అవంతి సుందరి చౌహాన వంశపు క్షత్రియ కన్య. సంస్కృత ప్రాకృతాలల్లో పాండిత్యం కలది. ఆమె అభిప్రాయాలను రాజశేఖరుడు ఎన్నో చోట్ల ఉట్టంకించాడు. రసోచిత శబ్దార్థ సూక్తులను కావ్యంగా పరిగ్రహించాలనే ఆవంతి సుందరి అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నట్లు రాజశేఖరుడు ఒకచోట చెప్పాడు. కవి భేదాలను చెప్తు రస కవినే అతడు ఉత్తమ కవిగా గ్రహించాడు. భరతుని నాట్యశాస్త్ర వ్యాఖ్యాతలైన లోల్లట, శంకుక, నాయకాదులు వివరించిన రస తత్త్వ సంబంధ విషయాలనే రాజశేఖరుడు అంగీకరించినట్లుగా కన్పిస్తుంది.



నీరసార్థనివేశం కావ్యంలో వుండరాదని రాజశేఖరుని అభిప్రాయం. కాబట్టి రాజశేఖరుడు రస సంప్రదాయానికి చెందినవాడే అని చెప్పవచ్చును.

## అజితసేనుడు

క్రీ శ. 10 వ శ॥ వాడు. అలంకార చూడామణి, శృంగారమంజరి ఇతని అలంకార శాస్త్ర గ్రంథాలు. అలంకార చూడామణిలో అలంకారాల వివేచనం, శృంగార మంజరిలో రస చర్చలు వున్నవి. [illegible]డు జైనాచార్యుడు.

## భట్టతౌతుడు

భట్ట తౌతుడు అభినవగుప్తుని గురువు. ఇతని కృతి కావ్యకౌతుకం. ఇది అలభ్యం. దీనికి అభినవగుప్తుడు వివరణనుకూడ వ్రాసాడట. క్షేమేంద్రాది ఆలంకారికులు భట్టతౌతుని ఉద్ధరించారు. రసనిష్పత్తికి హేతుభూతం నటులు రామాది నాయకులను అనుకరించటం కాదని భట్టతౌతుడు చెప్పెనని హేమచంద్రుడు పేర్కొనెను. భట్టతౌతుడు శాంతాన్ని నవమరసంగా అంగీకరించటమేకాక శృంగారాని కన్న దానికే ఉన్నత స్థానాన్ని ఇచ్చెను. భట్టతౌతుని అభిప్రాయాలను అభినవగుప్తుడు లోచనంలో ఉల్లేఖించివున్నాడు. ఇతని కాలం క్రీ. శ 9 వ శ॥ ఉత్తరార్థం. ఇతడు గొప్ప మీమాంసకుడు.

## భట్ట ఇందురాజు

భట్ట ఇందురాజు అభినవగుప్తుని గురువుల్లో ఒకడు. ఇతని దగ్గర అభినవగుప్తుడు ధ్వని సంప్రదాయాన్ని గూర్చి అధ్యయనం చేసెను. భట్టేందురాజు స్వతంత్ర అలంకార శాస్త్రగ్రంథ మేది మనకు లభించలేదు. కాని క్షేమేంద్రుడు ఇతన్ని తన ఔచిత్య విచారచర్చలో ఉల్లేఖించివున్నాడు. ఇతని కాలం క్రీ.శ. 9వ శ॥ ఉత్తరార్థం. ఇతడు కవి కూడ. ఇతని శ్లోకాలను అభినవగుప్తుడు లోచనంలో ఉద్ధరించివున్నాడు.

## అభినవగుప్తుడు

### అభినవగుప్తుని రచనలు

అభినవగుప్తుని కాలం క్రీ శ. 970 నుండి 1050 వరకు. అభినవగుప్తుడు గొప్ప దార్శనికుడే కాక గొప్ప ఆలంకారికుడు కూడ. అతడు స్వతంత్రమైన

53)

అలంకార శాస్త్రగ్రంథాన్ని దేన్నీ వ్రాయలేదు కాని ఇతడు నాట్యశాస్త్రానికి వ్రాసిన వ్యాఖ్య "అభినవభారతి", ధ్వన్యాలోకానికి వ్రాసిన వ్యాఖ్య "లోచనం", ఇవి అతన్నొక స్వతంత్రాలోచనలు గల ఆలంకారికునిగా నిలబెడ్తున్నవి. ఇతడు అప్రతిమాన ప్రతిభా సంపన్నుడైన ఆచార్యుడు. కొందరు ఆచార్యులు వ్యాఖ్యానాలు మాత్రమే వ్రాసినా స్వతంత్రమైన ఆలోచనలను అభిప్రాయాలను ప్రతిపాదించి గొప్ప కీర్తిని సంపాదించారు. వారిలో అభినవగుప్తునికి అగ్రతాంబూలం లభిస్తుంది. ఆనందవర్ధనుడు ధ్వనిసంప్రదాయ ప్రవర్తకుడైతే అభినవగుప్తుడు దాన్ని ప్రచారంలోకి తెచ్చి వ్యాప్తిని కలిగించిన ఆచార్యుడు. ధ్వన్యాలోకంలో అస్పష్టంగా వున్న విషయాలను ఎన్నిటినో అతడు వివరించిన ఘట్టాలు, విషయపుష్టిని చేసిన సందర్భాలు వున్నవి. రసధ్వని వివరణలో అతడు చూపిన ప్రతిభ చెప్పుకోదగింది. అభినవగుప్తుని రస నిష్పత్తివాదానికి "అభివ్యక్తి" వాద మని పేరు. శైవాద్వైతంలో ప్రతిపాదితమైన ఆనందవాదం ఆధారంగా అతడు రసవివేచన చేసాడు. విభావానుభావాదుల ద్వారా సామాజికుల్లో వాసనారూపంగా వున్న రసం అభివ్యక్తమౌతుందని,రసానందం బ్రహ్మానంద సహోదరమైందని అతడు చెప్పాడు. అభినవగుప్తుడు వ్రాసిన "ధ్వన్యాలోకలోచనం" చాల ప్రౌఢమైంది. తర్వాత మమ్మటాదులు అభినవగుప్తుని వ్యాఖ్యాన సహాయంతోనే ధ్వని సంప్రదాయాన్ని ఇంకా పరిపుష్టం చేసి దానికి వ్యాప్తిని కలిగించారు. నాట్యశాస్త్రానికి అభినవగుప్తుడు వ్రాసిన వ్యాఖ్య కూడ చాల ప్రౌఢమైంది.

### అభినవగుప్తుని పాండిత్యం

అభినవగుప్తుడు 19 మంది గురువుల దగ్గర శాస్త్ర విద్యలను అభ్యసించాడు. భట్ట ఇందురాజు దగ్గర ధ్వని సిద్ధాంతాన్ని, భట్టతౌతుని దగ్గర నాట్యశాస్త్రాన్ని అతడు అభ్యసించాడు. శైవవేదాంతాన్ని అతడు లక్ష్మణ గురువు దగ్గర అభ్యసించాడు. శైవ సంప్రదాయానికి చెందిన ప్రత్యభిజ్ఞ సిద్ధాంతంమీద అతడు గ్రంథాలను వ్రాసాడు. అభినవగుప్తుని తండ్రి నరసింహగుప్తుడు శైవాగమాల్లో పండితుడు, శివ భక్తుడు. అభినవగుప్తుడు తండ్రి దగ్గర కూడ శైవ సిద్ధాంతాలను అభ్యసించివుంటాడు. అతని తల్లి విమల. తాత వరాహగుప్తుడు. అభినవగుప్తుని పూర్వజులు పంజాబ్‌లోని 'డో ఆబ్' ప్రాంతవాసులు. తర్వాత కాశ్మీరానికి పోయారు. అభినవగుప్తుడు ఆజన్మ బ్రహ్మచారిగా వుండిపోయెను. అతడు శైవాగమాల్లోనే కాక తంత్ర శాస్త్రంలోను ప్రవేశం కలవాడు. అభినవగుప్తుడు



గొప్ప శైవదార్శనికుడు. శైవదర్శన సంబంధమైన 41 గ్రంథాలను అతడు రచించాడు. శైవాగమాల, స్తోత్రాల మీద అతడు వ్రాసిన వ్యాఖ్యానాలు కూడ వున్నవి. పై 41 గ్రంథాల్లో 11 గ్రంథాలు ప్రచురితమై లభిస్తున్నవి. భట్టతౌతుని కావ్యకౌతుకానికి కూడ అభినవగుప్తుడు "కావ్యకౌతుక వివరణ" మనే వివరణను వ్రాసాడు. ఇది అలభ్యం. కాని తర్వాత ఆలంకారికులు ఉద్ధరించిన భాగాలు మాత్రం మనకు మిగిలినవి.

### ధ్వన్యాలోక వ్యాఖ్య

అభినవ గుప్తునికి పూర్వం ధ్వన్యాలోకానికి "చంద్రిక" అనే వ్యాఖ్యానం వుండేది. ఆ వ్యాఖ్యానాన్ని అభినవగుప్తుని పూర్వజుడే వ్రాసాడని, ధ్వన్యాలోకాన్ని వారు వంశపారం పర్యంగా అధ్యయనం చేస్తుండే వారని అంటారు. "చంద్రిక" వున్నంత మాత్రాన ధ్వన్యాలోక ఆలోకనం జరుగదని ''లోచనం'' కావాలని అభినవగుప్తుడు అన్నాడు. దాన్నిబట్టి చంద్రిక అన్న వాఖ్యానం కన్న అభినవగుప్తుని వ్యాఖ్యానం విశదమైందని చెప్పవచ్చును. ఇతని వ్యాఖ్యానంచేత ధ్వని సిద్ధాంతం పరిపుష్టమై ప్రామాణిక రూపాన్ని ధరించింది.

కావ్య ప్రకాశకారుడు మమ్మటుడు అభినవ గుప్తుని ఆచార్యపాదు డని పేర్కొన్నాడు. దాన్నిబట్టి అతడు అభినవాచార్యుని శిష్యుడని తెలుస్తున్నది. క్షేమేంద్రుడు అభినవగుప్తుని తన గురువుగా చెప్పుకున్నాడు. అభినవగుప్తుడు అనేక గురువుల దగ్గర విద్యల నభ్యసించినవాడు. తానూ ఒక ఆచార్యుడై శిష్యపరంపరంతో విలసిల్లిన పండితుడు.

## రాజానక కుంతకుడు

అభినవగుప్తుడు లోచనంలో కుంతకునిగాని అతని వక్రోక్తి జీవితాన్ని గాని పేర్కొనక పోవటంచేత అతడు అభినవ గుప్తుని తర్వాతివాడని చెప్పవచ్చును. వింటర్‌నిట్జ్ కుంతకున్ని అభినవగుప్తునికి సమకాలికునిగా అంగీకరించాడు. కుంతకుని కాలాన్ని దాదాపుగా క్రీ. శ. 11 వ శతాబ్దం పూర్వార్ధ మని చెప్పవచ్చును. ఆనంద వర్ధనుడు ధ్వని సిద్ధాంతాన్ని స్థాపించిన తర్వాత దాన్ని అంగీకరించక ఖండించినవారు, నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించిన వారు వున్నారు. వారిలో ముకులభట్టు, కుంతక, మహిమ భట్టులు ప్రముఖంగా మనకు తెలియ

వచ్చినవారు. ధ్వని సిద్ధాంతానికి ప్రతిగా కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని స్థాపించాడు. అతని కృతిపేరే "వక్రోక్తి జీవితమ్". కావ్యంలో వక్రోక్తి ప్రాధాన్యాన్ని భామహాదులు అంగీకరించి వున్నారు. "వక్రాభి ధేయ శబ్దోక్తిరిష్టా వాచామలంకృతిః"- వక్రోక్తి గర్భితమైన వాక్యరచన కావ్యానికి అవసరమని భామహుడు గుర్తించి "యత్నోఽస్యాం కవినా కార్యః" అని అన్నాడు. భామహాదుల ఈ అభిప్రాయాలను గ్రహించి ప్రపంచించి కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని స్థాపించాడు. భామహుని వక్రోక్తి దండి గుణాలంకార సంప్రదాయమే కాక వామనుని రీతిగుణ సంప్రదాయం కూడ దీనిలో అంతర్భవించింది. వక్రోక్తి సిద్ధాంత ప్రతిపాదనను కుంతకుడు శాస్త్రీయ పద్ధతిలో చేసాడు. ఆ ప్రతిపాదనలో అతడు చూపిన ప్రతిభ గొప్పది. అయితే వక్రోక్తి సిద్ధాంత ప్రతిపాదనలో ధ్వని సంప్రదాయ ప్రభావం తప్పక గోచరిస్తున్నది. ధ్వని సంప్రదాయాన్ని కుంతకుడు ఎక్కడా ఎదిరించలేదు. అతడు ధ్వని విరోధి కాడు. అయినా అతడు ఒక కొత్త సిద్ధాంతాన్ని, ధ్వని సిద్ధాంతాన్ని అంతర్భవింపజేసుకొన్న కొత్త సిద్ధాంతాన్ని, ప్రతిపాదించి కొత్త మార్గాన్ని తొక్కాడు. అందుకే కొందరు విమర్శకులు వక్రోక్తి సిద్ధాంతం ముసుగు వేసుకొన్న ధ్వని సిద్ధాంతమే అని చెప్పారు. ధ్వనినే కుంతకుడు వక్రోక్తిగా పేర్కొన్నాడని అంటారు. కుంతకుని "వక్రోక్తి" పూర్వాచార్యుల కావ్యతత్త్వ విచారాల నన్నిటిని సమన్వయించే కొత్త సిద్ధాంతం.

కుంతకుని "వక్రోక్తి జీవితం"లో నాలుగు ఉన్మేషా లున్నవి. ధ్వన్యాలోకంలో వలెనే నాలుగు అధ్యాయాలుగా విభాగింపబడటం కాక దానిలో వలెనే వక్రోక్తిజీవితంలో కారికలు, వృత్తి అని రెండు భాగాలున్నవి. కారికలను, వృత్తిని కుంతకుడే వ్రాసాడు మూల కారికల పేరు "కావ్యాలంకారం", వృత్తి పేరు "వక్రోక్తి జీవితం" అని గ్రంథారంభంలో కుంతకుడు చెప్పాడు (1-2). ఇప్పుడు లభ్యమవుతున్న గ్రంథం సంపూర్ణంగా లేదని పండితుల అభిప్రాయం. ఒకొకచోట వృత్తి, ఉదాహణలున్నవి కాని కారికలు లుప్తమైనవి. వక్రోక్తి జీవితంలో రీతి, రస, గుణ, అలంకారాల సమాలోచన వున్నది. స్వభావోక్తి వక్రోక్తుల స్వరూపనిరూణను కుంతకుడు చేసి స్వభావోక్తి అలంకార్యమని, వక్రోక్తి అలంకృతి అని చెప్పాడు. కావ్యశోభాహేతుక తత్త్వంలో వక్రోక్తి ప్రధానమైందని అతని అభిప్రాయం. కుంతకుడు "కావ్యాత్మ" అని అనక "కావ్యజీవితం" అని అంటాడు. భామహ దండి ఉద్భటాదుల వలె కుంతకుడు రసాన్ని రసవదలంకారంగా అంగీకరించలేదు. రసయోగం చేత అలంకారం విశేషాహ్లాదకరం చమత్కృతం



అయినట్లయితే అది రసవదలంకారమని అతడు కొత్త నిర్వచనం ఇచ్చాడు. వక్రోక్తి సిద్ధాంతంలో రసస్థానం ధ్వని సిద్ధాంతంలో మాదిరిగానే మాన్యమైంది.

## వక్రోక్తి భేదాలు

కుంతకుడు ఆరు విధాలైన వక్రోక్తులను వివరించాడు -1) వర్ణ విన్యాస వక్రత 2) పదపూర్వార్ధ వక్రత 3) పదపరార్థ వక్రత 4) వాక్య వక్రత 5) ప్రకరణ వక్రత 6) ప్రబంధ వక్రత. తిరిగి వీటిలోను విభేదాలను కుంతకుడు వివరించివున్నాడు. కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతం అంతర్గతంగా కావ్యస్వరూపం, కావ్య ప్రయోజనాలు, కావ్య హేతువులు, కావ్య రీతులను గూర్చి చర్చించి వున్నాడు. పూర్వాచార్యులు పేర్కొన్న వైదర్భి, గౌడి, పాంచాలీ రీతులను దేశపరంగా పిలవటానికి అంగీకరించక వాటిని సుకుమార, విచిత్ర, మధ్యమ మార్గాలుగా పేర్కొన్నాడు "రీతి"ని ఇతడు "మార్గం"గా పేర్కొన్నాడు. కాళిదాసాదులు సుకుమార మార్గానికి, బాణభవభూతులు విచిత్ర మార్గానికి, మాతృగుప్తమయూరరాజాదులు మధ్యమ మార్గానికి చెందిన కవులని కుంతకుడు వివరించెను. ప్రతి కవి శైలి భిన్న మార్గంలో నడుస్తుందని, కవి వ్యక్తిత్వం అతని శైలిలో ప్రతిబింబిస్తుందని కుంతకుని అభిప్రాయం.

కుంతకుని ఇతర రచనలేవి వున్నట్లు లేదు. సోమేశ్వర, మాణిక్య చంద్ర వంటి ఆలంకారికులు కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని అంగీకరించివున్నారు. కుంతకుడు చెప్పిన ఎన్నో కావ్యసంబంధి ఆలోచనలు ప్రాచీనాధునిక పాశ్చాత్యాలంకారికుల అభిప్రాయాలను పోలివున్నవి. కావ్య నిర్వచనంలో, అలంకార అలంకార్య నిర్ణయంలో, రీతి వివరణలో కుంతకుని అభిప్రాయాలు మౌలికంగా అత్యాధునికంగాను వున్నవి.

## మహిమ భట్టు

ధ్వని సిద్ధాంతంతో సంతృప్తి చెందక, దానితో అంగీకరించక కొత్త సిద్ధాంతాన్ని స్థాపించిన వారిలో మహిమ భట్టు ఒకడు. ఇతని గ్రంథం "వ్యక్తి వివేకం". ఇతడు ప్రసిద్ధ నైయాయికుడు. వ్యక్తి వివేకంలో మహిమ భట్టు ధ్వని సిద్ధాంతాన్ని ఖండించాడు. ఇతడు అసాధారణ మేధావి. ధ్వని అనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని అది అనుమానాంతర్గతమే అని, దాన్ని కావ్య సిద్ధాంతంగా

వేరే ప్రతిపాదించే అవసరం లేదని మహిమ భట్టు మతం. ఇతని మతాన్ని అనుమతివాద మంటారు. దీన్ని ఒక ప్రత్యేక కావ్య సిద్ధాంతంగా కంటె ధ్వని ఖండనగా మాత్రమే గ్రహించవలెను. వ్యక్తి వివేకంలో మూడు ఖండాలున్నవి. మొదటి ఖండంలో ధ్వని లక్షణాన్ని చెప్పి అది అనుమానంలో అంతర్భవించినట్లుగా వివరింపబడింది. రెండవ ఖండంలో అనౌచిత్యాన్ని కావ్యదోషంగా పరిగ్రహించి అనౌచిత్యరూపం వివరింపబడింది. మూడవ ఖండంలో తిరిగి ధ్వని అనుమానంలో ఎట్లా అంతర్భవిస్తుందో తర్కపూర్ణంగా చెప్పబడింది. వ్యంగ్యార్థ బోధకమయ్యే రసాన్ని కూడ మహిమ భట్టు అనుమానాంతర్భాగంగానే పరిణమింపజేసాడు. మమ్మటుడు కావ్యప్రకాశం పంచమోల్లాసంలో ధ్వనిని స్థాపించేటప్పుడు మహిమ భట్టు అభిప్రాయాలను ఖండించి ధ్వని అనుమానంలో అంతర్భవించదని ప్రమాణాలతో నిరూపించాడు. అనుమానం ధ్వని రెండు భిన్నమైనవని మమ్మటుడు యుక్తియుక్తంగా ప్రకటించి చూపాడు. భట్ట శంకుకుని అనుమితి వాదాన్ని మహిమభట్టు అంగీకరించి గ్రహించి తన సిద్ధాంతాన్ని స్థాపించాడు :

మహిమభట్టు రాజశేఖరుని కృతులను పేర్కొన్నాడు. మరియు అతనికి వక్రోక్తి సిద్ధాంతంతోను పరిచయమున్నది. వ్యక్తి వివేకంలో మహిమ భట్టు కుంతకుని కూడ స్మరించివున్నాడు.

> కావ్య కాంచన కశాశ్మమానినా కుంతకేన నిజకావ్య లక్ష్మణి
> యస్య సర్వనిరవద్యతోదితా శ్లోక ఏష స నిదర్శితో మయా.

కాబట్టి మహిమభట్టు కుంతకుని తర్వాత వాడని చెప్పవచ్చును. మమ్మటుడు (క్రీ.శ. 1025–1075) మహిమ భట్టును ఖండించటంచేత ఇతడు అతనికి పూర్వుడో దాదాపుగా సమకాలికుడో కావచ్చును. క్షేమేంద్ర, రుయ్యకులకు మహిమభట్టు పూర్వుడు. మహిమభట్టు తత్త్వోక్తి కోశమనే మరొక అలంకార శాస్త్రగ్రంథాన్ని రచించెనంటారు. కాని అది అలభ్యం. రుయ్యకుడు మహిమభట్టు వ్యక్తి వివేకానికి వివేకవిచార మని విమర్శగ్రంథాన్ని రచించాడు. రుయ్యకుడు ధ్వనివాది. మహిమ భట్టు అభిప్రాయాలను తన విమర్శగ్రంథంలో విమర్శించి ఖండించాడు

## ధనంజయ - ధనికులు

ధనంజయుడు ధారాపతి ముంజరాజు (క్రీ. శ. 974–990) ఆస్థాన పండితుడు. ధనంజయుని కృతి దశరూపకం. ఇది నాట్యశాస్త్రం మీద ఆధారితమైన



రచన. నాటక లక్షణాలకు ఇది ప్రామాణికమైన గ్రంథం. దశరూపకంలో నాలుగు ప్రకాశా లున్నవి. 300 కారిక లున్నవి. దీనిలో రూపక భేదాలు, తల్లక్షణాలు, నాయికానాయక భేదాలు, భాషా ప్రయోగంలోని నియమాలు అభినయభేదాలు వృత్తులు, రసపోషణ, రస నిష్పత్తి, రసభేదాలు వివరింపబడినవి.

దశ రూపకానికి ధనికుడు "అవలోక" మనే వ్యాఖ్య వ్రాసాడు. ధనికుడు ధనంజయుని సోదరుడని ప్రతీతి. ధనికుడు కూడ ముంజరాజు ఆస్థాన పండితుడు. అవలోకం ముంజరాజు మరణానంతరం క్రీ.శ. 1000 ప్రాంతంలో రచింపబడింది. ధనికుడు కావ్య నిర్ణయ మనే కావ్యశాస్త్రాన్ని రచించినట్లు అతని అవలోకాన్ని బట్టి తెలుస్తున్నది. కాని లభ్యం కాలేదు.

## దశరూపక వైశిష్ట్యం

ధనంజయ ధనికులు వివరించిన రస నిర్వచనం, రస నిష్పత్తి, నాయికా భేదాలు మొదలైన వాటిని భానుదత్తుడు గ్రహించి రసతరంగిణి, రసమంజరులను రచించాడు. దశరూపక ప్రభావాన్ని భానుమిశ్రుని మీద కూడ చూడవచ్చును. క్రీ. శ. 12వ శతాబ్దానికి చెందిన గుణచంద్ర రామచంద్రుల నాట్య దర్పణానికి కూడ దశరూపకమే ఆధారమైంది. క్రీ శ. 10వ శ॥ తర్వాత వ్రాయబడిన నాట్య గ్రంథాలకు దశ రూపకమే ఉపజీవ్య గ్రంథంగా నిలిచింది. విశ్వనాథుని నాయికా నాయక భేదం, దృశ్యకావ్య నిర్వచన ప్రకరణాలు దశరూపకం ఆధారంగా వ్రాయబడినవి. విద్యానాథుడు నాయికానాయక భేదాలను దశరూపకం నుంచే గ్రహించాడు. దృశ్యకావ్యలక్షణాల విషయంతో దశరూపకమే ప్రామాణిక గ్రంథమైంది. నాట్యశాస్త్రం విశాలకాయం కలది. సులభరీతిలో లేదు. దశరూపకం సులభపద్ధతిలో నాటకలక్షణాలను వివరిస్తున్నది. కాబట్టి దశరూపకమే ఎక్కువ అందుబాటులో వుండి ప్రామాణికంగా నిలిచింది. దశరూపకాన్ని కేవలం నాట్యశాస్త్రం యొక్క రూపవిభేదమే అని చెప్పలేము. ధనంజయ ధనికులు సంధిసంధ్యంగాలను, అర్థోపక్షేపకాలను, రూపకాలల్లో రసనిర్వహణను గూర్చి చాల విశదంగా చర్చలు చేసి మౌలికమైన అభిప్రాయాలను కూడ వ్యక్తం చేసివున్నారు. అభినవగుప్తుడు శాంత రసాన్ని స్థాపించి దానికి పట్టం కట్టాడు. ధనంజయ ధనికులు శాంత రసం శ్రవ్య కావ్యంలో నిబద్ధిస్తే నిబద్ధించవచ్చును కాని దృశ్యకావ్యంలో అది పనికిరాదని అభిప్రాయపడినారు. తర్వాత విశ్వనాథుడు శాంతరసాన్ని దృశ్య కావ్యాలల్లోను

పోషించవచ్చునని చెప్పిపున్నాడు. ధనంజయుడు ధ్వని విరోధి ధ్వనిని ఖండించి ఇతడు రసమే శబ్దార్థాల తాత్పర్యమని చెప్పెను. ధనంజయ ధనికులు భాట్ట మీమాంసకులచేత ప్రభావితులైనారని పండితుల అభిప్రాయం. వీరు అభిధా, లక్షణా తాత్పర్యాలనే అంగీకరించారు. దశరూపకానికి ధనికుడేకాక నరసింహభట్ట, దేవపాణి, బహురూపభట్టు, క్షోణీధరమిశ్ర, కురవిరామాదులు కూడ వాఖ్యానాలు వ్రాసారు. వీటిల్లో ధనికుని వ్యాఖ్యానమే ప్రసిద్ధమైంది.

## భోజరాజు

భోజుడు ధారానగరాధిపతి. ముంజరాజు అగ్రజుడు సింధులుని కుమారుడు. సింధులుడు, ముంజరాజు, భోజుడు ముగ్గురు కూడా పండితకవి పోషకులు. అందులో భోజుడు స్వయంగా కవి, పండితుడు, ఆలంకారికుడు. భోజుడు (క్రీ. శ 1005-1054) సరస్వతీ కంఠాభరణం, శృంగార ప్రకాశం అనే అలంకారశాస్త్ర గ్రంథాలను రచించెను. ఇవి రెండు సాహిత్యశాస్త్ర రంగంలో ప్రసిద్ధ గ్రంథాలు. రెండు కూడా బృహద్గ్రంథాలే. సరస్వతీ కంఠాభరణంలో ఏదు ప్రకాశాలున్నవి. దీనిలో కావ్య గుణదోషాలు, అలంకారాలు, నాయికా నాయక భేదాలు, రసాలు దృశ్య కావ్య లక్షణాలు వివేచింపబడినవి. దీనిలో భోజుడు చేసిన భాషా విషయ చర్చ మహత్త్వపూర్ణమైంది. ఇటువంటి చర్చను రుద్రటుడు తప్ప మరే ఆలంకారికుడు చేసివుండలేదు. రుద్రటుడు దశమరసంగా అంగీకరించిన ప్రేయో రసాన్ని భోజుడు గ్రహించి సరస్వతీ కంఠాభరణంలో వివరించాడు. రుద్రటుడు నాలుగు రీతులను పేర్కొనగా భోజుడు అవంతి, మాగధి, రీతులను అదనంగా చేర్చి ఆరింటిని గ్రహించాడు. శృంగార ప్రకాశంలో 33 అధ్యాయాలున్నవి ఇది సంపూర్ణంగా లభించలేదు. ఇందులో శృంగార రస వివేచన ప్రధానంగా చేయబడింది. 12 అధ్యాయాలల్లో మహాకావ్య, రూపక లక్షణాలు చెప్పబడినవి మిగతా 24 అధ్యాయాలల్లో రసవివేచన చేయబడింది. మరియు శృంగార రస ప్రాధాన్యం వివరింపబడింది. భోజుడు "శృంగార ఏవ ఏకో రసః-" శృంగార మొక్కటే రసమని ప్రతిపాదించెను. ప్రాచీనాచార్యులు శృంగారాది పది రసాలను పేర్కొన్నారు. కాని శృంగార మొక్కటే రసమని, మిగిలినవన్ని భావాలని అవస్థావశంచేత అవి ఒకొకసారి స్థాయిరూపాన్ని పొందుతవని మరొకసారి వ్యభిచారి భావరూపాన్ని పొందుతవని ఇతడు చెప్పెను.



వటయక్షన్యాయానుసారంగా వీరాద్భుతాదులకు రసప్రసిద్ధి కలిగిందని, దాన్ని నివారించటమే తన ప్రయత్నమని అతడు తెలిపాడు:

వీరాద్భుతాదిషుచ యేహ రస ప్రసిద్ధిః
సిద్ధాకుతోఽపి వటయక్షవదా విభాతి
లోకే గతాను గతికత్వ వశాదుపేతా
మేతాం నివర్తయితు మేష పరిశ్రమో నః.

భోజుడు పూర్వాలంకారికుల అభిప్రాయాలను చాల ఉట్టంకించాడు. అలంకార వివేచనలో భోజుడు దండిచేత చాల ప్రభావితుడైనాడని చెప్పవచ్చును. భోజుడు సాహిత్య లోకంలో కొత్త కావ్యసిద్ధాంతాన్ని ఏది ప్రతిపాదించకపోయినా అతడు రసవివేచనలో ప్రకటించిన అభిప్రాయాలెన్నో మాన్యయోగ్యంగా వున్నవి. అభినవ గుప్తుడు శాంత రసానికి పట్టం కట్టాడు. భవభూతి కరుణరస మొక్కటే రసమని చెప్పాడు. భోజుడేమో శృంగారానికి ప్రాధాన్యమిచ్చి శృంగార మొక్కటే రసమని స్థాపించాడు. ఆ తర్వాత ఆలంకారికులు మాయ, అద్భుతాది రసాలను ఏకైక రసాలుగా స్థాపించటానికి పూనుకొన్నారు.

సరస్వతీ కంఠాభరణానికి రత్నేశ్వరుడు వ్రాసిన రత్నదర్పణ మనే వ్యాఖ్యానం ప్రసిద్ధమైంది. ఇదిగాక ఇంకా మూడు వ్యాఖ్యానాలు దీనికి వున్నవి.

భోజుడు పై రెండు అలంకార గ్రంథాలనే కాక ఇంకా అనేక గ్రంథాలను రచించాడు. అతని చంపూరామాయణం ప్రసిద్ధమైన రచన. అదేగాక రాజమార్తాండ మనే యోగశాస్త్ర గ్రంథాన్ని, రాజమృగాంకమనే జ్యోతిష గ్రంథాన్ని, వ్యవహార సముచ్చయం, చారుచర్య అనే ధర్మశాస్త్ర గ్రంథాలను, ఆయుర్వేదసర్వస్వం, విశ్రాంతీవిద్యా వినోద మనే ఆయుర్వేద గ్రంథాలను, శాలిహోత్ర మనే అశ్వశాస్త్ర గ్రంథాన్ని, చాణక్యనీతి, పుత్రమార్తాండ, యుక్తికల్పతరువు అనే రాజనీతి శాస్త్ర గ్రంథాలను, సమరాంగణ సూత్రధార మనే వాస్తుశాస్త్రగ్రంథాన్ని, తత్త్వ ప్రకాశం, సిద్ధాంత సంగ్రహం, శివతత్త్వరత్నకళిక అనే శైవసిద్ధాంత గ్రంథాలను రచించాడు వీటిల్లో ఎన్ని అతడు రచించినవో, ఎన్ని అతని పేరుమీదుగా చలామణి అవుతున్నవో నిర్ణయించటం కష్టం.

## క్షేమేంద్రుడు

క్షేమేంద్రుడు అభినవగుప్తుని శిష్యుడు. అతడు కవి పండితుడు, ఆలంకారికుడు. క్షేమేంద్రుని కాలం క్రీ. శ. 1050 ప్రాంతం. కాశ్మీరరాజు అనంతుని ఆస్థానపండితుడు. క్షేమేంద్రుడు వివిధ విషయాలమీద 33 గ్రంథాలవరకు వ్రాసాడు. కవికంఠాభరణం, ఔచిత్యవిచారచర్చ అతని రెండు అలంకార కృతులు.

కవికంఠాభరణంలో కవిత్వప్రాప్తి, కావ్యవైచిత్రి, అర్థశబ్దరసాలల్లోని దోషాలు, గుణాలు వివరింపబడినవి దీనిలో ఐదు అధ్యాయా లున్నవి. ఔచిత్య విచారచర్చలో క్షేమేంద్రుడు ఔచిత్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అనౌచిత్యం కన్న రసభంగకారణం లేదని ఔచిత్యప్రాధాన్యాన్ని ఆనందవర్ధనాదులు గుర్తించి వున్నారు. దాన్ని తీసుకొని క్షేమేంద్రుడు ఔచిత్యాన్ని ఒక కావ్యసిద్ధాంతంగా నిలబెట్టాడు. శబ్ద, అర్థ, గుణ, అలంకార, రససంబధమైన ఔచిత్యాలను సోదాహరణంగా అతడు వివరించాడు అనౌచిత్యదోషాలను చూపేటప్పుడు అతడు ప్రసిద్ధ కవుల కావ్యాలనుంచికూడ నిర్భయంగా ఎత్తిచూపాడు ధ్వని సిద్ధాంత ప్రభావం క్షేమేంద్రునిమీద చాల వున్నది. ఔచిత్యం ఒక కావ్య సిద్ధాంత రూపాన్ని ధరించదని విమర్శకుల అభిప్రాయం. విభిన్నతత్త్వాల మిశ్రణాన్ని మనం ఔచిత్య సిద్ధాంతంలో చూడవచ్చును. ఇది ఒక స్వతంత్రమైన సిద్ధాంతంకంటె ఒక అత్యావశ్యక కావ్యతత్త్వంగా గ్రహించాలి. ఎందుకంటె ఇది ధ్వనిలోనే చివరకు అంతర్భవిస్తున్నది. సువృత్తతిలక మనే ఛందో గ్రంథాన్ని కూడ క్షేమేంద్రుడు వ్రాసాడు.

## మమ్మటుడు

అభినవగుప్తుని ఆచార్యపాదుడని చెప్పటంచేత మమ్మటుడు అతని శిష్యుడని భావింపబడుచున్నాడు. మమ్మటుడు ఉదాత్తాలంకారానికి భోజరాజు దానశీలతను వర్ణిస్తు శ్లోకాన్ని ఉదాహరించాడు. మమ్మటుని కావ్యప్రకాశానికి మాణిక్యచంద్రుడు క్రీ. శ. 1159 - 1160 ప్రాంతంలో టీకను వ్రాసాడు. రుయ్యకుడు (క్రీ. శ. 1128 - 1149) కావ్యప్రకాశాన్ని ఉల్లేఖించాడు. అప్పుడు మమ్మటుని కాలాన్ని క్రీ శ. 1050-1100 అని చెప్పవచ్చును. సాహిత్యశాస్త్ర రంగంలో మమ్మటుని



కావ్యప్రకాశానికి ప్రత్యేక స్థానమున్నది. ఇతడు చాలావరకు ఉద్భట, రుద్రట, ధనంజయులను అనుసరించినా అతడు ధ్వనిసిద్ధాంత సమర్థకుడు. ధ్వని సిద్ధాంతాన్ని ఎదిరించిన వారిని ఇతడు కావ్య ప్రకాశంలో ఖండించాడు. ఆనందవర్ధన, అభినవగుప్తుల తర్వాత ధ్వనిసిద్ధాంతాన్ని కాదని కొత్త సిద్ధాంతాలను స్థాపించిన వారున్నారు. అంటె ఆ ఇద్దరు ఆచార్యుల తర్వాత వెంటనే ధ్వనిసిద్ధాంతం సర్వసమ్మతమై ప్రచలితం కాలేదు. అట్లా ఎదిరించిన వారిని ఖండించి ధ్వని సిద్ధాంతానికి ప్రాచుర్యాన్ని కలిగించటమే మమ్మటుని గ్రంథ రచనోద్దేశమని చెప్పవచ్చును. ఈ ఖండన ఖండనంలో మమ్మటుడు చూపిన యుక్తులు, ప్రమాణాలు ప్రబలమైనవి. ఆ తర్వాత ధ్వని విరోధులున్నా ఎవరు మమ్మటునికి సమాధానమిచ్చి నిలువలేకపోయారు. అట్లా ధ్వనిసిద్ధాంతం ఎదురులేక సర్వజనాంగీకారాన్ని పొందిందంటె మమ్మటుని యుక్తులే కారణం. ఉద్భట, రుద్రట, వామన మహిమభట్టు మొదలైనవారిని అతడు ఖండించెను. భామహుడు ధ్వనివాది అని మమ్మటుని అభిప్రాయం. తరువాత ఆలంకారికులు రుయ్యక, హేమచంద్ర, పండితరాజ జగన్నాథులు మమ్మటుని అనుసరించారు. మమ్మటుడు పూర్వాచార్యుల మతాలను కఠినంగా ఖండించక సంయమనంతో ఆదరపూర్వకంగా వివేచించి వున్నాడు.

కావ్యప్రకాశం పది ఉల్లాసాలుగా విభాగింపబడింది. 140 కారిక లున్నవి. తొమ్మిదవ ఉల్లాసంలో శబ్దాలంకారాలు, పదవ ఉల్లాసంలో అర్థాలంకారాలు వివరింపబడినవి. మొదటి ఉల్లాసంలో కావ్యప్రయోజనాలు, హేతువులు, భేదాలు, కావ్య స్వరూపం వివరింపబడినవి. రెండవ ఉల్లాసంలో శబ్దార్థ స్వరూప నిర్ణయం, శాబ్దీ వ్యంజనను గూర్చి చెప్పబడింది. మూడవ ఉల్లాసంలో ఆర్థీవ్యంజన నిరూపింపబడింది. నాల్గవ ఉల్లాసంలో రసాదిధ్వని విచారం చేయబడింది. ఐదవ ఉల్లాసంలో వ్యంజనాశక్తి ప్రతిష్ఠాపింపబడింది. ఆరవ ఉల్లాసంలో చిత్రకావ్య నిరూపణ చేయబడింది. ఏడవ ఉల్లాసంలో దోషనిరూపణ, ఎనిమిదవ ఉల్లాసంలో గుణనిరూపణ చేయబడింది. మమ్మటుడు "తదదోషౌ శబ్దార్థౌ సగుణా వనలంకృతీ పునః క్వాపి." అని నిర్వచించాడు. దండి వలెనే ఇతడు కావ్యం దోషరహితంగా వుండాలని గుణ సహితంగా వుండాలని చెప్పాడు. అందుకే దోషాలను అతడు విశదంగా వివరించి వున్నాడు. ''అనంకృతీ పునః క్వాపి'' అని అలంకారాల మీద మమ్మటుడు ఎక్కువ ఆదరణ చూపకున్నా చివరి రెండు ఉల్లాసాలల్లో అలంకార భేదాలను

విశదంగానే నిరూపించాడు మమ్మటుని కావ్యహేతువుల, కావ్యప్రయోజనాల వివేచన చాల మాన్యయోగ్యంగా వున్నది. మమ్మటుని శబ్దశక్తుల వివరణ ప్రామాణికమైంది.

### కావ్యప్రకాశానికి టీకలు

కావ్యప్రకాశానికి మొదట క్రీ. శ 1159 ప్రాంతంలో మాణిక్య చంద్రుడనే జైనపండితుడు టీకను వ్రాసాడు. అ తర్వాత కావ్యప్రకాశానికి చాలా టీకలు వ్రాయబడినవి. ఇప్పుడు దీనికి 40, 50 వరకు టీకలు దొరుకుతున్నవి. భగవద్గీతకు తప్ప ఇన్ని టీకలు మరేగ్రంథానికి లేవని కాణే అన్నాడు. ఈ టీకలే ఈ కృతి యొక్క వ్యాప్తి, ప్రాశస్త్యాలను ప్రకటిస్తున్నవి. కొన్ని టీకలకు తిరిగి వివరణలు, టీకలు కూడ వ్రాయబడినవి. కావ్యప్రకాశస్య కృతా గృహేగృహే టీకా తథాప్యేష తథైవ దుర్గమః''-అని ఒక ప్రాచీన వ్యాఖ్యానకారుని ఉక్తి.

మమ్మటుడు "శబ్దవ్యాపార విచార"మని శబ్దశక్తి మీద ఒక గ్రంథాన్ని రచించాడు.

## రాజానక రుయ్యకుడు

రాజానక అనేది రాజాస్థానంలో ఏదో పదవి అని, ఆ పదవిలో వుండటం చేత ఇతనికి రాజానక రుయ్యకుడని పేరు. రుయ్యకుడు మమ్మటుని కావ్య ప్రకాశాన్ని, బిల్హణుని విక్రమాంక దేవచరిత్రను పేర్కొనటం చేత క్రీ. శ 1128-1149 ప్రాంతంవాడని చెప్పవచ్చును. రుయ్యకున్ని రుచకుడని కూడ అంటారు. రుయ్యకుడు గొప్ప పాండిత్యం కలవాడు. రుయ్యకుని కృతి అలంకార సర్వస్వం. ఇది సూత్రరూపంలో రచింపబడింది. దీనికి వృత్తికూడ వున్నది. ఈ వృత్తిని రుయ్యకుడే వ్రాసాడో లేక వేరే ఎవరైనా వ్రాసారో చెప్పలేము. శ్రీకంఠ కావ్య కర్త మంఖకుడు రుయ్యకుని శిష్యుడు. సూత్రాలను రుయ్యకుడు వ్రాయగా దానికి వృత్తిని మంఖకుడు వ్రాసాడని కొందరు విమర్శకుల అభిప్రాయం. అలంకార సర్వస్వానికి జయరథుడు వ్రాసిన టీక వున్నది.

అలంకార సర్వస్వంలో రుయ్యకుడు అలంకారాల వివేచనను మౌలికంగా చక్కగా చేసాడు. అలంకార లక్షణాలు సూత్రాలల్లో చెప్పబడి, వృత్తిలో సోదాహరణంగా వివరింపబడినవి. అలంకారాల విశ్లేషణ, వివేచనలను రుయ్యకుడు శాస్త్రీయ పద్ధతిలో చేసాడు. తర్వాత అలంకారాలను వివరించేవారికి ఇది ఆదర్శమైంది. ఇతని కృతితో కేవలం అలంకారాల వివరణే వున్నది. ఇతర కావ్య తత్త్వాల ప్రసక్తి లేదు. దీనిలో కొత్త అలంకారాలను రుయ్యకుడు చేర్చాడు. అలంకారాలను విశదంగా వివరించి చెప్పినా రుయ్యకుడు ధ్వనివాది కాని అలంకారవాది కాడు. మమ్మటుని కావ్య ప్రకాశానికి ఇతడు టీక వ్రాయటమే దీన్ని నిరూపిస్తున్నది. ధ్వని సిద్ధాంతాన్ని ఖండించినవారిని ఈ టీకలో రుయ్యకుడు ప్రతి ఖండన చేసాడు.



రుయ్యకుడు కావ్య ప్రకాశానికి సంకేత మనే పేరుగల టీకనే కాక మహిమ భట్టు వ్యక్తి వివేకానికి విచార విమర్శను, బాణుని హర్ష చరిత్రకు టీకను కూడ వ్రాసాడు. ఇవేగాక సాహిత్య మీమాంస, నాటక మీమాంస, అలంకారానుసారిణి, సహృదయ లీల అనే గ్రంథాలను కూడ రచించాడు.

## వాగ్భట్టు (ప్రథమ)

వాగ్భట్టు జైనుడు. ఇతడు క్రీ. శ. 1121 - 1156 నడుమ జీవించి వున్నాడు. ఇతని కృతి వాగ్భటాలంకారం. ఈ గ్రంథం ఐదు పరిచ్ఛేదాలుగా విభాగింపబడింది. దీనిలో క్రమంగా కావ్య లక్షణాలు, కావ్య హేతువులు, కావ్య ప్రయోజనాలు, కవి శిక్ష, కవి సమయాలు, కావ్య భేదాలు, దోష గుణాలు, భాష అలంకారాలు, రీతులు, చిత్ర బంధకవిత్వం, నాయికానాయక భేదాలు, రసం, వివరింపబడినవి. వాగ్భట్టు కావ్యాలను ఛందఃసహితం, ఛందో రహితం, మిశ్రమని విభజించాడు. అతడు వైదర్భి, గౌడి రెండు రీతులనే గ్రహించాడు. వాగ్భట్టు ఉదాహరణలన్ని స్వయంగానే వ్రాసాడు. అతడు నేమి నిర్వాణమనే మహా కావ్యాన్ని రచించెను. వాగ్భటాలంకారానికి సింహదేవగణి వ్యాఖ్యానాన్ని వ్రాసాడు. వాగ్భట్టు స్వయంగా కూడ తన కృతికి వ్యాఖ్యానాన్ని వ్రాసుకొన్నాడు.

## హేమచంద్రాచార్యుడు

హేమ చంద్రుడు జైనుడు. గుజరాతు రాజు కుమార పాలుని (క్రీ. శ. 1142-1173) గురుపు, ఆస్థాన పండితుడు. ఇతని అసలుపేరు సోమదేవుడట. ఇతడు అనేక గ్రంథాలను రచించాడు. వాటిల్లో కావ్యానుశాసన మనే అలంకార

శాస్త్ర గ్రంథం ఒకటి. ఇది ప్రముఖమైన అలంకార గ్రంథం. హేమ చంద్రుని మీద అభినవ గుప్త మమ్మటుల ప్రభావాన్ని స్పష్టంగా చూడవచ్చును. ఇతడు రస ప్రకరణాన్ని అభినవగుప్తుని అభినవభారతి ననుసరించి రచించెను. కావ్యాను శాసనం సూత్రబద్ధమైంది. దీనికి అలంకార చూడామణి అనే వృత్తిని హేమ చంద్రుడే స్వయంగా వ్రాసాడు. మరియు దీనికి వివేక మనే టీకకూడ వున్నది. ఈ కృతిలో 8 అధ్యాయా లున్నవి. దీనిలో కావ్య నాటకాల వివేచన చేయబడింది. రస, దోష, గుణ, అలంకార, నాయికా నాయక భేదాలు మొదలైనవి వివరింప బడినవి. హేమచంద్రుడు కొత్త సిద్ధాంతాన్ని ఏది ప్రతిపాదించకపోయినా పూర్వా లంకారికుల సిద్ధాంతాలను చక్కగా సమీక్షించాడు. ఉదాహరణలుగా సంస్కృత, ప్రాకృత శ్లోకాలను ఇచ్చాడు. యాకోబి, బ్యూలర్లు హేమ చంద్రుని జీవితాన్ని బాగా పరిశోధించి అతని జీవిత చరిత్రను రచించారు.

హేమచంద్రుని సమకాలికులైన జయమంగళుడు కవిశిక్ష అనే గ్రంథాన్ని, నాగవర్మ కావ్యాలోచన మనే గ్రంథాన్ని రచించారు.

## రామచంద్ర గుణచంద్రులు

రామచంద్ర గుణచంద్రులు హేమచంద్రాచార్యుని శిష్యులు. వీరు నాట్య దర్పణమనే కృతిని రచించారు. ఇది కారికల్లో వ్రాయబడింది. రచయితలు స్వయంగా దీనికి వృత్తిని కూడ రచించారు. వీరిలో రామచంద్రుడు ప్రబంధ శతక కర్తనని చెప్పుకొన్నాడు. రామచంద్రుడు గుజరాతులో సిద్ధరాజు ( క్రీ శ. 1093-1143 ) కుమారపాల ( క్రీ. శ. 1143-1172 ) అజయపాల (క్రీ. శ. క్రీ. శ. 1172–1175) రాజుల సమకాలికుడు.

నాట్యదర్పణం నాట్యశాస్త్ర సంబంధ గ్రంథం. ఇది నాలుగు "వివేకా" లుగా విభాగింపబడింది. దీనిలో క్రమంగా నాటక, రూపక, వృత్తి, రస, భావాభి నయాదులు వివరింపబడినవి. దీనిలో విశాఖదత్తుని దేవీచంద్రగుప్త నాటకం ఉద్ధ రింపబడింది. ఇది ఇప్పుడు కొంత భాగం మాత్రమే దొరికింది. నాట్యదర్పణంలో రసవివేచన చక్కగా వున్నది. నాటకాలను ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని రస వివేచన చేయబడింది. రసవిషయకంగా ఎన్నో కొత్త విషయాలను ఈ అలంకారి కులు చెప్పారు. క్షుత్తు, తృష్ణ, మైత్రి, శ్రద్ధ, దయ, ఉపేక్ష, క్షమ, మార్దవాది కొత్త సంచారీభావాలను వీరు గ్రహించారు.



## మలయజ పండితుడు

క్రీ. శ. 1168 ప్రాంతంవాడు. ఇతని అలంకారకృతి "సాహిత్యసారం".

## రాజరాజు

క్రీ శ. 12 వ శతాబ్దం వాడు. ఇతని కృతి "రాజరాజీయం".

## సాగరనంది

సాగరనంది కాలనిర్ణయం చేయటం కష్టం. అయినా అతడు రాజశేఖరుని విద్ధ సాలభంజికను ఉద్ధరించటం చేత క్రీ. శ. .0 వ శ॥ తరువాతివాడని, అమర కోశటీకాకారులు సర్వానంద, సుభూతి చంద్రులు సాగరనంది విరచిత నాటక లక్షణ రత్నకోశాన్ని ఉద్ధరించటం చేత క్రీ. శ. 1159-59 కి ముందు అని నిర్ణ యించవచ్చును. సాగరుడు క్షత్రియుడు. నంది అన్నది అతని వంశనామం. ఆరంభంలో నాట్యప్రవర్తకుడు నాట్యాధిదేవత అయిన శివున్ని ప్రార్థించినా అతడు బౌద్ధుడో, జైనుడో అని విమర్శకుల అభిప్రాయం.

సాగరనంది నాటక లక్షణ రత్న కోశంలో నాట్య సిద్ధాంతాలను, నాటక లక్షణాలను వివేచించాడు. ఇతడు భరతుని నాట్యశాస్త్రాన్ని, అభినవగుప్తుని నాట్య శాస్త్ర వ్యాఖ్యానం అభినవభారతిని అనుసరించి ఈ గ్రంథాన్ని రచించాడు. శాంత రసం నాటకంలో పోషింపదగినదని ధనంజయుని అభిప్రాయం. ఈ విషయంలో సాగరనంది మౌనం ధరించాడు. నాటక లక్షణాలకు సంబంధించిన సమస్త విష యాలు దీనిలో వివరింపబడినవి.

## జయదేవుడు

గీతగోవిందకారుడు జయదేవుడు, నాటకకారుడు అలంకారికుడైన జయ దేవుడు వేరు వేరు వ్యక్తులా? లేక ఒక్కరేనా? అన్న విషయంలో పండితుల్లో అభిప్రాయభేదమున్నది. కాని సూక్ష్మపరిశీలనవల్ల వీళ్ళిద్దరు వేరు వేరు వ్యక్తులనే తేలుతున్నది. అలంకారిక జయదేవునికి జయదేవ పీయూషవర్షుడని పేరు. ఇతని తండ్రిపేరు మహాదేవుడు. గీత గోవిందకర్త జయదేవుని తండ్రి పేరు భోజదేవుడు. కాబట్టి ఈ ఇద్దరు జయదేవులు వేరు వేరు వ్యక్తులే అని తెలుస్తున్నది. ఒకవేళ

వీళ్ళిద్దరు అన్నదమ్ముల కుమారులేమో! ఈ జయదేవునివి రెండు అలంకారకృతులు వున్నవి. ఒకటి- చంద్రాలోకం. రెండు- రతిమంజరి. ఇతని నాటకం ప్రసన్న రాఘవం. ఇది ప్రసిద్ధ నాటకం. రతిమంజరిలో నాయికాభేదాలు నిరూపింపబడినవి. చంద్రాలోకం జయదేవుని ప్రసిద్ధమైన అలంకారకృతి. ఇది పది మయూఖాలుగా విభాగింపబడింది. దీనిలో 294 శ్లోకాలున్నవి. కావ్యపక్షమైన విషయాలన్ని దీనిలో చర్చింపబడినవి. కావ్యలక్షణాలు, దోషాలు, అలంకారాలు. రసధ్వని వివరింపబడినవి. అలంకారాలు లేకున్నా శబ్దార్థాలు కావ్యమౌతుం దన్న మమ్మటుని ఉక్తిని (అనలంకృతీ పునఃక్వాపి) జయదేవుడు ఖండించి కావ్యానికి అలంకారాలు అత్యవసరా లని, అగ్ని అనుష్ణతతో వుండటం ఎంత అస్వాభావికమో అలంకారాలు లేక కావ్యముండటం కూడ అంత అస్వాభావిక మని చెప్పాడు-

అంగీకరోతియః కావ్యం శబ్దార్థావనలంకృతీ
అసౌ న మన్యతే కస్మాదనుష్ణ మనలం కృతీ.

జయదేవుడు అలంకారవాది. అలంకార వివరణలో అతడు రుయ్యకుని అనుసరించాడు. పంచమ మయూఖంలో జయదేవుడు అలంకారాలను వివరించాడు. దీని ఆధారంగానే అప్పయ దీక్షితుడు కువలయానం దాన్ని రచించాడు. చంద్రాలోకానికి శారదాగముడు మొదలైనవారు వ్రాసిన టీక లున్నవి. చంద్రాలోకంలో ఉదాహరణలన్నీ జయదేవుడు స్వయంగా వ్రాసినవే. ఇతని కాలం క్రీ. శ. 12 వ శతాబ్దం. జయదేవుడు మొత్తం 89 అలంకారాలను వివరించాడు.

## దేవేశ్వరుడు

క్రీ. శ. 1300 ప్రాంతంవాడు. "కవి కల్పలత" దేవేశ్వరుని అలంకార శాస్త్ర గ్రంథం.

## భానుదత్తుడు

భానుదత్తుడు క్రీ. శ. 13 వ శతాబ్దంవాడని నిర్ణయింపబడింది. ఇతడు మిథిలాదేశానికి చెందిన గణనాథుని కొడుకు. రసమంజరి, రసతరంగిణి ఇతని అలంకారకృతులు. రసమంజరిలో శ్లోకాలు, వాటికి టీక వున్నవి. దీనిలో నాయికా నాయక భేదాలు వివరింపబడినవి. రసతరంగిణిలో రసమంజరి ప్రసక్తి వుండటం చేత రసతరంగిణి తరువాతి రచన అని చెప్పవచ్చును. దీనిలో రసచర్చ చాల



విశదంగా చేయబడింది. దీన్ని ఒక విధంగా భరతుని నాట్యశాస్త్రంలోని 6, 7 అధ్యాయాలకు వ్యాఖ్యాన రూపమని చెప్పవచ్చును. ఇది గద్యంలో వ్రాయబడింది. కృష్ణ, రామ సంబంధ వర్ణనలు గల శ్లోకాలను కవి రచించి ఉదాహరణలుగా ఇచ్చాడు. దీనిలో ఎనిమిది తరంగాలున్నవి. రసతరంగిణిలో భానుదత్తుడు శృంగార రస ప్రాధాన్యాన్ని వివరించాడు. భానుదత్తుడు మాయారసాన్ని దశమ రసంగా అంగీకరించాడు. చిత్తవృత్తి ప్రవృత్తి, నివృత్తి రూపాలల్లో రెండు విధాలుగా వుంటుందని, నివృత్తిలో శాంతరసం గ్రహింపబడినట్లుగానే ప్రవృత్తియందు మాయారసాన్ని అంగీకరించాలని అతడు అంటాడు. రతి, హాస, శోక, క్రోధ, ఉత్సాహ, భయ, జుగుప్స, విస్మయాలు ప్రవృత్తిలోనే పుట్టి, అణగుతాయని, కాబట్టి ఆ స్థాయి భావాలన్ని మాయా రసానికి వ్యభిచారీ భావాలని అతడు వివరించాడు. మాయారసానికి స్థాయిభావం మిథ్యాజ్ఞానం. సాంసారిక భోగాన్ని ఆర్జించే ధర్మాధర్మాలు విభావాలు. పుత్ర, కళత్ర, సామ్రాజ్య విజయాదులు అనుభావాలు అని అతడు స్థాపించెను. మాయ అనాది అని అది ఒక్కదానివల్ల పుట్టదని, కాబట్టి అది రసం కాదని చిరంజీవి భట్టాచార్యుడు కావ్యవిలాసంలో భానుదత్తుని మాయరసాన్ని ఖండించెను. భరతుడు ఎనిమిది సాత్త్విక భావాలను చెప్పగా భానుదత్తుడు జృంభ అనే తొమ్మిదవ సాత్త్విక భావాన్ని పేర్కొన్నాడు. ఛలమనే 34వ సంచారీ భావాన్ని కూడ పేర్కొన్నాడు.

## ధర్మదాసు

ఇతడు బౌద్ధ పండితుడు. ఇతడు విదగ్ధముఖమండనమనే అలంకార కృతిని రచించాడు. ఇది ప్రసిద్ధమైంది. ఇతని కాలం క్రీ. శ. 1293 - 1309 నడుమ.

## శారదాతనయుడు

క్రీ. శ. 13 వ శతాబ్దంవాడు. ఇతని అలంకార కృతి "భావప్రకాశం". దీనిలో 10 అధ్యాయాలున్నవి. శారదాతనయుడు భరతుని అనుసరించి రస వివరణను చేసాడు. రసాన్ని ఇతడు కావ్యాత్మగా గ్రహించాడు. ఇతడు శాంతాన్ని రసంగా అంగీకరించలేదు. భోజుని అనుసరించి శృంగార రసాన్ని వివరించాడు.

54)

## అల్లరాజు

ఇతడు క్రీ.శ. 13 వ శతాబ్దంవాడు. "రసరత్న ప్రదీపిక" ఇతని అలంకార కృతి.

## అమృతానందయోగి

క్రీ.శ. 13 వ శతాబ్దంవాడు. "అలంకారసార సంగ్రహం" ఇతని రచన.

## విద్యాధరుడు

విద్యాధరుడు ఉత్కళాన్నేలిన నరసింహుని (క్రీ శ. 1307-1826) ఆస్థానకవి. కాని ఆ వంశంలో ఎనిమిదిమంది నరసింహరాజు లుండటంచేత విద్యాధరుడున్నది ఏ నరసింహుని ఆస్థానంలోనో నిర్ణయించటం కష్టం. అయినా అతని కాలం క్రీ. శ. 1278-1314 అని ఊహించవచ్చును. ఏకావళి ఇతని అలంకార కృతి. దీనిలోని ఉదాహరణ శ్లోకాలు నరసింహరాజును స్తుతిస్తూ విద్యాధరుడు వ్రాసినవి. ఈ కృతి శ్లోకరూపంలో వున్నది. దీనికి విద్యాధరుడే స్వయంగా వ్యాఖ్యానాన్ని వ్రాసాడు. విద్యాధరుడు ఆనందవర్ధనుని ధ్వనిసిద్ధాంత సమర్థకుడు. రసానందాన్ని అతడు బ్రహ్మానంద సహోదరమని చెప్పాడు. అలంకారాల వివరణలో అతడు భామహరుయ్యకులను అనుసరించాడు. ఏకావళిలో 8 ఉన్మేషా లున్నవి. దీనిలో రసాలంకారాలే కాక కావ్య స్వరూపం, కావ్య హేతువులు, శబ్ద శక్తులు, గుణరీతి దోషాలు వివరింపబడినవి

## విద్యానాథుడు

క్రీ. శ 14 వ శతాబ్దారంభకాలంలో ఓరుగల్లు ప్రతాపరుద్రుని (క్రీ. శ. 1296-1323) ఆస్థానంలో వుండెను. తన ఆశ్రయదాతను వర్ణిస్తూ శ్లోకాలను లక్ష్యంగా వ్రాసి అతడు ఆ రాజు పేరుమీదుగానే తన అలంకార గ్రంథానికి "ప్రతాపరుద్రయశోభూషణం" అని పేరు పెట్టాడు. లక్ష్య శ్లోకాల విషయంలో ఇది ఏకావళిని అనుకరిస్తున్నది. తర్వాత ఎందరో లాక్షణికులు తమ ఆశ్రయదాతలను కీర్తిస్తూ ఉదాహరణ శ్లోకాలను లక్ష్యంగా ఇస్తూ అలంకారగ్రంథాలను రచించారు. ప్రతాపరుద్రయశోభూషణంలో 9 ప్రకరణా లున్నవి. వీనిలో శ్రవ్య,



దృశ్య కావ్య సంబంధి విషయాలు, వివరింపబడినవి. కావ్యస్వరూపం, కావ్య హేతువులు, ప్రయోజనాలు, చిత్రకవిత్వం, దోషగుణ అలంకారరీతులు. నాయికా నాయక భేదాలు. రసం, రూపక భేదాలు, తల్లక్షణాలు, ధ్వని, ధ్వని భేదాలు వివరింపబడినవి. విద్యానాథుని అలంకార వివరణలను మల్లినాథుడు తన వ్యాఖ్యానాలల్లో ప్రమాణంగా ఉద్ధరించాడు. విద్యానాథుని ఉపమా లక్షణాలతో అప్పయ దీక్షితుడు అంగీకరించలేదు. మల్లినాథుడు విద్యాధరుని ఏకావళికి తరళ అనే వ్యాఖ్యానాన్ని వ్రాయగా మల్లినాథుని కొడుకు కుమారస్వామి ప్రతాపరుద్రీయానికి రత్నాపణమనే వ్యాఖ్యానాన్ని వ్రాసాడు. విద్యాధర విద్యానాథులు కొత్త కావ్య సిద్ధాంతాలను ప్రతిపాదించక పోయినా అలంకారశాస్త్ర విషయాలను చక్కగా సుబోధరీతిలో వివరించివున్నారు. అందుకే వారి అలంకార గ్రంథాలు వ్యాప్తిని పొందినవి.

## వాగ్భట్టుడు (ద్వితీయ)

వాగ్భట్టు అనే పేరుగల మరొక జైన ఆలంకారికుని రెండవ వాగ్భట్టుగా పేర్కొంటుంటారు. ఇతడు క్రీ. శ. 14 వ శతాబ్దంవాడు. కావ్యానుశాసనం ఇతని అలంకారకృతి. ఇది సూత్ర పద్ధతిలో వ్రాయబడింది. దీనికి అలంకారతిలక మనే టీకను కవి స్వయంగా వ్రాశాడు. కావ్యానుశాసనంలో ఐదు అధ్యాయా లున్నవి. వీటిల్లో క్రమంగా కావ్యభేదాలు, రీతిగుణదోష రసాలంకారాదులు వివేచింపబడినవి. వాగ్భట్టు ఛందోనుశాసనమనే ఛందశ్శాస్త్ర గ్రంథాన్ని, ఋషభదేవ చరిత్ర అనే మహాకావ్యాన్ని కూడ రచించాడు.

## మహాపాత్ర విశ్వనాథుడు

విశ్వనాథుడు క్రీ. శ. 14 వ శతాబ్దం పూర్వార్ధంవాడు. ఒరిస్సా ప్రాంతానికి చెందినవాడు. విశ్వనాథుడు మరియు అతని తండ్రి ఇద్దరు ఒరిస్సారాజు దగ్గర ఉన్నత పదవులలో వున్నట్లు తెలుస్తున్నది. విశ్వనాథునికి "సంధి విగ్రహ మహాపాత్రు" డన్న బిరుదమున్నది. ఇతడు మమ్మటుని కావ్య ప్రకాశానికి "కావ్యప్రకాశదర్పణ" మనే టీకను కూడ వ్రాసాడు. విశ్వనాథుని కృతి "సాహిత్యదర్పణం" ప్రసిద్ధమైన అలంకార శాస్త్ర గ్రంథం. సాహిత్య దర్పణంలో 10 పరిచ్ఛేదాలున్నవి. దీనిలో శ్రవ్య, దృశ్య కావ్య లక్షణాలు వివే

చింపబడినవి. మమ్మటుని కావ్యలక్షణాలను ఇతడు వివేచించి "వాక్యం రసాత్మకం కావ్యమ్"అన్న నిర్వచనాన్ని చెప్పాడు. విశ్వనాథుడు ధ్వని సిద్ధాంతాన్ని విశదంగా వివేచించినా అతడు ధ్వనివాది కాడు. అతడు రసవాది రసాన్ని రసధ్వనిగా అంగీకరించి ధ్వనివాదులు దాన్ని మహత్త్వ హీనం చేసారని అతడు తలంచాడు. విశ్వనాథుడు భరతుని రస సిద్ధాంతాన్ని పునఃస్థాపించి రసమే కావ్యాత్మ అని అంగీకరించాడు.

దశరూపకం తర్వాత సాహిత్య దర్పణంలోనే రూపక భేదాలు, లక్షణాలు చక్కగా వివరింపబడినవి. దశరూపకం తర్వాత రూపక లక్షణాలకు ఇదే ప్రామాణిక గ్రంథం రీతులను, అలంకారాలను కూడ విశ్వనాథుడు విశదంగ వివరించాడు. విశ్వనాథుడు స్వయంగా కవి. కొన్ని ఉదాహరణలను అతడు తాను రచించిన గ్రంథాల నుంచి ఇచ్చాడు. రఘువిలాస మహాకావ్యం, కువలయాశ్వ చరిత్ర అనే ప్రాకృత కావ్యం, ప్రభావతి, చంద్రకళ అనే నాటకాలు, నరసింహరాజ విజయం అనే చారిత్రక కావ్యం- అతని కృతులు. ఇవి అనుపలభ్యాలు.

పేరుకు తగినట్లుగానే సాహిత్య దర్పణం సాహిత్యానికి దర్పణం పట్టున్నది. అలంకార శాస్త్ర సంబంధ విషయాలను ఎన్నిటినో సాహిత్య దర్పణం విశదంగా స్పష్టంచేసి చక్కగ చెప్తున్నది కాని విశ్వనాథుకు ఎటువంటి ఆలోచనలకు వివేచనలకు, ఖండనలకు పూనుకోలేదు. అలంకార శాస్త్ర గ్రంథాలల్లో మమ్మటుని కావ్యప్రకాశం తర్వాత సాహిత్య దర్పణానికే ఎక్కువ ఆదరం, వ్యాప్తి వున్నవి.

విశ్వనాథునిది పండితకుటుంబం. ఇతని తండ్రి చంద్రశేఖరుడు మహాకవి. సాహిత్య దర్పణానికి అనేక టీక లున్నవి. విశ్వనాథుని కొడుకు అనంతదాసు కూడ ఒక టీకను వ్రాసాడు. వాగీశుడు వ్రాసిన టీక చాల ప్రశస్తమైంది.

## కుమారగిరి రెడ్డి

కుమారగిరిరెడ్డి (క్రీ శ. 1386 - 1402) కొండవీటి సామ్రాజ్యాన్నేలిన రాజు. ఇతడు వసంత రాజీయ మనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దీనిలో ప్రత్యేకంగా రూపకాలను గూర్చి వివేచన చేయబడింది. కుమారగిరి బావ మరది కాటయ వేమారెడ్డి అతడు కాళిదాసు నాటకత్రయానికి "కుమారగిరి



రాజీయ" మని తన ఆశ్రయదాత పేరుపెట్టి వ్యాఖ్యానాలు వ్రాసాడు ఈ వ్యాఖ్యానాలు చాల ప్రసిద్ధమైనవి. కుమారగిరిరెడ్డి వసంతరాజీయంలోని వివరణల కనుగుణంగా వేమారెడ్డి ఆ వ్యాఖ్యానాలను వ్రాసాడు. వసంతరాజీయం నుంచి వేమారెడ్డియే కాక మల్లినాథ, కుమారస్వామి, నాదెండ్ల గోపమంత్రులు తమ వ్యాఖ్యానాలల్లో ఉద్ధరణలు ఇచ్చారు. ఈ ఉద్ధరణలు మాత్రమే ఇప్పుడు మనకు మిగిలినవి గ్రంథం నశించింది.

## పెదకోమటి వేమారెడ్డి

కొండవీడును పరిపాలించిన మరొక రాజు పెదకోమటి వేమారెడ్డి (క్రీ శ. 1403 - 1420). ఇతడు కుమారగిరి దాయాది. కుమారగిరి తర్వాత కొండవీడును ఆక్రమించి పరిపాలించాడు. ఇతడు సాహిత్య ప్రేమికుడు. ఇతడు వ్యాఖ్యానాలనే కాక అలంకార శాస్త్ర గ్రంథాన్ని కూడ రచించాడు. సాహిత్య చింతామణి ఇతని అలంకార కృతి.

మమ్మటుని కావ్యప్రకాశాన్ని అనుసరిస్తు వేమారెడ్డి సాహిత్య చింతామణిని రూపొందించినాడు. దీనిలో 13 పరిచ్ఛేదాలున్నవి. కావ్యోత్పత్తి, కావ్య లక్షణాలు, కావ్యదోషగుణాలు, అలంకారాలు, రీతులు, నాయికా నాయక భేదాలు, కావ్య వస్తువు, దృశ్యకావ్య లక్షణాలు క్రమంగా వీటిల్లో వివరింపబడినవి. ధ్వని అంతర్గతంగానే వేమారెడ్డి రసాన్ని గూర్చి వివేచన చేసాడు. దీన్ని బట్టి ఇతడు ధ్వనివాది అని చెప్పవచ్చును. ఉదాహరణ శ్లోకాలను వేమారెడ్డి తన రచనల నుంచి ఇచ్చాడు. కొన్ని ఇతర కవులు అతన్ని స్తుతించిన శ్లోకాలు కూడ వున్నవి. వేమారెడ్డి సాహిత్య శాస్త్రాన్నే కాక సంగీత చింతామణి అనే సంగీతశాస్త్ర గ్రంథాన్నికూడ వ్రాసాడు ఇతడు సాహిత్య సంగీతాలల్లో మిక్కిలి ప్రవేశమున్న మహారాజు 'సర్వజ్ఞ చక్రవర్తి' అని ఇతనికి బిరుదం.

## రెండవ సింగభూపాలుడు

పెదకోమటి వేమారెడ్డికి సమకాలికుడైన మరొక రాజు సింగభూపాలుడు. ఇతడు దేవగిరి నేలిన రేచర్ల వంశీయుడు (క్రీ. శ. 1383-1412) వేమారెడ్డి వలెనే కవి పండిత పోషకుడు. స్వయంగా కవి పండితుడు. ఇతడు 'సర్వజ్ఞ' అనే బిరుదాన్ని ధరించాడు, ఇతని అలంకారకృతి రసార్ణవసుధాకరం. దీనిలో 3 అధ్యా

యాలున్నవి. దీనిలో రసవివేచన వివరంగా చేయబడింది. ఇది మహత్త్వ పూర్ణమైన గ్రంథం. 3 అధ్యాయాలకు "రంజకోల్లాస, రసికోల్లాస, రూపకోల్లాసా'' లని పేర్లు పెట్టబడినవి. వీటిల్లో క్రమంగా రూపకోత్పత్తి, రూపక భేదాలు, రసం, నాయికా నాయక భేదాలు, రూపక వస్తువు మొదలైనవి వివేచి-పబడినవి నాట్యశాస్త్రం, దశరూపకం, భావప్రకాశం ఈ రసార్ణసుధాకరానికి ఆదర్శమైన గ్రంథాలు. చమత్కార చంద్రికను వ్రాసిన విశ్వేశ్వరుడు సింగభూపాలుని ఆస్థాని. విశ్వేశ్వరుడే రసార్ణవసుధాకరాన్ని వ్రాసి తన ఆశ్రయదాత పేరు పెట్టాడని కొందరు విమర్శకులు అభిప్రాయ పడినారు. కాని ఇది నిరాధారం. రాజులు వ్రాసినగ్రంథాలు ఇటువంటి అభిప్రాయాలకు గురికావటం శోచనీయం.

సింగభూపాలుడు సాహిత్య ప్రియుడే కాక సంగీత ప్రియుడు కూడ, సారంగ దేవుని సంగీత రత్నాకరానికి సంగీత సుధాకరమనే వ్యాఖ్యానాన్నివ్రాసాడు. కువలయావళి అనే నాటిక ఇతని మరొక రచన, (దీన్ని గురించి రూపక ప్రకరణంలో చెప్పబడింది). రసార్ణవసుధాకరాన్ని సింగభూపాలుడు సింహాసన మధిష్ఠించకముందే వ్రాసి వుండ వచ్చునని విమర్శకుల అభిప్రాయం, ఎందుకంటె రసార్ణవసుధాకరం విశ్వేశ్వరుని చమత్కార చంద్రికలో పేర్కొన బడింది. చమత్కార చంద్రికను సాయణుడు అలంకార సుధానిధిలో పేర్కొన్నాడు. అలంకార సుధానిధి క్రి. శ. 1360కి పూర్వమే వ్రాయబడింది.

## విశ్వేశ్వరుడు

విశ్వేశ్వరుడు రెండవ సింగభూపాలుని ఆస్థానకవి, పండితుడు. ఇతడు చమత్కార చంద్రిక అనే అలంకార శాస్త్రగ్రంథాన్ని రచించాడు. ఏకావళి, ప్రతాపరుద్రీయంలోవలె దీనిలోను ఉదాహరణ శ్లోకాలు ఆశ్రయదాత సింగభూపాలుని ప్రశంసతో కూడినవి. చమత్కారచంద్రిక 8 విలాసాలుగా విభాగింపబడింది. వీటికి క్రమంగా విశ్వేశ్వరుడు విషయాను సారంగా నామకరణం చేసాడు. వర్ణవివేక, వాక్యగుణ దోషవిచార, అర్థదోష ప్రబంధ విశేషవివేక, గుణరీతి వృత్తి పాకశయ్యావివేక, రసవివేక, శబ్దాలంకార, అర్థాలంకార, ఉభయాలంకారా లని విలాసాలకు గల పేర్లు. చమత్కార చంద్రికలో రసార్ణవసుధాకరం పేర్కొన బడటం చేత ఇది దాని తరువాత రచన అని చెప్పవచ్చును. రసార్ణవసుధాకరంలో రసవివేచన విశదంగా వుండటంచేత కాబోలు విశ్వేశ్వరుడు రసవివేచనను సూక్ష్మంగా చేసి విడిచిపెట్టాడు.



కావ్య సిద్ధాంతాల్లో విశ్వేశ్వరుని చమత్కార సిద్ధాంత మొకటి విశ్వేశ్వరుడు చమత్కారాన్ని కావ్యమూల తత్వంగా ప్రతిపాదించాడు "నహి చమత్కార విరహితస్య కవేః కవిత్వం, కావ్యస్యవా కావ్యత్వమ్" అని క్షేమేంద్రుడు కవి కంఠాభరణంలో చెప్పివున్నాడు. మరియు చమత్కారం లేకపోతే కావ్యం లావణ్య హీనమైన స్త్రీ యౌవనం వంటిదని అతడు చమత్కారానికి పెద్ద పీట వేసాడు–

ఏకేన కేనచిదర్ఘమణి ప్రభేణ
కావ్యమ్ చమత్కృతి పదేనవినాసువర్ణమ్
నిర్దోశ లేశమపి రోహతి కస్య చిత్తే
లావణ్య హీనమివ యౌవన మంగనానామ్.

క్రి. శ. 1729 ప్రాంతం వాడైన హరిప్రసాదుడు విశ్వేశ్వరుని తర్వాత చమత్కారాన్ని కావ్యాత్మగా ప్రతిపాదించాడు. "రమణీయార్థ ప్రతిపాదకః శబ్దమ్ కావ్యమ్" అన్న తన కావ్య నిర్వచనంలోని ''రమణీయ" శబ్దాన్ని వివరిస్తు జగన్నాథుడు "రమణీయతా చ లోకోత్తరాహ్లాద జనక జ్ఞాన గోచరతా. లోకోత్తరత్వం చాహ్లాద గతః చమత్కార పర పర్యాయః'' అని లోకోత్తరాహ్లాదకరమైన చమత్కారాన్ని కావ్యంగా గుర్తించాడు. విశ్వేశ్వరుడు కావ్యాన్ని చమత్కారి, చమత్కారి తర, చమత్కారి తమ అని విభజించాడు. చమత్కారి శబ్ద చిత్రం, చమత్కారా తరం - అర్థ చిత్రం, గుణీభూతవ్యంగం, చమత్కారి తమం - వ్యంగ్యం ప్రధానంగా కలిగినటువంటి కవిత్వం. విశ్వేశ్వరుడు చమత్కారాన్ని ధ్వనితో సమానంగా నిలబెట్టు తిరిగి ధ్వని సిద్ధాంతాన్నే గ్రహించి మారు రూపాన్ని ఇచ్చాడు. ఈ విషయంలో ఇతడు కుంతకునితో పోల్చదగినవాడు. ఇద్దరు ధ్వని విరోధులు కాకున్నా కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

## విద్యాభూషణుడు

క్రి శ. 5వ శతాబ్ది వాడు. "సాహిత్యకౌముది" ఇతని అలంకార గ్రంథం.

## సాయణుడు

వేదభాష్యాలు వ్రాసిన ప్రసిద్ధపండితుడు. సాయణుడు విద్యాతీర్థభారతీతీర్థ, శ్రీ కంఠాది గురువుల దగ్గర విద్యను అభ్యసించాడు ఆతని సోదరుడు మాధవా

చార్యుడు కూడా అతనికి గురువు. సాయణుని అలంకార గ్రంథం ''అలంకార సుధానిధి''. దీనిలో ఉదాహరణలన్ని సాయణుని ప్రశంసతో కూడివున్నవి. ఆ శ్లోకాలను అతని సోదరుడు భోగనాథుడు ఉదాహరణ మాలలో వ్రాసినవి. లభించిన తాళపత్ర ప్రతుల్లో రెండు ఉన్మేషాలు మాత్రమే వున్నవి. ఇవి సంపూర్ణంగా లేవు. సాయణుడు మహిమభట్టును ఖండిస్తు ఆనందవర్ధనుని అనుసరించాడు. సాయణుడు తాను చెప్పిన విషయాలను సమర్థించే కొరకు శాస్త్రోద్ధరణలను కూడ ఇచ్చాడు.

## పుంజరాజు

క్రీ. శ. 15 వ శతాబ్దం ఉత్తరార్ధంలో వున్నాడు. కేరళలోని మలబారు ప్రాంతాన్నేలిన రాజు. ఇతడు తన సోదరునికొరకు రాజ్యాన్ని త్యజించిన వృత్తాంతం ప్రసిద్ధమైంది. ఇతడు ధ్వని ప్రదీపం, శిశుప్రబోధాలంకారమనే అలంకార కృతులను రచించాడు.

## వారాణసి ధర్మసుధీ

ధర్మసుధీ క్రీ. శ. 15 వ శతాబ్దం పూర్వార్ధంలో జీవించాడు. ఇతడు ఆంధ్రదేశంలో కృష్ణా లేక గుంటూరు మండలానికి చెందినవాడు. ఇతడు చాలా కాలం వారాణసిలో జీవించటంచేత ఇతని ఇంటి పేరు వారాణసి అని ఏర్పడింది. ఇతనిది వేదపండిత వంశం. ఇతడు నరకాసుర విజయ వ్యాయోగం, కంసవధ అనే రూపకాలను; సూర్య శతకం, కృష్ణస్తుతి అన్న స్తుతి శతకాలను, బాల భాగవతమనే పద్య కావ్యాన్ని, హంస సందేశ మనే ప్రాకృత కావ్యాన్ని రచించెను. ఇతడు సన్యాసం గ్రహించి రామానంద లేక గోవిందానంద సరస్వతి అన్న పేరుతో శంకరుని బ్రహ్మసూత్ర భాష్యానికి 'రత్నప్రభ' అనే టీకను వ్రాశాడు. "సాహిత్య రత్నాకరం" ఇతని అలంకారశాస్త్ర గ్రంథం. ఇది విద్యానాథుని 'ప్రతాపరుద్ర యశోభూషణా'న్ని అనుసరించి వ్రాయబడింది. ప్రతాపరుద్ర మహారాజు ప్రశంస శ్లోకాలను ఉదాహరించిన విద్యానాథుని విమర్శించి ధర్మసుధీ శ్రీరామ ప్రస్తుతితో కూడిన శ్లోకాలను ఉదాహరణలుగా ఇచ్చాడు. దీనిలో కావ్య రూపక సంబంధ విషయాలన్ని చర్చింపబడినవి. దీనికి మల్లాది లక్ష్మణసూరి వ్రాసిన "మందార"మనే వ్యాఖ్య, మధుసూదనమిశ్రుడు వ్రాసిన "నౌక" అనే



వ్యాఖ్యలున్నవి. 'నౌక' అనే మరొక వ్యాఖ్య చర్ల వేంకటేశశాస్త్రి వ్రాసింది కూడ దీనికి వున్నది. చర్ల వేంకటేశశాస్త్రి గురువు అనివిల్ల వేంకటశాస్త్రి "అలంకార సింధు" అనే అలంకార గ్రంథాన్ని రచించాడు. ఇతని కొడుకు అనివిల్ల నారాయణశాస్త్రి "సాహిత్య కల్పతరు" అనే అలంకార కృతిని రచించాడు ఈ ఇద్దరు నూజివీడు మహారాజు మేకా అప్పారావు (క్రీ. శ. 1745) ఆస్థాన పండితులు.

## లొల్ల లక్ష్మీధరుడు

శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన పండితుడు. రాయల కొండవీటి సంస్కృత శాసనాన్ని లక్ష్మీధరుడే వ్రాశాడు. మొదట ప్రతాపరుద్రగజపతి ఆస్థానంలో వుండి ఇతడు విజయనగరానికి వచ్చెను. పండిత వంశజుడు. ఇతడు సరస్వతీ విలాసమనే ధర్మశాస్త్ర గ్రంథాన్ని, కర్ణావతంసం, ఒర్థావతంసం అనే కావ్యాలను, న్యాయ వివేకం, యోగదీపిక అనే శాస్త్ర గ్రంథాలను, వ్యాఖ్యలను మొదలైనవాటిని రచించాడు. "లక్ష్మీధర" మనేది అతని సాహిత్య శాస్త్ర గ్రంథం.

## శఠకోపాచార్యుడు

అహోబిల మఠాధిపతులకు శఠకోపాచార్యులని పేరు. ఈ ఆచార్యులలో ఇతడొకడు కావచ్చును. ఇతడు శఠకోపాలంకార పరిచయమనే అలంకారకృతిని రచించెను. ప్రసిద్ధ తెలుగుకవి పెద్దన మనుచరిత్రలో ఒక శఠకోపయతిని తన విద్యా గురువుగా పేర్కొన్నాడు. అతనికి పెద్దన హరికథాసారమనే కృతిని అంకితంగా ఇచ్చాడు. కాని అది ఈనాడు అలభ్యం. ఆ కృతిభర్త శఠకోపయతి వాసంతికాపరిణయ మనే కావ్యాన్నికూడ వ్రాసాడట. ఈ విద్యాగురువు శఠకోపయతి ఈ అలంకార కర్త ఒక్కరే కావచ్చును. పెద్దన అతన్ని వైష్ణవమతదీక్షను ఇచ్చిన గురువుగాకాక విద్యాగురువుగా పేర్కొన్నాడు అలంకారశాస్త్రవేత్త, కావ్యకర్త అయిన ఇతని దగ్గరనే పెద్దన సాహిత్య విద్యలను అభ్యసించి వుంటాడు. అప్పుడు ఇతని కాలాన్ని క్రీ. శ. 15 వ శతాబ్దం ఉత్తరార్ధమని చెప్పవచ్చును.

## రూపగోస్వామి

రూపగోస్వామి (క్రీ. శ 1490-1563) భక్తుడు, కవియేకాక ఆలంకారికుడు కూడ. ఇతని అనుఘేరు అమరుడు. ఇతని కుటుంబం కర్ణాటదేశంనుంచి

వలసపోయి వంగదేశంలో స్థిరపడిందని బి. ముజుందార్ నిరూపించారు. ఇతడు రెండు సందేశకావ్యాలను రచించాడు. (వాటిని గూర్చి లఘుకావ్యాల ప్రకరణంలో చూడవచ్చును.)

### భక్తిరసస్థాపన

భక్తి రసామృతసింధు, ఉజ్జ్వలనీలమణి ఇతని అలంకార గ్రంథాలు. వీటిల్లో రసవివేచన విశదంగ జరిగింది, ఉజ్జ్వలనీలమణిలో రస, నాయికానాయక భేదాలు చర్చింపబడినవి శృంగారరసం విస్తరంగ వివరింపబడింది. రాధాకృష్ణుల ప్రేమ వర్ణనగల శ్లోకాలను రచించి రూపగోస్వామి శృంగారరసానికి ఉదాహరణలుగా ఇచ్చాడు. భక్తియొక్క విభావాను భావాదులను వివరించి దాన్ని రసంగా స్థాపించాడు. ఇంతకుముందు భగవత్ప్రీతిప్రేయోరసం కింద చెప్పబడింది. రూపగోస్వామి భగవత్ప్రీతిని ప్రత్యేక రసంగా అంగీకరించి ప్రతిపాదించాడు. రూపగోస్వామి తర్వాత మధుసూదనపరస్వతి కూడ భక్తి రసతత్వాన్ని అంగీకరించి వివరించాడు. భక్తి రసం కాదని మృగయ, అక్షక్రీడ మొదలైన హర్షోత్సాహాదులలోనే ప్రీతిభక్త్యాది భావాలు అంతర్భవిస్తాయని ధనంజయుడు చెప్పాడు. మమ్మట జగన్నాథాదులు కూడ భక్తి రసం కాదని త్రోసిపుచ్చారు. రూపగోస్వామి "పృథగేవ భక్తిరసరాట్ సవిస్తరేణోచ్యతే మధురః" అని మధురం, ఉజ్జ్వలం అనే పేర్లలో భక్తిరసాన్ని వివరించాడు, శ్రీకృష్ణ గోపీ విషయకమైన శృంగారరూపమని ఇతడు చెప్పెను. దీనికి చిత్తద్రవము స్థాయిభావం. ఇతర శృంగారముపాదేయం కాదని, శ్రీకృష్ణ గోపీ విషయకరతి ఉపాదేయమని, అదే భక్తిరస మని అతని మతం. కాని రూపగోస్వామి చెప్పింది ఏకదేశం మాత్రమే. మధుసూదనసరస్వతి తన భగవద్భక్తి రసాయన మనే గ్రంథంలో భక్తికి సంపూర్ణంగా రసత్వాన్ని ఇచ్చి ఉదాత్తం చేశాడు శృంగారాది రసాలు క్షుద్రరసాలని, మిణుగురు పురుగులకన్న సూర్యకాంతి ఏ విధంగా బలవత్తరమో ఆ విధంగా మిగిలిన రసాలకన్న భక్తిరసం శ్రేష్ఠతరమైందని అతడు చెప్పెను. దీనిలో భగవంతుడు ఆలంబన విభావం, తచ్చరిత్రలు విభావాలు, భగవదాకార చిత్తవృత్తి లేక భగవద్రతి స్థాయిభావం, నేత్రాదివికారాలు అనుభావాలు, నిర్వేదశంకాహర్షాదులు వ్యభిచారీభావాలు అని అతడు వివరించెను. ఈ ఇద్దరు భక్తాలంకారికులు తప్ప మరే ఆలంకారికులు భక్తిని రసంగా అంగీకరించలేదు. అయినా భక్తిరసం సర్వజనాదరణ పొందింది. భక్తిరసం అంగిగా



గల ఎన్నో కావ్యాలు వ్రాయబడినవి కొందరు ఆలంకారికులు భక్తి శాంత రసంలో అంతర్భవిస్తుందని, దాన్ని వేరు రసంగా చెప్పే అవసరం లేదని భావించారు.

## రూపగోస్వామి ఇతర రచనలు

రూపగోస్వామి ఉజ్జ్వల నీలమణికి అతని సోదరుని కుమారుడు జీవ గోస్వామి వాఖ్యానాన్ని వ్రాసాడు. భక్తి రసామృత సింధువు పూర్వ పశ్చిమ ఉత్తర దక్షిణ అని నాలుగు భాగాలుగా విభజింపబడింది. తిరిగి అవి లహరులుగా విభాగింపబడినవి. దీనిలో కూడ రసవివేచన చేయబడింది. రూపగోస్వామి మరొక అలంకార కృతి నాటక చంద్రిక. దీనిలో ప్రత్యేకంగా నాటక లక్షణాలు చెప్పబడినవి. భరతుని నాట్య శాస్త్రం, సింగభూపాలుని రసార్ణవసుధాకరాలను, వైష్ణవ సిద్ధాంతాలను రూపగోస్వామి నాటక లక్షణ వివరణకు ఆధారంగా గ్రహించాడు. రూపగోస్వామి స్వయంగా వ్రాసిన లలిత మాధవ నాటకాన్ని చాల చోట్ల ఉద్ధరించాడు. ఈ నాటక ప్రతి పూనాలో భండార్కర్ ఓరియంటల్ రిసెర్చ్ ఇనిస్ట్యూట్‌లో వున్నది. కాని ఇంకా ప్రచురితం కాలేదు. ఇంకా తన దానకేళికౌముది అనే భాణికను కూడ రూపగోస్వామి ఉపరూపక బేదాల్లో ఉద్ధరించాడు. రూపగోస్వామి చైతన్య వైష్ణవ సంప్రదాయానికి చెందినవాడు. భక్తుడు, పండితుడు. వైష్ణవ సంప్రదాయంలో అనేకులు ఆలంకారికులు బయలుదేరారు. వారిలో రూపగోస్వామి ప్రముఖమైనవాడు.

## గోస్వామి కర్ణపూరుడు

వైష్ణవ సంప్రదాయంలో చైతన్యుని శిష్య పరంపరలో మరొక గొప్ప ఆలంకారికుడు కవి కర్ణపూరుడు. ఇతడు రూపగోస్వామికి సమకాలికుడు, శిష్యుడు ఇతని అలంకార కృతి "అలంకార కౌస్తుభం". ఇతని పేరు పరమానంద సేనుడు. కర్ణపూరుడన్నది ఉపనామం. రూపగోస్వామి వలెనే ఇతడు వంగ దేశీయుడు క్రీ. శ. 1524 లో జన్మించాడు. చైతన్యుని భక్తి సిద్ధాంతాలను, బోధనలను సర్వసుబోధకం చేయడానికై ఇతడు చైతన్య చంద్రోదయ మనే గ్రంథాన్ని రచించాడు. కావ్య ప్రకాశంలో వలెనే అలంకార కౌస్తుభంలో కావ్య తత్వాన్ని సాంగోపాంగంగా వివరింపబడినవి. ఇది పది కిరణాలుగా విభాగింపబడింది,

శ్రీ కృష్ణ స్తుతి పరమైన స్వయంగా వ్రాసిన శ్లోకాలను అతడు ఉదాహరణలుగా ఇచ్చాడు. కర్ణపూరుడు రసమొక్కటే అనే సిద్ధాంతాన్ని స్థాపించాడు. రజస్తమో గుణస్పర్శ లేని శుద్ధ తత్వ స్వరూపం గల మనస్సుకు ఆనందమనే ధర్మమున్నది. అదే స్థాయి అని ఇతని అభిప్రాయం. స్ఫటికం జపాకుసుమాది నానాపదార్థాల సంయోగం వల్ల ఒక సారి ఎర్రగా, ఒక సారి పచ్చగా, ఒక సారి నల్లగా కనబడినట్లుగా ఒక్కటే అయిన స్థాయి నానావిధ విభావాదుల సంయోగం వల్ల వీరాద్భుతాది రూపాలను ధరిస్తుందని కర్ణపూరుడు చెప్పాడు ఘటశరావాది నానా విధ పాత్రలలో అనేక ప్రతిబింబాలు ప్రతిఫలించినా సూర్యుని బింబమొక్కటే అయిన విధంగా ఉపాధిరూపాలైన రత్యాదులల్లో భేదమే కాని ఆనందంలో భేదం లేదని అతడు అంటాడు. రసాలన్నిటికి స్వాదాత్మ ఒక్కటే అని చెప్పే కర్ణపూరుని సిద్ధాంతం శాస్త్రీయంగా వున్నది.

కర్ణపూరుడు ఆనంద వృందావనమనే చంపువును, గౌరగణోద్దేశ దీపికను రచించాడు. ఇతని కొడుకు కవి చంద్రుడు కూడ పండితుడే కవి చంద్రుని అలంకార కృతి ''కావ్య చంద్రిక'' దీనిలో 9 ప్రకాశా లున్నవి. సారలహరి, ధాతు చంద్రికలు అతని ఇతర రచనలు.

## కేశవ మిశ్రుడు

క్రీ. శ. 16 వ శతాబ్దం వాడు. ''అలంకార శేఖరం'' ఇతని కృతి. ఇది పూర్వాలంకారికుల గ్రంథాలను అనుసరించి వ్రాయబడింది.

## శోభాకరుడు

క్రీ. శ. 1600 ప్రాంతంవాడు. కొందరు విమర్శకులు ఇతన్ని రుయ్యకుని పరవర్తి, హేమచంద్ర, జయదేవులకు పూర్వవర్తి అని అంగీకరించారు. అలంకార రత్నాకరం ఇతని కృతి ఇది సూత్ర శైలిలో వ్రాయబడింది. శోభాకరుడు స్వయంగా దీనికి విశదవ్యాఖ్యను వ్రాశాడు. దీనిలో 111 అలంకారాలు వివరింపబడినవి శోభాకరుడు అసమ, ఉదాహరణ అనే కొత్త అలంకారాలను వివరించాడు. వాటిని రసగంగాధరకర్త అంగీకరించి గ్రహించాడు.



## అప్పయ్య దీక్షితుడు

అప్పయ్య దీక్షితుడు బహుముఖ ప్రజ్ఞాశాలి. అతడు కవి, దార్శనికుడు, వైయాకరణుడు, ఆలంకారికుడు. అతడు మీమాంస, వేదాంత, వ్యాకరణ, కావ్య శాస్త్రాల మీద వ్రాసిన గ్రంథాలు ప్రశస్తమైనవి. ఇతడు వెల్లూరు రాజు చిన్న బొమ్మనాయకుని (క్రీ. శ. 1549-1578) మరియు పెనుగొండ రాజు వేంకటరాయల (క్రీ. శ. 1586-1613) ఆస్థానాలల్లో ఆదరణలను సంపాదించెను. చిన్న బొమ్మరాజుతో అప్పయ్యకు మంచి స్నేహసంబంధమున్నట్లున్నది. అందుకే తన ప్రాకృతమణిదీపాన్ని చిన్నబొమ్మని రచనగా చెప్పాడు. కాని తిరిగి ఉపసంహారంలో అది తన రచన అని అప్పయ్య చెప్పుకున్నాడు. అప్పయ్య చరమ దశను కాశీలో గడిపినట్లుగా తెలుస్తున్నది. ఇతడు తమిళుడైనా తెలుగు రాజుల ఆస్థానంలో వుండి గౌరవ సన్మానాలను పొందాడు.

అప్పయ్యవి మూడు అలంకార కృతులు వున్నవి – వృత్తివార్తిక, చిత్ర మీమాంస, కువలయానందం. వృత్తివార్తికలో రెండు పరిచ్ఛేదాలున్నవి. దీనిలో అభిధా లక్షణావృత్తుల విశదవివేచన వున్నది. అభిధావృత్తి యొక్క దీర్ఘ దీర్ఘతర వ్యాపారాన్ని అంగీకరించి అతడు వ్యంజనావృత్తిని ఖండించెను. ఈ గ్రంథం అసంపూర్ణంగా వున్నట్లు అనిపిస్తున్నది. ఎందుకంటె అభిధాలక్షణా వృత్తుల తర్వాత వ్యంజనావృత్తిని గూర్చి వివేచన లేదు. ప్రస్తావనను బట్టి మూడింటి వివేచన వున్నట్లు తెలుస్తున్నది. అతడు వ్యంజనను గూర్చి ఆలోచన తప్పక చేసివుంటాడు. అది ఉన్నట్లయితే వ్యంజనను గూర్చి అప్పయ్య అభిప్రాయం మనకు స్పష్టమైవుండేది. అప్పయ్య ధ్వనివాదిగా కాక అలంకారవాదిగా కన్పిస్తాడు. అతని మూడు ఆలంకారగ్రంథాలు అతని ఈధోరణినే బలపరుస్తున్నవి.

చిత్రమీమాంస ఒక అపూర్వమైన గ్రంథం. ఇందులో అర్థచిత్రకావ్యాలను గూర్చి వివేచన చేయబడింది. ఇది కూడ అసంపూర్ణంగా వున్నట్లు తోస్తున్నది.

కువలయానందంలో అలంకారాల వివేచన చేయబడింది. అలంకారాల మీద ఇది చివరి ఆధికారిక గ్రంథం. జయదేవుని అనుసరించి అప్పయ్య అలంకారాల లక్ష్యలక్షణాలను చెప్పాడు అప్పయ్య చెప్పిన మౌలికాభిప్రాయాలను జగన్నాథుడు ఖండించివున్నాడు. కువలయానందానికి పది టీక లున్నవి. ఈ టీకల సంఖ్యయే ఆ గ్రంథ వ్యాప్తిని ప్రకటిస్తున్నది. తర్వాత అలంకారాల వివరణ

గ్రంథాలకు ఇది ఉపజీవ్య గ్రంథమైంది. కువలయానందంలో అప్పయ్య 118 అలంకారాలను వివరించాడు. ఇది పెనుగొండ నేలిన వేంకటరాయల (క్రీ. శ. 1586-1613) కోరిక మీద రచింపబడింది. ఇది పాశ్చాత్య భాషల్లోకి కూడా అనువదింపబడింది. అప్పయ్య అలంకారాల వివరణను తర్కపూర్ణంగా శాస్త్రీయ పద్ధతిలో చేశాడు.

## అలంకారాల క్రమవికాసం

అలంకారాలు ఎప్పుడు పుట్టినవి అని ప్రశ్నిస్తే కచ్చితంగా సమయాన్ని నిర్ణయించి చెప్పటం కష్టం. మానవుడు మాట్లాడ నేర్చిననాడే ఏదో ఒక విధమైన అలంకారం పుట్టివుంటుంది. మానవుడు తాను చూచిన, అనుభవించిన వస్తుభావాలను ఎదుటి వానికి స్పష్టంచేసి చెప్పేటప్పుడు, తాను ఏ విధంగా వస్తుభావాలను దర్శించాడో ఆ విధంగానే ఎదుటి వానిచేత దర్శింపజేయాలనే కోరికతో తాను వర్ణించిచెప్పే వస్తుభావాలను ఎదుటి వానికి అతిపరిచితాలైన వస్తువులతో పోల్చి చెప్పివుంటాడు. ఆ పోలికను చెప్పటంతోటే అలంకారావిర్భావం జరిగింది. ప్రపంచంలోని ప్రతిభాషలో ఏదో ఒక విధమైన అలంకారం వుంటుంది. గ్రంథస్థమైన అలంకారోదాహరణలు మనకు ఋగ్వేదంలోనే లభిస్తున్నవి. ఋగ్వేదంలో ఉపమ, రూపకాలంకారాలు అధికంగా కన్పిస్తున్నవి. ఆ తర్వాత బ్రాహ్మణ ఉపనిషదాదుల్లో అలంకారాల ప్రయోగం జరిగింది. పురాణాదుల్లో సాహిత్య సృష్టి విస్తృతమైంది. అలంకారాల ప్రయోగం ప్రచురమైంది. సాహిత్యంలో ప్రచురంగా ప్రయోగింపబడే అలంకారాలను క్రమబద్ధం, శాస్త్రబద్ధం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అట్లా అలంకారాలను శాస్త్రబద్ధం చేసినవారిలో భరతుడు ప్రథముడు. నాట్య శాస్త్రంలో భరతుడు ఉపమ, రూపక, దీపక, యమక అనే నాలుగు అలంకారాలనే వివరించాడు. అగ్ని పురాణకర్త 16 అలంకాలను వివరించాడు. తర్వాత భామహుడు కావ్యానికి అలంకారాలు ప్రధానమైనవనిగుర్తించి వాటిని విశదంగా వివరించాడు. "న కాంతమపి నిర్భూషం విభాతి వనితాముఖమ్" అని అన్నాడు భామహుడు. అతడు 38 అలంకారాలను వివరించాడు. దండి 37 అలంకారాలను గూర్చి చెప్పాడు. వామనుడు 31 అలంకారాలను వివరించాడు. రీతిప్రధాన వాది అయినా వామనుడు "కావ్యం గ్రాహ్యమలంకారాత్" అని అంగీకరించాడు. ఉద్భటుడు 41 అలంకారాల వరకు వివరించాడు. రుద్రటుడు 57 అలంకారాల వరకు పెంచాడు. మమ్మటుడు 69 అలంకారాలను గ్రహించి వివరించాడు. వీటిల్లో 8 శబ్దాలంకారాలు, 61 అర్థాలంకారాలున్నవి. ఈ విధంగా క్రీ. శ. 11 వ శతాబ్దం వరకు అలంకారాల సంఖ్య 69 వరకు పెరిగింది. మొదట ఉపమా లేక సాదృశ్య మూలకంగావున్న అలంకారాలు అర్థవక్రతను ఆధారంగా తీసుకొని పెరుగసాగినవి. "లోకాతిక్రాంతగోచరం వచనం వక్రోక్తిః" అటువంటి వక్రోక్తియే అలంకారమని భామహుడు అన్నాడు. వక్రోక్తినే దండి అతిశయోక్తి అనే పేరుతో పేర్కొన్నాడు. 'కవుల ప్రౌఢశబ్దార్థాలతో కూడిన వక్రోక్తివైవిధ్యంతో అలంకారాలు పెరిగినవి. క్రీ. శ. 12 వ శతాబ్దంనాటి జయదేవుడు 89 అలంకారాలను వివరించెను. క్రీ శ. 14 వ శతాబ్దంవాడైన విశ్వనాథుడు కూడ 89 అలంకారాలను వివరించాడు. క్రీ. శ. 16 వ శతాబ్దంవాడైన అప్పయ్యదీక్షితులు అలంకార సంఖ్యను 118 వరకు తీసుకొని పోయాడు. అలంకారాలకు జయదేవుని చంద్రాలోకం, అప్పయ్య దీక్షితుల కువలయానందాలు పఠన యోగ్యమైన గ్రంథాలు. అప్పయ్య ధ్వని లేనటువంటి అలంకారయుక్త కావ్యాలు కూడ సుందరంగా సరసంగా వుంటవని నిరూపించటానికి పూనుకొన్నాడు. కాళిదాసాది కవుల కావ్యాలు కూడా ప్రకృతివర్ణనలతో నిండి ధ్వని కాని గుణీభూత వ్యంగ్యంకాని లేనివి వున్నవి. కాబట్టి ధ్వన్యభావంతో కూడ కావ్యం ఆదరణీయమౌతుందని అప్పయ్య అభిప్రాయం. ఉపమాలంకార సౌందర్యం చేతనే కాళిదాసు కవి కులగురువు అయినాడు. అప్పయ్య నాటికి సంస్కృత సాహిత్యంలో చిత్ర కావ్యాలెన్నో వ్రాయబడినవి అవి ఆదరింపబడినవి కాబట్టే కవులు అటువంటి కావ్యాల నెన్నిటినో వ్రాసారు. అప్పయ్య తన చిత్రమీమాంసలో చిత్ర కావ్య భేదాలను వివరించాడు. చిత్రకావ్యంలో గుణాలంకారాలకే ప్రాధాన్యం. ధ్వనివాదులు చిత్రకావ్యాన్ని అధమ కావ్యంగా చెప్పారు. అప్పయ్య ధ్వనికావ్యం వలె చిత్ర కావ్యం కూడ మహత్త్వపూర్ణమైందని అంగీకరించిన ఆలంకారికుడు. ధ్వని కావ్యంలో వ్యంగ్యం, ఈషద్ వ్యంగ్యం వుంటుంది ధ్వని కావ్యంలో వాచ్యార్థమే ఆకర్షకంగా వుంటుందని అతడంటాడు ధ్వని ఈషన్ మాత్రం లేని చిత్ర కావ్యాలను అంగీకరించి అప్పయ్య ఉత్తమస్థానాన్ని కల్పించాడు. ధ్వనివాది అయిన జగన్నాథుడు దీనిచేత క్రుద్ధుడై కాబోలు చిత్రమీమాంస ఖండనను రచించాడు. అప్పయ్య దీక్షితుల సోదరుని పౌత్రుడు నీలకంఠ దీక్షితుని సోదరుడైన మూడవ అప్పయ్య దీక్షితుడు చిత్రమీమాంస దోషధిక్కారమనే గ్రంథంలో జగన్నాథునికి సమాధానాలు ఇచ్చాడు.

## పండితరాయలు జగన్నాథుడు

జగన్నాథుని (క్రీ. శ. 17 వ శ॥) రసగంగాధర మనే అలంకార శాస్త్ర గ్రంథం మౌలికమైంది, ప్రసిద్ధమైంది. కావ్యసంబంధ విషయాలు దీనిలో చక్కగా వివేచింపబడినవి అలంకారశాస్త్ర సాహిత్యంలో ధ్వన్యాలోకం, కావ్యప్రకాశం తర్వాత ఇదే ప్రశస్తమైన గ్రంథం. రసగంగాధరం ఆననాలుగా విభజింపబడింది. దీనిలో చాల ఆననా లుండేవని అనేక కావ్యశాస్త్ర విషయాలు చర్చింపబడినవని కాని అవన్ని ఉపలబ్ధం కాలేదని పండిత విమర్శకుల అభిప్రాయం. జగన్నాథుడు రసగంగాధరాన్ని ఉద్గ్రంథంగా వ్రాయదలచుకొన్నాడు కాని ఏ కారణం చేతనో పూర్తి చేయలేకపోయాడని మరికొందరు పండితుల అభిప్రాయం. ఇప్పుడు రసగంగాధరంలో రెండే ఆననా లున్నవి. రెండవది అసంపూర్ణంగా వున్నట్లు కన్పిస్తున్నది. మొదటి ఆననంలో జగన్నాథుడు కావ్యలక్షణాలను సమీక్షించాడు. జగన్నాథుడు ప్రాచీనాచార్యుల కావ్యనిర్వచనాలను పరిశీలించి "రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్" అని కొత్త నిర్వచనాన్ని ప్రతిపాదించాడు. అన్ని నిర్వచనాలకన్న ఇది మేలైందని అంటారు. విశ్వనాథుని తర్వాత జగన్నాథుని కావ్యలక్షణమే సర్వజనామోదకరమైంది. జగన్నాథుడు కావ్యలక్షణాల తర్వాత కావ్యభేదాలను గూర్చి చెప్పాడు. ప్రాచీనాచార్యులు మూడు కావ్యభేదాలను- ఉత్తమ, మధ్యమ, అధమ అంటె ధ్వని, గుణీభూతవ్యంగ్య, చిత్ర కావ్యాలని విభజించగా జగన్నాథుడు నాలుగు విధాలుగా కావ్యాలను విభజించాడు, ఉత్తమోత్తమ, ఉత్తమ, మధ్యమ, అధమ. ధ్వనితో కూడింది ఉత్తమోత్తమ కావ్యం. వ్యంగ్య ప్రధానమై చమత్కారకారిణి అయినది ఉత్తమ కావ్యం. గుణీభూత వ్యంగం కలది మధ్యమకావ్యం చిత్రకావ్యం అధమ కావ్యం- అని జగన్నాథుని విభజన. చివరి మూడు విభజనలు ప్రాచీనాచార్యుల ననుసరించే చేయబడినవి. ఉత్తమోత్తమమన్న విభజన జగన్నాథుని స్వంతం. కావ్యభేదాల తర్వాత జగన్నాథుడు రసచర్చను విస్తృతంగ చేసాడు. జగన్నాథుని రససమీక్ష ఉత్కృష్టంగ వున్నది తర్క పూర్ణమైన అతని శైలి అతని పాండిత్య ఔద్ధత్యాన్ని ప్రకటిస్తున్నది. రసచర్చ సందర్భంలోనే జగన్నాథుడు శబ్దార్థగుణాలను రీతి, ధ్వని భేదాలను వివరించాడు. ఆనందవర్ధనుని ధ్వనిసిద్ధాంతం సర్వసమ్మతమైన సిద్ధాంతంగా పరిణమించింది. అభినవగుప్తుడు రసధ్వనికి పట్టంకట్టి ధ్వని సిద్ధాంతాన్ని భరతుని రససిద్ధాంతంలోకి పరిణమింపజేయ ప్రయత్నించాడు. కాని అది



జగన్నాథుని రసగంగాధరంలోనే సఫలమైందని చెప్పాలి. జగన్నాథుడు ధ్వని సమర్థుడైనా రసవాది. రసగంగాధరం రెండవ ఆననంలో ధ్వని భేదాలు, శబ్దశక్తి, అలంకారాల వివేచనలున్నవి. అలంకారాల వివరణలో జగన్నాథుడు రుయ్యకుని కొంతవరకు అనుసరించాడు. తిరస్కారమనే కొత్త అలంకారాన్ని ఇతడు వివరించాడు.

### రసగంగాధర ప్రాశస్త్యం

రసగంగాధరం సూత్రాలల్లో నిబద్ధింపబడింది. జగన్నాథుడే దీనికి స్వయంగా విస్తృతమైన వ్యాఖ్యానాన్ని వ్రాసాడు. ఉదాహరణలను కూడ జగన్నాథుడే స్వయంగా వ్రాసాడు. ప్రాచీనాచార్యుల అభిప్రాయాలను పరిశీలించి కొత్తవైన మౌలికమైన తన అభిప్రాయాలను ప్రతిపాదించటమే జగన్నాథుని ఈ రచనోద్దేశం. జగన్నాథుడు ప్రౌఢగంభీరమైన నవ్యన్యాయ శైలిలో రసగంగాధరాన్ని ప్రస్తుతీకరించాడు. అలంకారాల వివరణలో అతడు ప్రాచీనాచార్యులను అనుసరించినా కావ్యలక్షణ నిరూపణలో రసచర్చలో అతడు స్వతంత్రాభిప్రాయాలను వ్యక్తం చేశాడు. జగన్నాథుడు ధ్వని సమర్థుడైనా ప్రాచీనాచార్యుల అభిప్రాయాలను పరిశీలించేటప్పుడు ధ్వనికారుని, మమ్మటుని అభిప్రాయాలను కూడ విమర్శించటానికి వెనుక ముందాడ లేదు. ఇందులోనే అతని పాండిత్య గర్వం విశదమౌతున్నది. అలంకారాల వివరణలో రుయ్యకుని, రసచర్చలో విశ్వనాథుని ఒకవైపు అనుసరిస్తూ ఇంకొకవైపు వారి అభిప్రాయాలను కూడ విమర్శించాడు. ప్రాచీన పండిత పరంపరలోజగనాథుడే చివరివాడు అని పరిగణింపబడుతున్నది. జగన్నాథుడు కొత్త అలంకార సిద్ధాంతాన్ని దేన్ని ప్రతిపాదించకపోయినా అతడు ప్రాచీనాభిప్రాయాలను పరిశీలించిన తీరులో, తన అభిప్రాయాలను వ్యక్తంచేయటంలో మౌలికతను చూపాడు. అతడు గొప్ప ఆత్మవిశ్వాసం గల ఉద్దండ పండితుడు. ఆత్మవిశ్వాసం, స్వాభిమానం అతని మౌలికమైన స్వతంత్రమైన ఆలోచనలు, ప్రాచీనాచార్యుల అభిప్రాయాలను కూడ సవిమర్శకంగా ఆలోచించగల అతని ప్రతిభ పాండిత్య గర్వాతిశయం అతన్నొక మహావ్యక్తిగా నిలబెడుతున్నవి. జగన్నాథుని పాండిత్యపూర్ణమై నిరాఘాటంగా ప్రవాహంలాగ నడిచే శైలి అతని వ్యక్తిత్వానికి తగినట్లుగానే వున్నది. అతడు ఉదాహరణలుగా ఇచ్చిన శ్లోకాలు సరసమధురంగా వున్నవి. తన కవిత్వాన్ని గూర్చి అతడు ఇట్లా గర్వోక్తిని పలికాడు -

౫౫)

కవయతి పండితరాజే కవయంత్యన్యేఽపి విద్వాంసః
నృత్యతి పినాకపాణౌ నృత్యంత్యన్యేఽపి భూతబేతాళాః

"పండితరాజు కవిత్వం వ్రాసాడు. ఇతర కవులూ వ్రాసారు. శివుడు నృత్యం చేస్తున్నాడు, ఇతర భూతబేతాళురు కూడ నృత్యం చేస్తున్నవి." అంటే ఇతర కవుల కవిత్వం జగన్నాథుని కవిత్వంతో సాటివచ్చేది కాదని భావం. భట్టోజి పండితుని పౌత్రుడు నాగేశ పండితుడు రసగంగాధరానికి టీకను వ్రాసాడు. దీన్నిబట్టి ఈ కుటుంబాల నడుమ వున్న శాస్త్రవైరం తర్వాత విస్మరింపబడినట్లు చెప్పవచ్చును. (జగన్నాథుని జీవిత విశేషాలు వివరంగా లఘుకావ్య ప్రకరణంలో ఇవ్వబడినవి.)

## రాజచూడామణి దీక్షితుడు

క్రీ. శ. 1600 ప్రాంతంవాడు. కావ్యదర్పణం ఇతని అలంకార గ్రంథం. స్వయంగా దానికి అలంకార చూడామణి అనే టీకను వ్రాసెను.

## చెరుకూరి యజ్ఞనారాయణుడు

ఇతడు చెరుకూరి లక్ష్మీధరుని అగ్రజుడు, కొండుభట్టు కొడుకు. వీరిది పండితవంశం. లక్ష్మీధరుడు పెనుగొండ నేలిన తిరుమల రాయల (క్రీ. శ. 1570–157 ) ఆస్థానంలో వుండెను. యజ్ఞనారాయణుడు అలంకార రాఘవం అలంకార సూర్యోదయ మనే అలంకార శాస్త్ర గ్రంథాలను రచించాడు. అలంకార రాఘవంలో ఉదహరణలు శ్రీరాముని స్తుతిపరంగా వున్నవి.

## యజ్ఞనారాయణ దీక్షితుడు

రఘునాథ నాయకుని మంత్రి గోవింద దీక్షితుని కొడుకు. ఇతడు రఘునాథభూప విజయమనే మహాకావ్యమే కాక అలంకార రత్నాకర మనే అలంకార కృతిని కూడ రచించెను. ఉదాహరణలు రఘునాథుని ప్రశంసతో కూడినవి. ఇతడు రఘునాథుని (క్రీ. శ. 16 4-1682) ఆ స్థానంలోనే మండెను.

## కృష్ణశర్మ

క్రీ.శ. 17వ శ. వాడు. ఇతని మందార మరందచంపువు అలంకార శాస్త్ర గ్రంథం. ఇది అలంకార రస వివరణకు పిజ్ఞానకోశంగా పరిగణింపబడుతున్నది.



## శ్రీశైల నరసింహాచార్యుడు

లక్షణమాలిక ఇతని అలంకార కృతి. దీనితో అలంకారాల వివరణ స్వతంత్రంగా చేయబడింది. క్రీ. శ. 17వ శతాబ్ది వాడు. లక్షణమాలికకు ఇతడు స్వయంగా అలంకారేందుశేఖర మనే వ్యాఖ్యానాన్ని వ్రాసాడు.

## సుధీంద్రయోగి

క్రీ. శ. 17వ శతాబ్ది వాడు. అలంకారనికాసం ఇతని అలంకారకృతి. అర్థాలంకార నిరూపణ దీనిలో చక్కగా చేయబడింది.

## శ్రీకృష్ణుడు

పరకాల స్వామి అని ఇతనికి పేరు. అలంకారమణిహార మనే అలంకార కృతిని వ్రాసాడు. క్రీ.శ. 17వ శతాబ్ది వాడు.

## కృష్ణభట్టు

క్రీ. శ. 17వ శతాబ్ది వాడు. ప్రశ్నమాల అన్న ఇతని కృతి తత్త్వ చర్చలతో కూడి వున్నది.

## విశ్వేశ్వరుడు

అలంకార శాస్త్రాచార్యులల్లో జగన్నాథున్ని కాక కొందరు విశ్వేశ్వరున్ని అంతిమ ప్రౌఢాచార్యునిగా పరిగణిస్తారు. విశ్వేశ్వరుడు ఉత్తరప్రదేశ్ పర్వతీయ ప్రాంతంలోని అల్మోడా జిల్లా పాటియా గ్రామ నివాసి. ఇతడు క్రీ. శ 18వ శతాబ్దం పూర్వార్ధం వాడు. ఇతడు అలంకార కౌస్తుభమనే ప్రసిద్ధాలంకార కృతిని రచించాడు. దీనిలో శైలి నవ్యన్యాయశైలిని పోలివున్నది. విశ్వేశ్వరుడు కవి అలంకారికుడు, వైయాకరణుడే కాక గొప్ప నైయాయికుడు కూడ. విశ్వేశ్వరుడు మమ్మటుని తర్వాత విపరీతంగా జయదేవ, అప్పయ దీక్షితులచేత పెంచబడిన అలంకారాల సంఖ్యను అంగీకరించలేదు. అతడు మమ్మటుని 61 అర్థాలంకారాలనే గ్రహించి మిగతా అలంకారాలను అన్నిటిని వీటిలోనే అంతర్భవింపజేసాడు ఇతర ఆచార్యులు పెంచిన అలంకారాలను ఇతడు ఖండించాడు. అప్పయ్యను ఖండించిన జగన్నాథునితో ఇతడు అనేకచోట్ల తన సహమతిని ప్రకటించినా కొన్నిచోట్ల

జగన్నాథుని అభిప్రాయాలను కూడ ప్రశ్నించాడు. అలంకారాలను ఇతడు చక్కగా విశదంగా వివేచన చేసాడు. ఆ వివేచనలో అతడు అనేక అలంకారాలను ప్రసిద్ధమైన అలంకారాలల్లో అంతర్భవిస్తాయే కాని వేరే చెప్పవలసి అవసరం లేదని చెప్పాడు ఇంకా కొన్నిటికి అతడు అలంకార స్థానాన్ని ఇయ్యటానికే అంగీకరించలేదు అలంకార మీమాంస సందర్భంలో అతడు జగన్నాథుని రసగంగాధరశైలిని అనుకరించి ఇతరుల అభిప్రాయాలను ఖండిస్తు తన అభిప్రాయాలను స్థాపిస్తు వచ్చాడు. అలంకారకౌస్తుభానికి విశ్వేశ్వరుడు స్వయంగా టీకనుకూడ వ్రాసాడు. కాని అది సంపూర్ణంగా లభ్యంకాలేదు. ఇతడు ఇంకా అలంకార ప్రదీపం, అలంకార ముక్తావళి అనే సరళ సుబోధకమైన ఆలంకారాల వివరణతో కూడిన గ్రంథాలను రసచంద్రిక అన్న రసవివేచనతో కూడిన గ్రంథాన్ని రచించాడు. "కవీంద్రకంఠాభరణంలో" అతడు చిత్రకావ్యాల ప్రామాణికమైన పరిశీలన చేసాడు. ఇతని అన్న ఉమాపతి కూడ ఆలంకారికుడట. పరికరాలంకారాన్ని గూర్చి ఉమాపతి అభిప్రాయాన్ని విశ్వేశ్వరుడు ఉద్ధరించాడు, ఇతనితండ్రి లక్ష్మీపతికూడ కవి, పండితుడు. వీరిది పండిత వంశం. ఇతడు 34వ ఏట చిన్నవయస్సులోనే మరణించాడు.

## అక్బరు షా

అక్బరు షా తండ్రి శాహరాజు గోలకొండరాజు అబుల్‌హసన్ తానీషాకు రాజగురువట. అక్బరుషా తపశ్శక్తి కలవాడ నని చెప్పుకున్నాడు. ఇతడు గొప్పపండితుడు. తండ్రి తర్వాత ఇతడు రాజగురువు పదవిని అలంకరించి వుంటాడు. అక్బరుషా సంస్కృతంలోనే కాక తెలుగులోను పండితుడు. ఇతని అలంకారకృతి శృంగారమంజరి. దీన్ని ఇతడు మొదట తెలుగులో వ్రాసి తర్వాత సంస్కృతంలోకి అనువదించాడట—

> తేనాంధ్రభాషయాఽయం రచితః శృంగార మంజరీ గ్రంథః
> స్వయమకబరేణ భూభృ న్మకుట మణి రంజితాంఘ్రికమలేన,
> తద్విరచితాంధ్ర భాషా కలితాం శృంగార మంజరీచ్ఛాయామ్
> సేవధ్వం సురవాణీ రచితాం రసతోషతా రసిక భృంగాః

శృంగార మంజరిలో నాయికా నాయక భేదచర్చ, రసచర్చలు చేయబడినవి. ఇది నాయికా విభాగం, నాయక విభాగం, దూతీ విభాగం, రసవిభాగం అని



నాలుగు భాగాలుగా విభజింపబడింది. అక్బరుషా గ్రంథానికి భానుదత్తుని రస మంజరి ఆధార గ్రంథంగా తోస్తున్నది. అక్బరు అనే తనపేరును అకవర అని పదచ్ఛేదం చేసి తనపేరుకు బ్రహ్మ, విష్ణువులను మించినవాడనే అర్థాన్ని చెప్పుకొన్నాడు ఇతనికి బడేసాహెబ్ అని మరో పేరు. దానికతడు మహేశ్వరుడని అర్థం చెప్పాడు. మహమ్మదీయులల్లో సంస్కృతం అభ్యసించినవారే తక్కువ. వారిలో సంస్కృత గ్రంథరచనకు పూనుకొన్నవారు ఇంకా తక్కువ. వారిలో అక్బరుషా ప్రముఖమైన వాడని చెప్పాలి.

## దేవీశంకరుడు

ఇతని కాలం క్రీ. శ. 1761-1768 నడుమ. అలంకారమంజూష ఇతని కృతి. అలంకారాల వివేచన దీనిలో వున్నది. దీనిలోని ఉదాహరణలన్ని పేష్వే మాధవరావు (ప్రథమ) మరియు రఘునాథరావు వర్ణనలతో కూడినవి.

## నృసింహ కవి

క్రీ. శ. 18వ శతాబ్దం. అభినవ కాళిదాసు బిరుదాంకితుడు. ట్రావంకూర్ రాజు నంజరాజు ఆస్థానకవి. నంజరాజ యశోభూషణమనే అలంకార గ్రంథాన్ని రచించాడు. దీనిలో ఉదాహరణలన్ని నంజరాజు ప్రశంసతో కూడినవి. గ్రంథం ప్రతాపరుద్రయశోభూషణాన్ని అనుకరిస్తున్నది.

## అరుణగిరి కవి

క్రీ. శ 18 వ శతాబ్దివాడు. కేరళలోని వటక్కుంకూరు రాజు గోదవర్మ ఆస్థానకవి. వటక్కుంకూరు పోర్చుగీసు. డచ్చల కాలంలో సంపన్నమైన రాజ్యం. గోదవర్మ యశోభూషణం ఇతని అలంకారకృతి. దీనిలో అర్థాలంకారాలు ప్రతాపరుద్రయశోభూషణానుసారంగా వివరింపబడినవి. దానిలో లాగనే కవి తన ఆశ్రయదాతను ప్రస్తుతిస్తు ఉదాహరణలను ఇచ్చాడు.

## సదాశివమఖి

క్రీ శ. 18వ శ॥ వాడు ట్రావంకూర్ రాజు రామవర్మ ఆస్థాన పండితుడు. రామవర్మ యశోభూషణమనే అలంకార గ్రంథాన్ని రచించెను. ఉదాహరణలు రామవర్మ ప్రశస్తితో కూడినవి,

## కచ్ఛపేశ్వర దీక్షితుడు

ఇతడు రామచంద్ర యశోభూషణమనే అలంకార గ్రంథాన్ని ప్రతాపరుద్రయశోభూషణాన్ని అనుసరించి వ్రాసాడు.

## కాత్యాయన సుబ్రహ్మణ్య సూరి

క్రీ. శ. 18 వ శతాబ్దంవాడు అలంకారకౌస్తుభం ఇతని అలంకారకృతి.

## కృష్ణసుధీ

క్రీ. శ. 18 వ శతాబ్దంవాడు. కావ్యకళానిధి ఇతని అలంకార కృతి.

## బలదేవ విద్యాభూషణుడు

క్రీ. శ. 18 వ శ॥ వాడు. చైతన్యప్రభు అనుయాయి. సాహిత్యకౌముది, కావ్యకౌస్తుభం ఇతని కృతులు.

## రత్నభూషణుడు

క్రీ. శ. 18 వ శ॥ వాడు. కావ్యకౌముది ఇతని కృతి. వంగదేశీయుడు.

## అనురథ మండనుడు

క్రీ. శ. 18 వ శ॥ వాడు. జల్పకల్పలత, ముగ్ధమేధాకరం ఇతని అలంకార గ్రంథాలు. ఇతడు జైనుడు.

## రాజశేఖరుడు

క్రీ శ 19 వ శ॥ వాడు. ఇతడు దక్షిణదేశీయుడు. 81 స్తబకాలు గల సాహిత్యకల్పద్రుమ మనే అలంకార గ్రంథాన్ని రచించాడు.

## అచ్యుతశర్మ

క్రీ శ. 19 వ శ॥ వాడు. 12 అధ్యాయాలు గల సాహిత్యసార మనే అలంకార కృతిని రచించాడు.



## మురారిదాసుడు - సుబ్రహ్మణ్యం

ఈ ఇద్దరు క్రీ శ. 19 వ శ॥ వారు. యశ్వంతసింహుని ప్రశంసతో కూడిన శ్లోకాలు గల యశ్వంత యశోభూషణమనే అలంకార గ్రంథాన్ని రచించారు. ఆలంకారికులు చాలా మంది విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణాన్ని అనుకరిస్తూ తమ ఆశ్రయదాతలైన రాజులను ప్రశంసిస్తూ ఉదాహరణ శ్లోకాలను వ్రాసి అలంకార శాస్త్ర గ్రంథాలను రచించారు.

ఇంకా వీరేగాక కోకొల్లలుగా పండితులు వ్రాసిన అలంకార శాస్త్రగ్రంథాలు ఎన్నో ప్రచురితం కాక ప్రాచీన లిఖిత పుస్తకభండాగారాలల్లో పడివున్నవి. అందులో కొన్నిటి రచయితల పేర్లు కూడ తెలియనివి వున్నవి. రచయితల పేర్లు తెలియని అలంకార గ్రంథాలు 50 వరకున్నవని ఎస్. కే. డే పేర్కొన్నాడు. కాని ఇవేవి మౌలికమైన కొత్త ఆలోచనలతోకూడిన రచనలు కావు. అవి గ్రంథ సూచిక పట్టిక (కేటలాగు)ల్లో పేర్కొనదగినవేకాని ప్రత్యేక పరిశీలనకు తగినవిగా లేవు.

PAPER-IV, UNIT-II



Sanskrit verse and has rendred a translation with commentary of 'Vakrokti Jeevitam' which is published by the Central Sahitya Academy. Even as early as in 1964, he earned well deserved praise for his political drama 'Susamhata Bharatam'. He has also translated 'Dhammapada' form pali into Sanskrit and has written several other books in Telugu and Sanskrit. His pen is never idle and some more books are awaiting completion and publication. One striking feature about all the works of Dr. Sriramachandrudu, including the present one, is his passion for accuracy. The commentary and translation are rendered in such lucid style that even a student with elementary knowledge of Sanskrit and Telugu will have no difficulty in understanding. At the same time even those who are desirous of making an advanced study of Alankarasastra are sure to benefit by this work. It required considerable skill on the part of an author to render a translation in such a manner that it will be useful both to the student as well as an expert. Dr. Sriramachandrudu has achieved this difficult task in an admirable manner.

My pleasure in writing this foreword is doubly great as this book is being published under the auspices of the Surabharati Samiti. Dr. Sriramachandrudu who has been its secretary has been the solitary pillar on which the Samiti has been resting all these years. The Samiti has been making a modest effort all these years to popularise samskrit by conducting free Sanskrit classes in Hyderabad and Secunderabad, by arranging meetings running a free reading room and library. Quite recently it has decided to publish books on Sanskrit as a part of its programmes to induce persons to take to the study of this glorious language. The Samiti is fortunate to have as its first publication a book on such high merit as this commentary on Bhamaha's Kavyalankara by Dr. Sriramachandrudu.

***



## ప్రస్తావన*

భామహుడు ప్రాచీనాలంకారికులలో ఒకడు. ఇతని తండ్రి రక్రిల గోమి, కాశ్మీర దేశీయుడు. ఇతని కాలమును గూర్చి పండితులలో అభి ప్రాయభేదములున్నవి. ఈతడు విమర్శించిన కొన్ని విషయములు దండి రచితమగు కావ్యాదర్శములోనున్నవి. దండి విమర్శించిన కొన్ని విషయములు ఈతడు రచించిన కావ్యాలంకారములో ఉన్నవి. అందుచే భామహుడు దండికంటె అర్వాచీనుడని కొందరు, భామహునికంటె దండి అర్వాచీనుడని మరికొందరును భావించుచున్నారు. వీరిరువురు విమర్శించిన విషయములు మనకిపుడు అనుపలభ్యములగు ప్రాచీనాలంకార గ్రంథములలో ఉండియుండుననియు, అందుచే భామహదండులలో ఒకరు మరియొకరిని విమర్శించుట కాదనియు, రచనావిధానాదులను పట్టిచూడగా భామహుడే ప్రాచీనుడనియు చాలమంది పండితులు చెప్పుదురు. పి.వి. కాణేగారు ఈ విషయమును అతివిస్తృతముగ విమర్శించి "దండియే భామహునికంటె ప్రాచీనుడు. దండి గ్రంథ రచనాకాలము క్రీ.శ.660-680 ప్రాంతములలోనుండును. భామహుడు క్రీ.శ.700 తరువాతివాడై ఉండును" అని చెప్పియున్నారు. "వీరిరువురును సమకాలికులు కూడ కావచ్చును. కాని దండి చాల వృద్ధుడై యుండవలెను. భామహుడు చాలయువకుడై ఉండవలెను. అందుచే వారిగ్రంథములలో పరస్పరవిమర్శ ఉండి యుండును" అని కూడ కాణే గారి అభిప్రాయము. ఇతర విషయములను పట్టికూడ చూచినచో కాణే గారి అభిప్రాయము యుక్తమని తోచును.

భామహుడు రచించిన గ్రంథాలలో మనకిపుడు ఈ కావ్యాలంకారము మాత్రమే లభించుచున్నది. వరరుచికృతమైన ప్రాకృత ప్రకాశమను వ్యాకరణ గ్రంథముపై మనోరమ అనే ఒక వ్యాఖ్యను భామహుడు వ్రాసినట్లు "వరరుచి రచిత ప్రాకృత లక్షణ సూత్రాణి లక్ష్యమార్గేణ, బుద్ధ్వా చకార వృత్తిం సంక్షిప్తాం భామహః స్పష్టామ్" అనే శ్లోకముద్వారా తెలియుచున్నది. వృత్తరత్నాకరవ్యాఖ్యలో నారాయణభట్టు 'తదుక్తం భామహేన' అని చెప్పుచు భామహమతమును ఉట్టంకించుటచే భామహుడు ఒక ఛందః శాస్త్ర గ్రంథముకూడా వ్రాసినట్లు తెలియుచున్నది. అభిజ్ఞాన శాకుంతల వ్యాఖ్యానమగు అర్థద్యోతనికలో రాఘవభట్టు, భామహ ప్రోక్తములుగా కొన్ని అలంకార శాస్త్ర విషయములను చెప్పియున్నాడు. కావ్యాలంకార సూత్రవ్యాఖ్యయైన కామధేనువులో కూడ భామహుడు చెప్పినట్లుగా కొన్ని అలంకార శాస్త్ర విషయములు చూపబడి ఉన్నవి. ఈ విషయములు కావ్యాలంకారములో లేకుండుటచే, అలంకార శాస్త్రమునకు సంబంధించిన మరి యొక గ్రంథమును కూడా భామహుడు రచించి యుండెనని పండితుల అభిప్రాయము.

కావ్యాలంకారము కారికారూపమున ఉన్న అలంకార శాస్త్ర గ్రంథము. ఆయా లక్షణములకు ఉదాహరణములుగ భామహుడు స్వీయశ్లోకములనే ఇచ్చియున్నాడు. కావ్యాలంకారములో ఆరు పరిచ్ఛేదములున్నవి. ప్రథమ పరిచ్ఛేదములో-కావ్యప్రయోజనము, కావ్యహేతువు, కావ్యలక్షణము, భాషావిషయాది భేదములచే కావ్యభేదములు ప్రతిపాదించబడినవి. ద్వితీయ పరిచ్ఛేదములో గుణములు, అలంకారములు, తృతీయ పరిచ్ఛేదములో మరికొన్ని

* 1979నాటి ప్రథమ ముద్రణ ప్రస్తావన.

55. ఉపమారూపకాలంకారము 78
56. ఉపమేయోపమాలంకారము 78
57. సహోక్త్యలంకారము 79
58. పరివృత్త్యలంకారము 80
59. ససందేహాలంకారము 80
60. అనన్వయాలంకారము 81
61. ఉత్ప్రేక్షావయవము 81
62. సంసృష్టి 82
63. భావికము 83
64. ఆశీరలంకారము 84
65. వాక్యదోషాలు 85
66. వాక్యలక్షణము-మతభేదములు 86
67. అపార్థకము 90
68. వ్యర్థత్వము 91
69. పునరుక్తము 91
70. ససంశయము 93
71. అపక్రమము 94
72. శబ్దహీనము 94
73. యతిభ్రష్టము 95
74. విసంధి 96
75. దేశవిరోధి 97
76. కాలవిరోధి 97
77. కలావిరోధి 98
78. లోకవిరోధి 100
79. న్యాయవిరోధి 100
80. ఆగమ-ధర్మశాస్త్రవిరోధి 103
81. కావ్యవైశిష్ట్యము 105
82. ప్రమాణములు-ప్రత్యక్షము 106
83. అనుమానము 110
84. హేత్వపవాదిత్వ దోషము 112
85. స్వసిద్ధాంతవిరోధిత్వదోషము 113
86. సర్వాగమవిరుద్ధత్వదోషము 113
87. ప్రత్యక్ష బాధిని 114
88. త్రివిధ లింగములు 114
89. కావ్యన్యాయము 120
90. ధర్మమూలకప్రతిజ్ఞ 122
91. అర్థమూలక ప్రతిజ్ఞ 123
92. కామమూలక ప్రతిజ్ఞ 123
93. కోపమూలక ప్రతిజ్ఞ 123
94. ధర్మప్రతిజ్ఞాభాసము 124
95. అర్థబాధక ప్రతిజ్ఞ 124
96. కామబాధక ప్రతిజ్ఞ 124
97. కోపబాధక ప్రతిజ్ఞ 125
98. కావ్యములలో ప్రతిజ్ఞావిధానము 125
99. పరిహరింపవలసిన కొన్ని దోషములు 134
100. వ్యాకరణశాస్త్ర ప్రశంస 136
101. శబ్దార్థస్వరూపము 138
102. స్ఫోటవాద విమర్శ 138
103. అపోహవాద విమర్శ 143
104. ప్రయోగింపకూడని శబ్దములు 147
105. ప్రయోగింపవలసిన శబ్దములు 149
106. కొన్ని వ్యాకరణ విశేషములు 150
107. ఉపసంహారము 166




శ్రీః

## కావ్యాలఙ్కారః

## ప్రథమః పరిచ్ఛేదః

ప్రణమ్య సార్వం సర్వజ్ఞం మనోవాక్కాయకర్మభిః।
కావ్యాలఙ్కార ఇత్యేష యథాబుద్ధి విధాస్యతే॥ 1

**प्रणम्य सार्वं सर्वज्ञं मनोवाक्कायकर्मभिः।**
**काव्यालङ्कार इत्येष यथाबुद्धि विधास्यते॥**

బాలానన్దినీ వ్యాఖ్యా

నత్వా శ్రీతాతపాదాదీన్ విద్యామన్త్రాదిసద్గురూన్।
కావ్యాలఙ్కారవివృతిమాన్ధ్ర్యాం కుర్వే యథామతి॥

नत्वा श्रीतातपादादीन् विद्यामन्त्रादिसद्गुरून्।
काव्यालङ्कारविवृतिमान्ध्र्यां कुर्वे यथामति॥

సర్వజనులకు హితము చేకూర్చువాడును సర్వజ్ఞుడును అగు పరమేశ్వరుని మనోవాక్కాయకర్మలచే నమస్కరించి కావ్యాలంకారము అను పేరు గల ఈ గ్రంథము(ను) నా బుద్ధి ననుసరించి రచింపబడును (రచింపగలను).

వి. గ్రంథారంభమున మంగళము నాచరించుట సంప్రదాయసిద్ధము. మంగళాచరణముచే గ్రంథము నిర్విఘ్నముగ పూర్తియగును, రచయితకును పఠితలకును గూడ క్షేమము గలుగును అని మహాభాష్యమున పతంజలి చెప్పియున్నాడు. "*మఙ్గలాదీని హి శాస్త్రాణి ప్రథన్తే వీరపురుషాణి చ భవన్తి, ఆయుష్మత్పురుషాణి చ, అధ్యేతారశ్చ వృద్ధియుక్తా యథా స్యుః*" (మ.భా. 1.1.3)

ధర్మార్థకామమోక్షేషు వైచక్షణ్యం కలాసు చ।
ప్రీతిం కరోతి కీర్తిం చ సాధుకావ్యనిబన్ధనమ్॥ 2

**धर्मार्थकाममोक्षेषु वैचक्षण्यं कलासु च।**
**प्रीतिं करोति कीर्तिं च साधुकाव्यनिबन्धनम्॥**

వ్యా. ఉత్తమకావ్యరచనము ధర్మ-అర్థ-కామ-మోక్షములందును, కళలందును నేర్పును, ఆనందమును, కీర్తిని కలిగించును.

వి. 'నిబన్ధనమ్' అనుటకు బదులు 'నిషేవణమ్' అను పాఠాంతరము కూడ ఉన్నది. మొదటి పాఠమున ఈ ప్రయోజనములు ప్రధానముగ రచయితకు చెప్పినట్లగును. నిషేవణం అనగా సేవించుట. ఈ పాఠమున ప్రయోజనములు కవికిని, పఠితకును కూడ సంబంధించును. గ్రంథప్రారంభమున విషయము, సంబంధము, ప్రయోజనము, అధికారి అను నాలుగు విషయములను సూచించుట సంప్రదాయము. వీటికి అనుబంధచతుష్టయమని పేరు. ఈ గ్రంథమున విషయము కావ్యరచన, గ్రంథమునకును ఈ విషయమునకును ప్రతిపాద్య ప్రతిపాదకభావసంబంధము. ప్రయోజనము ఇచట చెప్పిన ధర్మాదివైచక్షణ్యాదికము. ఏతజ్జిజ్ఞాసువు (కావ్యరచనయందు గాని, కావ్యాస్వాదము నందు గాని అభిలాషకలవాడు) అధికారి. ఈ విధమున అనుబంధచతుష్టయమును సూచించినట్లైనది. ఇది కావ్యరచనను గూర్చిన గ్రంథము గాన కావ్య ప్రయోజనమే దీనికి కూడ ప్రయోజనము. ఈనాడు అనుబంధచతుష్టయమును గ్రంథములో కాక భూమికలో సూచింతురు.

అధనస్యేవ దాతృత్వం క్లీబస్యేవాస్త్రకౌశలమ్।
అజ్ఞస్యేవ ప్రగల్భత్వమకవేః శాస్త్రవేదనమ్॥ 3

अधनस्येव दातृत्वं क्लीबस्येवास्त्रकौशलम्।
अज्ञस्येव प्रगल्भत्वमकवेः शास्त्रवेदनम्॥

వ్యా. కవితాశక్తి లేనివాని శాస్త్రజ్ఞానము ధనములేనివాని దాతృత్వము వంటిది. నపుంసకుని అస్త్రకౌశలము వంటిది. జ్ఞానహీనుని ప్రగల్భత్వము (మాటలాడుటలో భయము లేకుండుట) వంటిది. కవితాశక్తి లేని శాస్త్రజ్ఞానము వ్యర్థమని యర్థము.

వినయేన వినా కా శ్రీః కా నిశా శశినా వినా।
రహితా సత్కవిత్వేన కీదృశీ వాగ్విదగ్ధతా॥ 4

विनयेन विना का श्रीः का निशा शशिना विना।
रहिता सत्कवित्वेन कीदृशी वाग्विदग्धता॥

వ్యా. వినయము లేని ఐశ్వర్యమువలన ఏమి ప్రయోజనము? చంద్రుడు లేని రాత్రి అందము ఏమి అందము? సత్కవిత్వము లేని వాగ్వైదగ్ధ్య మనగా (మాటలాడుటలోని నేర్పు అనగా) ఏమి?"

గురూపదేశాదధ్యేతుం శాస్త్రం జడధియోఽప్యలమ్।
కావ్యం తు జాయతే జాతు కస్యచిత్ప్రతిభావతః॥ 5

गुरूपदेशादध्येतुं शास्त्रं जडधियोऽप्यलम्।
काव्यं तु जायते जातु कस्यचित्प्रतिभावतः॥

వ్యా. జడబుద్ధి కలవారు కూడా గురూపదేశమువలన శాస్త్రాభ్యాసము చేయుటకు



సమర్థులు కావచ్చును, కాని, కావ్యము మాత్రము, ప్రతిభావంతుడగు ఎవనికో, ఎప్పుడో, ఆవిర్భవించును.

వి. ప్రతిభ అనగా అపూర్వవస్తువులను నిర్మించుటకు సమర్థమైన బుద్ధిబలము. "ప్రతిభా అపూర్వవస్తునిర్మాణక్షమా ప్రజ్ఞా" అని అభినవగుప్తుడు చెప్పియున్నాడు. "స్మృతిర్వ్యతీతవిషయా మతిరాగామిగోచరా, బుద్ధిస్తాత్కాలికీ జ్ఞేయా ప్రజ్ఞా త్రైకాలికీ మతా. ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభా మతా" జరిగిపోయిన విషయములను గూర్చిన జ్ఞానము 'స్మృతి', రాబోవు విషయముల జ్ఞానము 'మతి'. తాత్కాలికవిషయముల జ్ఞానము 'బుద్ధి'. మూడు కాలములకును సంబంధించు విషయముల జ్ఞానము 'ప్రజ్ఞ'. నవనవోన్మేషముతో ప్రకాశించు ప్రజ్ఞయే ప్రతిభ అని స్మృత్యాదుల ప్రసిద్ధ లక్షణము. ఇట్టి ప్రతిభకలవాడే నిజమైన కవి కాగలడు అని అభిప్రాయము.

ఉపేయుషామపి దివం సన్నిబన్ధవిధాయినామ్।
ఆస్త ఏవ నిరాతఙ్కం కాన్తం కావ్యమయం వపుః॥ 6

उपेयुषामपि दिवं सन्निबन्धविधायिनाम्।
आस्त एव निरातङ्कं कान्तं काव्यमयं वपुः॥

వ్యా. ఉత్తమకావ్యరచయితలు స్వర్గస్థులైన పిమ్మట కూడ వారి కావ్యరూపమగు శరీరము ఎట్టి (జరామరణాది భయమును లేనిదై) (స్థిరముగ) ఉండును.

రుణద్ధి రోదసీ చాస్య యావత్కీర్తిరనశ్వరీ।
తావత్కిలాయమధ్యాస్తే సుకృతీ వైబుధం పదమ్॥ 7

रुणद्धि रोदसी चास्य यावत्कीर्तिरनश्वरी।
तावत्किलायमध्यास्ते सुकृती वैबुधं पदम्।

వ్యా. నాశరహిత మగు ఈతని కీర్తి ఎంతవరకు భూలోకస్వర్గములను (రోదసీ) వ్యాపించి యుండునో అంతవరకును ఈ సత్కావ్యరచయిత (సుకృతీ) స్వర్గలోకమును (వైబుధం పదమ్) అధిష్ఠించి యుండునట.

అతోఽభివాఞ్ఛతా కీర్తిం స్థేయసీమా భువః స్థితేః।
యత్నో విదితవేద్యేన విధేయః కావ్యలక్ష్మణి॥ 8

अतोऽभिवाञ्छता कीर्तिं स्थेयसीमाभुवः स्थितेः।
यत्नो विदितवेद्येन विधेयः काव्यलक्ष्मणि॥

వ్యా. కావున భూమి యున్నంతవరకును స్థిరముగ నుండు కీర్తిని కోరువానిచే, కావ్యలక్షణమే విషయమున ప్రయత్నము చేయదగినది.

వి. 'కావ్యలక్ష్మణి' అను పాఠమునకు బదులు 'కావ్యలక్షణః' అని పాఠమున్నది.

'కావ్యలక్షణమైన ప్రయత్నము' అను అర్థము సరిగా పొసగదు. అందుచే మొదటి పాఠమే యుక్తము. కీర్తి కావలెనన్నచో కావ్యము వ్రాయవలెను. కావ్యరచనాపాటవము కావలెనన్నచో కావ్యలక్షణము సరిగా తెలిసి యుండవలెను అని అర్థము.

శబ్దశ్ఛన్దోఽభిధానార్థా ఇతిహాసాశ్రయాః కథాః।
లోకో యుక్తిః కలాశ్చేతి మన్తవ్యాః కావ్యగైర్హ్యమీ॥ 9

शब्दश्छन्दोऽभिधानार्था इतिहासाश्रया: कथा: ।
लोको युक्ति: कलाश्चेति मन्तव्याः काव्यगैर्ह्यमी ॥

వ్యా. వ్యాకరణము, ఛందస్సు, శబ్దమున కున్న అభిధారూపవ్యాపారము, విభిన్న అర్థములు, ఇతిహాసములకు సంబంధించిన కథలు, లోకవ్యవహారము, యుక్తులు, కళలు ఇవన్నియు కావ్యరచన కుద్యమించువారు తెలిసికొని ఉండవలెను.

వి. ఇచటనున్న 'అభిధాన' అనుపదమునకు కావ్యాలంకారవ్యాఖ్యాత యగు ఉద్భటుడు అభిధావ్యాపారము, గౌణవృత్తి అని అర్థము చెప్పినట్లు ధ్వన్యాలోకలోచనము నుండి తెలియుచున్నది. కవిత్వము చెప్పదలచినవాడు ఏ పదమునకు ఏది ముఖ్యార్థమో తెలిసికొనవలెను అని అర్థము. భామహాది ప్రాచీనాలంకారికులు వ్యంజనను ప్రధానముగ గ్రహింపలేదు, 'అర్థ' శబ్దమునకు అర్థములను బోధించు కోశములని అర్థము చెప్పవచ్చును.

శబ్దాభిధేయే విజ్ఞాయ కృత్వా తద్విదుపాసనమ్।
విలోక్యాన్యనిబన్ధాంశ్చ కార్యః కావ్యక్రియాదరః॥ 10

शब्दाभिधेये विज्ञाय कृत्वा तद्विदुपासनम् ।
विलोक्यान्यनिबन्धांश्च कार्य: काव्यक्रियादर: ॥

వ్యా. శబ్దార్థములను బాగుగ తెలిసికొని శబ్దార్థజ్ఞానవంతుల శుశ్రూష చేసి (లేదా కావ్యనిర్మాణజ్ఞానము కలవారి శుశ్రూష చేసి) ఇతర కావ్యములను కూడ పరిశీలించి కావ్యనిర్మాణమునందు ఆదరము (ప్రయత్నము) చేయవలెను.

సర్వథా పదమప్యేకం న నిగాద్యమవద్యవత్।
విలక్ష్మణా హి కావ్యేన దుఃసుతేనేవ నిన్ద్యతే॥ 11

सर्वथा पदमप्येकं न निगाद्यमवद्यवत् ।
विलक्ष्मणा हि काव्येन दु:सुतेनेव निन्द्यते ॥

వ్యా. దుష్టమైన (అవద్యవత్) ఒక్క పదమైనను, ఎట్టి పరిస్థితి యందును, ప్రయోగింప రాదు. దోషయుక్త మగు కావ్యముచే, చెడ్డకుమారునిచేత వలె నిందింపబడును.

వి. దుష్టుడైన కుమారుడు ఒక్కడున్నను తండ్రిని నిందించినట్లు, దుష్టశబ్దమొక్కటి ప్రయోగించినను కవిని నిందింతురు.



నాకవిత్వమధర్మాయ వ్యాధయే దణ్డనాయ వా।
కుకవిత్వం పునః సాక్షాన్మృతిమాహుర్మనీషిణః॥ 12

नाकवित्वमधर्माय व्याधये दण्डनाय वा ।
कुकवित्वं पुन: साक्षान्मृतिमाहुर्मनीषिण: ॥

వ్యా. కవి కాకుండుట అధర్మమునకు గాని, వ్యాధికి గాని, రాజదండనమునకు గాని హేతువుకాదు. కుకవిత్వము మాత్రము సాక్షాత్తు మరణమే అని పండితులు చెప్పుదురు.

రూపకాదిరలఙ్కారస్తస్యాన్యైర్బహుధోదితః।
న కాన్తమపి నిర్భూషం విభాతి వనితాననమ్॥ 13

रूपकादिरलङ्कारस्तस्यान्यैर्बहुधोदित: ।
न कान्तमपि निर्भूषं विभाति वनिताननम् ॥

వ్యా. "ఆ కావ్యమునకు రూపకము మొదలగు అలంకారము, ఇతరులచే, అనేక విధములుగ చెప్పబడినది. స్త్రీముఖము సుందరమైనదే యైనను, అలంకారరహితమైనచో ప్రకాశింపదు."

వి. ఈ శ్లోకము అర్థాలంకారప్రాధాన్యవాదుల మతమును చెప్పుచున్నది. సహజముగ సుందరముగ నున్నను కాంతాముఖము పూర్తిగ ప్రకాశింపనట్లు కావ్యమునందలి శబ్దములు వ్యాకరణశుద్ధములై అందముగ నున్నను రూపకాద్యర్థాలంకారములు లేనిచో ఆ కావ్యము మనోహరము కాజాలదని వీరి అభిప్రాయము.

రూపకాదిమలఙ్కారం బాహ్యమాచక్షతే పరే।
సుపాం తిఙాం చ వ్యుత్పత్తిం వాచాం వాఞ్ఛన్త్యలఙ్కృతిమ్॥ 14
తదేతదాహుః సౌశబ్ద్యం నార్థవ్యుత్పత్తిరీదృశీ।

रूपकादिमलङ्कारं बाह्यमाचक्षते परे ।
सुपां तिङां च व्युत्पत्तिं वाचां वाञ्छन्त्यलङ्कृतिम् ।
तदेतदाहु: सौशब्द्यं नार्थव्युत्पत्तिरीदृशी ॥

వ్యా. మరికొందరు రూపకాద్యర్థాలంకారములను బాహ్యములని (అనగా కావ్య సహజములు కాక కల్పితములనియు, అందుచే అవి అలంకారములు కాజాలవనియు) చెప్పుదురు. వీరు సుబన్తతిఙన్త శబ్దముల వ్యుత్పత్తియే కావ్యములకు (వాచాం=వాగ్రూపములగు కావ్యములకు,) అలంకారములని (సహజాలంకారము లని) అంగీకరింతురు. ఇట్టిసుబన్తతిఙన్త శబ్దముల వ్యుత్పత్తియే సౌశబ్ద్యము (శబ్దసౌష్ఠవము) అనియు, అర్థవ్యుత్పత్తి ఇట్టిది, అనగా అలంకృతి, కాదనియు చెప్పుదురు.

వి. ఈ ఒకటిన్నర శ్లోకములలో శబ్దాలంకార ప్రాధాన్యవాదుల మతము చెప్పబడినది.

వీరి మతము ప్రకారము కావ్యమును చదివిన వెంటనే స్ఫురించునవి శబ్దాలంకారములు గాన అవి అంతరంగములు; అందుచే ప్రధానములు. అర్థాలంకారములు అర్థజ్ఞానానంతరము బుద్ధిగోచరములు గాన అవి బహిరంగములు, అందుచే అప్రధానములు. సుబంతములనగా నామవాచక-విశేషణాదులు. తిజంతములనగా క్రియాపదములు వాటి, వ్యుత్పత్తి, (నిర్దుష్టముగాను అందముగాను ఉండు కూర్పు) శబ్దాలంకారము.

శబ్దాభిధేయాలఙ్కారభేదాదిష్టం ద్వయన్తు నః॥ 15

**शब्दाभिधेयालङ्कारभेदादिष्टं द्वयन्तु नः ॥**

వ్యా. శబ్దాలంకారము, అర్థాలంకారము అను భేదముచే రెండు విధములైన అలంకారమును మాకు అంగీకార్యమే.

వి. శబ్దాలంకార-అర్థాలంకారములు రెండును సమప్రధానములే. అందుచే రెండును పరిగ్రాహ్యములే అని భామహుని అభిప్రాయము. కావుననే మమ్మటుడు కావ్యప్రకాశమున –"శబ్దాలంకారార్థాలంకారములు రెండును సాధారణముగ కలిసియే యుండును గాన, ఇచట శబ్దాలంకారము మాత్రమే ఉన్నది, ఇచట అర్థాలంకారము మాత్రమే ఉన్నది, అని చెప్పుటకు వీలు లేదు; ఇక నేమనగా-కవి కొన్ని చోట్ల శబ్దాలంకార ప్రయోగవిషయమున ఎక్కువ శ్రద్ధ చూపును. కొన్ని చోట్ల అర్థాలంకారము విషయమున శ్రద్ధ చూపును. పరిశీలించినచో శబ్దాలంకారములున్నచోట అర్థాలంకారము కూడ ఉండును. అర్థాలంకారమున్న చోట శబ్దాలంకారము కూడా ఉండును" అని షష్ఠోల్లాస ప్రారంభమున చెప్పియున్నాడు.

శబ్దార్థౌ సహితౌ కావ్యం గద్యం పద్యం చ తద్ద్విధా।
సంస్కృతం ప్రాకృతం చాన్యదపభ్రంశ ఇతి త్రిధా॥ 16

**शब्दार्थौ सहितौ काव्यं गद्यं पद्यं च तद्द्विधा ।**
**संस्कृतं प्राकृतं चान्यदपभ्रंश इति त्रिधा ॥**

వ్యా. పరస్పరము చక్కగ కలిసిన శబ్దార్థములు కావ్యము. గద్యము, పద్యము అని కావ్యము రెండు విధములు. సంస్కృతము, ప్రాకృతము, అపభ్రంశము అని కావ్యము మరల మూడు విధములు.

వి. 'శబ్దార్థౌ సహితం కావ్యమ్' అనునది భామహుని కావ్యలక్షణమని చాలమంది అర్వాచీనాలంకారికుల అభిప్రాయము. 'శబ్దార్థములకు దేనియందు మంచి పొందిక ఉండునో అదియె కావ్యము' అని దీని భావమును చెప్పుదురు. కాని ప్రకరణమును పట్టి చూడగా ఇది కావ్యలక్షణముగ భామహుడుద్దేశించినాడని చెప్పుటకు అవకాశమున్నట్లు కనబడదు. ఎంతో భావమును కల్పించి చెప్పిన కాని దీనికి లక్షణత్వము కూడ అంతగా పొసగదు. వెనుకటి శ్లోకములలో భామహుడు శబ్దాలంకారప్రాధాన్యవాదుల యభిప్రాయమును, అర్థాలంకార



ప్రాధాన్యవాదుల మతమును పేర్కొని తనకు రెండు విధములగు అలంకారములును సమ్మతములే అని "శబ్దాభిధేయాలఙ్కారభేదాదిష్టం ద్వయం తు నః" అను వాక్యమున చెప్పినాడు. దాని వెంటనే చెప్పిన "శబ్దార్థౌ సహితౌ కావ్యమ్" అను వాక్యమున 'సహితౌ' అను పదమునకు 'శబ్దాలంకార- అర్థాలంకారములతో గూడిన' అను నర్థమును చెప్పుట యుక్తము. అందుచే ఈ వాక్యము కావ్యలక్షణముగ భామహుడుద్దేశించినాడని అనుకున్నచో- "శబ్దాలంకార-అర్థాలంకారములతో గూడిన శబ్దార్థములు కావ్యము" అను నర్థము చెప్పిన బాగుండును. అంతియే కాని "ఒకదానితో ఒకటి కలిసి యున్న శబ్దార్థములు" అని అర్థము చెప్పి, మరల దానికి ఎన్నో వివరణములను చేర్చి ఇది కావ్యలక్షణమని చెప్పుట యుక్తము కాదు.

కావ్యములు గద్యము, పద్యము అని రెండు విధములు. మరల ఆ రెండును ప్రత్యేకముగ సంస్కృతాది భేదముచే మూడు విధములు. సంస్కృతాలంకారికులు ఆనాటి దేశభాషాకావ్యములను గూడ సంస్కృత కావ్యములతో సమముగ అభ్యసించి వాటి కన్నింటికిని సమాన ప్రతిపత్తి నిచ్చుట గమనార్హము.

వృత్తదేవాదిచరితశంసి చోత్పాద్యవస్తు చ।
కలాశాస్త్రాశ్రయఞ్చేతి చతుర్ధా భిద్యతే పునః॥ 17

**वृत्तदेवादिचरितशंसि चोत्पाद्यवस्तु च ।**
**कलाशास्त्राश्रयञ्चेति चतुर्धा भिद्यते पुनः ॥**

వ్యా. జరిగిన దేవాదుల చరితమును చెప్పునది, కల్పితకథావస్తువు కలది, (సంగీతాది) కళలకు సంబంధించినది, (వ్యాకరణాది) శాస్త్రమునకు సంబంధించినది అని కావ్యము మరల నాలుగు విధములు.

వి. 'దేవాది' అను 'ఆది' పదముచే మనుష్యాదులు కూడ చేరుదురు. రఘువంశ కుమారసంభవాదులు. మాలతీమాధవాదులు కల్పిత కథా వస్తువులు. భట్టికావ్యాదులు శాస్త్రకావ్యములు.

సర్గబన్ధోఽభినేయార్థం తథైవాఖ్యాయికాకథే।
అనిబద్ధఞ్చ కావ్యాది తత్పునః పఞ్చధోచ్యతే॥ 18

**सर्गबन्धोऽभिनेयार्थं तथैवाख्यायिकाकथे ।**
**अनिबद्धञ्च काव्यादि तत्पुनः पञ्चधोच्यते ॥**

వ్యా. సర్గబంధము (మహాకావ్యము), అభినయింపదగిన అర్థము కలది (రూపకము), ఆఖ్యాయిక, కథ అనిబద్ధము (ముక్తకములు) అని కావ్యములు మరల ఐదు విధములు.

వి. 'కావ్యాది'కి బదులు 'కావ్యజ్ఞైః' అను పాఠము యుక్తము. ఛందస్సును ప్రయోగింపక పోవుట ప్రయోగించుట, అను దానిని బట్టి కావ్యము 1) గద్యము 2) పద్యము అని రెండు

విధములు. భాషను బట్టి (1) సంస్కృతము (2) ప్రాకృతము (3) అపభ్రంశము అని మూడేసి విధములు. ఈ విధముగ గద్యకావ్యము సంస్కృతాదిభేదముచే మూడు విధములు. పద్యకావ్యము మూడు విధములు. మొత్తము ఆరు విధములు. ఇవి అన్నియు కథావస్తువును బట్టి నాలుగేసి విధములు. అనగా 6×4=24 విధములు. ఈ ఇరవైనాలుగు విధముల కావ్యములును వాటి స్వరూపమును బట్టి సర్గబంధాది భేదపంచకములో ఏదో ఒక తెగకు చెందియుండును.

ఐదు శ్లోకములలో మహాకావ్యలక్షణము చెప్పుచున్నాడు.

**సర్గబన్ధో మహాకావ్యం మహతాం చ మహచ్చ యత్।**
**అగ్రామ్యశబ్దమర్థ్యం చ సాలఙ్కారం సదాశ్రయమ్॥ 19**

**सर्गबन्धो महाकाव्यं महतां च महच्च यत्।**
**अग्राम्यशब्दमर्थ्यं च सालङ्कारं सदाश्रयम्॥**

వ్యా. సర్గములలో కూర్చినది మహాకావ్యము. ఇది మహాపురుషులకు సంబంధించినదియై, అధిక ప్రమాణము (మహత్) కలదై ఉండును. ఇందలి శబ్దములు, అర్థములు కూడ అగ్రామ్యములుగ ఉండవలెను. అలంకారము లుండవలెను. మంచి విషయము లుండవలెను.

**మన్త్రదూతప్రయాణాజినాయకాభ్యుదయైశ్చ యత్।**
**పఞ్చభిః సన్ధిభిర్యుక్తం నాతివ్యాఖ్యేయమృద్ధిమత్॥ 20**

**मन्त्रदूतप्रयाणाजिनायकाभ्युदयैश्च यत्।**
**पञ्चभिः सन्धिभिर्युक्तं नातिव्याख्येयमृद्धिमत्॥**

వ్యా. కావ్యమున మంత్రము, అనగా కర్తవ్యాలోచనము, దూత ప్రేషణాదికము, యుద్ధప్రయాణము, యుద్ధము, నాయకుని అభ్యుదయము వర్ణింపవలెను. ఐదు సంధులతో కూడినదై ఉండవలెను. ఎక్కువ వాఖ్యానాపేక్ష లేకుండ సామాన్యులకు కూడ అర్థ మగునట్లు ఉండవలెను. ఉదాత్త విషయ-వర్ణనాదిసమృద్ధికలదై ఉండవలెను.

వి. ముఖము, ప్రతిముఖము, గర్భము, అవమర్శము, ఉపసంహృతి అని సంధులు ఐదు విధములు. వీటి ప్రయోగము ప్రధానముగ దృశ్య కావ్యములలో నుండును. మహాకావ్యములో కూడ వీటిని ఉపయోగించవలెనని భామహుడు చెప్పుచున్నాడు. 1) ముఖసంధి :- ఇందు కథావస్తువునకు సంబంధించిన బీజములు నాటబడును. 2) ప్రతిముఖసంధి:-ఈ బీజములు అంకురించి అస్పష్టముగ కనబడుచుండును. 3) గర్భసంధి :- అంకురములు బాగుగ పెరిగి వాంఛితార్థము లాభోన్ముఖ మగును. లేదా అది చేయి జారిపోవుట, దానికొరకై అన్వేషణము జరుగును. 4) విమర్శసంధి:- వాంఛితార్థమునకై అన్వేషణము కొనసాగును. 5) నిర్వహణ సంధి:- వాంఛితార్థము లభించును, కథావస్తువు పరిపూర్ణత చెందును.



**చతుర్వర్గాభిధానేఽపి భూయసార్థోపదేశకృత్।**
**యుక్తం లోకస్వభావేన రసైశ్చ సకలైః పృథక్॥ 21**

**चतुर्वर्गाभिधानेऽपि भूयसार्थोपदेशकृत्।**
**युक्तं लोकस्वभावेन रसैश्च सकलैः पृथक्॥**

వ్యా. కావ్యము ధర్మార్థకామమోక్షము లను నాలుగు పురుషార్థములను బోధించునదైనను ప్రధానముగ అర్థమును గూర్చి ఉపదేశించునదై ఉండవలెను. లోకస్వభావనిరూపణముతోడను, వేరువేరు రసములతోడను కూడి ఉండవలెను.

**నాయకం ప్రాగుపన్యస్య వంశవీర్యశ్రుతాదిభిః।**
**న తస్యైవ వధం బ్రూయాదన్యోత్కర్షాభిధిత్సయా॥ 22**

**नायकं प्रागुपन्यस्य वंशवीर्यश्रुतादिभिः।**
**न तस्यैव वधं ब्रूयादन्योत्कर्षाभिधित्सया॥**

వ్యా. ఉత్తమవంశము, పరాక్రమము, శాస్త్రాభ్యాసము మొదలగు సద్గుణములతో ముందుగా నాయకుని వర్ణించి, తరువాత ప్రతినాయకుని ఉత్కర్షను చెప్పవలెననెడు అభిప్రాయముతో ఆ నాయకుని వధనే (ప్రతినాయకుని చేతిలో) వర్ణింపరాదు.

వి. కథాప్రారంభమునుండి చివరివరకును ఉండి చివరకు అభ్యుదయమును పొందువాడు నాయకుడు. అట్టివాడు ప్రతినాయకునిచే పరాస్తుడైనట్లు వర్ణింపరాదు. అట్లు చెప్పవలసివచ్చినచో మొదట అతనిని అంత గొప్పగా వర్ణింపరాదు. కావ్యాదర్శములో (1.22) దండి దీనికి భిన్నముగా చెప్పినాడు. ప్రతినాయకుని మొదట బాగుగా వర్ణించి నాయకుని చేతిలో అతని మరణము వర్ణింపవచ్చునని దండి ఉద్దేశ్యము.

**యది కావ్యశరీరస్య న స వ్యాపయితేష్యతే।**
**న చాభ్యుదయభాక్తస్య ముధాదౌ గ్రహణం స్తవే॥ 23**

**यदि काव्यशरीरस्य न स व्यापयितेष्यते।**
**न चाभ्युदयभाक्तस्य मुधादौ ग्रहणं स्तवे॥**

వ్యా. ఆ నాయకుడు కావ్యశరీరమునంతను వ్యాపించు నట్లుండుటయు, అభ్యుదయమును పొందుటయు (కవికి) ఇష్టము కానిచో అతనిని స్తుతించుటకై ముందుగ గ్రహించుట వ్యర్థము. "ముధాదౌ గ్రహణస్తవే" అను పాఠాంతరము యుక్తము. ఆదియందు గ్రహించుట (చెప్పుట) స్తుతించుట వ్యర్థము అని అర్థము.

అవ. ఇంతవరకు మహాకావ్యలక్షణము చెప్పి ఇపుడు (దృశ్యకావ్యమును) గూర్చి చెప్పుచున్నాడు.

నాటకం ద్విపదీశమ్యారాసకస్కన్ధకాది యత్।
ఉక్తం తదభినేయార్థముక్తోఽన్యైస్తస్య విస్తరః॥ 24

नाटकं द्विपदीशम्यारासकस्कन्धकादि यत्।
उक्तं तदभिनेयार्थमुक्तोऽन्यैस्तस्य विस्तर: ॥

వ్యా. నాటకము, ద్విపది, శమ్య, రాసకము, స్కంధకము మొదలగునది అభినేయార్థము, (అభినయింపదగిన అర్థము కలది). దీని విస్తరము ఇతరులచే (భరతాదులచే) చెప్పబడినది. (అచటినుండియే దానిని గూర్చి తెలిసికొనవలెను).

అవ. ఇపుడు మూడవభేద మగు ఆఖ్యాయికను గూర్చి చెప్పుచున్నాడు.

సంస్కృతానాకులశ్రవ్యశబ్దార్థపదవృత్తినా।
గద్యేన యుక్తోదాత్తార్థా సోచ్ఛ్వాసాఖ్యాయికా మతా॥ 25

संस्कृतानाकुलश्रव्यशब्दार्थपदवृत्तिना।
गद्येन युक्तोदात्तार्था सोच्छ्वासाख्यायिका मता॥

వ్యా. సంస్కృతభాషలో, అనాకులములును శ్రవ్యములును (వినుటకు ఇంపుగ నుండునవి) అగు శబ్దార్థములును, పదవృత్తులును కల గద్యముతో కూడినదియు, ఉదాత్తమైన అర్థము కలదియు, ఉచ్ఛ్వాసములు కలదియు అగు రచన ఆఖ్యాయిక అని అంగీకరింపబడినది.

వి. కొన్ని పుస్తకములలో 'సంస్కృత' అనుటకు బదులు 'ప్రకృత' అను పాఠమున్నది. కథ సంస్కృతములో కాని, ఇతర భాషలలో కాని ఉండవచ్చునని చెప్పనున్నాడు. అందుచే ఇచట 'సంస్కృత' అను పాఠము యుక్తమని తోచును. పదవృత్తు లనగా పదములకు సంబంధించిన సమాసతద్ధితాది-వృత్తులు. శబ్దార్థములు అనాకులముగను, పదవృత్తులు శ్రవ్యములుగను ఉండవలెనని అన్వయము.

వృత్తమాఖ్యాయతే తస్యాం నాయకేన స్వచేష్టితమ్।
వక్త్రం చాపరవక్త్రం చ కాలే భావ్యర్థశంసి చ॥ 26

वृत्तमाख्यायते तस्यां नायकेन स्वचेष्टितम्।
वक्त्रं चापरवक्त्रं च काले भाव्यर्थशंसि च॥

వ్యా. ఈ ఆఖ్యాయికయందు జరిగిన తన కథ నాయకునిచే చెప్పబడును. అప్పుడప్పుడు భావివిషయమును సూచించుటకై వక్త్ర-అపరవక్త్రము లను ఛందస్సులలో శ్లోకము లుండును.

కవేరభిప్రాయకృతైః కథనైః కైశ్చిదఙ్కితా।
కన్యాహరణసఙ్గ్రామవిప్రలమ్భోదయాన్వితా॥ 27

कवेरभिप्रायकृतैः कथनैः कैश्चिदङ्किता।
कन्याहरणसङ्ग्रामविप्रलम्भोदयान्विता॥



వ్యా. ఆఖ్యాయిక, కవియొక్క అభిప్రాయముచే నిర్మితములగు కొన్ని కథనములచే చిహ్నితమై యుండును. ఇందు కన్యాహరణము, యుద్ధము, విప్రలంభము, (నాయకునికి) అభివృద్ధి వర్ణింపబడును.

అవ. ఇపుడు కథను వివరించుచున్నాడు-

న వక్త్రాపరవక్త్రాభ్యాం యుక్తా నోచ్ఛ్వాసవత్యపి।
సంస్కృతే సంస్కృతా చేష్టా కథాపభ్రంశభాక్తథా॥ 28

न वक्त्रापरवक्त्राभ्यां युक्ता नोच्छ्वासवत्यपि।
संस्कृते संस्कृता चेष्टा कथापभ्रंशभाक्तथा॥

వ్యా. కథలో వక్త్రాపరవక్త్రముల ప్రయోగము గాని, ఉచ్ఛ్వాస విభాగము గాని ఉండదు. సంస్కృతమునందును, ప్రాకృతమునందును, అపభ్రంశమునందును కూడ ఉండవచ్చును.

అన్యైః స్వచరితం తస్యాం నాయకేన తు నోచ్యతే।
స్వగుణావిష్కృతిం కుర్యాదభిజాతః కథం జనః॥ 29

अन्यै: स्वचरितं तस्यां नायकेन तु नोच्यते।
स्वगुणाविष्कृतिं कुर्यादभिजात: कथं जन: ॥

వ్యా. కథలో, నాయకుని చరిత్రను ఇతరులు చెప్పుదురు కాని, నాయకుడే స్వయముగ చెప్పుకొనడు. ఉత్తమవంశసంజాతుడగువాడు తన చరిత్రను తానే ఎట్లు చెప్పుకొనును?

వి. ఆఖ్యాయికలో నాయకుడే తన కథను చెప్పును అని పూర్వము చెప్పబడినది. ఉత్తమవంశీయుడు, (ఆటోబయాగ్రఫీ వ్రాసుకొన్నట్లు) తనను గూర్చి తానే చెప్పుకొనునా? అని ఇచట చెప్పుటచే ఆఖ్యాయికలోని నాయకుడు సాధారణవ్యక్తి యైయుండునని భామహుని అభిప్రాయ మన్నట్లు తోచుచున్నది.

అవ. ఇపుడు అనిబద్ధ (ముక్తక) కావ్యమును గూర్చి చెప్పుచున్నాడు-

అనిబద్ధం పునర్గాథాశ్లోకమాత్రాది తత్పునః।
యుక్తం వక్రస్వభావోక్త్యా సర్వమేవైతదిష్యతే॥ 30

अनिबद्धं पुनर्गाथाश्लोकमात्रादि तत्पुन: ।
युक्तं वक्रस्वभावोक्त्या सर्वमेवैतदिष्यते॥

వ్యా. ఒక గాథా (పాకృతపద్యము) రూపముననో ఒక శ్లోకము (సంస్కృతపద్యము) రూపముననో ఉన్నది అనిబద్ధము. ఇంత వరకును చెప్పిన ఐదు విధములగు కావ్యము కూడ వక్రోక్తితో కూడి యుండవలెను.

వి. అనిబద్ధ మనగా ఇతరశ్లోకములతో కలిపి కూర్పబడనిది అని యర్థము. అనగా

ముక్తకము. పూర్వాపర నిరపేక్షముగనే రసాస్వాదనను కలిగించునది ముక్తక మనియు, అట్టి ముక్తకములు ప్రబంధముల మధ్య కూడ ఉండవచ్చు ననియు అభినవగుప్తుడు లోచనమున చెప్పియున్నాడు-"ముక్తకమ్ అన్యేనానాలిఙ్గితమ్...ప్రబన్ధేష్వపి ముక్తకస్యాస్తి సద్భావః" "పూర్వాపరనిరపేక్షేణాపి హి యేన రసచర్వణా క్రియతే తదేవ ముక్తకమ్"...(3.7) అభిజ్ఞాన శాకుంతలాదులలోని సూర్యోదయాదివర్ణనాశ్లోకాదులు ప్రబంధమధ్యగతముక్తకములకు ఉదాహరణములు.

'వక్రస్వభావోక్త్యా యుక్తమ్' అనుదానికి "వక్రోక్తి-స్వభావోక్తులతో కూడినది" అను అర్థము చెప్పవచ్చును. కాని భామహుడు స్వభావోక్తిని అంగీకరింపడుగాన (చూ. 11.99) వక్రమగు స్వరూపమును చెప్పుట అనగా 'వక్రోక్తి' అను అర్థమును గ్రహింపవలెను. భామహుడు స్వభావోక్తిని అలంకారముగ అంగీకరింపకపోయినను కావ్యములో స్వభావవర్ణనమును కూడా నిరాకరించినాడని చెప్పుటకు వీలు లేదు గాన 'వక్రోక్తి స్వభావోక్తులతో కూడినది' అను అర్థము చెప్పినను అసమంజసము కాదు.

వైదర్భమన్యదస్తీతి మన్యన్తే సుధియోఽపరే।
తదేవ చ కిల జ్యాయః సదర్థమపి నాపరమ్॥ 31

वैदर्भमन्यदस्तीति मन्यन्ते सुधियोऽपरे।
तदेव च किल ज्यायः सदर्थमपि नापरम्॥

వ్యా. వైదర్భమను (అనగా వైదర్భీరీతిగ్రథిత మగు) కావ్యభేదము మరి యొకటి కూడ ఉన్నదని కొందరు పండితులు చెప్పుదురు. ఆ వైదర్భకావ్యమే ఉత్తమ మైనదట. మంచి అర్థముతో కూడినదైనను రెండవది, అనగా గౌడీయ మను కావ్యభేదము, మంచిది కాదట.

గౌడీయమిదమేతత్తు వైదర్భమితి కిం పృథక్।
గతానుగతికన్యాయాన్నానాఖ్యేయమమేధసామ్॥ 32

गौडीयमिदमेतत्तु वैदर्भमिति किं पृथक्।
गतानुगतिकन्यायान्नानाख्येयममेधसाम्॥

వ్యా. వాస్తవమున ఇది గౌడీయము, ఇది వైదర్భము అని భేదమేమి ఉన్నది? ఈ వేరు వేరు నామధేయముల ప్రయోగము గతానుగతిక న్యాయముచే, మేధారహితులైనవారిలో మాత్రమే కానవచ్చుచున్నది.

వి. నానాఖ్యా+ఇయమ్', అని పదచ్ఛేదము. ఒకరు ఏదో మార్గము పట్టి పోవుచుండగా, అందలి కారణములను బాగుగ పరిశీలింపకయే వారి వెనుక మరి కొందరు పోవుచుందురు. ఇదియే గతానుగతికన్యాయము.

నను చాశ్మకవంశాది వైదర్భమితి కథ్యతే।
కామం తథాస్తు ప్రాయేణ సంజ్ఞేచ్ఛాతో నిధీయతే॥ 33



ननु चाश्मकवंशादि वैदर्भमिति कथ्यते।
कामं तथास्तु प्रायेण संज्ञेच्छातो निधीयते॥

వ్యా. అశ్మకవంశము, మొదలగునవి వైదర్భకావ్యములని చెప్పుదురు కదా? అవి అట్లైన కావచ్చును. సాధారణముగా వారివారి ఇచ్ఛననుసరించి సంజ్ఞ ఏర్పరచుకొనుచుందురు.

వి. ఈ అశ్మకవంశకావ్యము ఇపుడు అలభ్యము.

అపుష్టార్థమవక్రోక్తి ప్రసన్నమృజు కోమలమ్।
భిన్నం గేయమివేదం తు కేవలం శ్రుతిపేశలమ్॥ 34

अपुष्टार्थमवक्रोक्ति प्रसन्नमृजु कोमलम्।
भिन्नं गेयमिवेदं तु केवलं श्रुतिपेशलम्॥

వ్యా. అర్థపుష్టి లేనిదియు, వక్రోక్తిరహితమును, ప్రసన్నార్థమును (చదివినవెంటనే స్పష్టమగు అర్థము కలది), ఋజువైనదియు, సుకుమార మైనదియు అగు (మీరు వైదర్భమని పేరుపెట్టిన) ఈ కావ్యము ఒక గేయవిశేషము వలె కేవలము చెవులకు ఇంపుగా నుండును. (అంతియే కాని కావ్యమునందావశ్యకములగు ధర్మములేవియు దాని యందు లేకపోవచ్చును.)

అలఙ్కారవదగ్రామ్యమర్థ్యం న్యాయ్యమనాకులమ్।
గౌడీయమపి సాధీయో వైదర్భమితి నాన్యథా॥ 35

अलङ्कारवदग्राम्यमर्थ्यं न्याय्यमनाकुलम्।
गौडीयमपि साधीयो वैदर्भमिति नान्यथा॥

వ్యా. అలంకారములు కలదియు, అగ్రామ్యము, సదర్థయుక్తము, యుక్తియుక్తము, అనాకులము (అనగా ఒక నియమితరీతిలో వ్రాయబడినది) అగు కావ్యము గౌడీయమేయైనను మంచిదే. అట్లు కానిది, వైదర్భమైనంత మాత్రమున (వైదర్భమితి=వైదర్భమితి హేతోః) మంచిది కాదు.

వి. అలంకార - అగ్రామ్యత్వాది కావ్యలక్షణము లుండవలెను. ఇది వైదర్భము, ఇది గౌడీయము అని పేర్లు పెట్టినంత మాత్రమున ప్రయోజనము లేదు. ఈ రెండు శ్లోకములను పరిశీలింపగా-"పుష్టార్థః సవక్రోక్తిః, (అలంకారవాన్). అగ్రామ్యః న్యాయ్యః అనాకులః శబ్దః కావ్యమ్" అనునది భామహాంగీకార్యమగు కావ్యలక్షణ మని గమ్యమగుచున్నది. 'శబ్దః కావ్యమ్' అనుటకు బదులు "శబ్దార్థయుగలం కావ్యమ్" అని (శబ్దార్థయుగలం అను దానిని విశేష్యముగ గ్రహించి) చెప్పినచో పుష్టార్థం' లేదా 'అర్థ్యమ్' అను విశేషణము సరిపడదు.

న నితాన్తాదిమాత్రేణ జాయతే చారుతా గిరామ్।
వక్రాభిధేయశబ్దోక్తిరిష్టా వాచామలఙ్కృతిః॥ 36

न नितान्तादिमात्रेण जायते चारुता गिराम्।
वक्राभिधेयशब्दोक्तिरिष्टा वाचामलङ्कृतिः॥

వ్యా. 'నితాంత' శబ్దాదులను ప్రయోగించినంత మాత్రమున వాక్కులలో సౌందర్యము పుట్టదు. వక్రమగు అర్థములయొక్కయు, శబ్దములయొక్కయు, కూర్పు వాక్కులకు (కావ్యములకు) అలంకారముగా అంగీకరింపబడును.

వి. "ఆహా! ఈ కావ్యము ఎంత బాగున్నది?". చాల అద్భుతముగా నున్నది' ఇత్యాదివాక్యములను ప్రయోగించి శ్లాఘించినంత మాత్రమున కావ్యమునందు సౌందర్యము పుట్టదు. వాస్తవమైన సౌందర్య ముండవలెనన్నచో లోకసాధారణము కాని (వక్ర) అర్థములను, శబ్దములను కూర్చవలెను. అపుడే కావ్యమున సౌందర్య మావిర్భవించును అని భావము. సాధారణ లోకవ్యవహారములో ప్రయోగించు విధమున కాక తద్విలక్షణముగ శబ్దార్థాదులను ప్రయోగించుట యే వక్రోక్తి. దానినే అతిశయోక్తి అని కూడ అందురు. సాధారణ లౌకికోక్తిని అతిశయించిన ఉక్తియని యర్థము. ఈ వక్రోక్తి-అతిశయోక్తులు ఆనామధేయములతో ప్రసిద్ధములగు అలంకారముల కంటె భిన్నమైనవి. వాటి పరిధి సంకుచితము. వీటి పరిధి అతివిస్తృతము. వాస్తవమున ఇతరాలంకారము లన్నియు ఈ వక్రోక్తిపైననే (అతిశయోక్తిపైననే) ఆధారపడి యున్నవని భామహ-అభినవగుప్త-కుంతకాదుల యభిప్రాయము.

అవి. ఇపుడు కావ్యదోషములను కొన్నిటి నిచట చెప్పుచున్నాడు. భామహుడు దోషవివేచనము నాలుగు స్థానములలో చేసి యున్నాడు. ఈ పరిచ్ఛేదములో 37వ కారికలో ఆరు దోషములను 47వ కారికలో నాలుగు దోషములను, ద్వితీయపరిచ్ఛేదములో 39-64 కారికల నడుమ ఏడు ఉపమాదోషములను చతుర్థపరిచ్ఛేదాన్త పంచమ పరిచ్ఛేదారంభములలో పదిహేను దోషములను నిరూపించి యున్నాడు :-

**నేయార్థం క్లిష్టమన్యార్థమవాచకమయుక్తిమత్।**
**గూఢశబ్దాభిధానం చ కవయో న ప్రయుఞ్జతే॥** **37**
**नेयार्थं क्लिष्टमन्यार्थमवाचकमयुक्तिमत्।**
**गूढशब्दाभिधानं च कवयो न प्रयुञ्जते॥**

వ్యా. కవులు నేయార్థమును, క్లిష్టమును, అన్యార్థమును, అవాచకమును, అయుక్తిమత్తు అగుదానిని, గూఢశబ్దాభిధానమును ప్రయోగించరు. అనగా ఇవి దోషములు గాన వీటిని ప్రయోగించరాదు.

**నేయార్థం నీయతే యుక్తో యస్యార్థః కృతిభిర్బలాత్।**
**శబ్దన్యాయానుపారూఢః కథఞ్చిత్స్వాభిసన్ధినా॥** **38**
**नेयार्थं नीयते युक्तो यस्यार्थः कृतिभिर्बलात्।**
**शब्दन्यायानुपारूढः कथञ्चित्स्वाभिसन्धिना॥**

వ్యా. శబ్దన్యాయానుసారముగా లేని దేని అర్థమును బుద్ధిమంతులు తమ



నిగూఢాభిప్రాయము (అభిసంధి) ననుసరించి, బలవంతముగ యుక్తరూపమున నున్నట్లు చూపుదురో అది నేయార్థము.

వి. అచటనున్న శబ్దములను బట్టి అర్థమును చెప్పవలెను. ఇది శబ్దన్యాయము. అంతకు మించిన అర్థమును చెప్పుట శబ్దన్యాయవిరుద్ధము. కాని సరియగు అర్థమును చెప్పుటకు అచటనున్న పదములు చాలక ఏదో విధముగ అర్థమును సరిపెట్టుకొనినచో అది నేయార్థ మను దోషము.

అవ. దీనికి ఉదాహరణము :-

**మాయేవ భద్రేతి యథా సా చాసాధ్వీ ప్రకల్పనా।**
**వేణుదాకేరితి చ తాం నయన్తి వచనాద్వినా॥** **39**
**मायेव भद्रेति यथा सा चासाध्वी प्रकल्पना।**
**वेणुदाकेरिति च तां नयन्ति वचनाद्विना॥**

వ్యా. "మాయ వలె మంగలప్రదముగ నున్నది" ఇట్లు కల్పించి చెప్పుట అయుక్తము (మాయ మంగళప్రదము కాదు కదా?). కాని అచట మాట లేకపోయినను 'వేణుదాకేః' అని కల్పించి ఈ అర్థమునెట్లో సమర్థింతురు.

వి. 'వేణుదాకేః' అనుదాని అర్థము అస్పష్టముగ నున్నది. ఎవడో వేణుదాకి అనువాడు మాయాసహాయముచే మంచి పనులు చేసియుండును. కావున 'మాయేన భద్రా' అని మాత్రము చెప్పిన సరిగ లేదు గాన, 'వేణుదాకేః' అని అచట లేని పదమును కల్పించి "వేణుదాకియొక్క మాయవలె భద్రమైనది" అని అర్థకల్పన చేయవలసి వచ్చెను అని భావము.

**క్లిష్టం వ్యవహితం విద్యాదన్యార్థం విగమే యథా।**
**విజహ్రుస్తస్య తాః శోకం క్రీడాయాం వికృతం చ తత్॥** **40**
**क्लिष्टं व्यवहितं विद्यादन्यार्थं विगमे यथा।**
**विजह्रुस्तस्य ताः शोकं क्रीडायां विकृतं च तत्॥**

వ్యా. వ్యవహితపదప్రయోగముచే అర్థప్రతీతి ఆలస్యమైనచో అది క్లిష్టము. బోధింపతగిన అర్థము బోధింపబడకున్నచో (విగమే) అది అన్యార్థము. "విజహ్రుః తస్య తాః శోకమ్-(వి) హరించిరి, వానియొక్క వారు శోకమును" అనునది క్లిష్టమున కుదాహరణము 'విజహ్రుః' అనునది 'వి' అను ఉపసర్గచే క్రీడార్థబోధకముగ మార్చబడినది కూడ. అందుచే ఇదియే అన్యార్థమునకు గూడ ఉదాహరణము.

వి. పదములను ఒక క్రమమున గాక ఇటు నటు తారుమారు చేసి ప్రయోగించినచో అర్థప్రతీతియందు ఆలస్య మగును. అందుచే అది క్లిష్టము. "తాః తస్య శోకం విజహ్రుః" అని వాక్యప్రయోగము చేసినచో అర్థము శ్రమ లేకుండ తెలియును. కాని ఈ క్రమమును తారుమారు

చేయుటచే అర్థప్రతీతి క్లిష్టముగ నుండును. ఈ వాక్యము చిన్నదగుటచే అర్థ ప్రతీతిలోని క్లేశము అంతగ తెలియుటలేదు. గాని మొత్తము శ్లోకము ఏకవాక్యరూపమై యున్నపుడు, అందలి పదములను ఈ విధముగ అస్తవ్యస్తముగ ప్రయోగించినచో అట్టి ప్రయోగములోని క్లిష్టత్వము స్పష్టమగును. కావుననే మమ్మటుడు పూర్తిశ్లోకమును ఉదాహరించినాడు. ఈ వాక్యమే అన్యార్థదోషమునకు కూడ ఉదాహరణము. 'ఆ స్త్రీలు ఆతని శోకమును తొలగించిరి' అని చెప్పుటలో దీని తాత్పర్యము. 'జహ్రుః' అనుదానికి 'వి' అను ఉపసర్గ చేర్చుటచే 'హరించిరి' అను అర్థము మారిపోయి, 'విహరించిరి' అను నర్థము వచ్చును. కావున అన్యార్థదోషము.

"విత్తేరన్యార్థం విగమే" అను పాఠాంతరమున, "విత్తేః=అర్థజ్ఞానము యొక్క విగమే=అభావమునందును" అనియర్థము.

అవ. 'అవాచకము' అను దోషమునకు లక్షణోదాహరణములను చూపుచున్నాడు.

హిమాపహామిత్రధరైర్వ్యాప్తం వ్యోమేత్యవాచకమ్।
సాక్షాదరూఢం వాచ్యేఽర్థే నాభిధానం ప్రతీయతే॥ 41

हिमापहामित्रधरैर्व्याप्तं व्योमेत्यवाचकम्।
साक्षादरूढं वाच्येऽर्थे नाभिधानं प्रतीयते॥

వ్యా. ఆకాశము హిమమును తొలగించుదాని శత్రువును ధరించు వాటిచే వ్యాప్తమైనది అను వాక్యము అవాచకము. వాచ్యార్థమునందు రూఢము కాని అర్థము సాక్షాత్తుగ (అవ్యవధానమగ) బోధగోచరము కాదు (తెలియబడదు).

వి. హిమమును దొలగించునది అగ్ని, అగ్నికి శత్రువు ఉదకము, ఉదకము ధరించునవి మేఘములు. ఈ విధముగ హిమాపహామిత్రధరైః అను పదమునకు మేఘరూపార్థమున రూఢి లేకపోవుటచే ఈ పదము ఈ అర్థమును వెంటనే బోధింపజాలదు గాన, ఇది 'అవాచక' దోషము.

అవ. ఇపుడు మూడు శ్లోకములలో అయుక్తిమత్తు అను దోషమునకు లక్షణోదాహరణములను చూపుచున్నాడు.

అయుక్తిమద్యథా దూతా జలభృన్మారుతేన్దవః।
తథా భ్రమరహారీతచక్రవాకశుకాదయః॥ 42

अयुक्तिमद्यथा दूता जलभृन्मारुतेन्दवः।
तथा भ्रमरहारीतचक्रवाकशुकादयः॥

అవాచోఽవ్యక్తవాచశ్చ దూరదేశవిచారిణః।
కథం దూత్యం ప్రపద్యేరన్నితి యుక్త్యా న యుజ్యతే॥ 43

अवाचोऽव्यक्तवाचश्च दूरदेशविचारिणः।
कथं दूत्यं प्रपद्येरन्निति युक्त्या न युज्यते॥



యది చోత్కణ్ఠయా యత్తదున్మత్త ఇవ భాషతే।
తథా భవతు భూమ్నేదం సుమేధోభిః ప్రయుజ్యతే॥ 44

यदि चोत्कण्ठया यत्तदुन्मत्त इव भाषते।
तथा भवतु भूम्नेदं सुमेधोभिः प्रयुज्यते॥

వ్యా. అయుక్తిమత్తు ఎట్లనగా-మేఘము, వాయువు, చంద్రుడు, తుమ్మెద, హారీత-చక్రవాక-శుకాదులును అగు, మాటలాడజాలనివియు, అస్పష్టమగు వాక్కు కలవియు అగుదూతలు, ఎచటనో దూరదేశమునందున్న వానికి దూత్యము ఎట్లు చేయగలవు? ఇది యుక్తి సంగతము కాదు. (పంపువాడు) బెంగచే ఉన్మత్తుడువలె మాటలాడుచున్నాడు అని అన్నచో అది యుక్తమైన కావచ్చును. కాని ఈ విధమగు దూత ప్రేషణము తరచుగ మంచి బుద్ధి కలవారిచేత కూడ చేయబడుచున్నది కదా.

వి. కాళిదాసాది విరచితములగు మేఘసందేశాదులను దృష్టిలో నుంచుకొని ఇచట భామహుడు మేఘాదులను దూత్యము పై పంపుట యుక్తి యుక్తము కాదని చెప్పుచున్నాడు. "కామార్తా హి ప్రకృతికృపణాశ్చేతనాచేతనేషు" అని కాళిదాసు సమర్థించిన విధముగ ఆ విరహులు ఉన్మాదావస్థలో నున్నప్పుడు మేఘాదులను దూత్యముపై పంపినను అది అంత అనుచితము కాదు అని ఆశంకించుకొని, మేఘసందేశాదికావ్యములలో ఈ అయుక్తిమత్తాదోషము లేకపోయినను, అట్టి ఉన్మాదము లేని వారు కూడ పక్ష్యాదులను దూతలుగ పంపినట్లు వర్ణించిన ఇతరకావ్యములలో ఈ దోష ముండునని 44వ శ్లోకమునకు అభిప్రాయము.

అవ. గూఢశబ్దాభిధానదోషమునకు లక్షణోదాహరణములు చెప్పుచున్నాడు :-

గూఢశబ్దాభిధానం చ న ప్రయోజ్యం కథఞ్చన।
సుధియామపి నైవేదముపకారాయ కల్పతే॥ 45

गूढशब्दाभिधानं च न प्रयोज्यं कथञ्चन।
सुधियामपि नैवेदमुपकाराय कल्पते॥

వ్యా. గూఢశబ్దాభిధానమును ఎట్టి పరిస్థితులందును ప్రయోగింపరాదు. ఇట్టి ప్రయోగము బుద్ధిమంతులకు కూడ ఉపకారకారి కాజాలదు.

వి. బుద్ధిమంతులే అర్థము చేసికొనజాల రన్నచో సామాన్యబుద్ధిమంతుల మాట చెప్పవలెనా? గూఢశబ్దాభిధాన మనగా అతిగూఢ మగు అర్థము గల శబ్దముల ప్రయోగ మని అర్థము.

అసితర్తితుగద్రిచ్ఛిత్స్వఃక్షితాం పతిరద్విదృక్।
అమిద్భిః శుభ్రదృగ్దృష్టైర్ద్విషో జేఘ్నీయిషీష్ట వః॥ 46

असितर्तितुगद्रिच्छित्स्वःक्षितां पतिरद्विदृक्।
अमिद्भिः शुभ्रदृग्दृष्टैर्द्विषो जेघ्नीयिषीष्ट वः॥

వ్యా. 'అర్తి' అనగా గమనము. అసిత ర్తితుక్=నల్లనిమార్గము గల అగ్ని యొక్క పుత్రడును (తుక్), అద్రిచ్ఛిత్=కౌంచపర్వతమును భేదించినవాడును, అద్విదృక్=రెండునేత్రములు కలవాడు కానివాడును అనగా అనేకనేత్రములు కలవాడును, స్వఃక్షితామ్=స్వర్గనివాసులగు దేవతలయొక్క పతిః=సేనాపతియు అగు కుమారస్వామి, అమిద్భిః=స్నిగ్ధములు కాని, అనగా తీక్ష్ణములైన, శుభ్రదృగ్ద్రుష్టైః=తెల్లని నేత్రముల చూపులచేత, వః=మీయొక్క ద్విషః=శత్రువులను. జేఘ్నీయిషీష్ట= మాటిమాటికి ఎక్కువగా కొట్టుగాక.

వి. ఇచట ప్రయోగించిన శబ్దముల అర్థము చాల అస్పష్టము, వ్యాఖ్యామాత్రగమ్యము గాన ఇచట గూఢశబ్దాభిధానదోషము.

శ్రుతిదుష్టార్థదుష్టే చ కల్పనాదుష్టమిత్యపి।
శ్రుతికష్టం తథైవాహుర్వాచాం దోషం చతుర్విధమ్॥ 47
श्रुतिदुष्टार्थदुष्टे च कल्पनादुष्टमित्यपि।
श्रुतिकष्टं तथैवाहुर्वाचां दोषं चतुर्विधम्॥

వ్యా. శ్రుతిదుష్టము, అర్థదుష్టము, కల్పనాదుష్టము శ్రుతికష్టము అని వాక్కుల దోషము చతుర్విధమైనది అని చెప్పుదురు.

విడ్వర్చోవిష్ఠితక్లిన్నచ్ఛిన్నవాన్తప్రవృత్తయః।
ప్రచారధర్షితోద్గారవిసర్గహదయన్త్రితాః॥ 48
विड्वर्चोविष्ठितक्लिन्नच्छिन्नवान्तप्रवृत्तयः।
प्रचारधर्षितोद्गारविसर्गहदयन्त्रिताः॥
హిరణ్యరేతాః సమ్బాధః పేలవోపస్థితాణ్డజాః।
వాక్కాటవాదయశ్చేతి శ్రుతిదుష్టా మతా గిరః॥ 49
हिरण्यरेताः सम्बाधः पेलवोपस्थिताण्डजाः।
वाक्काटवादयश्चेति श्रुतिदुष्टा मता गिरः॥

వ్యా. విట్, వర్చస్, విష్ఠిత, క్లిన్న, ఛిన్న, వాన్త, ప్రవృత్తి, ప్రచార, ధర్షిత, ఉద్గార, విసర్గ, హద, యంత్రిత, హిరణ్యరేతస్, సంబాధ, పేలవ, ఉపస్థిత, అండజ, వాక్కాటవ మొదలగు శబ్దములు వినుటకు దుష్టములు.

వి. 'విట్' మొదలగు పదములకు రెండేసి అర్థము లుండుటచే అవి వినగానే రెండవదైన అశ్లీలార్థము కూడ స్ఫురణకు వచ్చును, అందుచే ఈ పదములు శ్రుతిదుష్టములు. విట్-వైశ్యులు లేదా జనులు, రెట్ట. వర్చస్=తేజస్సు, వీర్యము. విష్ఠిత=విశేష రూపమున ఉన్నది, రెట్ట. క్లిన్న=తడిసిన, రక్తాదులచే తడిసిన, ఛిన్న=తెగిన, మంగల సూత్రం తెగిన, వాన్త=పైకి వచ్చిన, వాంతిచేసికొనిన. ప్రవృత్తి=మానసికమగు రీతి, కారుట. ప్రచార=ప్రచారము, మలస్రావము, ధర్షిత= అవమానితుడు. స్త్రీ విషయమున బలాత్కారము, ఉద్గార=త్రేఁపు, వాంతి. విసర్గ=త్యాగము. అపానవాయు నిస్సరణము. హద=మలత్యాగము అను ఒక అశ్లీలార్థమే. యంత్రిత=కట్టబడిన, సంభోగము నందు బంధించిన, హిరణ్యరేతస్=బంగారము రేతస్ పదముండుటచే వీర్యరూపార్థప్రతీతి. సంబాధ=ఇరుకు, యోని. పేలవ=కోమలము. 'పేల' శబ్దమునకు లాటభాషలో గుహ్యాంగమని అర్థము. ఉపస్థిత=సమీపించిన, గుహ్యాంగము. అండజ=పక్షి. అండకోశము స్ఫురించును. వాక్కాటవ=వాక్కుయొక్క కటుత్వము. 'కాట' శబ్దశ్రవణముచే గుహ్యాంగ ప్రతీతి.



అవ. అర్థదుష్టమును వివరించుచున్నాడు :-

అర్థదుష్టం పునర్జ్ఞేయం యత్రోక్తే జాయతే మతిః।
అసభ్యవస్తువిషయా శబ్దైస్తద్వాచిభిర్యథా॥ 50
अर्थदुष्टं पुनर्ज्ञेयं यत्रोक्ते जायते मतिः।
असभ्यवस्तुविषया शब्दैस्तद्वाचिभिर्यथा॥

వ్యా. ఏ వాక్యమును చెప్పగానే, (అందులో ఉన్న) అసభ్యార్థ ప్రతిపాదకము లగు శబ్దములను బట్టి అసభ్యవస్తువులకు సంబంధించిన బుద్ధి కలుగునో అది దుష్టము. దాని కుదాహరణ మెట్లనగా :-

హన్తుమేవ ప్రవృత్తస్య స్తబ్ధస్య వివరైషిణః।
పతనం జాయతేఽవశ్యం కృచ్ఛ్రేణ పునరున్నతిః॥ 51
हन्तुमेव प्रवृत्तस्य स्तब्धस्य विवरैषिणः।
पतनं जायतेऽवश्यं कृच्छ्रेण पुनरुन्नतिः॥

వ్యా. కొట్టుటకే ప్రవర్తించు, స్తబ్ధుడైన (స్తబ్ధమైన) ఛిద్రాన్వేషికి తప్పక పతనము జరుగును. మరల లేచుట అతికష్టమున జరుగును.

వి. ఇచట పదములను వేరువేరుగ చూచినపుడు అశ్లీలార్థ మేమియు లేకున్నను మొత్తము వాక్యమునకర్థము చెప్పినపుడు సంభోగప్రవృత్త పురుషగుహ్యాంగరూపమగు అశ్లీలార్థము గమ్యమగును. అందుచే ఇది అర్థదుష్టము. దుష్టుడు ఇతరులను పీడించుటకే ప్రవర్తించును. దృష్టుడై యుండును (స్తబ్ధస్య), ఎదుటివారినిపీడించు అవకాశమునకై వేచియుండును. అట్టి వాడు తప్పక పడిపోవును. వాడు అతికష్టముమీద గాని మరల లేవజాలడు. 'హన్తుమేవ ప్రవృత్తస్య' మొదలగు వాటిఅర్థములు గమ్యమానమగు అశ్లీలార్థమునకు కూడ సమన్వయించును.

అవ :- కల్పనాదుష్టమును విశదీకరించుచున్నాడు :-

పదద్వయస్య సన్ధానే యదనిష్టం ప్రకల్పతే।
తదాహుః కల్పనాదుష్టం స శౌర్యాభరణో యథా॥ 52
पदद्वयस्य सन्धाने यदनिष्टं प्रकल्पते।
तदाहुः कल्पनादुष्टं स शौर्याभरणो यथा॥

వ్యా. రెండు పదములను కలిపినపుడు అనిష్టార్థము గమ్యమైనచో దానిని కల్పనాదుష్ట మందురు. "స ః శౌర్యాభరణః" (ఆతడు శౌర్యాభరణుడు, అనగా శౌర్యమే ఆభరణముగా కలవాడు) అనునది ఉదాహరణము.

వి. 'శౌర్య' 'ఆభరణ' శబ్దములకు సవర్ణదీర్ఘసంధి చేయగా ఏర్పడిన 'శౌర్యాభ' అనుదానిలోని 'యాభ' అను భాగము మైథునవాచకము. అందుచే ఇది కల్పనాదుష్టమను దోషము.

అవ. శ్రుతికష్టదోషమునకు లక్షణము సుగమమే కాన ఉదాహరణము మాత్రమే చెప్పుచున్నాడు :-

**యథాజిహ్లదదిత్యాది శ్రుతికష్టం చ తద్విదుః।**
**న తదిచ్ఛన్తి కృతినో గణ్డమప్యపరే కిల॥** 53

**यथाजिह्लददित्यादि श्रुतिकष्टं च तद्विदुः।**
**न तदिच्छन्ति कृतिनो गण्डमप्यपरे किल॥**

వ్యా. 'అజిహ్లదత్' మొదలగుదానిని శ్రుతికష్టమని చెప్పుదురు. బుద్ధిమంతులు ఇట్టి దానిని అంగీకరించరు కొందరు 'గణ్డ' శబ్దమును కూడ అంగీకరింపరట.

వి. చెవులకు కఠోరముగా వినబడునది శ్రుతికష్టము. అసభ్యార్థస్ఫూర్తిచే వినుటకు కష్టముగ నుండునది శ్రుతిదుష్టము. 'అజిహ్లదత్' అనునది 'ణిజంతహ్లాద' ధాతులుఙ్ ప్రథమ పురుషైకవచనము. ఆనందింపచేసెను అని యర్థము. ఇట్టి పదములు వినుటకు ఇంపుగా ఉండవు.

**సన్నివేశవిశేషాత్తు దురుక్తమపి శోభతే।**
**నీలం పలాశమాబద్ధమన్తరాలే స్రజామివ॥** 54

**सन्निवेशविशेषात्तु दुरुक्तमपि शोभते।**
**नीलं पलाशमाबद्धमन्तराले स्रजामिव॥**

వ్యా. పుష్పమాలల నడుమ కట్టిన నీలవర్ణ మగు పత్రము వలె, దుష్టశబ్దము కూడ సన్నివేశవిశేషముచే అనగా పదముల కూర్పులో నున్న వైశిష్ట్యముచే శోభించును.

**కిఞ్చిదాశ్రయసౌన్దర్యాద్ధత్తే శోభామసాధ్వపి।**
**కాన్తావిలోచనన్యస్తం మలీమసమివాఞ్జనమ్॥** 55

**किञ्चिदाश्रयसौन्दर्याद्धत्ते शोभामसाध्वपि।**
**कान्ताविलोचनन्यस्तं मलीमसमिवाञ्जनम्॥**

వ్యా. రమణినేత్రములందు ఉంచిన, మలినమైన అంజనము వలె ఒక్కొక్కటి అసాధువైనను, ఆశ్రయముయొక్క సౌందర్యమును బట్టి శోభను పొందును.



అవ. సహజమగు సౌందర్యములేనిది కూడ కూర్పులోని విశేషమును బట్టియు, ఆశ్రయించిన దాని సౌందర్యమును బట్టియు అందముగనే కనబడును అని రెండు దృష్టాంతములను చూపినాడు. అందు సన్నివేశ విశేషముచే శబ్దదోషము కూడ గుణముగ అగుటకు ఉదాహరణమును చెప్పుచున్నాడు :-

**ఆపాణ్డుగణ్డమేతత్తే వదనం వనజేక్షణే।**
**సఙ్గమాత్పాణ్డుశబ్దస్య గణ్డః సాధు యథోదితమ్॥** 56

**आपाण्डुगण्डमेतत्ते वदनं वनजेक्षणे।**
**सङ्गमात्पाण्डुशब्दस्य गण्डः साधु यथोदितम्॥**

వ్యా. "ఓ! పద్మనయనా! నీ ఈ ముఖము, ఆపాండుగండము, అనగా బాగా తెల్లగానున్న గండస్థలము గలది"-అని చెప్పినవిధముగ ఉదాహరణము (యథోదితమ్). ఇచట పాండు శబ్దము ప్రక్కచేర్చుటచే 'గండ' శబ్దము నిర్దుష్ట మైనది.

**అనయాన్యదపి జ్ఞేయం దిశా యుక్తమసాధ్వపి।**
**యథా విక్లిన్నగణ్డానాం కరిణాం మదవారిభిః॥** 57

**अनयान्यदपि ज्ञेयं दिशा युक्तमसाध्वपि।**
**यथा विक्लिन्नगण्डानां करिणां मदवारिभिः॥**

**మదక్లిన్నకపోలానాం ద్విరదానాం చతుఃశతీ।**
**యథా తద్వదసాధీయః సాధీయశ్చ ప్రయోజయేత్॥** 58

**मदक्लिन्नकपोलानां द्विरदानां चतुःशती।**
**यथा तद्वदसाधीयः साधीयश्च प्रयोजयेत्॥**

వ్యా. ఈరీతిగనే, ఇతరశబ్దములు గూడ అసాధువులైనను (ఆశ్రయమునుబట్టి) సాధువులగునని గ్రహింపవలెను. ఎట్లనగా-"మదోదకములచే విక్లిన్నగండములగు, అనగా చెమ్మగిలిన గండస్థలములు గల, ఏనుగులు యొక్క "ఇంకను ఎట్లనగా,-మదక్లిన్నకపోలములు గల ఏనుగుల చతుఃశతి (నాలుగువందల ఏనుగులు). ఈవిధముగ అసాధుశబ్దమును గూడ ప్రయోగింపవలెను.

వి. 'విక్లిన్న గణ్డానామ్' అనునపుడు 'క్లిన్న', 'గణ్డ' పదములు రెండును దుష్టములే యైనను, 'మదవారిభిః' అను దానితో కలిపి ప్రయోగించుటచే అవి సాధువులే. "మదక్లిన్నక పోలానామ్" అను సమాసములోని 'క్లిన్న' పదముకూడ ఇట్లే. ఈ విధముగ అసాధుపదములను సన్నివేశవిశేష-ఆశ్రయాదులను బట్టి దోషరహితములుగ చేసి ప్రయోగింపవలెను.

సాధుపదముల విషయమున శంకకు అవకాశమే లేదు.

ఏతద్గ్రాహ్యం సురభి కుసుమం గ్రామ్యమేతన్నిధేయం
ధత్తే శోభాం విరచితమిదం స్థానమస్యైతదస్య।
మాలాకారో రచయతి యథా సాధు విజ్ఞాయ మాలాం
యోజ్యం కావ్యేష్వవహితధియా తద్వదేవాభిధానమ్॥ 59

एतद्ग्राह्यं सुरभि कुसुमं ग्राम्यमेतन्निधेयं
धत्ते शोभां विरचितमिदं स्थानमस्यैतदस्य।
मालाकारो रचयति यथा साधु विज्ञाय मालां
योज्यं काव्येष्ववहितधिया तद्वदेवाभिधानम्॥

వ్యా. పరిమళించుచున్న ఈ సుమము గ్రహింపదగినది. ఇది గ్రామ్యము అనగా మోటుగా నుండును. అందుచేత ఉంచివేయతగనది, అనగా త్యాజ్యము. ఇది దీనికి తగు స్థానము, ఈ విధముగ బాగుగ తెలిసికొని మాలాకారుడు ఎట్లు మాలను రచించునో అట్లే కావ్యములందు కూడ శబ్దము సావధాన మగు చిత్తముతో కూర్చదగినది.

ప్రథమః పరిచ్ఛేదః సమాప్తః.



శ్రీః

కావ్యాలఙ్కారః

## ద్వితీయః పరిచ్ఛేదః

మాధుర్యమభివాఞ్ఛన్తః ప్రసాదం చ సుమేధసః।
సమాసవన్తి భూయాంసి న పదాని ప్రయుఞ్జతే॥ 1

माधुर्यमभिवाञ्छन्तः प्रसादं च सुमेधसः।
समासवन्ति भूयांसि न पदानि प्रयुञ्जते॥

వ్యా. బుద్ధిమంతులు, (తమ కావ్యములందు) మాధుర్యమును, ప్రసాదమును కోరుచున్న వారై సమాసయుక్తములగు పదములను అధికముగ ప్రయోగింపరు, లేదా ఎక్కువ పదములను సమాసములలో కూర్చరు. (దీర్ఘసమాసములను ప్రయోగింపరు)

వి. ఎక్కువ సమాసములను ప్రయోగించినచో, లేదా దీర్ఘసమాసములు ప్రయోగించినచో మాధుర్య-ప్రసాదము లను, గుణములకు భంగము కలుగును.

కేచిదోజోऽభిధిత్సన్తః సమస్యన్తి బహూన్యపి।
యథా మన్దారకుసుమరేణుపిఞ్జరితాలకా॥ 2

केचिदोजोऽभिधित्सन्तः समस्यन्ति बहून्यपि।
यथा मन्दारकुसुमरेणुपिञ्जरितालका॥

వ్యా. కొందరు ఓజోగుణమును చెప్పదలచినవారై, అనగా తమ రచనలో కూర్చ దలచినవారై, అధికపదములను గూడ సమాసరూపమున చేర్చుదురు. ఉదాహరణ మెట్లనగా -(ఆమె) "మందారకుసుమరేణుపిఞ్జరితాలక" అనగా మందార పుష్పముల పుప్పొడిచే పచ్చని వర్ణముకలవిగ చేయబడిన ముంగురులు కలది.

అవ. మాధుర్య ప్రసాదముల లక్షణము చెప్పుచున్నాడు :-

శ్రవ్యం నాతిసమస్తార్థం కావ్యం మధురమిష్యతే।
ఆవిద్వదఙ్గనాబాలప్రతీతార్థం ప్రసాదవత్॥ 3

श्रव्यं नातिसमस्तार्थं काव्यं मधुरमिष्यते।
आविद्वदङ्गनाबालप्रतीतार्थं प्रसादवत्॥

వ్యా. చెవులకు ఇంపుగా నుండినదియు, ఎక్కువగా సమసించనిదియు అనగా, అధిక

శ్రీః

కావ్యాలఙ్కారః

## షష్ఠః పరిచ్ఛేదః

సూత్రామ్భసం పదావర్తం పారాయణరసాతలమ్।
ధాతూణాదిగణగ్రాహం ధ్యానగ్రహబృహత్ప్లవమ్॥ 1

सूत्राम्भसं पदावर्तं पारायणरसातलम्।
धातूणादिगणग्राहं ध्यानग्रहबृहत्प्लवम्॥

ధీరైరాలోకితప్రాన్తమమేధోభిరసూయితమ్।
సదోపభుక్తం సర్వాభిరన్యవిద్యాకరేణుభిః॥ 2

धीरैरालोकितप्रान्तममेधोभिरसूयितम्।
सदोपभुक्तं सर्वाभिरन्यविद्याकरेणुभिः॥

నాపారయిత్వా దుర్గాధమముం వ్యాకరణార్ణవమ్।
శబ్దరత్నం స్వయం గమ్యమలం కర్తుమయం జనః॥ 3

नापारयित्वा दुर्गाधममुं व्याकरणार्णवम्।
शब्दरत्नं स्वयं गम्यमलं कर्तुमयं जनः॥

వ్యా. సూత్రములనెడు ఉదకము కలదియు, పదములనెడు సుడులు కలదియు, పారాయణ మనెడు పాతాళము కలదియు, ధాతుగణములు ఉణాదిగణములు అనెడు మొసళ్లు కలదియు, ధ్యాన పరిశీలనా పూర్వకముగ అర్థముచేసికొనుట (ధ్యానగ్రహ) అనెడు పెద్ద నావ కలదియు, బుద్ధిమంతులచే కనుగొనబడిన అంతము కలదియు, మేధాశక్తి లేనివారిచే ద్వేషింపబడినదియు, సమస్తములైన ఇతరవిద్యలనెడు (ఆడ) ఏనుగులచే ఎల్లప్పుడు అనుభవింప బడినదియు, అగాధమైనదియు అగు వ్యాకరణసముద్రమును దాటకుండగా. ఈ జనుడు (కావ్యరచన చేయదలచినవాడు) శబ్దరత్నమును స్వయముగ తెలిసికొనుటకు వీలగుదానినిగ చేసికొనుటకు సమర్థుడు కాడు.

వి. సూత్రము లనగా పాణినీయసూత్రములు. పదములనగా ఆ సూత్రములచే సాధింపదగిన పదములు. పారాయణ మనగా పరినిష్ఠితములైన శబ్దముల సముదాయమును



యథాతథముగ చదువుట. లేదా ప్రతిదినము సూత్రములను పారాయణచేయుట. మొదట 'సూత్రాంభసమ్' అని సూత్రములను పేర్కొనుటచే 'పద' 'పారాయణ' శబ్దములను వార్తిక-మహాభాష్యపరముగ అర్థముచేసికొనవచ్చును. కాని ఉపపత్తి చూపవలసి యుండును. ధాతుగణ మనగా భ్వాదిధాతుపాఠము. ఉణాదిగణమనగా 'కారుః' మొదలగు పదములు 'కృఞ్' మొదలగుధాతువులకు 'ఉణ్' మొదలగు ప్రత్యయములను చేర్చుటచే నిష్పన్నమైనవి అని సాధించు కొన్ని సూత్రముల సముదాయము. ఈ సూత్రములు కూడ పాణిని విరచితములే అని కొందరు చెప్పుదురు. అన్యులెవరో రచించినారని మరి కొందరు. ఇతరశాస్త్రము లన్నియు వ్యాకరణ శాస్త్రముపై ఆధారపడియున్నవి అను ఈ రెండవశ్లోకములో చెప్పిన విషయమును ఆనందవర్ధనుడు కూడ ధ్వన్యాలోకములో "ప్రథమే హి విద్వాంసో వైయాకరణాః, తన్మూలత్వాత్ సర్వశాస్త్రాణామ్" అని చెప్పియున్నాడు. ఒకడు శబ్దముల సాధుత్వాసాధుత్వములను స్వయముగ తెలిసికొనవలె నన్నచో వ్యాకరణశాస్త్రాభ్యాసము చేయ్యవలెనని అభిప్రాయము. ఇతరుల ద్వారా శబ్దములను తెలిసికొనుటలో ఆ అందము, సంతృప్తి లేదని ముందుమూడు శ్లోకములలో చెప్పనున్నాడు.

తస్య చాధిగమే యత్నః కార్యః కావ్యం విధిత్సతా।
పరప్రత్యయతో యత్తు క్రియతే తేన కా రతిః॥ 4

तस्य चाधिगमे यत्नः कार्यः काव्यं विधित्सता।
परप्रत्ययतो यत्तु क्रियते तेन का रतिः॥

వ్యా. కావ్యము రచింపదలచినవాడు ఆ వ్యాకరణమును పొందుటకు ప్రయత్నింపవలెను. ఇతరులపై నమ్మకముచే (అనగా ఆకవి ప్రయోగించినాడు గాన ఈ శబ్దము సాధువే ఐయుండును అను విశ్వాసముతో) కావ్యమును రచించినచో అందు ఆనంద మేమి ఉన్నది?

నాన్యప్రత్యయశబ్దా వాగావిభాతి ముదే సతామ్।
పరేణ ధృతముక్తేవ సరసా కుసుమావలీ॥ 5

नान्यप्रत्ययशब्दा वागाविभाति मुदे सताम्।
परेण धृतमुक्तेव सरसा कुसुमावली॥

వ్యా. ఇతరులపై విశ్వాసముచే ప్రయోగించిన శబ్దములు గల రచన, ఇతరులు ధరించి విడిచివేసిన, సరసమైన పుష్పమాల వలె, పండితులకు ఆనందకరము కాజాలదు.

ముఖ్యస్తావదయం న్యాయో యత్స్వశక్త్యా ప్రవర్తతే।
అన్యసారస్వతా నామ సన్త్యన్యోక్తానువాదినః॥ 6

मुख्यस्तावदयं न्यायो यत्स्वशक्त्या प्रवर्तते।
अन्यसारस्वता नाम सन्त्यन्योक्तानुवादिनः॥

వ్యా. (ఇతరులపై ఆధారపడకుండా) స్వశక్తితో కావ్యరచనా విషయమున ప్రవర్తించుట

అనునది ముఖ్యమైన విషయము, న్యాయమైన విషయము. ఇతరులు చెప్పిన విషయములనే చెప్పు 'అన్యసారస్వతులు' అనువారు (అనేకులు) ఉన్నారు.

అవ. ఇపుడు శబ్దస్వరూపమును విశదీకరించుచున్నాడు :-

ప్రతీతిరర్థేషు యతస్తం శబ్దం బ్రువతే పరే।
ధూమభాసోరపి ప్రాప్తా శబ్దతాగ్న్యనుమాం ప్రతి॥ 7

प्रतीतिरर्थेषु यतस्तं शब्दं ब्रुवते परे।
धूमभासोरपि प्राप्ता शब्दताग्न्यनुमां प्रति ॥

వ్యా. "దేనివలన అర్థజ్ఞానము కలుగునో అది శబ్దము" అని కొందరు శబ్దలక్షణము చెప్పుదురు. (అట్లైనచో) అగ్నియొక్క అనుమానమును గూర్చి ధూమము, కాంతియు శబ్దములు అని చెప్పవలసి యుండును.

వి. పగలు దూరమునుండి ధూమమును చూచియు రాత్రి కాంతిని చూచియు అచట అగ్ని ఉన్నదని ఊహించుచున్నాము. దేనివలన అర్థ (పదార్థ) జ్ఞానము కలుగునో అది శబ్దము అని చెప్పినచో ఇచట ధూమకాంతులచే అగ్ని రూపార్థజ్ఞానము కలుగుచున్నది గాన అవి కూడ శబ్దములు కావలసియుండును. అందుచే ఈ లక్షణము అతివ్యాప్తిదోషదుష్టము. 'శబ్దతాన్యానుమాం' అను పాఠము 'శబ్దతాగ్న్యనుమాం' అని మార్చబడినది.

అవ. ఈ అతివ్యాప్తి లేకుండుటకై లక్షణాంతరము చూపుచున్నాడు :-

నన్వకారాదివర్ణానాం సముదాయోఽభిధేయవాన్।
అర్థప్రతీతయే గీతః శబ్ద ఇత్యభిధీయతే॥ 8

नन्वकारादिवर्णानां समुदायोऽभिधेयवान्।
अर्थप्रतीतये गीतः शब्द इत्यभिधीयते ॥

వ్యా. అర్థప్రతీతికొరకై ఉచ్చరింపబడినదియు అర్థము కలదియు అగు, అకారాదివర్ణ సముదాయము శబ్దమని చెప్పబడుచున్నది (అపుడు పూర్వోక్త దోషము లేదు కదా?)

అవ. ఇపుడు స్ఫోటవాదులు పై శబ్దలక్షణమునందు చూపిన దోషములను అనువదించు చున్నాడు:-

ప్రత్యేకమసమర్థానాం సముదాయోఽర్థవాన్కథమ్।
వర్ణానాం క్రమవృత్తిత్వాన్న్యాయ్యా నాపి చ సంహతిః॥ 9

प्रत्येकमसमर्थानां समुदायोऽर्थवान्कथम्।
वर्णानां क्रमवृत्तित्वान्न्याय्या नापि च संहतिः ॥

వ్యా. ఒక్కొక్కటిగ ఉన్నప్పుడు అర్థమును బోధించుటకు అసమర్థములైన వర్ణముల



సముదాయము అర్థవంతమైనది ఎట్లగును? మరియు వర్ణములు ఒక వరుసలో ఉండునవి గాన అవి సముదాయము రూపమున ఉండుట కూడ న్యాయము కాదు.

వి. "అర్థమును బోధించు వర్ణసముదాయము శబ్దము" అను శబ్దలక్షణము విషయమున వైయాకరణులు ఇచట రెండు దోషములను చూపుచున్నారు. ఒక్కొక్క వర్ణమును వేరు వేరుగ తీసిచూచినపుడు దానికి అర్థ మేదియును లేదు. అట్టి వర్ణములు కొన్ని కలసి ఒక సముదాయముగ ఏర్పడినప్పుడు మాత్రము వాటికి అర్థము ఎచటినుండి వచ్చును? మరియు పదములోని వర్ణములన్నియు ఒక క్రమములో నుండును. అట్టి వర్ణములన్నియు కలిసి ఒక సముదాయముగ ఏర్పడుట ఎట్లు కుదురును? మొదటి దోషమునకు సమాధానముగ ఇట్లు చెప్పవచ్చును. శబ్దములోని ప్రత్యేకవర్ణమునకు అర్థము లేకపోవచ్చును. అయినను అవి ఒక సముదాయముగ ఏర్పడినపుడు వాటికా శక్తి కలుగవచ్చును కదా. పరమాణువులు ఒక్కొక్కటిగ ఉన్నపుడు ప్రత్యక్షము కాకపోవచ్చును. కాని అనేకపరమాణువులు కలిసి ఒక పదార్థముగ ఏర్పడినపుడు ఆ సముదాయము ప్రత్యక్షవిషయమగుచున్నది కదా? ఇట్టి సమాధానమును దృష్టిలో నుంచుకొని రెండవ దూషణము చెప్పబడినది. వర్ణములు ఒక క్రమములో ఉత్పన్నమై మరుక్షణమున నశించును గాన అవి ఒక సముదాయముగ అగుటయే కుదరదు. ఉదాహరణమునకు-'కలశ' అనుపదములో మూడు వర్ణములున్నవి. 'క' ఉచ్చరించు సమయమున 'ల' 'శ' లు లేవు. 'ల' ఉచ్చరించుసరికి 'క' అనునది ఉత్పన్నమై నశించినది, 'శ' ఇంకను ఉత్పన్నము కాలేదు. 'శ' ఉచ్చరించుసరికి 'క' 'ల' లు రెండును నశించినవి. కావున ఈ మూడు వర్ణములును కలిసి ఒక సముదాయముగ ఏర్పడుటగాని, ఆ సముదాయము ద్వారా అర్థబోధ కలుగుట కాని అసంభావ్యము అని వైయాకరణులమతము.

అవ. వాస్తవమున సముదాయులకంటె (సముదాయములో చేరిన వాటికంటె) భిన్న మగు సముదాయ మనునది ఒకటి స్వతంత్రముగ, వేరుగ ఉన్నదని చెప్పుట యుక్తము కాదని చెప్పుచున్నాడు :-

న చాపి సముదాయిభ్యః సముదాయోఽతిరిచ్యతే।
దారుభిత్తిభువోఽతీత్య కిమన్యత్సద్మ కల్ప్యతే॥ 10

न चापि समुदायिभ्यः समुदायोऽतिरिच्यते।
दारुभित्तिभुवोऽतीत्य किमन्यत्सद्म कल्प्यते ॥

వ్యా. సముదాయులకంటె సముదాయము భిన్నము కాదు. కఱ్ఱ, గోడలు, నేల వీటికంటె వేరుగ ఇల్లు అనునది ఏమి ఉన్నది?

వి. పూర్వోక్తవిధముగ వర్ణసముదాయము శబ్దమనియు, అది అర్థబోధక మనియు చెప్పుట కుదరదు. గాన వైయాకరణులు శబ్దము స్ఫోటరూపమనియు, అది నిత్య మనియు అంగీకరింతురు. వాక్కు స్ఫోటరూపము కావుననే "ఇది ఒక పదము" 'ఇది ఒక వాక్యము' అను

ఏకత్వ బుద్ధి కుదురును. లేకపోయినచో "ఇవి నాలుగు వర్ణములు" ఇత్యాది ప్రతీతి మాత్రమే ఉండును. వాక్కునకు పశ్యన్తి మధ్యమ వైఖరి అను అవస్థలున్నవి. అందు మనకు వర్ణాది రూపమున శ్రవణగోచర మైనది వైఖరి. దానికంటె సూక్ష్మమైనది మధ్యమ, దానికంటె సూక్ష్మమైనది పశ్యన్తి. మధ్యమలో వర్ణముల పౌర్వాపర్యాదులు, పరస్పరసంబంధము ఉండును. ఆ వర్ణములు స్పష్టముగ వినబడవు కాని కేవలము ఒక విధమగు నాదము మాత్రము శ్రవణగోచర మగును. వైఖరీవాక్కు అట్టి మధ్యమావాక్కును స్ఫురింపచేసి తద్వారా అర్థజ్ఞానమును కలిగించును. ఆ మధ్యమావాక్కుకు స్ఫోట అని పేరు. అది నిత్యము, మధ్యమా వాక్కును స్ఫురింపచేయు వైఖరికి కూడ స్ఫోటమని పేరు. కాని ఇది అనిత్యము. మధ్యమావాక్కు పశ్యంతీవాక్కును వ్యంజింపచేయుచున్నది. పశ్యంతీవాక్కులో వర్ణవిభాగాదులు ఉండవు. దానివలన యోగులకు మాత్రమే అర్థజ్ఞానము కలుగును. పశ్యంతి కూడ స్ఫోటయే. ఈ మూడింటికి ఆధారమైనది, సర్వజగత్తుకు కారణమైనది పరావాక్కు. అది నిర్గుణాద్వయచైతన్యరూపము. మధ్యమా, పశ్యంతీవాక్కులు నిత్యములని చెప్పినచో వాటి నిత్యత్వము సాపేక్షము. అనగా వైఖరీవాక్కు అనిత్యము, దానిదృష్ట్యా మధ్యమా వాక్కు నిత్యము. పశ్యంతి దాని దృష్ట్యా కూడ నిత్యము. ఈ విధముగ వీటి నిత్యత్వము అద్వైతులు జగజ్జీవాదులకు అంగీకరించిన వ్యావహారికసత్యత్వము వంటిది. వాస్తవమైన నిత్యత్వ–సత్యత్వములు కేవలము పరావాక్కునకే ఉన్నవి.

"వైఖరీ శబ్దనిష్పత్తిః మధ్యమా శ్రుతిగోచరా।
ద్యోతితార్థా చ పశ్యన్తీ పరా వాగనపాయినీ"॥
*वैखरी शब्दनिष्पत्तिः मध्यमा श्रुतिगोचरा।*
*द्योतितार्था च पश्यन्ती परा वागनपायिनी॥*

చతుర్విధవాక్స్వరూపమును ఈ విధముగ ఒక క్రమమున చెప్పవచ్చును. జీవుడు శుద్ధచైతన్యస్వరూపుడు. జీవునకు గల కాల్పనిక భేదమునకు అతీతమగు ఏ అద్వితీయ స్వరూపము కలదో దానిని గ్రహింపవలెను. పరావాక్కు అనునది తాదృశశుద్ధ చైతన్యస్వరూపాభిన్నము. ఒక వ్యక్తి ఒక వాక్యమును ప్రయోగింపనున్నాడనుకొందము. ఆ వాక్యమునకు ఒక అర్థముండును కదా. ఆ అర్థమును ముందుగ అతడు తెలిసికొనిన పిమ్మటనే కదా అతడావాక్యమును ప్రయోగించును. అందుచే ఆ అర్థవిషయకజ్ఞానము పరావాక్కు. తరువాత వాక్యోచ్చారణమునకై అతడు ప్రయత్నము చేయును. అపుడు వర్ణాదుల పౌర్వాపర్యముతో కూడినదియు; కాని వర్ణములు స్పష్టముగ శ్రవణగోచరములు కానిదియు, కేవలము నాదమాత్రముగ వినబడునదియు అగు ఒక అవస్థ యేర్పడును. అది మధ్యమావాక్కు. ఇది ఉపాంశుజపము (మంత్రమును గట్టిగ ఉచ్చరించకుండ పెదవులను మాత్రమే కదుపుచు చేయు జపము) వంటిది. తరువాత వర్ణరూప ధ్వనులు బయలుదేరును ఆ ధ్వనులను వినగనే శ్రోతకు వర్ణములు స్పష్టముగ గోచరించును. ఇది వైఖరీవాక్కు, ఈ వైఖరీవాక్కు చేయునదల్ల ఏమనగా దాని పూర్వరూపమగు మధ్యమావాక్కు



యొక్క జ్ఞానమును శ్రోతకు కలిగించును. అపుడాతనికి అర్థజ్ఞానము కలుగును. ఈ విధముగ వైఖరీవాక్కు ద్వారా అనశ్వర మగు మధ్యమావాక్కు వ్యంజితమై తద్వారా అర్థబోధము కలుగును అని అంగీకరించినచో వర్ణసముదాయవాదుల పక్షమున ఉండు దోషము లేవియు ఉండవని వైయాకరణుల అభిప్రాయము.

అవ. స్ఫోటవాదమును నిరాకరించుచున్నాడు :–

**తస్మాత్కూటస్థ ఇత్యేషా శాబ్దీ వః కల్పనా వృథా।**
**ప్రత్యక్షమనుమానం యా యత్ర తత్పరమార్థతః॥** 11
**तस्मात्कूटस्थ इत्येषा शाब्दी वः कल्पना वृथा।**
**प्रत्यक्षमनुमानं या यत्र तत्परमार्थतः॥**

వ్యా. "అందువలన (వర్ణసముదాయము అనుపపన్నము గాన, శబ్దము కూటస్థము (నిత్యము, స్ఫోటరూపము)" అనెడు శబ్దమును గూర్చిన మీ కల్పన నిరర్థకము. దేని విషయమున ప్రత్యక్షమునుకాని, అనుమానమును కాని ప్రమాణముగ చూపుటకు వీలగునో అది సత్యము అని చెప్పవచ్చును.

వి. శబ్దము స్ఫోటరూప మనియు, అది సత్య మనియు చెప్పుటకు ప్రత్యక్షము గాని అనుమానము గాని లేవు గాన ఈ వాదము స్వకపోలకల్పితము, అందుచే అప్రామాణికము.

**శపథైరపి చాదేయం వచో న స్ఫోటవాదినామ్।**
**నభఃకుసుమమస్తీతి శ్రద్ధధ్యాత్కః సచేతనః॥** 12
**शपथैरपि चादेयं वचो न स्फोटवादिनाम्।**
**नभःकुसुममस्तीति श्रद्धध्यात्कः सचेतनः॥**

వ్యా. ఒట్టు పెట్టి చెప్పినను స్ఫోటవాదుల మతము స్వీకరింపదగినది కాదు "ఆకాశ కుసుమము ఉన్నది" అను మాటను, ఆలోచనాశక్తి కలవాడెవడైన విశ్వసించునా?

అవ. ఈ విధముగ స్ఫోటవాదము అప్రామాణిక మని నిరాకరించి శబ్దము, శబ్దార్థముల సంబంధము కూడ కేవలము సంకేతముచే సిద్ధమైనవి, వాస్తవములు కావు అని చెప్పుచున్నాడు:–

**ఇయన్త ఈదృశా వర్ణా ఈదృగర్థాభిధాయినః।**
**వ్యవహారాయ లోకస్య ప్రాగిత్థం సమయః కృతః॥** 13
**इयन्त ईदृशा वर्णा ईदृगर्थाभिधायिनः।**
**व्यवहाराय लोकस्य प्रागित्थं समयः कृतः॥**

వ్యా. "వర్ణముల స్వరూపము ఇట్లుండును, ఇవి ఇన్ని, ఇవి ఇట్టి అర్థమును బోధించును" అని పూర్వము లోకవ్యవహారముకొరకై ఒక సమయము (ఒక నిర్ణయము–ఏర్పాటు) చేయబడినది.

వి. ఇది అంతయు లోకవ్యవహారము నడచుటకై ఏర్పరచుకున్న ఒక ఏర్పాటు మాత్రమే.

అందుచే ఈ వర్ణములు నిత్యములా, అనిత్యములా, వీటి సముదాయము ఎట్లు కుదురును. ఈ శబ్దమునకును అర్థమునకును గల సంబంధము నిత్యమా, అనిత్యమా, ఇత్యాదివిమర్శ అంతయు అనావశ్యకమని భామహుని అభిప్రాయము.

స కూటస్థో౾నపాయీ చ నాదాదన్యశ్చ కథ్యతే।
మన్దాః సాఙ్కేతికానర్థాన్మన్యన్తే పారమార్థికాన్॥ 14

**स कूटस्थोऽनपायी च नादादन्यश्च कथ्यते।**
**मन्दाः साङ्केतिकानर्थान्मन्यन्ते पारमार्थिकान्॥**

వ్యా. ఈ శబ్దము కూటస్థమనియు, నాశరహిత మైనదనియు ధ్వనికంటె భిన్న మైనదనియు చెప్పబడుచున్నది. ఈ విధముగ తెలివి తక్కువవారు, సంకేతముచే కల్పితములగు అర్థములను పారమార్థికములని కూడ చెప్పుచున్నారు.

ఈ శ్లోకము పూర్వార్ధమును వైయాకరణమతఖండనపరముగను, లేదా మీమాంసక మతఖండ రూపముగను అన్వయించవచ్చును. పైన చూపిన విధముగ స్ఫోటవాదులగు వైయాకరణులు స్ఫోటరూపమగు శబ్దము నాశరహిత మనియు, శ్రవణేంద్రియమునకు వినబడు ధ్వని కంటె భిన్న మనియు చెప్పుదురు. అది అంతయు అప్రామాణికము అని వెనుక ఖండించిన వైయాకరణమతమునే సింహావలోకనన్యాయముచే మరల ఖండించినాడు. లేదా మీమాంసక మతమును దృష్టిలో నుంచుకొని ఇది వ్రాసి యుండును. మీమాంసకుల మతము ప్రకారము వర్ణములు నిత్యములు. సర్వవ్యాప్తములు. తాల్వాదులందు వాయువుయొక్క ఆఘాతముచే జనించు ధ్వని లేదా నాదము ఆ వర్ణములను దీపము చీకటిలో నున్న ఘటమును కనబడునట్లు చేసినట్లు, మనకు వినబడునట్లు చేయుచున్నది. కావున తాల్వాది స్థానప్రయత్నాదులు వర్ణరూపమగు శబ్దమును అభివ్యంజింపచేయుచున్నవేకాని, క్రొత్తగా పుట్టించుటలేదు. ధ్వని అనిత్యమే కాని శబ్దము మాత్రము అనిత్యము కాదు. అనిత్యమగు ధ్వనియొక్క ధర్మమును శబ్దమునందారోపించి శబ్దము పుట్టుచున్నది, శబ్దము నశించుచున్నది అని చెప్పుచున్నాము. కాని శబ్దమునకు ఉత్పత్తివినాశములు లేవు. ఈ విధముగ మీమాంసకులు చెప్పునదంతయు కూడ అసంగతమే యని భామహుని అభిప్రాయము. భామహుడు, నైయాయికుల వలె, శబ్దము వర్ణసముదాయ రూపమనియు, వర్ణములు ఉత్పత్తి వినాశవంతము లగుటచే అనిత్యములనియు, వాటికిని అర్థమునకును గల సంబంధము కూడ అనిత్యము, కాల్పనికము అనియు అంగీకరించుచున్నట్లు కనబడుచున్నది. భామహుడు చతుర్థ పరిచ్ఛేదములోని 5,6,7 శ్లోకములలో కూడ శబ్ద స్వరూపమును గూర్చిన చర్చ చేసియున్నాడు.

వినశ్వరో౾స్తు నిత్యో వా సమ్బన్ధో౾ర్థేన వా సతా।
నమో౾స్తు తేభ్యో విద్వద్భ్యః ప్రమాణం యే౾స్య నిశ్చితౌ॥ 15

**विनश्वरोऽस्तु नित्यो वा सम्बन्धोऽर्थेन वा सता।**
**नमोऽस्तु तेभ्यो विद्वद्भ्यः प्रमाणं येऽस्य निश्चितौ॥**



వ్యా. సత్ అయిన అనగా భావరూప మగు అర్థముతో శబ్దమునకు గల సంబంధము అనిత్యము కానిండు, నిత్యము కానిండు ఈ విషయమును నిర్ణయించుటయందు ఎవరు ప్రమాణభూతులో అట్టి విద్వాంసులకు ఒక నమస్కారము.

వి. శబ్దార్థసంబంధము నిత్యమా, అనిత్యమా అనెడు విచారణ అంతయు కావ్యములకు సంబంధిచినంతవరకు మనకు అనావశ్యకము అని భామహుని అభిప్రాయము.

అన్యాపోహేన శబ్దో౾ర్థమాహేత్యన్యే ప్రచక్షతే।
అన్యాపోహశ్చ నామాన్యపదార్థాపాకృతిః కిల॥ 16

**अन्यापोहेन शब्दोऽर्थमाहेत्यन्ये प्रचक्षते।**
**अन्यापोहश्च नामान्यपदार्थापाकृतिः किल॥**

వ్యా. శబ్దము అన్యాపోహముచే అర్థమును బోధించును అని కొందరు (అనగా బౌద్ధులు) చెప్పుదురు. అన్యాపోహ మనగా అన్యపదార్థనిషేధమట.

వి. 'గో' శబ్దాదులు బోధించు అర్థము విషయమున శాస్త్రకారులలో అభిప్రాయ భేదములున్నవి. 'గో' అను శబ్దము 'గోవు' అను ఒక వ్యక్తిని బోధించునా లేక 'గోత్వము' అను జాతిని బోధించునా అనునది ప్రశ్న. ఒక గోవ్యక్తిని బోధించును (అనగా 'గో' శబ్దమునకు గోవ్యక్తి యందు శక్తి) అను పక్షమున ప్రపంచములో నున్న గోవ్యక్తుల నన్నింటిని చూచి 'గో' శబ్దమునకు ఈ వ్యక్తి అర్థము. ఈ వ్యక్తి అర్థము, అని అన్నివ్యక్తుల విషయమునను శక్తిని గ్రహించుట అసంభావ్యము. వర్తమానమున అనంతగోవ్యక్తు లుండుటయే కాక భూతకాలమున ఎన్నో ఉండెడివి, భవిష్యత్తున ఉండగలవు. కావున 'గో' శబ్దమునకు 'గోత్వము' అను జాతియందే శక్తి. కాని 'గాం ఆనయ' ఇత్యాదులలో గోత్వజాతిని తీసికొనివచ్చుటకు వీలు లేదు గాన ఆక్షేపముచే అచట 'గో' శబ్దము 'గోవ్యక్తిని' బోధించును. కావున ప్రతిశబ్దమునకును జాతియందే శక్తి యని మీమాంసకులు అంగీకరింతురు. అర్థక్రియాకారిత్వ మనునది (ఏదైన ఒక పనికి ఉపయోగించుట అనునది) వ్యక్తియందే ఉండును గాని జాతియందు ఉండదు. '*గౌః కర్షతి*' ఇత్యాదులలో కర్షణక్రియ చేయునది ఒక గోవ్యక్తియే కాని గోత్వజాతి కాదు కదా? అందుచే పదములకు వ్యక్తి యందే శక్తి. కాని అన్ని గోవ్యక్తుల విషయమున సంకేతగ్రహణమనునది అసాధ్యము అను పూర్వోక్తదోషమును పరిహరించుటకై కేవల వ్యక్తియందు కాక జాతివిశిష్టవ్యక్తియందు సంకేతము చెప్పవలెను. అనగా 'గాం ఆనయ' అనగా "గోత్వమను జాతి కలదానిని తీసికొని రమ్ము" అని అర్థము అని నైయాయికాదులు చెప్పుదురు. "*గౌః శుక్లః చలో డిత్థః*" ఇత్యాదిప్రయోగములలో 'గౌః' మొదలగు నాలుగు పదములును ఒక వ్యక్తిని బోధించుటకై ప్రయోగింపబడినవి. ఈ పదములన్నియు ఒకే వ్యక్తిని, ఒకే విధముగ బోధించుచున్నవి అని చెప్పినచో ఒక పదము ప్రయోగించిననే చాలును. నాలుగు పదములును నాలుగు అర్థములను బోధించును. 'గౌః' అనునది జాతిని బోధించును. 'శుక్లః' అనునది గుణమును బోధించును. 'చలః' అనునది

క్రియను బోధించును. డిత్థః అనునది సంజ్ఞను బోధించును. "డిత్థః" అనునది ఒక ఎద్దుకు పేరు. సంజ్ఞను బోధించుపదములను "యదృచ్ఛాశబ్దములు- అనగా పురుషుని ఇచ్ఛను అనుసరించి కల్పించిన శబ్దములు అందురు) ఈ విధముగ జాతి వాచకములు, గుణవాచకములు, క్రియావాచకములు, సంజ్ఞావాచకములు (యదృచ్ఛాశబ్దములు) అని శబ్దములు నాలుగు విధములని వైయాకరణులు చెప్పుదురు వీరిలో కొందరు యదృచ్ఛా శబ్దమును ఒక స్వతంత్రభేదముగ అంగీకరింపరు. పైన చెప్పిన నాలుగు విధములగు అర్థము లందును వేరువేరు జాతులున్నవి. ఉదాహరణమునకు-మంచుగడ్డలోని తెలుపు వేరు, పాల తెలుపు వేరు, వెల్ల తెలుపు వేరు, అందుచే ఈ తెలుపులన్నింటియందును శుక్లత్వ మను జాతి యున్నది. గోవు చలనము వేరు. మనుష్యుని చలనము వేరు, పక్ష్యాదుల చలనము వేరు. ఈ చలనము లన్నింటియందును చలనత్వమను జాతి ఉన్నది. 'డిత్థ' ఒకదానికే పేరు గాన 'డిత్థత్వము' జాతి ఎట్లు అగును అని సందేహము కలగవచ్చును. ("నిత్యమేకమనేకానుగతం సామాన్యమ్" అనేక వస్తువులతో సంబంధించినది, నిత్యము, ఏకము అగునది సామాన్యము, అనగా జాతి, యని జాతిలక్షణము). దానికి సమాధాన మేమనగా బాల్యము నందు డిత్థము వేరు, యౌవనమున వేరు, వార్ధకమున వేరు. అందుచే వేరు వేరు వ్యక్తులకు సంబంధించిన దగుటచే డిత్థత్వము కూడ జాతియే. ఈ విధముగ పదములన్నియు జాతివాచకములే అని మీమాంసకులు చెప్పుదురు.

ఒక వస్తువునకును మరి యొక వస్తువునకును గల భేదమును చెప్పుటకు ఈ జాతి ఉపకరించును. ఉదాహరణమునకు-గోవునకును, అశ్వమునకును భేద మేమి యని చెప్పవలె నన్నచో గోవునందు గోత్వమున్నది, అశ్వమునందు లేదు, అశ్వమునందు అశ్వత్వమున్నది, గోవులో లేదు అని చెప్పవచ్చును. కాని బౌద్ధులు నిత్యమగు జాతిని అంగీకరింపరు. అందుచే జాతివలె పదార్థముల పరస్పరభేదమును సాధించుటకు ఉపయోగించు అన్యాపోహము అనుదానిని అంగీకరించినారు. వీరి మతము ప్రకారము 'గౌః' అనగా గోవుకానివాటికంటె భిన్నమైనది అని అర్థము. ఇట్లు గోవుకానివాటికంటె భిన్నమగుట అనునది వేటియందు ఉండునో అవి అన్నియు గోశబ్దవాచ్యములే. అశ్వమున్నది. అది గోవుకానివాటికంటె భిన్నముకాదు, అది గోవుకానిదే. అందుచే అది 'గో' శబ్దవాచ్యము కాదు. భామహుడిచట ఈ మతమును ఉదాహరించి ఖండించుచున్నాడు.

యది గౌరిత్యయం శబ్దః కృతార్థోఽన్యనిరాకృతౌ।
జనకో గవి గోబుద్ధేర్మృగ్యతామపరో ధ్వనిః॥ 17

**यदि गौरित्ययं शब्दः कृतार्थोऽन्यनिराकृतौ।**
**जनको गवि गोबुद्धेर्मृग्यतामपरो ध्वनिः॥**

వ్యా. 'గౌః' అను ఈ శబ్దము గోభిన్నమైనవాటిని నిరాకరించుట చేతనే కృతార్థమైన దని చెప్పినచో 'ఇది గోవు' అని బోధించుటకై మరియొక శబ్దమును వెదుకవలసి యుండును.

వి. బౌద్ధులు చెప్పిన దాని ప్రకారము 'గో' శబ్దము 'గోవు కానిది కాదు' అను అర్థమును



బోధింపగనే దాని పని అయిపోయినది. ఇంక 'ఇది గోవు' అని చెప్పుటకు మరి యొక 'గో' శబ్దమును ప్రయోగింపవలసియుండును కదా? ఒక వస్తువునందు రెండు అంశములుండును. ఇతరవస్తువులకంటె ఇది వేరు అను అంశ మొకటి (Negative aspect) ఆవస్తువునకు మాత్రమే సంబంధించిన విశిష్టాంశ మొకటి (Positive aspect). మీ మతము ననుసరించి 'గో' అనుశబ్దము గోభిన్నములకంటె భిన్నము (గోభిన్నముకాదు) అని మాత్రమే అర్థమును బోధించి, దాని పని పూర్తిచేసికొన్నచో ఆ గోవునందున్న విశిష్టాంశమును బోధింపగల అనగా 'ఇది గోవు' అని బోధింపగలిగిన మరొక పదమేమున్నది? ఆ అంశమును కూడ బోధించిననే కాని వస్తువునకు అర్థక్రియా కారిత్వము (ఏదైన పనిలో ఉపయోగించుట) ఉండదు కదా అని భావము.

అవ. ఒక్క 'గో' శబ్దమే రెండు అంశములను బోధించును అని ఆశంకించుకొని నిరాకరించుచున్నాడు

అర్థజ్ఞానఫలాః శబ్దాః న చైకస్య ఫలద్వయమ్।
అపవాదవిధిజ్ఞానే ఫలే చైకస్య వః కథమ్॥ 18

**अर्थज्ञानफलाः शब्दाः न चैकस्य फलद्वयम्।**
**अपवादविधिज्ञाने फले चैकस्य वः कथम्॥**

వ్యా. శబ్దముల ఫలము (ప్రయోజనము) అర్థజ్ఞానము కాని ఒక శబ్దమునకు రెండు ఫలములని చెప్పుటకు వీలు లేదు. ఒకే శబ్దమువలన అపవాదజ్ఞానము, అనగా అన్యభేదజ్ఞానము, విధిజ్ఞానము, అనగా గోస్వరూపజ్ఞానము అను రెండు ఫలములు మీ మతములో ఎట్లు కుదురును?

వి. ఒక శబ్దము ఒకే అర్థమును చెప్పకలుగును గాని, నిషేధరూపము, విధిరూపము అగు అర్థద్వయమును బోధింపజాల దని అభిప్రాయము.

పురా గౌరితి విజ్ఞానం గోశబ్దశ్రవణాద్భవేత్।
యేనాగోప్రతిషేధాయ ప్రవృత్తో గౌరితి ధ్వనిః॥ 19

**पुरा गौरिति विज्ञानं गोशब्दश्रवणाद्भवेत्।**
**येनागोप्रतिषेधाय प्रवृत्तो गौरिति ध्वनिः**

వ్యా. 'గో' శబ్ద ప్రయోగమునకు ప్రయోజనము గోభిన్నమైనదాని కంటె భేదమును బోధించుట అను పక్షమున గోశబ్దమును వినగనే ముందుగ గోవు అను జ్ఞానముకలుగవలెను కదా?

వి. అన్యాపోహవాదము ప్రకారము 'గౌః' అను పదమునకు 'గోవుకానిది కాదు' అని అర్థము. "గోవుకానిది" అనుదానిలో గోవుయొక్క భానము కలుగుచునే ఉన్నది. మరల దీనికి 'గోవు కానిది కానిది' అని చెప్పుటలో ప్రయోజన మేమున్నది. గోరూపపదార్థముయొక్క జ్ఞానమే

కదా 'గో' శబ్దప్రయోగమునకు ఫలము. అది మొదటనే సిద్ధించినది. మొదట అది సిద్ధించకపోయినచో గోభిన్నము అగుదాని జ్ఞానము కూడ కలుగదు. గోవు అనగా ఏదో తెలిసిన పిమ్మట కదా గోభిన్నమైనది తెలియుట?

వర్ణభేదాదిదం భిన్నం వర్ణాః స్వాంశవికల్పతః।
కే శబ్దాః కిఞ్చ తద్వాచ్యమిత్యహో వర్త్మ దుస్తరమ్॥ 20
वर्णभेदादिदं भिन्नं वर्णाः स्वांशविकल्पतः।
के शब्दाः किञ्च तद्वाच्यमित्यहो वर्त्म दुस्तरम्॥

వ్యా. ఇది (పదము) వర్ణముల భేదమును బట్టి భిన్నమైనది. తమ తమ అంశముల భేదమును బట్టి వర్ణములు భిన్నమైనవి. ఈ విధముగ శబ్దము లనగా ఏవి, వాటి వాచ్యమేది, ఈ విచారమార్గమంతయు అగమ్యగోచరమైనది.

వి. ఇది శబ్దస్వరూపమును గూర్చిన బౌద్ధసిద్ధాంతమును దృష్టిలో నుంచుకొని వ్రాసినచో, లేదా శబ్దస్వరూపమును, శబ్దార్థముల సంబంధమును గూర్చిన వివిధ మతములను దృష్టిలో నుంచుకొని వ్రాసినచో తెలియుట లేదు.

ద్రవ్యక్రియాజాతిగుణభేదాత్తే చ చతుర్విధాః।
యదృచ్ఛాశబ్దమిత్యన్యే డిత్థాదిం ప్రతిజానతే॥ 21
द्रव्यक्रियाजातिगुणभेदात्ते च चतुर्विधाः।
यदृच्छाशब्दमित्यन्ये डित्थादिं प्रतिजानते॥

వ్యా. ద్రవ్యము, క్రియ, జాతి, గుణము అను భేదములచే అవి (అర్థములు) నాలుగు విధములు. కొందరు 'డిత్థ' మొదలగు శబ్దములను యదృచ్ఛాశబ్దములని చెప్పుదురు.

వి. "సూర్యః, చం ద్రః, భూమిః" ఇత్యాది పదములు ద్రవ్యవాచకములు. సూర్యాదులు ఒక్కొక్క పదార్థమే గాన వాటియందు సూర్యత్వాది జాతి లేదు. అనేకవస్తువులలో నుండునదియే జాతి. క్రియాశబ్దాదులను గూర్చి 16వ శ్లోకమున వివరింపబడనది.

అవ. ఇటుపై కొన్ని శబ్దముల సాధుత్వాసాధుత్వములను గూర్చి వ్రాయుటకై ఉపక్రమించి అనంతశబ్దరాశిని పూర్తిగ నిరూపించుట అశక్యమైన పని అని చెప్పుచున్నాడు.

నానాభాషావిషయిణామపర్యన్తార్థవర్తినామ్।
ఇయత్తా కేన వామీషాం విశేషాదవధార్యతే॥ 22
नानाभाषाविषयिणामपर्यन्तार्थवर्तिनाम्।
इयत्ता केन वामीषां विशेषादवधार्यते॥

వ్యా. వివిధములగు భాషలకు సంబంధించినవియు, అనంతములగు అర్థములను



బోధించునవియు, అగు ఈ శబ్దముల ఇయత్తను (వీటి స్వరూపమిది, ఇవి ఇన్ని ఉన్నవి అను విషయమును) విశేషరూపమున ఎవరు నిర్ణయింపగలరు?

వక్రవాచాం కవీనాం యే ప్రయోగం ప్రతి సాధవః।
ప్రయోక్తుం యే న యుక్తాశ్చ తద్వివేకోఽ యముచ్యతే॥ 23
वक्रवाचां कवीनां ये प्रयोगं प्रति साधवः।
प्रयोक्तुं ये न युक्ताश्च तद्विवेकोऽयमुच्यते॥

వ్యా. వక్రవాక్కుల రచన చేయు కవుల ప్రయోగమునకు ఏవి సాధువులో, ఏవి అయుక్తములో వాటి వివేకము చెప్పబడుచున్నది.

నాప్రయుక్తం ప్రయుఞ్జీత చేతఃసంమోహకారిణమ్।
తుల్యార్థత్వేఽ పి హి బ్రూయాత్కో హన్తిం గతివాచనమ్॥ 24
नाप्रयुक्तं प्रयुञ्जीत चेतः संमोहकारिणम्।
तुल्यार्थत्वेऽपि हि ब्रूयात्को हन्तिं गतिवाचनम्॥

వ్యా. (పాఠకుని) మనస్సుకు భ్రాంతి కలిగించు, ప్రసిద్ధప్రయోగములో లేని, పదమును ప్రయోగింపరాదు. 'హన్' ధాతువునకు 'గమ్' ధాతువుతో సమానమైన అర్థమున్నను దానిని గతివాచకముగ ఎవడు ప్రయోగించును.

వి. "హన హింసాగత్యోః అను ధాతుపాఠమును అనుసరించి 'హన్' ధాతువును వెళ్ళుట అను నర్థములో ప్రయోగించుట శాస్త్ర సంమతమే. అయినను దీనిని 'చంపుట' అను అర్థమునందే ప్రయోగించుట ప్రచారములో ఉన్నది కావున 'వెళ్ళుచున్నాడు' అను నర్థమును బోధించుటకై 'హన్తి' అని ప్రయోగించినచో అది పఠితల మనస్సుకు క్లేశదాయక మగును గాన అట్లు ప్రయోగింపరాదు.

శ్రౌత్రాదిం న తు దుర్బోధం న దుష్టాదిమపేశలమ్।
గ్రామ్యం న పిండీశూరాదిం న డిత్థాదిమపార్థకమ్॥ 25
श्रौत्रादिं न तु दुर्बोधं न दुष्टादिमपेशलम्।
ग्राम्यं न पिंडीशूरादिं न डित्थादिमपार्थकम्॥

వ్యా. అర్థము తెలిసికొనుటకు కష్టమైన 'శ్రౌత్ర' మొదలగు పదములను ప్రయోగింప కూడదు. సౌందర్యరహితము లగు 'దుష్ట' మొదలగు పదములను 'పిండీశూర' మొదలగు గ్రామ్యపదములను, అర్థ రహితములగు 'డిత్థ' మొదలగు పదములను కావ్యములలో ప్రయోగింపరాదు.

వి. ఛందః అధీతే' అను అర్థమున 'ఛందః' శబ్దముకంటె పరముగ 'ఘన్' ప్రత్యయము, ప్రకృతియైన ఛందస్' అను దానికి 'శ్రోత్ర' ఆదేశము వచ్చుటచే "శ్రోత్రియంశ్ఛన్దోఽ ధీతే"

అను పాణిని సూత్రము ననుసరించి 'శ్రోత్రియ' శబ్దము నిష్పన్నమైనది. 'శ్రోత్రియస్య భావః అను నర్థమున 'శ్రోత్రియస్య యలోపశ్చ' అను సూత్రముచే అణ్' 'య' లోపాదులు చేయ, 'శ్రౌత్రమ్' అను రూపము నిష్పన్నమైనది. 'శ్రోత్రియుని ధర్మము' అని యర్థము. ఇట్టి పదముల అర్థముల సులభముగ తెలియతగినవి కాదు గాన అట్టి వాటిని ప్రయోగింపరాదు. 'పిండీశూరః' అనగా తిండిబోతు.

నాప్రతీతాన్యథార్థత్వం ధాత్వనేకార్థతావశాత్।
న లేశజ్ఞాపకాకృష్టం స హన్తి ధ్యాతి వా యథా॥ 26
नाप्रतीतान्यथार्थत्वं धात्वनेकार्थतावशात्।
न लेशज्ञापकाकृष्टं स हन्ति ध्याति वा यथा॥

వ్యా. ధాతువులకు అనేకార్థములుండుటను బట్టి స్పష్టముగా ప్రతీతము కాని మరియొక అర్థమున అనగా ప్రసిద్ధార్థముకంటె భిన్నమగు అర్థమున ప్రయోగము చేయరాదు. లేశ మాత్రమగు జ్ఞాపకముచే వ్యాకరణ సూత్రాదులకు బలత్కారమున ఏదియో అర్థము కల్పించి దానిని బట్టి ప్రయోగము చేయరాదు. ఎట్లనగా సః హన్తి' 'సః ధ్యాతి'

వి. వెనుక 24వ కారికలో చెప్పిన విషయమునే మరల ఈ కారికలో చెప్పినాడు. హనధాతువునకు గత్యర్థముకూడ ఉన్నదికదా అని, 'సః గచ్ఛతి' అను అర్థమున "సః హన్తి" అని ప్రయోగింపగూడదు. ధాత్వనేకార్థత్వము ఉపలక్షణము; నిఘంటువులలో కొన్ని పదములకు అనేకార్థము లుండవచ్చును. ఐనను ప్రసిద్ధములగు అర్థములందే వాటిని ప్రయోగింపవలెను గాని అప్రసిద్ధములగు అర్థములందు ప్రయోగింపగూడదు. పాణిని ప్రత్యక్షముగా కొన్ని నియమములను విధించును. కాని ఆ నియమములకు అపవాదముగ కొన్ని ప్రయోగము లుండుటచే ఆ శాస్త్రము వైకల్పిక మని చెప్పి వ్యాఖ్యాకారులు ఆ రూపముల ప్రామాణ్యమును సాధించుచుందురు. అవి వైకల్పికము లని చెప్పుటకు ఏదైన ఆధారముండవలెను గాన పాణిని లేదా పతంజలి ఈ విధముగ (పూర్వోక్తనియమమునకు విరుద్ధముగ) ప్రయోగించి యున్నాడు; లేదా పూర్వనియమము చేతనే సిద్ధించుచుండగా మరల ఇంకొక నియమము చెప్పినాడు; అని కారణము చెప్పుదురు. పాణిన్యాదులు చేసిన ఇట్టి ప్రయోగములు జ్ఞాపకములు ఆ విధముగ ఏదియో ఒక జ్ఞాపకమున్నది కదా అని దానిని ఆధారముగ చేసికొని అశాస్త్రీయ ప్రయోగములు చేయరాదు. 'కృఞ్' ధాతువు తనాదిగణము లోనిది. ఈ గణములో చేరుటచేతనే దీనికి 'ఉ' అను వికరణ ప్రత్యయము వచ్చుచుండగా 'తనాదికృఞ్భ్యః ఉః' అను సూత్రమునందు మరల కృఞ్ ధాతువును చెప్పుట అనావశ్యకము. 'తనాదిభ్య ఉః' అని చెప్పిన చాలును, దీనిని బట్టి 'గణ కార్యమనిత్యమ్' అను ఒక పరిభాషను కల్పించినారు అనగా ఆ యా ధాతువులు ఆ యా గణములకు చెందిన వగుటచే వచ్చు కార్యము అనిత్య మని యర్థము. దీనిని బట్టి "ధ్యై" ధాతువు భ్వాదిగణములో చేరినను దాని 'శప్' కు అదాదిధాతువు 'శప్' కు వలె లోపము చేసి



ధ్యాయతి' కి ధ్యాతి' అని ప్రయోగించినా మని సమర్థించవచ్చును. అట్లు చేయుట యుక్తము కాదని అర్థము. 'జ్ఞాపకసిద్ధం న సర్వత్ర' అని వైయాకరణులే చెప్పినారు. "జ్ఞాపకముచే సిద్ధించిన దానిని అంతటను ఉపయోగింపరాదు" అని దీని అర్థము.

న శిష్టైరుక్తమిత్యేవ న తన్త్రాన్తరసాధితమ్।
ఛన్దోవదితి చోత్సర్గాన్న చాపి చ్ఛాన్దసం వదేత్॥ 27
न शिष्टैरुक्तमित्येव न तन्त्रान्तरसाधितम्।
छन्दोवदिति चोत्सर्गान्न चापि च्छान्दसं वदेत् ॥

వ్యా. ఎవరో శిష్టులు ప్రయోగించినా రన్నంత మాత్రమున వ్యాకరణవిరుద్ధమగు శబ్దమును ప్రయోగింపరాదు. ఇతరశాస్త్రములచే సాధింపబడిన దానిని ప్రయోగింపరాదు. 'ఛందస్సులో వలె' అనెడు సామాన్య పద్ధతిని అనుసరించి అసాధుశబ్దములను ప్రయోగింపరాదు. అట్లే ఛందస్సులోని శబ్దములను ప్రయోగింపరాదు.

వి. 'న తన్త్రాన్తరసాధితమ్'అని చెప్పటచే భామహుడు పాణిన్యాది మునిత్రయము చెప్పినదే కాని ఇతరవ్యాకరణములు ప్రామాణికములు కావు అని భావించుచున్నట్లు కనబడుచున్నది. బహుశా ఈతని సమకాలికుడెవరో క్రొత్తవ్యాకరణమును వ్రాసి యుండవచ్చును. అట్టి వాటికి ఈతడు ప్రామాణ్యము నంగీకరించుటకు ఇష్టపడక ఈ విధముగ వ్రాసి యుండును. 'యూస్త్ర్యాఖ్యౌ నదీ' అను సూత్రభాష్యమున పతంజలి – "యస్మిన్దశసహస్రాణి పుత్రే జాతే గవాం దదౌ బ్రాహ్మణేభ్యః ప్రియాఖ్యేభ్యః సోఽయముఞ్ఛేన జీవతి" అను శ్లోకములో 'ప్రియాఖ్యాయేభ్యః' అని ఉండవలెను కదా "ప్రియాఖ్యేభ్యః' అని ఎట్లు ప్రయోగించినాడు అని ఆశంకించుకొని 'ఛన్దోవత్ కవయః కుర్వన్తి" అని సమాధానము చెప్పినాడు. ఇట్లు పతంజలి సామాన్యరూపమున చెప్పినాడు కదా అని వ్యాకరణవిరుద్ధశబ్దములను ప్రయోగింపరాదు. 'ఛందోవత్ కవయః కుర్వన్తి' అని చెప్పినంతమాత్రమున ఈ ప్రయోగములు సాధువు లని మేమంగీకరించినట్లు కాదు–"న హ్యేషా ఇష్టిః" అని పతంజలి అచటనే వ్రాసియున్నాడు. "నహ్యేషేతి–అసాధవ ఏవైవమాదయః, న తు తత్ప్రామాణ్యాత్సాధుత్వవ్యవస్థా" అని కైయటుడు. అట్లే ఛందస్సులో 'కర్ణేభిః' ఇత్యాది ప్రయోగములున్నవి కదా యని మనము కూడ అట్లు ప్రయోగింపకూడదు.

క్రమాగతం శ్రుతిసుఖం శబ్దమర్థ్యముదీరయేత్।
అతిశేతే హ్యలఙ్కారమన్యం వ్యఞ్జనచారుతా॥ 28
क्रमागतं श्रुतिसुखं शब्दमर्थ्यमुदीरयेत्।
अतिशेते ह्यलङ्कारमन्यं व्यञ्जनचारुता ॥

వ్యా. సంప్రదాయసిద్ధముగ వచ్చుచున్నదియు, వినుటకు ఇంపుగనుండునదియు, అర్థయుక్తమును అగు శబ్దమును ప్రయోగింపవలెను. వ్యంజనముల సౌందర్యము

ఇతరాలంకారము లనన్నింటిని మించి యుండును. అనగా మధురవ్యంజనములగు శబ్దములను కూర్చినచో ఇతరాలంకారములున్నను, లేకపోయినను బాధకము లేదని యర్థము.

సిద్ధో యశ్చోపసంఖ్యానాదిష్ట్యా యశ్చోపపాదితః।
తమాద్రియేత ప్రాయేణ న తు యోగవిభాగజమ్॥ 29

सिद्धो यश्चोपसंख्यानादिष्ट्या यश्चोपपादित:
तमाद्रियेत प्रायेण न तु योगविभागजम्।

వ్యా. వార్తికకారుని ఉపసంఖ్యానముచే సాధింపబడిన శబ్దమును, భాష్యకారుని ఇష్టిచేత సాధింపబడిన శబ్దమును సాధారణముగ అంగీకరింపవచ్చును. అంతియేకాని యోగ విభాగముచే సాధించినదానిని అంగీకరింపకూడదు.

వి. పాణిని సూత్రములను రచించి శబ్దముల సాధుత్వమును సాధించెను. ఈ సూత్రములచే సిద్ధించని కొన్ని పదములను సాధించుటకై వార్తిక కారుడగు కాత్యాయనుడు కొన్ని వార్తికములను రచించెను. ఆ వార్తికముల చివర సాధారణముగ 'ఉపసంఖ్యానమ్' 'వక్తవ్యమ్' 'వాచ్యమ్' వంటి పదములుండును. ఫలానా సూత్రములో చెప్పిన కార్యము ఈ శబ్దమునకు కూడ వచ్చునని చెప్పవలెను అని వాటి అర్థము. ఇంకను మిగిలిన శబ్దములున్నచో వాటి సాధుత్వమును సాధించుటకై భాష్యకారుడు కొన్ని వాక్యములు వ్రాయుచుండును. సాధారణముగ ఆ వాక్యముల చివర 'ఇష్టిః'(అంగీకారము) అను పదముండును. కావున వీటికి భాష్యకారేష్టులని పేరు. ఈ సూత్రములకు, వార్తికములకు, ఇష్టులకుకూడ లొంగని శబ్దములు కొన్ని యున్నవి. వాటిని ఏదో విధముగ సాధువులని చెప్పుటకై కొందరు వ్యాఖ్యాతలు సూత్రములను విరిచి, శ్రమపడి ఏదో ఒక అర్థము చెప్పి ఆ ప్రయోగములను సాధించుచుందురు. ఈ విధములగు శబ్దములలో వార్తిక-భాష్యకారేష్టులచే సాధింపబడిన శబ్దములను మనము కూడ కావ్యాదులలో ప్రయోగింపవచ్చును గాని యోగవిభాగముచే (సూత్రమును ముక్కలు చేసి) సాధించిన పదములను గ్రహింపరాదని అభిప్రాయము.

అవ. వార్తికముచే సాధించిన ప్రయోగమునకు ఉదాహరణము:-

ఇయం చన్ద్రముఖీ కన్యా ప్రకృత్యైవ మనోహరా।
అస్యాం సువర్ణాలఙ్కారః పుష్ణాతి నితరాం శ్రియమ్॥ 30

इयं चन्द्रमुखी कन्या प्रकृत्यैव मनोहरा।
अस्यां सुवर्णालङ्कार: पुष्णाति नितरां श्रियम्।

వ్యా. చంద్రముఖియైన ఈ కన్య స్వభావముచేతనే (సహజముగనే) మనోహరమైనది, ఈమెయందు సువర్ణాలంకారము అధికముగ శోభను పోషించుచున్నది.

వి. పాణిని 'కర్తృకరణయోస్తృతీయా" అను సూత్రముచే 'కర్తృ కరణ' కారకములకు తృతీయావిభక్తిని విధించినాడు. దీనిని పట్టి 'రామేణ బాణేన హతో వాలీ' ఇత్యాదులందు



కర్తృకారకమగు 'రామ' శబ్దమునకును, కరణకారక మగు 'బాణ' శబ్దమునకు తృతీయ వచ్చినది. కాని 'ప్రకృత్యా చారుః' 'గోత్రేణ గార్గ్యః' ఇత్యాది ప్రయోగములున్నవి. వీటిలోని తృతీయను సాధించుటకు పాణిని సూత్ర మేదియును లేదు, ప్రకృతి-గోత్రములు కర్త కాని, కరణము కాని కావు కదా? అందుచే వార్తికకారుడు **"ప్రకృత్యాదిభ్య ఉపసంఖ్యానమ్"** ('ప్రకృతి' మొదలగు శబ్దములకు కూడ తృతీయ చెప్పవలెను) అని వార్తికమును చెప్పినాడు. పై ఉదాహరణములందును, ఈ శ్లోకములోని 'ప్రకృత్యా, అనుదానికిని ఈ వార్తికముచే తృతీయ వచ్చినది. ఈ విధముగ వార్తికభాష్యకారులు సాధించిన రూపములు కూడ గ్రాహ్యములే.

అవ. ఇపుడు వ్యాకరణసిద్ధ ప్రయోగములలో కూడ ఏ శబ్దములు కావ్యానుకూలముగ ఉండునో, ఏవి ఉండవో-కొన్ని శ్లోకములలో చూపుచున్నాడు.

వృద్ధిపక్షం ప్రయుఞ్జీత సఙ్క్రమేఽపి మృజేర్యథా।
మార్జన్త్యధరరాగం తే పతన్తో బాష్పబిన్దవః॥ 31

वृद्धिपक्षं प्रयुञ्जीत सङ्क्रमेऽपि मृजेर्यथा।
मार्जन्त्यधरराग ते पतन्तो बाष्पबिन्दव: ॥

వ్యా. 'కిత్', 'ఙిత్' లగు ప్రత్యయములు పరమగునపుడు కూడ మృజ్ధాతువునకు వృద్ధిపక్షమునే స్వీకరింపవలెను. ఎట్లనగా పడుచున్న బాష్పబిందువులు నీ అధరరాగమును తుడిచివేయుచున్నవి.

వి. మృజ్ధాతువు అదాదిగణములోనిది. దీనికి తిబాదిధాతు ప్రత్యయములు పరమగునపుడు వృద్ధిని విధించుచు 'మృజేర్వృద్ధిః' అను సూత్రము చెప్పబడినది. లట్ ప్రథమపురుషైక వచనమున 'మార్ష్టి' అను రూపమగును. ద్వివచనబహువచనప్రత్యయములు, ఙిత్తులు (ఙకారము ఇత్‌గా గలదానికి 'ఙిత్' అని పేరు. అట్లే 'కిత్' అనుదానికి కూడ అర్థము) ఇట్టి ఙిత్తు, కిత్తు, గిత్తులగు ప్రత్యయములు పరముగ నున్నప్పుడు గుణవృద్ధులు రావని 'క్ఙితి చ' అను సూత్రము చెప్పుటచే గుణము కాని వృద్ధి కాని లేక 'మృష్టః' 'మృజన్తి' అను రూపములగును. కాని బహువచన ప్రత్యయమగు 'అన్తి' అనునది అజాదిప్రత్యయము. అట్టి అజాదిప్రత్యయము పరమైనచో (అవి ఙిత్తులైనను, వృద్ధి వికల్పముగ రావచ్చునని "క్ఙిత్యజాదౌ వేష్యతే" అను వార్తికము చెప్పుచున్నది. కావున అజాదులగు 'కిత్ఙిత్' ప్రత్యయములు పరమైనపుడు వికల్పముగ వృద్ధి వచ్చి "మృజన్తి" "మార్జన్తి" ఇత్యాది విధమున రూపద్వయము అగును. ఈ మృజ్ధాతురూపములను ప్రయోగింప వలసి వచ్చినపుడు వృద్ధి రహితములను కాక, వృద్ధి వచ్చిన 'మార్జన్తి' ఇత్యాదిరూపములను కావ్యములలో ప్రయోగించినచో వినుటకు సొంపుగ నుండునని భావము. గుణ వృద్ధ్య భావమునకు కారణభూతములగు 'క్ఙిత్' ప్రత్యయములకు "సంక్రమము" అని కొన్ని ప్రాచీనవ్యాకరణము లలో సంజ్ఞ. 'ఇహాన్యే వైయాకరణాః మృజేరజాదౌ సంక్రమే విభాషా వృద్ధిమారభన్తే" (మహా భాష్యము 1.1.3 "సంక్రమ ఇతి-గుణవృద్ధి ప్రతిషేధవిషయేక్ఙితాం ప్రాచాం సంజ్ఞా" (కైయటుడు)

**సరూపశేషం తు పుమాన్ స్త్రియా యత్ర చ శిష్యతే।**
**యథాహ వరుణావిన్ద్రౌ భవౌ శర్వౌ మృడావితి॥** 32

**सरूपशेषं तु पुमान् स्त्रिया यत्र च शिष्यते।**
**यथाह वरुणाविन्द्रौ भवौ शर्वौ मृडाविति॥**

వ్యా. స్త్రీవాచకముతో కలిపి చెప్పినపుడు పురుషవాచకము ఎక్కడ శేషించునో అచట సరూపపదశేషమును చేయవలెను. ఎట్లనగా–'వరుణౌ", 'ఇంద్రౌ", 'భవౌ", 'శర్వౌ', మృడౌ" అని చెప్పుచున్నాడు.

వి. 'ఏకశేషవృత్తి' అని ఒక వృత్తి ఉన్నది. రెండు పదములను కలిపి ద్వంద్వసమాసము చేసినపుడు వాటిలో ఒక పదము లోపించును, ఒకటి శేషించును. ఆ శేషించునది లోపించినదాని అర్థమును కూడ చెప్పును. అట్టి ఏకశేషవృత్తి విధాయకసూత్రములలో **'పుమాన్ స్త్రియా'** (1.2.67) అనునది ఒకటి. "లింగభేదము తప్ప ఇతరవిషయములలో సమానముగ ఉన్న స్త్రీవాచక పుంవాచకపదములలో పుంవాచకము శేషించును" అని దీని అర్థము. "హంసీ చ హంసశ్చ= హంసౌ" అనునది ఉదాహరణము. ఇచట ఉన్న రెండు శబ్దములును హంసశబ్దములే కాని లింగ భేదమును బట్టి 'హంసీ' అనియు 'హంస' అనియు చిన్న మార్పు మాత్రము ఉన్నది. ఐనను ఈ సూత్రము ప్రవర్తించును. పులింగశబ్దమగు 'హంస' శబ్దము శేషించినది కాని ఇచట నున్నవి రెండు వ్యక్తులగుటచే ద్వివచనము మాత్రము వచ్చినది. 'వరుణ' 'ఇన్ద్ర' 'భవ' 'శర్వ' 'మృడ'-శబ్దములకు స్త్రీలింగమున వరుసగ 'వరుణానీ, ఇంద్రాణీ, భవానీ, శర్వాణీ, మృడానీ' అను రూపములగును. 'వరుణస్య స్త్రీ వరుణానీ'–ఇత్యాద్యర్థములు. వరుణానీ చ వరుణశ్చ= వరుణౌ" ఇత్యాదివిధమున ఏకశేషరూపములను ప్రయోగింపవలెను అని అర్థము. 'భవానీ శివౌ' ఇత్యాదివిధమున ప్రయోగించుటకంటె ఏకశేషరూపమును ప్రయోగించుటలో ఒక అందమున్నదని భామహుని అభిప్రాయమై యుండును. అట్లు కానిచో 'భవానీ చ భవశ్చ' ఇత్యాద్యర్థమున ఏకశేషవిధి నిత్యము గాన ఏకశేషను ప్రయోగింపవలెనని ప్రత్యేకముగ చెప్ప పని లేదు కదా?

**యథా పటయతీత్యాది ణిచ్ ప్రాతిపదికాత్తతః।**
**ణావిష్ఠవదితీష్ట్యా చ తథా క్రశయతీత్యపి॥** 33

**यथा पटयतीत्यादि णिच् प्रातिपदिकात्ततः।**
**णाविष्ठवदितीष्ट्या च तथा क्रशयतीत्यपि॥**

వ్యా. ప్రాతిపదికమునకు 'ణిచ్' ప్రత్యయము చేర్చి 'పటయతి' ఇత్యాదు లెట్లు సాధింపబడుచున్నవో అట్లే 'ణావిష్ఠవత్' అను ఇష్టిచే 'క్రశయతి' ఇత్యాదిపదములను గూడ సాధించి ప్రయోగించవలెను.

వి. "ప్రాతిపదికాద్ధాత్వర్థే బహులమిష్ఠవచ్చ" అను గణసూత్రముచే, "దానిని



చేయుచున్నాడు, అది చెప్పుచున్నాడు" (**తత్కరోతి తదాచష్టే** గ.సూ.) అను అర్థమున 'పటు' అను ప్రాతిపదికముకంటె 'ణిచ్' ప్రత్యయము చేర్చగా 'పటుం అచష్టే' (అతడు సమర్థుడు అని చెప్పుచున్నాడు) అను అర్థమున 'పటయతి' అను రూపము సిద్ధించును. ఈ విధముగ ప్రాతిపదికకు 'ణిచ్' ప్రత్యయము చేర్చినపుడు ఆ ణిచ్ ప్రత్యయము పరముగ నున్నపుడు, 'ఇష్ఠన్' ప్రత్యయము పరముగ నున్నపు డేకార్యములు వచ్చునో ఆ కార్యములు వచ్చును అని చెప్పుచు "ణావిష్ఠవత్ప్రాతిపదికస్య" అను వార్తికము భాష్యమున (6.4.155) ఉన్నది. ఈ ఇష్ఠవద్భావమునకు ప్రయోజనము రభావాదులని కూడ మహాభాష్యకారుడు చెప్పియున్నాడు–"కిం ప్రయోజనమ్? పుంవద్భావరభావ టిలోపయణాదిపరార్థమ్" (మ.భా.). కావున 'కృశం కరోతి' అను అర్థమున 'కృశ' అను ప్రాతిపదికము కంటె గూడ ణిచ్ చేర్చి ఇష్ఠవద్భావముచే లభించిన రభావముచే 'క్రశయతి' (సన్నపడునట్లు చేయుచున్నాడు) అనుదానిని ప్రయోగించవచ్చును అని అర్థము.

**ప్రయుఞ్జీతావ్యయీభావమదన్తం నాప్యపఞ్చమీ।**
**తృతీయాసప్తమీపక్షే నాలుగ్విషయమానయేత్॥** 34

**प्रयुञ्जीताव्ययीभावमदन्तं नाप्यपञ्चमी।**
**तृतीयासप्तमीपक्षे नालुग्विषयमानयेत्॥**

వ్యా. అదంతమగు అవ్యయీభావసమాసమును ప్రయోగించవలెను. పంచమ్యంతమును ప్రయోగించరాదు. తృతీయసప్తమీపక్షమునందు అలుక్ కలదానిని, (అనగా విభక్తిలోపము లేనిదానిని) ప్రయోగించరాదు.

వి. 'దిశయోర్మధ్యే అపదిశమ్' ఇత్యాదులు అవ్యయీభావసమాసములు. అవ్యయీభావ సమాసమునందు పదాంతమునందలి 'సుప్' ప్రత్యయములన్నియు సామాన్యశాస్త్రముచే లోపించును. కాని అదంతావ్యయీ భావసమాసమైనచో 'సుప్' ప్రత్యయము లోపించదనియు, పంచమీవిభక్తి ప్రత్యయము తక్క మిగిలిన విభక్తిప్రత్యయములకు 'అమ్' అను ఆదేశము వచ్చు ననియు "**నావ్యయీభావాదతోఽమ్త్వపఞ్చమ్యాః**" అను సూత్రము చెప్పుచున్నది. **తృతీయా-సప్తమ్యోర్బహులమ్**" అను మరియొక సూత్రము చెప్పుచున్నది. ఈ విధముగ 'అపదిశ' మొదలగు ఆకారాంతావ్యయీభావసమాసములలో పంచమీవిభక్తి యందు 'అపదిశాత్' అను ఒక రూపమును, తృతీయా- సప్తములయందు- అపదిశమ్-అపదిశేన, "అపదిశం-అపదిశే" అను రెండేసి రూపములును మిగిలిన ప్రథమాది విభక్తులన్నింటియందును 'అపదిశమ్' అను ఒక్క రూపమును ఉండును. ఇట్టి అకారాంతావ్యయీభావసమాసములను ప్రయోగించునపుడు పంచమీవిభక్తి ప్రత్యయలోపము లేని 'అపదిశాత్' మొదలగువాటిని ప్రయోగింపరాదు. తృతీయాసప్తముల విషయమున పాక్షికముగ లోపాభావమున్నది. ఐనను లోపాభావపక్షము ననుసరించి 'అపదిశేన' 'అపదేశే' ఇత్యాదులు ప్రయోగింపరాదు అని యర్థము. 'నాప్యపఞ్చమీ" అను ప్రయోగము అస్పష్టార్థముగ నున్నది.

తిష్ఠద్గుప్రభృతౌ వాచ్యౌ నక్తందివసగోచరౌ।
యథా విద్వానధీతేఽసౌ తిష్ఠద్గు చ వహద్గు చ॥ 35

**तिष्ठद्गुप्रभृतौ वाच्यौ नक्तंदिवसगोचरौ।**
**यथा विद्वानधीतेऽसौ तिष्ठद्गु च वहद्गु च॥**

వ్యా. 'తిష్ఠద్గు' ప్రభృతిగణములో 'తిష్ఠద్గు' 'వహద్గు' అను మొదటి రెండు పదములును రాత్రిని, దివసమును బోధించునవిగా చెప్పతగినవి. ఎట్లనగా-ఈ విద్వాంసుడు తిష్ఠద్గు=రాత్రి యందును, వహద్గు చ=పగటి యందును, చదువుచున్నాడు.

వి. 'తిష్ఠద్గుప్రభృతీని చ' అను సూత్రముచే అవ్యయీభావ ప్రకరణమున 'తిష్ఠద్గు' మొదలగునవి నిపతింపబడినవి. అందులో 'తిష్ఠద్గు' అనుదానికి పాలు పితుకుటకై ఆవులు ఎప్పుడు నిలబడి యుండునో ఆ కాలము అని యర్థము. "తిష్ఠన్తి గావః యస్మిన్ కాలే స తిష్ఠద్గు కాలః". అట్లే 'వహద్గు' అను పదమునకు-మేతకై గోవులు సంచరించు కాలము అని యర్థము. "వహన్తి గావః యస్మిన్ కాలే సః వహద్గు". ఈ రెండు శబ్దములను 'రాత్రి' 'పగలు' అను నర్థమున ప్రయోగింపవలెనని భామహుని అభిప్రాయము.

శిష్టప్రయోగమాత్రేణ న్యాసకారమతేన వా।
తృచా సమస్తషష్ఠీకం న కథఞ్చిదుదాహరేత్॥ 36

**शिष्टप्रयोगमात्रेण न्यासकारमतेन वा।**
**तृचा समस्तषष्ठीकं न कथञ्चिदुदाहरेत्॥**

సూత్రజ్ఞాపకమాత్రేణ వృత్రహన్తా యథోదితః।
అకేన చ న కుర్వీత వృత్తిం తద్గమకో యథా॥ 37

**सूत्रज्ञापकमात्रेण वृत्रहन्ता यथोदितः।**
**अकेन च न कुर्वीत वृत्तिं तद्गमको यथा॥**

వ్యా. శిష్టప్రయోగమున్నంతమాత్రముచేతగాని, వ్యాసకారుని మతమును అనుసరించి గాని, ఎట్టి పరిస్థితులందును, తృజంతముతో సమసించిన షష్ఠ్యంతము గల పదమును ప్రయోగింప రాదు.

సూత్రజ్ఞాపకమాత్రముచేత 'వృత్రహన్తా' అని ప్రయోగించినట్లుగా 'తద్గమకః' ఇత్యాదివిధమున అకప్రత్యయాంతములో వృత్తిని (సమాసమును) చేయరాదు.

వి. 'ణ్వుల్ తృచౌ' (3.1.133) అను సూత్రముచే ధాతువు కంటె పరముగ 'ణ్వుల్' 'తృచ్' అను ప్రత్యయములు కర్త్రర్థమున విధింపబడినవి. 'ణ్వుల్' అనునది 'అక' గా మారును. 'కర్తా' 'కారకః' ఇత్యాదిరూపములు సిద్ధించును. 'తృజకాభ్యాం కర్తరి, (2.2.15) అను మరియొక సూత్రము. 'కర్త్రర్థక తృచ్' ప్రత్యయాంత-'అక' ప్రత్యయాంతములతో షష్ఠ్యంతపదమునకు సమాసము చేయకూడదని చెప్పుచున్నది. ఈ నిషేధసూత్రము ప్రకారము 'వజ్రస్య ధర్తా' 'ఓదనస్య పాచకః' అని వ్యస్తపదములనే ప్రయోగింపవలెను గాని వాటికి సమాసము చేసి 'వజ్రధర్తా' 'ఓదనపాచకః' అని ప్రయోగింపకూడదు. కావున ఎవరో శిష్టులు ప్రయోగించినారనిగాని, వ్యాసకారుడు తృజంతముతో సమాసము సాధువే అంగీకరించినాడని గాని, తృజంతముతో షష్ఠ్యంతమునకు సమాసముచేయకూడదు. పాణిని 'జనికర్తుః ప్రకృతిః' అను సూత్రములో షష్ఠ్యన్తమగు జనేః అనుదానికి 'కర్తా' అను తృజంతముతో సమాసము చేసి "జనికర్తుః" అని ప్రయోగించినాడు. అందుచే "తృజకాభ్యాం కర్తరి" అను సమాసనిషేధము అనిత్యమని జ్ఞాపితమైనదని భావించి కొందరు 'వృత్రస్య హన్తా= వృత్రహన్తా' ఇత్యాది ప్రయోగములను ప్రయోగించినారు. వారిని చూచి 'అక' ప్రత్యయాంతముతో కూడ షష్ఠ్యంతమునకు సమాసము చేసి, పాణిని 'తత్ప్రయోజకో హేతుశ్చ' అను సూత్రములో చేసిన 'తత్ప్రయోజకః' అను ప్రయోగమును జ్ఞాపకముగ తీసికొని 'తస్య గమకః=తద్గమకః' వంటి ప్రయోగములను చేయరాదు. పాణిని ఏవో లాఘవాదులను ఉద్దేశించి అట్టి ప్రయోగములను చేసినను, అతడు కంఠతః చెప్పిన నియమమునకు విరుద్ధముగ ప్రయోగించుట యుక్తము కాదని అర్థము.



పఞ్చరాజీతి చ యథా ప్రయుఞ్జీత ద్విగుం స్త్రియామ్।
నపుంసకం తత్పురుషం పురుహూతసభం యథా॥ 38

**पञ्चराजीति च यथा प्रयुञ्जीत द्विगुं स्त्रियाम्।**
**नपुंसकं तत्पुरुषं पुरुहूतसभं यथा॥**

వ్యా. 'పంచరాజీ' ఇత్యాదిపదములందు వలె ద్విగుసమాసమును స్త్రీలింగమున ప్రయోగింపవలెను. 'పురుహూతసభం' ఇత్యాదులందు వలె నపుంసకలింగములో నున్న తత్పురుషమును ప్రయోగింపవలెను.

వి. 'పఞ్చానాం రాజ్ఞాం సమాహారః=పఞ్చరాజీ' 'అకారాన్తోత్తరపదో ద్విగుః స్త్రియా మిష్టః' అను వార్తికముచే (సామాన్యనియమము ప్రకారము నపుంసకలింగ మగుటకు బదులు) ఇది స్త్రీలింగ మైనది. కావున ఇట్టి వాటిని స్త్రీలింగమునందే ప్రయోగించవలెను. ఇతరలింగములలో ప్రయోగించినచో అది అపశబ్ద మగును. తత్పురుషసమాసమున ఉత్తరపదముగ 'సభా' శబ్దముండి, పూర్వపదము 'రాజన్' శబ్దము కాని 'మనుష్య' శబ్దము కాని కాకున్నచో. ఆ 'సభా' శబ్దాంత తత్పురుషము నపుంసకములో నుండును. 'సభా రాజామనుష్యపూర్వా' (2.4.23) అని సూత్రము. ఈ నియమమును గుర్తులోనుంచుకొని 'పురుహూతసభమ్' ఇత్యాదివిధముననే ప్రయోగించవలెను. కాని లింగాంతరములో ప్రయోగింపరాదు.

సర్వేభ్యశ్చ భృశాదిభ్యో వదేల్లుప్తహలం యథా।
ప్రియోన్మనాయతే సా తే కిం శఠాభిమనాయసే॥ 39

**सर्वेभ्यश्च भृशादिभ्यो वदेल्लुप्तहलं यथा।**
**प्रियोन्मनायते सा ते किं शठाभिमनायसे॥**

వ్యా. భృశాదిగణములో చేరిన అన్ని శబ్దములను హల్‌లోపము చేసి ప్రయోగించవలెను.

ఎట్లనగా-ఓశరుడా! నీ ప్రియురాలైన ఆమె బెంగపెట్టుకొన్నది. నీవెందులకు అభిమానము (అహంకారము) చూపెదవు.

వి. "అభూతతద్భావమున-(అట్లుకానిది అట్లైనది అను నర్థము గమ్యమగునపుడు) భృశాదులకంటె, అగుచున్నది అను అర్థమున, 'క్యజ్' ప్రత్యయము వచ్చును. హల్లుకు లోపము కూడ వచ్చును". అని "భృశాదిభ్యో భువ్యచ్వేర్లోపశ్చ హలః" (3.1.12) అను సూత్రము చెప్పుచున్నది. 'భృశాయతే' 'మందాయతే' ఇత్యాదులుదాహరణములు. 'మనస్' మొదలగు హలంతశబ్దముల హల్లు లోపించును గాన ఉన్మనాయతే అభిమనాయతే, ఇత్యాదిరూపములగును. ఈ విధముగ హల్లోపము చేసియే ప్రయోగించవలెనని యర్థము.

తృతీయైకవచః షష్ఠ్యామామన్తఞ్చ వదేత్క్విపి।
యథోదితం బలభిదా సురుచాం విద్యుతామివ॥ 40

**तृतीयैकवचः षष्ठ्यामामन्तञ्च वदेत्क्विपि।**
**यथोदितं बलभिदा सुरुचां विद्युतामिव॥**

వ్యా. 'క్విప్' ప్రత్యయాంతశబ్దమును తృతీయైకవచనమునందును, షష్ఠియందు ఆమంతముగను ప్రయోగింపవలెను. ఎట్లనగా 'బలభిదా' (దేవేంద్రునిచేత) 'సురుచాం' (అందమైన కాంతిగల) 'విద్యుతామ్' ఇవ (మెరుపులయొక్క వలె).

ధాతువులకు (కర్త్రర్థమున) 'క్విప్' అను ప్రత్యయము చేర్చుటచే కొన్ని హలంతశబ్దములు సిద్ధించును- వాటిని ఇతరవిభక్తులలో ప్రయోగించుటకంటె 'బలభిదా' ఇత్యాదివిధమున తృతీయైకవచనమునందును, 'సురుచామ్' 'విద్యుతామ్' ఇత్యాదివిధమున షష్ఠీబహువచనమునందును ప్రయోగించినచో కావ్యరచనకు సౌందర్యము లభించునని యర్థము. 'ఆమ్' అనునది షష్ఠీబహువచనప్రత్యయము.

అసన్తమపి యద్వాక్యం తత్తథైవ ప్రయోజయేత్।
యథోచ్యతేఽమ్భసా భాసా యశసామమ్భసామితి॥ 41

**असन्तमपि यद्वाक्यं तत्तथैव प्रयोजयेत्।**
**यथोच्यतेऽम्भसा भासा यशसामम्भसामिति॥**

వ్యా. 'అస్' అనునది చివర గల పదమును గూడ అట్లే, అనగా తృతీయైకవచన-షష్ఠీబహువచనములందే ప్రయోగించవలెను. ఉదా. అమ్భసా (తృ.వి) భాసా, (తృ.వి.) యశసామ్, (ష.వి) అమ్భసామ్ (ష.వి)

పుంసి స్త్రియాం చ క్వస్వన్తమిచ్ఛన్త్యచ్ఛాన్దసం కిల।
ఉపేయుషామపి దివం యథా న వ్యేతి చారుతా॥ 42

**पुंसि स्त्रियां च क्वस्वन्तमिच्छन्त्यच्छान्दसं किल।**
**उपेयुषामपि दिवं यथा न व्येति चारुता॥**



ఇభకుమ్భనిభే బాలా దధుషీ కఞ్చుకం స్తనే।
రతిఖేదపరిశ్రాన్తా జహార హృదయం నృణామ్॥ 43

**इभकुम्भनिभे बाला दधुषी कञ्चुकं स्तने।**
**रतिखेदपरिश्रान्ता जहार हृदयं नृणाम्॥**

వ్యా. క్వసుప్రత్యయాంతము పుంలింగమునందును, స్త్రీలింగమునందును కూడ అవైదికమే అని అంగీకరింతురు. ఎట్లనగా-"స్వర్గమును పొందినను, వారి సౌందర్యము తొలగిపోదు".

రతిఖేదశ్రాంతయై గజకుంభతుల్యమగు స్తనమునందు రవికెను ధరించియున్న ఆ బాల నరుల హృదయమును హరించెను.

వి. 'క్వసుశ్చ' అను సూత్రముచే 'లిట్' కు 'క్వసు' అను ప్రత్యయము విధింపబడినది. కాని ఇది వేదమునందే వచ్చు నని చెప్పబడినది. ఐనను లౌకికభాషలో కూడ స్త్రీపుంలింగములు రెండింటియందును దీని ప్రయోగము కవులు అధికముగ చేయుచున్నారు గాన అందరును చేయవచ్చునని యర్థము. ఉపపూర్వక 'ఇణ్' ధాతువునకు 'క్వసు' ప్రత్యయము చేయుటచే 'ఉపేయివస్' అను ప్రాతిపదికము సిద్ధించును. 'ఉపేయుషామ్' అనునది దాని షష్ఠీబహువచనము, పుంలింగము. దధుషీ' అనునది 'ధా' ధాతువునకు 'క్వసు' ప్రత్యయము చేర్చుటచే నిష్పన్నమైన స్త్రీలింగప్రథమైకవచనరూపము.

శబలాదిభ్యోఽతితరాం భాతి ణిజ్విహితో యథా।
బలాకాః పశ్య సుశ్రోణి ఘనాఞ్ఛబలయన్త్యమూః॥ 44

**शबलादिभ्योऽतितरां भाति णिज्विहितो यथा।**
**बलाकाः पश्य सुश्रोणि घनाञ्छबलयन्त्यमूः॥**

శిశిరాసారకణికాసదృశస్సేతుగన్ధవాట్।
స వీజయతి సుశ్రోణి రతిఖేదాలసేక్షణామ్॥ 45

**शिशिरासारकणिकासदृशस्सेतुगन्धवाट्।**
**स वीजयति सुश्रोणि रतिखेदालसेक्षणाम्॥**

వ్యా. 'శబల' మొదలగు శబ్దములకు 'ణిచ్' చేర్చి ప్రయోగించినచో అది చాల సుందరముగ నుండును. ఎట్లనగా-"ఓ సుశ్రోణీ! ఈ కొంగలను చూడుము. మేఘములను చిత్రవర్ణముకలవాటినిగ చేయుచున్నవి."

ఓ సుశ్రోణి! రతిఖేదముచే అలసమైన నేత్రములు గల నిన్ను (నీకు) మంచు యొక్క నిరంతరధారాకణములతో సమానమైన మలయమారుతము వీచుచున్నది.

వి. 'శబలయన్తి' అనునది 'శబలశబ్దమునకు' 'ణిచ్' చేర్చుటచే సిద్ధించినది. 'వీజ్' ధాతువు చురాదులలోది గాన దానికి 'ణిచ్' చేర్చగా 'వీజయతి' అను రూపమైనది.

**ఏవం ణిచః** ప్రయోగస్తు సర్వత్రాలఙ్కృతిః పరా।
లిఙ్గత్రయోపపన్నం చ **తాచ్ఛీల్యవిషయం ణినిమ్॥** 46

एवं णिच: प्रयोगस्तु सर्वत्रालङ्कृति: परा।
लिङ्गत्रयोपपन्नं च ताच्छील्यविषयं णिनिम्॥

వ్యా. ఈ విధముగ ణిజంతశబ్దముల ప్రయోగము అంతటను ఉత్కృష్టమైన అలంకారము. తాచ్ఛీల్యార్థకమగు (అదిస్వభావముగా కలవాడు అను అర్థము గల) 'ణిని' ప్రత్యయాంతమును మూడు లింగములందును ప్రయోగింపవలెను.

తస్యా హారీ స్తనాభోగో వదనం హారి సున్దరమ్।
హారిణీ తనురత్యన్తం కియన్న హరతే మనః॥ 47

तस्या हारी स्तनाभोगो वदनं हारि सुन्दरम्।
हारिणी तनुरत्यन्तं कियन्न हरते मन: ॥

వ్యా. ఆమెయొక్క మనోహర మగు స్తనాభోగము (స్తన వైశాల్యము), మనోహరమైన సుందరమగు వదనము, అత్యంతము మనోహరమైన శరీరము మనస్సును ఎంతగా ఆకర్షించుట లేదు?

వి. తాచ్ఛీల్యార్థమున 'ణిని' ప్రత్యయము చేర్చుటచే 'హృ' ధాతువునుండి 'హారిన్' అను పదము నిష్పన్నమైనది. 'హరించు స్వభావము కలది' అని అర్థము. పూర్వశ్లోకములో చెప్పినట్లు ఇది 'హారీ' 'హారిణీ' 'హారి' అని లింగత్రయమునందును ప్రయోగింపబడినది.

**తాచ్ఛీల్యాదిషు చేష్యన్తే** సర్వ ఏవ **తృనాదయః।**
విశేషేణ చ **తత్రేష్టా యుచ్‌కురజ్వరజిష్ణుచః॥** 48

ताच्छील्यादिषु चेष्यन्ते सर्व एव तृनादय:
विशेषेण च तत्रेष्टा युचकुरज्वरजिष्णुच: ॥

వ్యా. 'తృన్' ప్రత్యయము మొదలైన అన్ని ప్రత్యయములును తాచ్ఛీల్యాద్యర్థములందు అంగీకరింపబడును. అందును 'యుచ్' 'కురచ్' 'వరచ్' 'ఇష్ణుచ్' ప్రత్యయములు విశేషముగ అంగీకార్యములు

వి. **"ఆక్వేస్తచ్ఛీలతద్ధర్మతత్సాధుకారిషు"** (3.2.134) అను సూత్రముచే 'క్విప్' ప్రత్యయవిధాయకమగు "భ్రాజ....." (3.3.177)వ సూత్రములోపుగా నున్న సూత్రములచే విహితములగు ప్రత్యయములు 'ఆ స్వభావము కలవాడు', 'ఆ ధర్మము కలవాడు' 'ఆ విషయమున సాధుకారి' అను అర్థములందు వచ్చు నని చెప్పబడినది. ఈ ఘట్టమున 'తృన్' (3.2.135) ఇత్యాదిసూత్రములచే విహితములగు 'తృన్' మొదలగు ప్రత్యయములు తచ్ఛీలాద్యర్థకము లనియు, వాటిలో 'యుచ్' ప్రత్యయాంతపదాదులను కావ్యములో ప్రయోగించినచో సుందరముగ నుండు



ననియు, ఈ శ్లోకమునకు అర్థము. ఉదా:- 'కర్తా కటమ్'-కటమును (చాపను) తయారుచేయు స్వభావము కలవాడు. 'కర్తా' అనునది తృనంతము. "చలన శబ్దార్థాదకర్మకాద్యుచ్" (3.2.148) అను సూత్రముచే 'యుచ్' ప్రత్యయము విహితమైనది. 'చలనః' 'చోపనః', 'కమ్పనః' 'శబ్దనః', 'రవణః' ఇత్యాదులు ఉదాహరణములు. 'విదిభిదిచ్ఛిదేః కురచ్' (3.2.162) అను సూత్రముచే 'కురచ్' ప్రత్యయము విధింపబడినది. 'విదురః', 'భిదురమ్', 'ఛిదురమ్' ఇత్యాదులు ఉదాహరణము. "స్థేశభాసపిసకసోవరచ్" (3.2.175) అను సూత్రముచే 'వరచ్' ప్రత్యయము విహితమైనది. 'స్థావరః', 'ఈశ్వరః', 'భాస్వరః', 'పేస్వరః', 'కస్వరః', 'ఇత్యాదు'లుదాహరణము. **"అలఙ్కృఞ్ నిరాకృఞ్ ప్రజనోత్పచోత్పతోన్మదరుచ్యపత్రప వృతువృధుసహచర ఇష్ణుచ్"**(3.2.136) అను సూత్రముచే 'ఇష్ణుచ్' ప్రత్యయము విధింపబడినది. 'అలంకరిష్ణుః' 'నిరాకరిష్ణుః' ఇత్యాదులు ఉదాహరణము. ఈ విధముగ 'తృన్' ప్రత్యయాద్యంతము లన్నియు సుందరములు, అందును యుజంతాదులు సుందరతరములని యర్థము.

**క్తిన్నన్తఞ్చ** ప్రయుఞ్జీత **సఙ్గతిః సంహతిర్యథా।**
**శాకారౌ జాగురిష్టౌ** చ **జాగర్యా జాగరా** యథా॥ 49

क्तिनन्तञ्च प्रयुञ्जीत सङ्गति: संहतिर्यथा।
शाकारौ जागुरिष्टौ च जागर्या जागरा यथा॥

వ్యా. 'సంగతిః' 'సంహతిః' వంటి క్తిన్నంత ప్రత్యయములను ప్రయోగించవలెను. 'జాగృనిద్రాక్షయే' అను ధాతువునకు 'శ' ప్రత్యయము 'అ' ప్రత్యయము కూడ ఇష్టములు. ఎట్లనగా:- 'జాగర్యా', 'జాగరా'.

వి. భావార్థమున 'స్త్రియాం క్తిన్' (3.3.94) అను సూత్రముచే విహితమగు 'క్తిన్' ప్రత్యయము చేర్చుటచే నిష్పన్నములగు 'సఙ్గతిః' 'సంహతిః' ఇత్యాదిపదములు కావ్యానుకూలములు. 'జాగర్తేరకారో వా' అను వార్తికముచే 'అ' ప్రత్యయము-'జాగరా'. అదిరాని పక్షమున 'శ' ప్రత్యయము-'జాగర్యా'. ఈ రెండును కావ్యమున గ్రాహ్యములు.

**ఉపాసనేతి** చ **యుచం నిత్యమాసేః** ప్రయోజయేత్।
**ల్యుటం** చ **కర్తృవిషయే దేవనో రమణో** యథా॥ 50

उपासनेति च युचं नित्यमासे: प्रयोजयेत्।
ल्युटं च कर्तृविषये देवनो रमणो यथा॥

వ్యా. "ఉపాసనా" అను ఉదాహరణమునందు వలె 'అస్' ధాతువునకు నిత్యముగ 'యుచ్' ప్రత్యయమును చేర్చి ప్రయోగింపవలెను. కర్త్రర్థక 'ల్యుట్' ప్రత్యయాంతము లగు పదములను ప్రయోగింపవలెను.

వి. **"ణ్యాసశ్రన్థో యుచ్"** (3.3.107) అను సూత్రముచే 'అస్ ధాతువుకంటె

భావాద్యర్థమున 'యుచ్' ప్రత్యయము విధింపబడినది. దీనిని చేర్చుటచే ఏర్పడిన 'ఉపాసనా' ఇత్యాది శబ్దముల ప్రయోగము సుందరముగ ఉండును. 'ల్యుట్' ప్రత్యయము **'ల్యుట్చ'** (3.3.115) సూత్రముచే భావార్థమునందును (హసనం, గమనం, ఇత్యాదులు ఉదాహరణములు) 'కరణాధికరణయోశ్చ' (3.3.117) అను సూత్రముచే "కరణాధికరణార్థములందును - (ప్రవృశ్చ్యతే అనేనేతి ప్రవ్రశ్చనః, 'దుహ్యతే అస్యాం ఇతి=దోహనీ" ఇత్యాదులుదాహరణము) విధింపబడినది. కర్త్రర్థమున విధింపబడలేదు. కాని 'కృత్యల్యుటో **బహులమ్**' అను సూత్రముచే, చెప్పిన అర్థములందే కాక ఇతరార్థములందు కూడ 'ల్యుట్' ప్రత్యయమును చేర్చవచ్చునని చెప్పుటచే కర్త్రర్థమున ఈ ప్రత్యయమును చేర్చగా సిద్ధించిన "దేవనః" (జూదమాడువాడు) "రమణః" (రమింపచేయువాడు) ఇత్యాదిపదములను కావ్యములలో ప్రయోగించిన బాగుండునని అభిప్రాయము.

**అణన్తాదపి ఙీబిష్టో లక్ష్మీః పౌరన్దరీ యథా।**
**అఞ్ మహారజనాల్లాక్షారోచనాభ్యాం తథా చ ఠక్॥** 51

**अणन्तादपि ङीबिष्टो लक्ष्मीः पौरन्दरी यथा।**
**अञ् महारजनाल्लाक्षारोचनाभ्यां तथा च ठक्॥**

వ్యా. 'అణ్' ప్రత్యయాంతశబ్దమునకు స్త్రీలింగమున 'ఙీప్' ప్రత్యయమును చేర్చిన ప్రయోగము వాంఛనీయము. ఎట్లనగా- "పౌరన్దరీ లక్ష్మీః". 'మహారజన' శబ్దమునకు 'అఞ్' ప్రత్యయము, 'లాక్షా' 'రోచన' శబ్దములకు 'ఠక్' ప్రత్యయము చేర్చి చేసిన ప్రయోగములు కావ్యమునందు ఇష్టములు.

వ్యా. 'పురన్దరస్య ఇదమ్" అను నర్థమున "**తస్యేదమ్**" (4.3.120) అను సూత్రముచే 'అణ్' ప్రత్యయము చేయగా 'పౌరన్దర' శబ్దము సిద్ధించును. స్త్రీలింగమున దానికి "టిడ్ఢాణఞ్..." ఇత్యాది సూత్రముచే (4.1.15) 'ఙీప్' ప్రత్యయము చేర్చగా "పౌరన్దరీ" (దేవేంద్రుని సంబంధమైన) అను శబ్దము సిద్ధించును. ఇట్టి శబ్దములు కావ్యమున రమ్యముగ నుండును. "దానిచే రంగువేయబడినది" అను అర్థమున 'లాక్షా' 'రోచన' శబ్దములకు "లాక్షారోచనాట్ఠక్' (4.2.2) అను సూత్రముచే 'ఠక్' ప్రత్యయము చేర్చగా 'లాక్షికః' 'రౌచనికః' అను రూపములు సిద్ధించును. 'లాక్షచేత రంగువేయబడినది,. "రోచనముచేత రంగువేయబడినది" అని అర్థము. అట్లే 'మహారజనేన రక్తమ్' అను అర్థమున "మహారజన" శబ్దమునకు 'హరిద్రామహారజనాభ్యామఞ్' అను వార్తికముచే 'అఞ్' ప్రత్యయము చేర్చగా 'మాహారజనమ్' అను శబ్దము సిద్ధించును. "మహారజనముచే రంగువేసిన వస్త్రాదికము" అని అర్థము. ఇట్టి శబ్దములు కావ్యప్రయోగమునకు అనుగుణములని భామహుని అభిప్రాయము.

**ద్మతుబిష్టం చ కుముదాద్యథేయం భూః కుముద్వతీ।**
**ఠక్ చాపి తేన జయతీత్యాక్షికః శాస్త్రికో యథా॥** 52



**ड्मतुबिष्टं च कुमुदाद्यथेयं भूः कुमुद्वती।**
**ठक् चापि तेन जयतीत्याक्षिकः शास्त्रिको यथा॥**

వ్యా. 'కుముద' శబ్దమునకు 'డ్మతుప్' ప్రత్యయము చేర్చిన రూపము ఇష్టము. ఎట్లనగా-'కుముద్వతీ (కలువలు గల) భూః" "తేన జయతి" అను అర్థమున ప్రయుక్త మగు ఠక్' ప్రత్యయము కూడ ఇష్టము. ఎట్లనగా-'ఆక్షికః', 'శాస్త్రికః'.

వి. "**కుముదనడవేత సేభ్యో డ్మతుప్**" (4.1.87) అను సూత్రముచే మత్వర్థమున 'కుముద' శబ్దమునకు 'డ్మతుప్' ప్రత్యయము చేర్చగా 'కుముద్వాన్' అను రూపము సిద్ధించును. దీని స్త్రీలింగరూపము 'కుముద్వతీ'. 'దానిచే జయించుచున్నాడు' అను అర్థమున "**తేన దీవ్యతి ఖనతి జయతి జితమ్**" (4.4.2) అను సూత్రముచే 'ఠక్' ప్రత్యయము చేర్చగా "అక్షేణ జయతి ఆక్షికః", "శస్త్రేణ జయతి శాస్త్రికః" అను రూపములు నిష్పన్న మగును. ఇవి కూడ కావ్యమున ప్రయోగించుటకు రమ్యముగ నుండును.

**హితప్రకరణే ణం చ సర్వశబ్దాత్ ప్రయుఞ్జతే।**
**తతశ్ఛమిష్ట్యా చ యథా సార్వః సర్వీయ ఇత్యపి॥** 53

**हितप्रकरणे णं च सर्वशब्दात् प्रयुञ्जते।**
**ततश्छमिष्ट्या च यथा सार्वः सर्वीय इत्यपि॥**

వ్యా. హిత ప్రకరణమునందు 'సర్వ' శబ్దమునకు 'ణ' ప్రత్యయమును కూడ ప్రయోగింతురు. ఆ శబ్దమునకే ఇష్టిచే (అనగా వార్తికముచే) 'ఛ' ప్రత్యయమును కూడ చేర్చుదురు. ఎట్లనగా-'సార్వః' 'సర్వీయః'.

వి. '**తస్మై హితమ్**' (5.1.5) అను సూత్రప్రకరణమున 'అందుకు మంచిది' అను నర్థమున 'సర్వ' శబ్దమునకు "సర్వపురుషాభ్యాం ణఢఞౌ" (5.1.10) అను సూత్రముచే 'ణ' ప్రత్యయము చేర్చగా "సర్వేభ్యో హితః సార్వః" అను రూపము సిద్ధించును. "అందరికిని హితుడు" అని అర్థము. ఈ 'ణ' ప్రత్యయము వైకల్పిక మని '**సర్వాణ్ణోవేతి వక్తవ్యమ్**' అను వార్తికము చెప్పుచున్నది. అందుచే 'ణ' ప్రత్యయము రాని పక్షమున "ప్రాక్క్రీతాచ్ఛః" (5.1.1.) అను సూత్రముచే ఛప్రత్యయము వచ్చి 'సర్వీయః' అను రూపము సిద్ధించును. ఈ రెండు రూపములును కావ్యప్రయోగార్హములు. భామహుడు వార్తికమును 'ఇష్టి' అని పేర్కొనుచున్నాడు.

**వదేదిమనిజన్తం చ పటిమా లఘిమా యథా।**
**విశేషేణేయసున్నిష్టో జ్యాయానాప కనీయసీమ్॥** 54

**वदेदिमनिजन्तं च पटिमा लघिमा यथा।**
**विशेषेणेयसुन्निष्टो ज्यायानाप कनीयसीम्॥**

వ్యా. 'ఇమనిచ్' ప్రత్యయము అంతమునందు గల శబ్దములను ప్రయోగింపవలెను.

ఎట్లనగా– 'పటిమా', 'లఘిమా', 'ఈయసున్' ప్రత్యయాంతము విశేషరూపమున ఇష్టము. ఎట్లనగా "జ్యాయాన్ కనీయసీం ఆప'=పెద్దవాడు చిన్నదానిని పొందెను.

వి. 'దానియొక్క ధర్మము' అను అర్థమున '**తస్య భావస్త్వతలౌ**' (5.1.119) ఇత్యాది సూత్రములచే 'త్వ' 'తల్' మొదలగు ప్రత్యయములు విధింపబడినవి. అట్టి ప్రత్యయములలో '**పృథ్వాదిభ్య ఇమనిజ్వా**' (5.1.112) అను సూత్రముచే విహితమగు '**ఇమనిచ్**' ప్రత్యయము ఒకటి. అది చేర్చుటచే ఏర్పడిన, 'లఘిమా', 'పటిమా' ఇత్యాది పదములు కావ్యసౌందర్య హేతువులని అర్థము. 'రెండింటిలో ఒకటి మంచిది' అను నర్థమున '**ద్వివచనవిభజ్యోపపదే తరబీయసునౌ**' (5.3.57) అను సూత్రముచే 'తర', 'ఈయసున్' ప్రత్యయములు విధింపబడినవి. 'లఘుతర– లఘీయాన్' 'పటుతర-పటీయాన్' ఇత్యాదులు ఉదాహరణములు. వీటిలో 'తర' ప్రత్యయాంతముల కంటె 'ఈయసున్' ప్రత్యయాంతములు కావ్యశోభాదాయకములని భామహుని అభిప్రాయము. 'జ్యాయాన్' 'కనీయసీమ్' అనునవి 'ఈయసున్' ప్రత్యయాంతములు. రెండవది 'కనీయాన్' అనుదాని స్త్రీలింగరూపము.

**ద్వయసజ్ దఘ్నచావిష్టౌ ప్రమాణవిషయౌ యథా।**
**జానుదఘ్నీ సరిన్నారీనితమ్బద్వయసం సరః॥** 55

**द्वयसज् दघ्नचाविष्टौ प्रमाणविषयौ यथा।**
**जानुदघ्नी सरिन्नारीनितम्बद्वयसं सरः॥**

వ్యా. 'ప్రమాణము గల' అను నర్థమున 'ద్వయసచ్' 'దఘ్నచ్' అను ప్రత్యయముల ప్రయోగము ఇష్టము. ఎట్లనగా–'నది జానుదఘ్ని (మోకాలు లోతైనది) సరస్సు నారీనితంబ ద్వయసము (స్త్రీనితంబము వరకును ఉన్నది.)"

వి. '**ప్రమాణే ద్వయసజ్ దఘ్నఞ్ మాత్రచః**' అను సూత్రముచే– 'అంత ప్రమాణము కలది' అను వర్థమున 'ద్వయసచ్' 'దఘ్నచ్' 'మాత్రచ్' అను ప్రత్యయములు వచ్చును. 'కంఠద్వయసం, కంఠదఘ్నం, కంఠమాత్రం జలమ్" ఇత్యాదులు ఉదాహరణము. మెడలోతు నీరు అర్థము. వీటిలో 'ద్వయసచ్' 'దఘ్నచ్' ప్రత్యయాంతముల ప్రయోగము కావ్యశోభాకరము.

**మతుప్ప్రకరణే జ్యోత్స్నాతమిస్రాశృఙ్గిణాదయః।**
**ఇనచ్చ ఫలబర్హాభ్యాం ఫలినో బర్హిణో యథా॥** 56

**मतुप्प्रकरणे ज्योत्स्नातमिस्राशृङ्गिणादयः।**
**इनच्च फलबर्हाभ्यां फलिनो बर्हिणो यथा॥**

వ్యా. 'మతుప్' ప్రకరణమున 'జోత్స్నా' 'తమిస్రా' 'శృఙ్గిణ' మొదలగు శబ్దములును, 'ఫల' 'బర్హ' శబ్దములకు 'ఇనచ్' ప్రత్యయము చేర్చగా సిద్ధించిన 'ఫలినః' 'బర్హిణః' అను శబ్దమును ప్రయోగార్హములు.



వి. 'అది కలిగి యున్నది' అను అర్థమున 'మతుప్' అను ప్రత్యయము చేర్చబడును. 'ధీమాన్' 'బుద్ధిమాన్' ఇత్యాదులుదాహరణములు. ఈ ప్రకరణమున 'మతుప్' ప్రత్యయమే కాక కొన్ని ఇతర ప్రత్యయములు కూడ విధింపబడినవి. కొన్ని పరినిష్ఠితరూపములు నిపతింపబడినవి. ఇది ప్రకృతి, ఇది ప్రత్యయము అను విభాగమును చూపకుండగా ఈ పదమిట్లు ఉండును అని సిద్ధరూపమును చూపుటకు నిపతించుట అని పేరు. "**జోత్స్నా.....మలీమసాః**" (5.2.114) అను సూత్రముచే 'వెలుతురు కలది' ఇత్యాద్యర్థములందు 'జ్యోత్స్నా, తమిస్రా-శృంగిణ-ఊర్జస్విన్-ఊర్జస్వల-గోమిన్-మలిన-మలీమస' శబ్దములు నిపతింపబడినవి. ఈ శబ్దములు కావ్యమున ప్రయోగించినచో రమ్యముగ నుండును. ఇట్లే '**ఫలబర్హాభ్యామినచ్**' అను వార్తికముచే 'ఇనచ్' ప్రత్యయముచేర్చగా సిద్ధించిన 'ఫలినః, (ఫలములు కలది) 'బర్హిణః' (పింఛము కలది) అను పదములు కూడ శ్రవణ పేశలములు.

**ఇనిః ప్రయుక్తః ప్రాయేణ తథా ఠంశ్చ మనీషిభిః।**
**తత్రాపి మేఖలామాలామాయానాం సుతరాం మతా॥** 57

**इनिः प्रयुक्तः प्रायेण तथा ठंश्च मनीषिभिः।**
**तत्रापि मेखलामालामायानां सुतरां मता॥**

వ్యా. పండితులు సాధారణముగ 'ఇని', ప్రత్యయమును 'ఠన్' ప్రత్యయమును ప్రయోగించుచుందురు అందును మేఖలా-మాలా-మాయా శబ్దములకు ఈ ప్రత్యయములను చేర్చి ప్రయోగించుట అంగీకార్యము.

వి. మత్వర్థప్రకరణమునందలి "**అత ఇనిఠనౌ**" (5.2.115) అను సూత్రముచే అదంతశబ్దమునకు 'ఇని' 'ఠన్' ప్రత్యయములు వచ్చును. 'దణ్డీ, దణ్డికః' ఇత్యాదులు సిద్ధించును. దండము కలవాడు అని యర్థము. "**వ్రీహ్యాదిభ్యశ్చ**" అను మరియొక సూత్రము (5.2.116) చే మేఖలా-మాలా-మాయా శబ్దములకు పై ప్రత్యయములు విధింపబడినవి. అందుచే మేఖలీ-మేఖలికః, మాలీ, మాయీ-మాయీకః అని రూపములు సిద్ధించును. అవి కావ్యమున ప్రయోగింపదగినవి. "**శిఖామాలా సంజ్ఞాదిభ్య ఇనిః**" అను వార్తికము ననుసరించి 'మాలా' శబ్దమునకు 'ఇని', ప్రత్యయము మాత్రమే వచ్చును. అందుచే 'మాలికః' అను రూపము ఉండదు.

**అభ్యస్తాజ్ఝే రదాదేశే దధతీత్యాదయోఽపి చ।**
**రోదితి స్వపితీత్యాది సహేటా సార్వధాతుకమ్॥** 58

**अभ्यस्ताज्झेरदादेशे दधतीत्यादयोऽपि च।**
**रोदिति स्वपितीत्यादि सहेटा सार्वधातुकम्।**

వ్యా. అభ్యస్తముకంటె పరమైన 'ఝి' కి అదాదేశము వచ్చుటచే ఏర్పడిన 'దధతి' మొదలగునవియు ఇడాగమము వచ్చుటచే ఏర్పడిన 'రోదితి' 'స్వపితి' మొదలగు ఆర్ధ ధాతుకములును కావ్యప్రయోగార్హములు.

వి. 'ధా' ధాతువు మొదలైనవి జుహోత్యాదిగణములోనివి. ఈ గణములోని ధాతువులకు ద్విత్వము (రెండుపర్యాయములు ఉచ్చారణము) వచ్చును. ఇట్లు ద్విత్వమువచ్చిన రూపమునకు అభ్యస్త మని పేరు. కావున 'ధాధా' అనుద్విరుక్తరూపము అభ్యస్తము. ఈ ధాతువులకు 'లట్' ప్రథమపురుషబహువచనమున 'ఝోన్తః' అను సూత్రముచే 'అన్త' ఆదేశము వచ్చుటకు బదులు 'అదభ్యస్తాత్' అను సూత్రముచే. (7.1.4) 'అత్' అను ఆదేశము వచ్చి 'దధతి' ఇత్యాదిరూపము లగును. ఇట్టివి కావ్యములలో ప్రయోగార్హములు. లట్, లోట్, లఙ్, విధిలిఙ్ అను ఈ నాలుగులకారములకును సార్వధాతుకములనిపేరు. రుద్, స్వప్, శ్వస్, అన్, జక్ష్ ధాతువుల వలాది సార్వధాతుకములకు 'ఇట్' అను ఆగమము **"రుదాదిభ్యః సార్వధాతుకే'** (7.2.76) అనుసూత్రముచే వచ్చి రోదితి, స్వపితి, శ్వసితి, అనితి, జక్షితి ఇత్యాదిరూపము లగును, అవి కూడ కావ్యములలో ప్రయోగించినచో అందముగా ఉండును.

**అభ్యస్తేషు ప్రయోక్తవ్యమదన్తం ఘుభృఞోః శతుః॥** 59
**అసౌ దధదలఙ్కారం స్రజం బిభ్రచ్చ శోభతే॥**
**अभ्यस्तेषु प्रयोक्तव्यमदन्तं घुभृञोः शतुः।**
**असौ दधदलङ्कारं स्रजं बिभ्रच्च शोभते॥**

వ్యా. అభ్యస్త సంజ్ఞకధాతువులలో ఘుసంజ్ఞకధాతువులకును, 'భృఞ్' ధాతువునకును 'శతృ' ప్రత్యయము చేర్చినపుడు దానిని 'అత్' అనునది అంతమునందు కలదానినిగా ప్రయోగింపవలెను. ఎట్లనగా-అలఙ్కారం దధత్=అలంకారములను ధరించుచున్నవాడును, స్రజం బిభ్రత్ చ=మాలికలను ధరించుచున్నవాడును అగు ఇతడు శోభించుచున్నాడు.

వి, సాధారణముగా ధాతువులకు 'శతృ' ప్రత్యయమును చేర్చినపుడు 'నుమ్' మొదలగునవి వచ్చి 'పచన్' గచ్ఛన్ ఇత్యాది రూపములు నిష్పన్న మగును. 'దా' 'ధా' ధాతువులకు 'ఘు' అని పేరు. ఇవి జుహోత్యాదిగణములో చేరినవి. అందుచే అభ్యస్త సంజ్ఞకములు. అట్లే జక్షిత్యాదులగు ఏడు ధాతువులకు కూడ అభ్యస్తసంజ్ఞ చెప్పబడినది. అభ్యస్తసంజ్ఞ కల ధాతువులకంటె పరమైన 'శతృ' ప్రత్యయమునకు 'నుమ్' రాదని 'నాభ్యస్తాచ్ఛతుః' (7.1.78) అను సూత్రము చెప్పుచున్నది. అందుచే 'దధత్' 'బిభ్రత్' ఇత్యాదిరూపము లగును. 'భృఞ్' ధాతువుకూడ జుహోత్యాదిగణములోనిది. ఇట్టి శతృప్రత్యయాంతరూపములు కావ్యములలో బాగుండు నని అభిప్రాయము.

**(న తవర్గం శకారేణ క్వచిత్ సం) యోగినం వదేత్।** 60
**యథైతచ్ఛ్యామమాభాతి వనం వనజలోచనే॥**
**(न तवर्गं शकारेण क्वचित् सं) योगिनं वदेत्।**
**यथैतच्छ्यामभाति वनं वनजलोचने॥**

వ్యా. శకారముతో సంధి గల తవర్గమును ప్రయోగింపరాదు. ఎట్లనగా-ఓపద్మలోచనా! ఈ నల్లనైన వనము ప్రకాశించుచున్నది.



వి. ఏతత్+శ్యామమ్ అనునపుడు సంధినియమములచే 'త' కారమునకు 'చ' కారము, 'శ' కారమునకు 'ఛ' కారమును వచ్చి 'ఏతచ్ఛ్యామమ్ అని యగును. ఇట్టి ప్రయోగము కావ్యమునందు కటువుగ నుండును.

**నైకత్రౌకారభూయస్త్వం గతో యాతో హతో యథా।** 61
**సావర్ణ్యవఙ్ఝయో హస్య బ్రూయాన్నాన్యత్ర పద్ధతేః॥**
**नैकत्रौकारभूयस्त्वं गतो यातो हतो यथा।**
**सावर्ण्यवज्झयो हस्य ब्रूयान्नान्यत्र पद्धतेः॥**

వ్యా. "గతో యాతో హతో"ఇత్యాదులందువలె, ఒకచోట (దగ్గర దగ్గరగా) ఓకారమును ఎక్కువగా ప్రయోగింపరాదు. 'పద్ధతిః' అను ఒక శబ్దముతప్ప 'ఝయ్' కును హకారమునకును సావర్ణ్యము వచ్చిన రూపములను ప్రయోగింపరాదు.

వి. 'గతో యాతో హతో యథా' ఇత్యాదులందు వలె వరుసగ ఏకారములను ప్రయోగించినచో శ్రవ్యముగ ఉండదు. 'ఝయ్' అనునది ఒక ప్రత్యాహారము. 'ఝయోహోఽన్యతరస్యామ్, (8-4-62) అను సూత్రము ననుసరించి ఝయ్‌కంటె 'హ' కారము పరముగ నున్నపుడు పూర్వసవర్ణము వికల్పముగ వచ్చును. వాక్+హరిః= వాగ్ఘరిః, ఇత్యాదిరూపములగును, 'పద్ధతిః' అనునది 'పద్+హతిః' అని యుండగా ఈ పూర్వసవర్ణముచే నిష్పన్న మైనదే. ఈ 'పద్ధతి' శబ్దము తప్ప, హకారమునకు ఈ విధముగ పూర్వ 'ఝయ్' సవర్ణము వచ్చిన రూపములను కావ్యములలో ప్రయోగింపరాదు. చెవులకింపుగ ఉండదు అని అర్థము.

**సాలాతురీయమతమేతదనుక్రమేణ**
**కో వక్ష్యతీతి విరతోఽహమతో విచారాత్।**
**శబ్దార్ణవస్య యది కశ్చిదుపైతి పారం**
**భీమామ్భసశ్చ జలధేరితి విస్మయోఽసౌ॥**

**सालातुरीयमतमेतदनुक्रमेण**
**को वक्ष्यतीति विरतोऽहमतो विचारात्।**
**शब्दार्णवस्य यदि कश्चिदुपैति पारं**
**भीमाम्भसश्च जलधेरिति विस्मयोऽसौ॥**

వ్యా. ఈ పాణినీయసిద్ధాంతమును ఒక క్రమమున ఎవరు చెప్పగలరు? అందుచే నేను ఈ విచారణమునుండి విరమించుచున్నాను. ఎవడైనను శబ్దసముద్రముయొక్క పారమును భయంకరమైన జలము గల మహా సముద్రము యొక్క పారమను (ఆవలిఒడ్డును) పొందగలిగినచో అట్టివాడు ఆశ్చర్యకరుడే.

వి. తక్షశిలాసమీపమున నున్న శాలాతురము అను ఒక గ్రామమున జన్మించి యుండుటచే పాణినికి శాలాతురీయుడు అనిపేరు.

విద్యానాం సతతమపాశ్రయోఽ పరాసాం
తాసూక్తాన్న చ విరుణద్ధి కాంశ్చిదర్థాన్।
శ్రద్ధేయం జగతి మతం హి పాణినీయం
మాధ్యస్థ్యాద్భవతి న కస్యచిత్ ప్రమాణమ్॥ 63

विद्यानां सततमपाश्रयोऽपरासां
तासूक्तान्न च विरुणद्धि कांश्चिदर्थान्।
श्रद्धेयं जगति मतं हि पाणिनीयं
माध्यस्थ्याद्भवति न कस्यचित् प्रमाणम्॥

వ్యా. పాణినీయమతము (పాణినిప్రోక్త మగు వ్యాకరణము) ఇతర విద్యలన్నింటికిని, ఎల్లప్పుడును ఆశ్రయ మైనది. ఆ విద్యలలో చెప్పిన ఏ విషయములతోడను దీనికి విరోధము లేదు. ఇది జగత్తునందు అందరి చేతను విశ్వసింపదగినది. ఇది ఇతరశాస్త్రములు వేటితోడను విరోధము లేక మాధ్యస్థ్యమును వహించిన శాస్త్ర మగుటచే ఎవరికి ప్రమాణము కాదు?

అవలోక్య మతాని సత్కవీనా
మవగమ్య స్వధియా చ కావ్యలక్ష్మ।
సుజనావగమాయ భామహేన
గ్రథితం రక్రిలగోమిసూనునేదమ్॥ 64

अवलोक्य मतानि सत्कवीना
-मवगम्य स्वधिया च काव्यलक्ष्म।
सुजनावगमाय भामहेन
ग्रथितं रक्रिलगोमिसूनुनेदम्।

వ్యా. సత్కవుల మతముల పర్యాలోచనము చేసి, స్వబుద్ధిచేత కూడ తెలిసికొని, రక్రిలగోమి కుమారుడైన భామహునిచే ఈ 'కావ్యలక్ష్మ' అనగా 'కావ్యలక్షణము' అనుగ్రంథము, సుజనులకు కావ్యస్వరూప జ్ఞానము కలిగించుటకై, కూర్చబడినది.

షష్ట్యా శరీరం నిర్ణీతం శతషష్ట్యా త్వలఙ్కృతిః
పఞ్చాశతా దోషదృష్టిః సప్తత్యా న్యాయనిర్ణయః॥
షష్ట్యా శబ్దస్య శుద్ధిః స్యాదిత్యేవం వస్తుపఞ్చకమ్।
ఉక్తం షడ్భిః పరిచ్ఛేదైర్భామహేన క్రమేణ వః॥ 65

षष्ट्या शरीरं निर्णीतं शतषष्ट्या त्वलङ्कृतिः।
पञ्चाशता दोषदृष्टिः सप्तत्या न्यायनिर्णयः॥
षष्ट्या शब्दस्य शुद्धिः स्यादित्येवं वस्तुपञ्चकम्।
उक्तं षड्भिः परिच्छेदैर्भामहेन क्रमेण वः॥



వ్యా. అరవై శ్లోకములచే కావ్య శరీరము నిర్ణయింపబడినది. నూట అరవై శ్లోకములచే అలంకారము నిర్ణయింపబడినది. ఏబది శ్లోకములచే దోషములు నిర్ణయింపబడినది. డెబ్బది శ్లోకములచే న్యాయనిర్ణయము చేయబడినది. అరవై శ్లోకములచే శబ్దశుద్ధి చూపబడినది. ఈ విధముగ భామహునిచే ఆరు పరిచ్ఛేదములతో క్రమముగ ఐదు విషయములు మీకొరకై చెప్పబడినవి.

ఇతి భామహీయః కావ్యాలఙ్కారః

కావ్యాలంకారము సమాప్తము

యత్కృపాలేశసంసర్గాద్వ్యాఖ్యేయం రచితా మయా।
తమహం జానకీజానిమానతోఽస్మి ముహుర్ముహుః॥

దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చాచార్యసత్కృపా।
కర్తాస్మద్గ్రన్థజాతస్య కరణం కేవలం వయమ్॥

यत्कृपालेशसंसर्गाद्व्याख्येयं रचिता मया।
तमहं जानकीजानिमानतोऽस्मि मुहुर्मुहुः॥

देवतानुग्रहः पित्रोस्तपश्चाचार्यसत्कृपा।
कर्तास्मद्ग्रन्थजातस्य करणं केवलं वयम्॥